తెలుగు పుస్తకాలయం

# వికాస ధాత్రి



# EE DESAM OKA HIMALAYAM

(NAVALIKA)

## MARO PEDDA KADHA

JANA SANDRAMLO RAKTA TARANGAM

Turaga Janaki Rani

జననం: 1936, ఆగస్టు 31, మచిలీపట్నంలో. ఆంధ్రవిశ్వవిద్యాలయం స్వర్ణపతకాలు, ప్రథమ బహుమతులు ఇంటర్మీడియేటు, బి.ఏ.లలో. నిజాం కళాశాలలో ఎం.ఏ. ఎకనమిక్స్, మదరాసు స్కూల్ ఆఫ్ సోషల్‌వర్క్ డిప్లొమాలు, భరతనాట్యంలో సర్టిఫికేటు.


రచయిత్రిగా - జానకీరాణి కథలు, ఎర్రగులాబీలు, నవ్వునిప్పు (కథల సంపుటాలు); వేయబోవని తలుపు, సంఘర్షణ, ఈ దేశం ఒక హిమాలయం (నవలలు); కస్తూర్బా, రెడ్‌క్రాస్ కథ, దేశాన్ని పునర్నిర్మించండి, నా యాత్రానుభవాలు (అనువాదాలు). బి. నందంగారి అనుపత్రి, మిఠాయిపొట్లం (పిల్లల పుస్తకాలు) - మొదలైనవి వెలువడ్డాయి.

తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, గృహలక్ష్మి స్వర్ణకంకణం, సుశీలా నారాయణరెడ్డి అవార్డు, చింతాదీక్షితులు మున్నగు అవార్డులు.

ప్రసారకర్తగా - ఆకాశవాణిలో 1975-94 ఉద్యోగం, ఐబిపిఎస్ అసిస్టెంటు స్టేషన్ డైరెక్టరుగా పదవీ విరమణ. 'నిశ్శబ్దంలో ప్రేమనాదాలు', 'ఆశ్రయం' డాక్యుమెంటరీ రూపకాలకు ఆకాశవాణి జాతీయస్థాయి అవార్డులు. బాలల బృందగానాలకు జాతీయస్థాయి బహుమతులు. రేడియో-అక్కయ్యగా ప్రాచుర్యం.

సంఘసేవా రంగంలో: 1960-74 కేంద్ర సాంఘిక సంక్షేమ మండలిలో వెల్ఫేరు ఆఫీసరుగా ఉద్యోగం. నారీ నవ్య మార్గదర్శిని, స్త్రీజన హితైషిణి, బాలబంధు వంటి సత్కారాలు.

ప్రచారోద్యమాలు: యునిసెఫ్, ఎస్.సి.ఆర్.టి. ఎన్నో ప్రభుత్వశాఖల కోసం నాలుగు జిల్లాల్లో 570 ప్రదర్శనలు, 18 ఆడియో క్యాసెట్లు, కరపత్రాలు, పోస్టర్లు - ప్రచారసామగ్రి రూపకల్పన.



# 'ఈ దేశం ఒక హిమాలయం' (నవలిక)

## మరో పెద్దకథ 'జనసంద్రంలో రక్తతరంగం

తురగా జానకీరాణి

ప్రత్యూష ప్రచురణలు

29, జర్నలిస్ట్సు కాలనీ, రోడ్ నెం.3, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34.

ఫోన్: 3351153 మొబైల్: 98851 51153: E-Mail : jrturaga@rediffmail.com

Ee Desham Oka Himalayam (Novelette)

Jana Sandramlo Rakta Tarangam (Story)

- Turaga Janaki Rani


© with the Writer


September 2002

Price : Rs.50/-
$ 4

Published by :
Pratyusha Prachuranalu
Hyderabad

Cover Photograph :
Ch. Srinivasa Rao

Design : Suri

Layout :
Siva Datta ✆ 3756406

*Copies available at :*
All leading book stores
(or)
Narender Revelli
29, Journalists' Colony, Rd#3
Banjara Hills, Hyderabad-34
Ph : 040-3351153 Mobile : 98851-51153
email : revelli@rediffmail.com


# ఆలోచింప చేసే రచనలు

**తు**రగా జానకీరాణిగారు రెండు మాధ్యమాల మీద పట్టు ఉన్నవారు. ఎలక్ట్రానిక్ మాధ్యమంలో - రేడియోలో - చాలా కాలం పనిచేశారు. ఆత్మీయంగా, అలవోకగా ఆమె స్పోకెన్ వర్డ్ ఉంటుంది. రేడియోలోని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాటిలో ప్రధాన భూమికను పోషిస్తూ లక్షలాది శ్రోతలకు సన్నిహితమయ్యారు. ఆమధ్య కాలంలో మరీ ముఖ్యంగా బాలశ్రోతలకూ, అందరికీ చదువు కార్యక్రమాల ద్వారా స్ఫూర్తిపొందిన చాలా చాలా మందికి దగ్గరయ్యారు. ఆమె ముద్రణ మాధ్యమంతో సంబంధం తెంచుకోలేదు. కవితల్నీ, వ్యాసాల్నీ, కథల్నీ, నవలల్నీ రాసి తెలుగు పాఠకులలో సాన్నిహిత్యం ఏర్పరచుకున్నారు. ఈనోటి మాటకూ, రాత మాటకూ ఆమె జీవితానుభవాలు ఎన్నెన్నో తోడ్పడ్డాయి - వ్యక్తిగతమైనవీ, వృత్తిపరమైనవీ. కొంతకాలం సాంఘిక సంక్షేమ శాఖలో ఉద్యోగించారు - అదీ మారుమూల గిరిజన ప్రాంతల్లో. రేడియోలో ఎన్నెన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఈ అనుభవాల మూలంగా చాకిరీ తప్ప చదువు నోచుకోని పిల్లల్నీ, స్త్రీలనూ, పెద్దల్నీ పట్టించుకున్నారు. చుట్టూ సాగుతున్న రాజకీయ సాంఘిక ఉద్యమ ప్రభావాల్నీ, ప్రభుత్వ విధానాల అమలు తీరునూ గమనించారు. స్త్రీవాద ఉద్యమంలో మమేకం అయ్యారు.

ఈ కారణాల వల్ల జానకీరాణి గారికి మార్పుమీద విశ్వాసం ఉంది. అయితే ఏ మార్పూ ఒక సమగ్రమైన జీవిత పరిష్కారాన్ని చూపగలదనే నమ్మకం ఆమెకు లేదు. ఆమె ప్రధానంగా ఆశిస్తున్నది వ్యక్తుల సంస్కారంలోని మార్పు - చదువు ద్వారా, సంఘ పరిశీలన ద్వారా వచ్చే మార్పు. ఈ మార్పు కోసమే ఆమె నోటి మాటా, రాత మాటా.

ఈ సంపుటిలోని ఈ దేశం ఒక హిమాలయం చిన్న నవల. జనసంద్రంలో రక్తతరంగం పెద్ద కథ.

చిన్న నవలలో ప్రధానపాత్ర పద్మిని. కథా ప్రారంభ కాలానికి శిశు సంక్షేమ విస్తరణాధికారి. గిరిజన సమాజ మహిళ సంక్షేమాన్ని నిజాయితీతో పట్టించుకున్న ఉద్యోగిని. అవివాహిత. తల్లి, చెల్లి, ఇతర కుటుంబ బాధ్యతలు ఒకవైపు నెరవేరుస్తోంది. మరోవైపు ఉద్యోగినిగా నలుగురి మధ్యా మెలగుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు పరచటానికి కాయకష్టులా కృషి చేస్తోంది. అవినీతిపరులైన పై అధికారులు, రకరకాల హింసలను స్త్రీలపై ప్రయోగించగల నిపుణులైన సహోద్యగాధముల మధ్య వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ ప్రణయం, పరిణయం కోసం తపించింది. ఒకదశలో అవి ముఖ్యం కాదని, సంప్రదాయాలూ, మర్యాదలూ ప్రధానం కావని పని గుర్తింపు కోసం, జ్ఞాన విస్తృతి కోసం, జీవితంలో ఎదురైన అరుదైన అవకాశం కోసం, పెద్ద మలుపుకోసం పద్మిని నవలాంతంలో తీసుకున్న నిర్ణయం రెండు దశాబ్దాల కింద సాధారీకరణ సత్యమై, జీవిత వాస్తవమై ఉండేది కాదు. పద్మిని బహిరంగ, అంతరంగ ఘర్షణను కుటుంబ, ఉద్యోగనేపథ్యాల్లో జానకీరాణి గారు విపులంగా చిత్రించటానికి ప్రయత్నించారు. గిరిజన సమాజ మహిళావరణంలో పద్మినికి ఎదురైన - ఉద్యోగిని పద్మినికీ, వ్యక్తి పద్మినికీ ఎదురైన - అనుభవాలను బాగా తడిమి ఉంటే, గిరిజన సామాజిక, సాంస్కృతికాంశాలు నవలకు మరింత పుష్టినిచ్చేవి. ఏ సమాజంలోని ఏ విలువలు మంచివో, ఏ మార్పు ఎందుకోసం అవసరమో, మన పైపై అభివృద్ధి లక్ష్యాల లోటుపాట్లేమిటు మన అధికార యంత్రాంగం చలనంలో, ఇంకా బాగా పాఠకులకు తెలిసి ఉండేది. నవలలో ఆ పరిధి ఉంది. జానకీరాణి గారికి ఉండే మోడెస్టీ లేదా నిగ్రహం అందుకు ఒప్పుకోక పోయి ఉండవచ్చు.

'జనసంద్రంలో రక్తతరంగం' కథలో జానకీరాణి గారు రెండు సాహస ప్రయోగాలు చేశారు. మొదటి ప్రయోగం నక్సలైటు సమస్యకు మూలభూతమైన ఒకటి రెండు సామాజిక ఆర్థిక అంశాలను చిత్రించటానికి పూనుకోవటం. రెండవ ప్రయోగం తెలంగాణ పలుకు బడినీ, యాసనూ ఒకటి రెండు పాత్రలతో - ముఖ్యంగా శ్యామలమ్మతో - పలికించటం.

ఈ కథలోని 'జయ' లాగా జానకీరాణిగారు పూర్తిగా గ్రామీణ సమాజానికి చెందిన వాళ్లు కారు. జయకంటే కూడా భిన్నంగా ఆమె బయటివ్యక్తి - out sider. తెలంగాణ సమాజానుభవంలోని వ్యక్తి - insider - కాదు. పరిశీలించి విన్నంత, చదివినంత రాశారు. ఇది ఒక విధంగా కత్తిమీద సాము.

వైకుంఠరావు దొర రెండో ప్రవృత్తిగా మారిన క్రౌర్యం, దౌర్జన్యం, భూస్వామ్య అహంకారం, వారసత్వపు హక్కులు, పోలీసులతో లాలూచీలు, నక్సలైట్ల ప్రతిఘటన, అమాయకుల, ప్రతిఘటించే వాళ్ల ఎన్‌కౌంటర్లూ ఈ రక్తతరంగాల చిత్రణ ఈ పెద్ద కథలో ఒక పార్శ్వం, మరొక పార్శ్వం వైకుంఠరావు భార్య శ్యామలమ్మ, ఇతర కుటుంబ సభ్యులు - ముఖ్యంగా స్త్రీలు - శ్యామలమ్మ రాజీ పథకం కేంద్రంగా సాగిన పార్శ్వం ఇది. శ్యామలమ్మ రాజీ పథకం (పేజీ 52) నెరవేరడం, నెరవేరక పోవడం ఏక సంఘటన కేంద్రకంగా ఉండదు. జానకీరాణిగారు ఒకవిధంగా గాంధీ ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని పరిష్కారమార్గంగా ప్రతిపాదించారు. అయితే ఆమె అవతలివైపు కూడా చూడటానికి ప్రయత్నించారు. ''జయ విస్తుపోయి చూస్తున్నది. మానవ జీవితంలోని ఒక కెరటాన్ని చూసి, దాని అందుల ఉధృతం చూసి ఉక్కిరి బిక్కిరవుతున్నది'' (పేజీ 52) అనే కథా సంఘటనల్లో, సన్నివేశాల్లో బయటివ్యక్తి అయిన జయ వాక్యాలలోనే ఈ కథ ముగియటం శిల్పరీత్యా వైచిత్ర్యం. ఆ తర్వాతి వ్యాఖ్యానం/ కథనం వ్యాసప్రాయం. ఎందుకంటే జానకీరాణి గారిలాగే ఆ జీవితాన్ని పాఠకులు విస్తుబోయి చూడక తప్పదు. ఉక్కిరి బిక్కిరి కాక తప్పదు. దాన్ని గురించి ఆలోచించక తప్పదు. ఈ కథలో కల్పన పాలు సంభావ్యతను కొంత మించిపోయింది. కాని జానకీరాణి కథా రచనలోని నిజాయితీని, జీవన సమస్యల సంక్లిష్టతను అర్థం చేసుకొంటూ పాఠకులతో ఆ అనుభవాన్ని పంచుకోవాలనే కోరికనూ శంకించలేము.

''అరువన్నర పదుల వయసు గడిచాక, కొన్నివేల పేజీలు వ్రాశాక యిప్పుడు ఈ జీవి మారుతుందా? ఏమో చెప్పలేను'' అంటున్న జానకీరాణి గారు రచయిత పరిణామశీలి అని కూడా నమ్ముతారు. ఆమె నిరంతర అన్వేషణా తత్పరతలో ఎన్నుకున్న కథాంశాలకు రూపాలే ఈ చిన్న నవలా, పెద్ద కథా. బాధితుల పట్లా, సంఘర్షిస్తున్న వాళ్ల పట్లా ఈ రచనలు మనల్ని ఆలోచింపచేస్తాయి. ఆలోచన అవగాహనకు మార్గం.

– కేతు విశ్వనాథరెడ్డి

హైదరాబాదు,
10 ఏప్రిల్ 2002

# ఇవి వాస్తవ గాథలే!

నేను సాధారణంగా పోటీలకు నవలలు, కథలు పంపడానికి సంకోచిస్తాను. కారణం బహుమతులు గెల్చుకునే జాతకాలు, ధోరణి, వస్తువు వేరుగా వుంటాయని నా అభిప్రాయం. కాని తుది గడువు తేదీ లోపుగా ఒక రచన తయారౌతుంది కదా అనే ఆశతో 'జ్యోతి'కి ఒక నవలిక పంపాను. ఎంపిక చేసిన న్యాయనిర్ణేత, ఫ్రెండు కావడంతో, "ఎంత బాగా రాశావోయ్!" అని మెచ్చుకుంటూనే ఒక కన్సొలేషను బహుమతి పడేశారు. ఆ తర్వాత, పోటీలలో పాల్గొనే కంటే న్యాయ నిర్ణేతగా వుండడమే ఎన్నో సందర్భాలలో జరుగుతున్నది. అదే మంచిది.

నేను సోషల్ వెల్ఫేరు బోర్డులో 1960-72 సంవత్సరాలలో పనిచేసిన రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించాను. ప్రాజెక్టులు కూడా ప్రారంభించే అవకాశం కలిగింది. అడ్డతీగల బ్లాకులో పనసలపాలెం అనే వూళ్లో రాత్రి బసచేసి, అటువంటి పనిచేసిన తొలి మహిళా ఆఫీసరుని నేనే అనిపించుకున్నాను. సీతంపేట, చింతపల్లి, వాంభిడి, ఏటూరు నాగారం, అశ్వారావుపేట వంటి అనేకచోట్ల కారడవులలోకి ప్రయాణించాను. అదొక అనుభవం. అది నేపథ్యంగానే చేసిన రచన "ఈ దేశం ఒక హిమాలయం". మొదట వ్రాసినప్పుడు ముగింపు వేరు, తర్వాత రేడియోకి ఒక గంట నాటకంగా ప్రసారం చేసినప్పుడు, యిచ్చిన ముగింపు వేరు. ఈ నాటకం ప్రత్యేక త్రైమాసిక నాటికగా అన్ని భాషలలోను ప్రసారమైంది. ఇప్పుడు పునర్ముద్రణ చేసే సమయంలో, నేను తిప్పిన మలుపు వేరు. నా ఆలోచనల్లోనే మార్పు వచ్చిందనడానికి ఇదొక ఉదాహరణ. ప్రకృతిలాగే, రచయితా పరిణామం చెంది, ఆశయాలను, ఆలోచనా సరళిని మార్చుకుంటాడని నాకు అర్థమైంది. స్త్రీ పురుషుల ప్రణయ సంబంధాల పైన నాకు చాలా నమ్మకం వుంది. అందుకే చివరి వరకు యీ నవలికలో అనురాగ భావ చిత్రణ కొనసాగించాను.

ఇందులో చేర్చిన పెద్ద కథ 'జనసంద్రంలో రక్తతరంగం' వాస్తవంగా జరిగిన రెండు కథల అల్లిక. ఆ వ్యక్తులు కూడా యిక్కడున్నారు. అయితే ఉగ్రవాదుల చేష్టలకి అంత తేలిగ్గా పరిష్కారం చూపారేమిటి - అన్నారొక ప్రసిద్ధ రచయిత్రి. వాస్తవాలు, కల్పనల కంటే చిత్రంగా వుంటాయనడానికి యిదొక ఉదాహరణ. అంతే కాదు, ప్రపంచంలో ఏ సమస్యకూ సమగ్రమైన పరిష్కారం వుండదని జీవితానుభవం చెబుతుంది. ఆ కథకు సంబంధించినంత వరకు వలయం పూర్తయి, సంపూర్ణత గోచరించిందా లేదా అనేదే ముఖ్యం. ఇది 'ఇండియా టుడే'లో మూడు భాగాలుగా ప్రచురించిన రాజేంద్ర ఔదార్యానికి కృతజ్ఞతలు. తెలంగాణ మాండలికం నాకు చేతనైన స్థాయిలో వాడాను. ఈ కథలోని వారి కుటుంబీకులకు వినిపించి, ఫరవాలేదనిపించుకున్నాను.

కఠోరమైన జీవన సమస్యలను నేను స్పృశించనని, కోమలమైన అంశాలను, మర్యాద పూర్వకంగా చిత్రిస్తానని విమర్శకులు యిదివరలో అనడం నేను విన్నాను. అది నిజమో కాదో, యీ చిన్న పుస్తకం చదివిన పాఠకులు చెప్పాలి.

అరున్నర పదుల వయస్సు గడిచాక, కొన్ని వేల పేజీలు వ్రాశాక, యిప్పుడు యీ జీవి మారుతుందా? ఏమో, చెప్పలేను.

పీఠిక వ్రాసిన డా. కేతు విశ్వనాథరెడ్డి, సహజమైన తన ప్రతిభను, విమర్శనా పటిమను, నాపట్ల తమకు గల అభిమానాన్ని రంగరించి అక్షరాలుగా పోశారు. వారికి నా ధన్యవాదాలు.

నా ప్రతి ప్రయత్నానికి ప్రోత్సాహమిస్తుండే నా పిల్లలు ఉషారమణి, వసంతశోభకు - పుత్ర సమానుడైన అల్లుడు నరేందర్‌కీ నా ఆశీస్సులు.

-జానకీరాణి

# 1

బ్లాక్ ఆఫీస్ కోలాహలంగా వుంది. మరో గంటలో విచ్చేయబోతున్న కొత్త సబ్ కలెక్టర్ గారికి, ఆయన సతీమణికి స్వాగతం చెప్పడానికి సన్నాహాలు చేసుకుంటోంది. ఎవరివంతు హడావిడి వారు విడివిడిగా పడుతున్నారు. ఉమ్మడిగా పరుగులు పెడుతున్నారు.

ఈ పంచాయతీ సమితి బ్లాక్ చరిత్రలో మొట్టమొదటిసారిగా ఒక ఆఫీసరుగారి సతీమణి కూడా ఆయనగారి వెంట విచ్చేస్తోంది. కనుక స్త్రీ, శిశు సంక్షేమ విస్తరణాధికారిణి పద్మినికి ఒక ప్రముఖ పాత్ర లభించింది యీనాటి ఉత్సవంలో. దంపతులు మహిళా మండలిని సందర్శిస్తున్నారు. కొండగ్రామాల్లోని రెండు బాల్వాడీ పాఠశాలలను కూడా చూడబోతున్నారు.

మహిళా మండలి భవనానికి సున్నాలు, రంగులు, తోరణాలు, ముగ్గులు మొదలైన సమస్తాలంకారాలు అమిరాయి. దేముడొచ్చినా పొద్దుటిపూట మహిళా మండలికి రాలేము అని ఖచ్చితంగా చెప్పిన అమ్మలక్కలందరినీ బతిమాలి, బుజ్జగించి, ఏవో ఆశలుపెట్టి మంత్రించినంత పని చేసింది పద్మిని. అందుకే, ఒక యాభైమంది పిల్లా, పెద్ద మంది బట్టలతో, వాళ్ళకున్న నగలతో, మందారపూలు, బంతిపూలు తలల్లో తురుముకుని మహిళా మండలికి వచ్చారు. పద్మిని తన క్వార్టర్స్‌కి, బి.డి.ఓ.గారి రూమ్‌కి, మహిళా మండలికి మధ్యన ఎన్ని వందలసార్లు పరుగులు పెట్టిందో ఆమెకే తెలియదు.

ఎండ చురుక్కుమంటున్నది. తొమ్మిదో గంట కొట్టేసరికి ఒక చిన్న కారు, రెండు జీపులు వచ్చాయి బర్రుమని. ట్రావెలర్స్ బంగళా దగ్గర సామాన్లు దించేయడానికి జీపు వెళ్ళింది. చిన్నసైజు నీలిరంగు కారు పంచాయతీ సమితి ఆఫీసు దగ్గర ఆగింది. ముద్దొస్తున్న ఆ కారును

సబ్ కలెక్టర్ సుకుమార్ నడుపుతున్నారు. పక్కన అతని భార్య పద్మిని. తను నిక్కి నిక్కి అటు చూస్తూనే, మహిళా సభ్యులందరినీ ఎటెన్షన్‌లో పెట్టేసింది.

ఐదు నిమిషాలు గడిచాయో లేదో బ్లాక్ ఆఫీసులోని యావన్మంది మహిళా మండలి వైపు పరుగులు పెడుతూ వచ్చారు. ఆ వెనుకే అందంగా అలికి ముగ్గులు పెట్టిన ఆవరణలోకి చిన్నకారు మెల్లగా ప్రవేశించింది. కారు తలుపు తీసి, కలెక్టరమ్మగారు వయ్యారంగా దిగుతుంటే, వున్నట్లుండి తెలివి ఉదయించి, పద్మిని ఆ డోర్‌ని పట్టుకుంది ఆమెగారు దిగడానికి వీలుగా. తనంత ఎత్తే. కాని గులాబీ రంగు ఛాయ, తల్లో విచ్చిన విరజాజుల మాలలాగే సుకుమారంగా వుంది. సబ్‌కలెక్టర్ సుకుమార్ గారు దిగారు. అద్వర్టయిజ్‌మెంట్ బొమ్మల్లాగా వున్న ఆ దంపతులను చూసి పద్మినితోసహా మొత్తం జనమంతా నోటమాట రానంత ముగ్ధులైపోయారు.

అంతలోనే తెప్పరిల్లిన పద్మిని గిరిజన స్త్రీల చేతికి తెల్లని బట్టతో తాను తయారుచేసిన పారిజాతం మాలలు యిచ్చింది. అవి పువ్వులు కావే, కాని ఎంత బాగున్నాయో అన్నట్లు అభినందనగా ఆ దంపతులు చూశారు. వారు ఏమడిగారో, తనేం చెప్పిందో గుర్తించే పరిస్థితే కాదిది. అమ్మగారు మెడలోంచి ఆ మాలలు తీయబోతుంటే అయ్యగారు వద్దు వుంచుకోమని సైగచేశారు. వాటిని ధరించే వాళ్ళిద్దరూ కాసేపు కూర్చున్నారు.

మహిళా మండలి కార్యక్రమాలను, బ్లాక్‌లో జరుగుతున్న మహిళా సహాయక కార్యక్రమాలను ఆసక్తితో చూశారు అయ్యగారు. ఎన్నో సలహాలు కూడా యిచ్చారు. బి.డి.ఓ., సమితి ప్రెసిడెంట్ మొదలైన వారంతా తామే అంతా నిర్వహిస్తున్నట్లు, పద్మినిని పక్కకునెట్టి మాట్లాడటం మొదలెట్టారు. కాని పది నిముషాలలోనే యిదంతా పద్మిని చేసిన ఏర్పాట్లని ఐ.ఎ.ఎస్. బుర్రగల అయ్యగారు పసిగట్టి, ఆమెతోనే అన్నీ మాట్లాడారు. ఆ తర్వాత రహదారి బంగళాలోనే కాఫీలు, ఫలహారాలు పూర్తయినాయి. మహిళా మండలి వారందరికీ పళ్ళు, బిస్కెట్లు, టీలు పంచి, పద్మిని బంగళాకు చేరుకునే సరికి అక్కడున్న బృందం కొండ గ్రామాలు సందర్శించడానికి బయలుదేరుతోంది. సమితి అధ్యక్షుల సరికొత్త సొంత జీపులో, సబ్ కలెక్టర్ దంపతులు ఎక్కారు. చుట్టుపక్కల సమితుల తాలూకు పాత డొక్కు, రథాల్లాంటి రెండు జీపుల్లో మిగతా జనం ఎక్కారు. సుకుమార్ గారి జీపు వెనుక సీట్లో బ్లాకులోని ముఖ్యులైన స్టాఫ్ మెంబర్లు ఎక్కారు. ఆఖరు క్షణంలో ముందు కూర్చున్న అమ్మగారు పద్మినిని చూసి, ''మీరు రావడం లేదా?'' అన్నారు. సమితి ప్రెసిడెంటు గారికి ఆ ప్రశ్న వినబడి ''వస్తుందండీ మేడమ్!'' అంటూ, ''ఎక్కెయ్యి'' అన్నారు పద్మినితో. ఆ మూడు జీపుల్లోనూ కూరుకుపోయిన ఆ పురుష జనంలో ఆమె ఎక్కడ ఎక్కాలన్న ప్రశ్న అయనకు తోచలేదు. అలాంటి సమస్యలు అక్కడ ఉద్యోగం చేసే అమ్మాయిలకు వుండకూడదు మరి. సబ్‌కలెక్టర్ గారు వెనక్కి తిరిగి చూసి, ''యీ పక్కసీట్లో వాళ్ళు దిగివెనకాల రండి. మీరు, మీ జి.ఎస్. ఎక్కండి'' అన్నారు.



అమ్మగారు కూడా కళ్ళతో అటువంటి ఆజ్ఞే జారీచేశారు. అక్కడున్న ఉద్యోగులందరి ముఖాలు మాడిన పెసరట్లలాగా తయారయినాయని పద్మిని, వారివంక చూడకుండానే గ్రహించి, జీపు ఎక్కి ఆ దంపతుల వెనుక కూర్చుంది.

కొండలు, పచ్చటి కొండలు - లోయలు, అతిలోతుగా బావురుమనే లోయలు - ఎన్ని మైళ్ళు వెళ్ళినా యిదే దృశ్యం. అడవి పూలు గాలిని కూడా కొట్టుకుని ఆపలేని సువాసనలు వెదజల్లుతున్నాయి. లెక్కలేనన్ని సీతాకోక చిలుకలు జీపుమీదుగా ఎగురుతున్నాయి. కళ్ళెత్తి చూస్తే, ఎవరో పెట్టిన శిలావిగ్రహంలా నల్లని గుబురు చెట్లమీద, పెద్ద కొండరాయి కనబడుతోంది ఒకచోట. ఎంత ఎన్నాళ్ళైనా సోకుతుందా, వెన్నెల ఏ రాత్రయినా పడుదు కుంటుందా అన్నట్లు ఆకాశమెత్తున లేచిన ఆ కొండల్లో దాక్కున్నాయి చిన్నచిన్న పల్లెలు. చుట్టూనేల చదునుచేసి, తెచ్చిన గింజలు చల్లేసి, వానజల్లుకు అవి మొలకెత్తితే, పంట పండితే, పండిన పంట తమవరకూ వస్తే, అప్పుడు తింటారు ఆ గిరిజనులు. అరటి పిలకలు, కందిచేలు, ఎక్కడో అపురూపంగా వరి, మొక్కజొన్నలు. ఏ గింజా దొరక్కపోతే డొక్క మాడ్చుకుని, కాళ్ళు ముడుచుకుని పసిపిల్లలు సైతం పడుకోవడమే. కొన్నాళ్ళకు తామున్న నేల పస తగ్గిపోతే, మరో కొండ కడుపులోకి ఆశ్రయం వెతుక్కుంటూ పోతారు. ఈ జనంకోసం ఏదేదో చేయాలని యీ కార్యక్రమాలన్నిటి తాపత్రయం.

కలెక్టరమ్మగారు - ఆమె పేరు సుమలత - చెట్లపూలు చూస్తూ, వాటి పేర్లు అడుగుతోంది. పద్మిని కొన్ని పేర్లు చెప్పి ''బొటానికల్ పేర్లు చెప్పగలనండి!'' అనేటప్పటికి సుకుమార్ చిన్నగా నవ్వారు. ప్రతి మలుపులోని ప్రతి పొదా చాలా పరిచయం పద్మినికి. కాళ్ళు అరిగేట్లు యీ అడవి దారులన్నీ వనవాసిలాగా తిరిగే వున్నదామె. ఇలాగ తుర్రుమని జీపులో వెడితే అది నిజంగా పండుగరోజే. కనీసం లారీలో ఎవరయినా ఎక్కించుకున్నా అది పండుగే. అసలు యీ విజిట్ ఒక కలలాగే అనిపిస్తుంది పద్మినికి. అమ్మగారి వీణాస్వనం లాంటి నవ్వులు, అయ్యగారు సూపర్‌ఫైన్‌గా మాట్లాడే ఇంగ్లీషు మాటలు ఎంతో శ్రావ్యంగా వున్నాయి. కొండ పల్లెలోని ఆడవాళ్ళచేత కొన్ని మందిపనులు చేయించింది పద్మిని. పిల్లలకు టీకాలు, చదువులు, మధ్యాహ్న భోజనాలు, శుభ్రమైన బట్టలు యివన్నీ కొన్ని పల్లెల్లో అందించారు. జనాభా తక్కువైనా, చూడముచ్చటగా లక్కపిడతల్లా వుంటాయి బాల్వాడీ కేంద్రాలు. ఇవన్నీ అధికారం, హోదా గలవారు అడిగి తెలుసుకుంటూంటే ఆమెకు పట్టరాని సంతోషంగా వుంది. కొన్ని కార్యక్రమాలు యితరులు ఏర్పాటు చేసినవి చూశారు సుకుమార్. పద్మిని మాత్రం, రేపటినుండి మిగిలిన ఉద్యోగులతో సయోధ్యగా సంసారం వెలిగించగలనా అని భయపడుతోంది - అయ్యగారి యీ అతి మెచ్చుకోలు వలన.

తిరిగి భోజన సమయానికి యింటికి చేరేటప్పటికి సేవకుడు వెంకట నారాయణ, ''అమ్మగారూ! టెలిగ్రామ్ వచ్చిందండీ తమర్ని యింటికి రమ్మని'' అని చెప్పారు. చేతిలో

బ్యాగ్ అక్కడే పడేసి టెలిగ్రామ్ చూసింది. ''స్టార్ట్ యిమ్మీడియట్లీ!'' వెంటనే బయలుదేరి రమ్మని చిన్నమామయ్య యిచ్చాడు. పద్మినికి వణుకు ఆరంభమైంది. ఎవరికి ఏమయిందో ఇంట్లో? అమ్మకి ఆయాసం ఎక్కువయిందో, నాన్నగారికి బ్లడ్‌ప్రెషర్ ముంచుకొచ్చిందో అని ఖంగారు. ఆ టెలిగ్రామ్ పుచ్చుకుని ఆఫీసుకి పరుగెత్తింది. బి.డి.ఓ. రహదారి బంగళాకు వెళ్ళాడట భోజనాలు పెట్టించుకొని. మరొక ఆలోచన కోసం ఆగకుండా, అక్కడికి పరుగెత్తింది. లోపల భోజనాలు అవుతున్నట్లున్నాయి. బి.డి.ఓ. వరండాలో కూర్చుని వున్నాడు. పద్మినిని చూస్తూనే, పెద్ద యిబ్బంది చికాకు ముఖంలోకి తెచ్చేసుకుని ''ఏమిటి?'' అన్నాడు. ఆమె చెప్పింది. ''ఎలా వెడతావు, అయ్యగారు, అమ్మగారు ఇక్కడ క్యాంపులో వుండగా?'' అన్నాడు.

కళ్ళలో నీరు తిరిగిపోతోంది పద్మినికి. ''నా పని అయిపోయింది కదండీ? మా నాన్నగారికి ప్రెషర్ వచ్చేసి వుంటుంది. నేను వెళ్ళాలి సార్'' అన్నది నూతిలోంచి మాట్లాడుతున్నట్లు.

''నీ పనైందో లేదో నువ్వేనేమిటి చెప్పడం? డ్యూటీ అంటే డ్యూటీయే. నాతో వాదించకు. వెళ్ళు'' అంటూ చాలా కోపంగా చూశాడాయన. ఆమె అలాగే నిలబడింది, ఆ టెలిగ్రామ్ కాగితం చేతిలో పట్టుకుని. ''వెళ్ళు యింకా నిలబడ్డావే? వెళ్ళి ఆ రిపోర్టులు అవీ రాసేయ్'' అన్నాడు తీవ్రంగా.

ఆయన కర్కోటకత్వానికి చెప్పదగిన జవాబు దొరక్క వెనక్కి తిరిగింది పద్మిని. ఆఫీసులోకి వచ్చి కూర్చుంది. పొద్దున్నుంచీ కప్పు కాఫీ, మరో కప్పు టీ మినహా మరేమీ పడలేదో ఏమో కడుపులో మంట, గుండెలో ఆవేదన. అలాగే అరగంట కూర్చుంది సీట్లో. జీపులు తిరిగొచ్చాయి. భోజనాలు ముగిశాయన్నమాట. తిండిగొడవలో ఇళ్ళకి చేరుకోవడంలో వున్నారందరూ. బి.డి.ఓ. కూడా అలసి సొలసి ఇంటికి చేరినట్లున్నాడు. పద్మిని ఒక తెగింపు తెచ్చుకుని లేచి నిలబడింది. ఆమె బంగళాకి చేరేటప్పటికి అయ్యగారి బంట్రోతు ఒక్కడే వరండాలో కూర్చుని వున్నాడు. అతను ఏమంటాడోనని భయపడింది. అతని వంక దీనంగా చూస్తూ ''అర్జెంట్‌గా ఒక మాటుంది, అమ్మగారితో చెప్పేసి వస్తానేం?'' అన్నది. బంట్రోతు అనుమతి లభించింది. ''ఏమిటమ్మా'' అన్నారు అమ్మగారు. ఆమె కుర్చీలో, అయ్యగారు మంచంమీద దిండుపై ఒరిగి ఏదో చదువుకుంటున్నారు. పద్మిని చూసి అడుగు వెనక్కి వేస్తోంది. ''ఫరవాలేదు రండి'' అన్నది సుమలత.

''మేడమ్! మా యింటి నుంచి టెలిగ్రామ్ వచ్చిందండీ వెంటనే రమ్మని. మా నాన్నగారికి ఎటాక్ ఏదో వచ్చివుంటుందండీ!'' అన్నది పద్మిని.

సుకుమార్ చదివే పుస్తకం మీద నుంచి తలెత్తి ''వెళ్ళండి! మాతో చెబుతున్నారేమిటి వచ్చి?'' అన్నాడు.

పద్మినికి సరయిన జవాబు దొరక్క ''మీరు పర్మిషన్ యిస్తేనే వెడతానండీ!'' అన్నది.



''నా పర్మిషనా! మీ బాస్ బి.డి.ఓ. ఆయనతో చెప్పండి. ఏమిటి అసలు సమస్య, వద్దన్నాడా ఆయన?'' అన్నాడతను.

పద్మిని తలూపింది. ''మీరు క్యాంపులో వుండగా నన్ను కదలొద్దన్నారండి'' అన్నది ఏడుపు ఒక్కటే తరువాయిగా వున్న స్వరంతో. ''ఓహో! యిలా యివ్వండి'' అంటూ టెలిగ్రామ్ కాగితం అందుకుని రెండు మాటలు రాసి సంతకం పెట్టాడతను. ''వెళ్ళండి. నేను ఆయనతో చెబుతాను'' అన్నాడు కాగితమిచ్చి. పద్మిని యింకా అలాగే నిలబడడం చూసి ''వెళ్ళండి. ఫరవాలేదు'' అన్నాడు మళ్ళీ.

పద్మిని ఎలాగో యింటికి వచ్చి పడింది. ఇంట్లో ఎక్కడివక్కడ వదిలేసి, చిన్న సూట్‌కేసులో నాలుగు బట్టలు పడేసుకుని బయలుదేరింది. సేవకకు తాళంవేసి జి.ఎస్.కు చెప్పిరమ్మంది తను వెడుతున్నట్లు. ఎట్లా తెలిసిందో గానీ, ఆఫీసులో అందరికీ తెలిసిపోయింది. కలెక్టర్‌గారు పర్మిషన్ యిచ్చారట, పద్మిని వెళ్ళిపోతోందిట అని. నలుగురూ వచ్చి అరాళీసేలోపే బస్సు దగ్గరికి నడిచింది పద్మిని. జి.ఎస్.కు మాత్రం చెయ్యి వూపి, వీడ్కోలు చెప్పి, యిల్లు భద్రం, సెంటర్ భద్రం, అమ్మగారు భద్రం అంటూ అప్పగింతలు పెట్టేలోపే బస్సు కదిలింది.

ఆ బస్సులో కోడిపెట్టలు, మేకపిల్లలు, అరిటాకులు, వంకాయలు, ఎరువుల సంచులు... ఒకటేమిటి చరాచర ప్రపంచంలో ఒక భాగం అది. ఇవి దాటుతూపోయి, చుట్టలు కాల్చేవారికి దూరంగా వున్న సీటు ఎన్నిక చేసుకుని కూలబడ్డాక పద్మినికి యిల్లు గుర్తుకు వచ్చింది.

నాన్నెట్లా వున్నారో? రిటైర్ అయిన యీ అయిదేళ్ళలోనూ రెండుసార్లు జబ్బుపడ్డారు. సంతానం ముగ్గురు ఆడపిల్లలు అనే చింత. పెద్దమ్మాయి పెళ్ళిచేసిన నాటికి కాస్త స్థితి బాగున్నా, రానురానూ పెరుగుతున్న ధరల వల్ల దిగజారిపోయింది. రెండవ అమ్మాయి కరుణ భర్త చనిపోయాడన్న బెంగ. మూడో అమ్మాయి పద్మినికి మేనరికం అనుకున్నా, ఆ పెళ్ళి చేసేందుకు కావలసిన డబ్బు లేదని మనోవేదన. ఇంక సుస్తీకాక ఏమిటి జీవితంలో?

ఇరవయ్యో యేట భర్త పోగానే కరుణ ఇంటికి తిరిగి వచ్చేసింది. అత్తవారి వైపు యింత అన్నం పెట్టేవారుగానీ, దారిచూపేవారు గానీ లేరు కరుణకి. ఆ దెబ్బకి కుప్పకూలిపోయి, ఇంటర్ పాసయిన పద్మినిని, జీతాలు కట్టే శక్తిలేక యింట్లో కూర్చోబెట్టేశారు. చదువంటే ఖర్చు, పెళ్ళంటే మరీ ఖర్చు. నెత్తిన దెబ్బ తగిలితే మతిపోయినట్లుగా దెబ్బలుతిని ఒక ఏడాది బతికింది ఆ కుటుంబం. పద్మిని తనే తెగించి కాలేజీలో చేరి బి.ఎస్.సి. అయినాక యీ బ్లాక్ ఉద్యోగం వెదుక్కుంది. ఇప్పటికి కరుణకి యిరవయ్యారు, పద్మినికి యిరవై మూడు.

చిన్నమామయ్య ఎందుకిచ్చాడు టెలిగ్రామ్? ఎప్పుడొచ్చాడసలు? అమ్మకు ఆయాసం రావడం మామూలే. ఆయనే ఏదో వైద్యం చేస్తుంటాడు. దానిమీదే అందరికీ గురి. వైద్యం చేయడానికి పిలిపించారేమో? పెద్దమామయ్య విశ్వనాథం క్యాన్సర్ పేషెంట్. జ్వరంతో, నీరసంతో అలాగే తిరుగుతున్నారు. ఆయన కొడుకు రమణ బావ. నిరుద్యోగి కాబట్టి ఎప్పు

రైనా వచ్చి మేనత్తను చూసిపోతుంటాడు. అందరినీ తలుచుకుని, ఎవరికి ఏమై వుంటుందోనని గుండెదడ ఆరంభమైంది. అడవి వంక చూస్తుంటే ముందుకే కదా పోతున్నానని కొంత నిశ్చింత కలిగింది.

తీరా దిగేటప్పటికి యింటి దగ్గర ఏ అవాంతరమూ వచ్చిన జాడలు కనబడలేదు. వెలిసి, పెచ్చులూడిన గోడలు, యిటుకలు రాలిపోయిన అరుగులు, సున్నం ముఖం చూడని పాతకొంప. తీరిగ్గా కూర్చుని, కష్టాలు తలుచుకొని, దిక్కులు చూడడానికి పనికివచ్చే ఆ అరుగుల మీద, ఎప్పుడూ రెండో మూడో మేకలు పడుకుని వుంటాయి. ఇంటికి వస్తూనే వాటిని తోలడం యింట్లో ప్రతిఒక్కరికీ ఒకపని. పద్మిని రిక్షాకి డబ్బులిచ్చి, మేకలను అదిలించి, లోపలకు అడుగుపెట్టింది.

చిన్నమామయ్య, అమ్మా పీటలు వేసుకుని కూర్చుని కాఫీలు తాగుతున్నారు. నాన్న పడక కుర్చీలో వాలి పంచాంగం తిరగేస్తున్నాడు. కరుణ బావి దగ్గర నీళ్ళు తోడుతోంది. తీరుబాటుగా వున్న వీళ్ళందరినీ చూసేటప్పటికి పద్మినికి కోపం వచ్చింది. ''టెలిగ్రామ్ ఎందుకిచ్చారమ్మా?'' అన్నది చురచురలాడుతూ.

వైదేహి లేచి, కూతురి చేతిలోని బ్యాగ్ అందుకుని ''వస్తూనే ఏమిటమ్మా ఆ చూకుడు?'' అన్నది.

పద్మిని కూలబడింది. ''టెలిగ్రామ్ ఎందుకిచ్చారో చెప్పరేం? అవతల కలెక్టరుగారి ప్రోగ్రామ్. ఎవరికి ఏమయిందోనని హడలి చస్తూ వచ్చాను. ఉద్యోగం ఊడినా ఫరవాలేదన్నట్టు దెబ్బలాడి, పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చింది'' అన్నది గబగబా. చిన్నమామయ్యకి యీ మాటలతో కాస్త చలనం కలిగి ''పోనీ అంత దెబ్బలాడవలసి వస్తే ఎందుకొచ్చావమ్మా? సంగతేమిటని తిరుగు టెలిగ్రామ్ కొట్టలేకపోయావూ?'' అన్నాడు. విచిత్రమైన యీ మాటకు యింకా విచిత్రంగా చూసింది పద్మిని.

''నువ్వేకదా యిచ్చావు టెలిగ్రామ్. అసలు అంత అర్జెంటుగా రమ్మని ఎందుకిచ్చావు? ఏమిటంత ముంచుకుపోయే పని?'' అన్నది,

''పనున్నది కనుకే టెలిగ్రామ్ యిచ్చాడమ్మా. చిన్నక్క, కాగుకింద మంటేస్తోంది. వెళ్ళి వేడివేడిగా యిన్ని నీళ్ళు పోసుకుని రా. ఉప్మా తిందువుగాని'' అన్నది వైదేహి. కూతుర్ని శాంతపరిచి, ఆ తర్వాత అసలు సంగతి చెప్పవచ్చునన్నట్టు.

''అవన్నీ సరేలేమ్మా, నన్నెందుకు రమ్మన్నారు? చెప్పకపోతే నేను యీ పళాన వెళ్ళి ఏడుగంటల బస్సు ఎక్కేస్తాను'' అన్నది పద్మిని గట్టిగా.

రఘురామయ్య యింతదాకనే పంచాంగం చూడడం మానివేశాడు. ''చూడమ్మా పద్మా నిన్ను చూసుకోవడానికి రేపు ఎవరో వస్తామన్నారు...'' యీ మాటలు ఆయన అంటుంటేనే, ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయినాయి.



ఎలాగూ విషయం మొదలెట్టారు కనుక, చిన్నమామయ్య అందుకుని ''అవునమ్మా పెళ్ళిచూపులకోసం వస్తున్నారు. నిన్ను అడక్కుండానే పిలిచాము రేపు రమ్మని'' అంటూ కంఠం తగ్గించి, ''పెద్దమామయ్య కొడుకు రమణ విషయం ఏమైపోయిందని నువ్వు ఆశ్చర్యపోతున్నావు. వాడు వేరే దారి చూసుకుంటున్నాడు. వాడికీ, నీకు పెళ్ళి జరిపించలేమని మాకు తేలిపోయాక, యీ ప్రయత్నం మొదలెట్టాం. చూడమ్మా నువ్వు ఆవేశపడకుండా నిదానంగా అర్థంచేసుకో'' అని పూర్తిచేశాడు.

పద్మిని ఆవేశం యిందాకే కరిగింది. కొంచెంగా నీరసం వంట్లో. చూపు వాలిపోయింది. ఎన్ని విషయాలు ఒక్కసారి చెప్పాడు మామయ్య! కాస్సేపు నిశ్శబ్దం. అందులోనే ఎవరి ఆలోచనలు వారివి.

ఇంతసేపూ కరుణ తలుపు దగ్గర నిలబడి వున్నది. ''లోపలికి రా పద్మా నీళ్ళు కాగాయి'' అన్నది.

పద్మిని ఫలహారం చేస్తుంటే ఒక్కొక్క సంగతి చెప్పింది అమ్మ. విశ్వనాథం మామయ్యకు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది కనుక పెద్దవైద్యం జరగడానికి డబ్బు బోలెడు కావాలి. రమణ బావకి ఉద్యోగం లేదు. బొటాబొటీ సంసారం. తనకు ఉద్యోగానికీ, నాన్నకు వైద్యానికీ కూడా సాయపడ్డానికి సిద్ధపడ్డ డాక్టరు గారికి ఒక పెళ్ళీడు కూతురుంది. ఇంతవరకూ అమ్మ చెప్పగానే, మబ్బులు విచ్చినట్లు అసలు సంగతి అర్థమయింది పద్మినికి.

ఉప్మా తినడం అయిపోయింది. ఖాళీ ప్లేట్లో వేలితో గీతలు గీస్తోంది ఆమె. తనకు ఉద్యోగం వచ్చినపుడు, ఆ వచ్చేదేదో బావకైనా రాకూడదా అన్నారు అందరూ. అతనికి ఉద్యోగం వస్తే ఆమెను పెళ్ళి చేసుకుంటాడని ఆశ. రమణా, తనూ ఎంత చనువుగా వున్నా, ఒక అందమైన ఉల్లిపొరలాంటి దూరం వుంటుండేది తమ మధ్య 'బావా, నువ్వు' అని పిలిచినా ఏదో గౌరవం తన పిలుపులో. పెళ్ళికి ముహూర్తం పెట్టేలోగా తను రెండు మూడు వేలయినా దాచుకోగలనేమో అనుకుంది, కానీ అది కుదరలేదు. ''రేపు వస్తున్నవాళ్ళని రమణబావే పంపిస్తున్నాడు. వాళ్ళొచ్చి వెళ్ళాక, ఒంటిగంట బస్సుకు వెళుదువుగాని. ఒసే, మాట దక్కించు'' అన్నది అమ్మ చివరి మాటగా. ఎంత బాధగా వుంది! అతనే సంబంధం వెతికి పంపడం! అమ్మ మీద గానీ, చిన్నమామయ్య మీద గానీ విసుక్కోవడం అనవసరం అని గ్రహించి పద్మిని యింక మౌనంలో వుండిపోయింది.

పెద్దమామయ్య విశ్వనాథానికి, చెల్లెలు వైదేహి అంటే చాలా ప్రేమ. ఉన్నంతలోనే, ఏటేటా ఏదో ఒకసారి ఒక చీర పెట్టేవాడు. అతని భార్య పోయి అయిదారేళ్ళు అయింది. ప్లీడరు దగ్గర గుమాస్తాగా చేస్తూ, అందరికీ తలలో నాలుకలా మసలుకుంటూ వున్న విశ్వనాథానికి వున్నట్టుండి నలత ప్రారంభమైంది. గవర్నమెంటు ఆస్పత్రిలో చేయించుకున్న వైద్యం ఏ బాధనూ తగ్గించలేదు. ఏదో పెద్దరోగం వుందన్న లక్షణాలు రికార్డుల్లో ఎక్కింది వదిలాడు

డాక్టర్లు. విశ్వనాథానికి యిద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు. అతనే రమణ. కూతుళ్ళిద్దరికీ మంచి సంబంధాలు యిచ్చాడు. వాళ్ళ సంసారాలు ఎంతో బాగున్నాయని సంతృప్తిపడుతూ, బి.ఏ. పాసయిన రమణకి ఉద్యోగం కోసం ఆరాటపడుతున్న సమయంలో, అంతా అస్తవ్యస్తం చేస్తూ యీ రోగం వచ్చిపడింది. టైపు, షార్ట్‌హ్యాండు నేర్చుకున్నా, ఆ ప్లీడరు గారి దగ్గర గుమాస్తాగా చేసేవాడు. కానీ రమణ ఆ విద్యను నేర్చుకోనూలేదు, తండ్రిలాగా గుమాస్తా అనిపించుకోవడమూ యిష్టం లేదు. ఏలుంటే తనూ 'లా' చదివి, ప్లీడరుగా బోర్డు తగిలించాలన్న అతి సామాన్యమైన కల అతనిది. మూడేళ్ళు చదువులోనే గడిపేస్తే, యిల్లు గడిచేదెలాగూ అని విశ్వనాథం ప్రశ్న.

ఈ ప్రశ్నకు యింక జవాబు చెప్పే అవసరం లేకుండా ఆసుపత్రులు, పరీక్షలు, బలానికి మందులు, రిపోర్టులు ఏమి వస్తాయోనని ఎదురుచూడడం - వీటిల్లో పడిపోయింది ఆ సంసారం. అమ్మాయిలిద్దరూ వచ్చి చూసి వెళ్ళినా, పూర్తిభారం రమణమీదే పడింది.

విశ్వనాథం పనిచేస్తున్న వకీలుగారు పాపం వెయ్యి రూపాయలు సాయం చేశారు. జీతం పట్టుకోకుండా కొన్ని నెలలు సెలవు ఇచ్చారు. కానీ, కోర్టు పనులకు యిబ్బంది అవుతున్నదని ఆయన కొప్పిసార్లు అనగానే, రమణకి పౌరుషం వచ్చింది. ''మన తిప్పలు మనం పడదాం'' అని గట్టిగా తండ్రితో అన్నాడు.

ఎటొచ్చీ ఆ ప్లీడరుగారు అపకారమో, ఉపకారమో తెలియదుగానీ లేబొరేటరీ వున్న ఒక డాక్టరు గారికి విశ్వనాథం జబ్బు గురించి చెప్పారు. ఆ డాక్టరుకి పెళ్ళికాని ఒక కూతురు వుంది. ఒక్కతే కూతురు. ఎక్కడా, ఏ సంబంధం కుదరకపోవడానికి ముఖ్య కారణం ఆ పిల్లకు పోలియో వల్ల కాలు దెబ్బతిని, యీడుస్తుంటుంది. అనాకారి కాదుగానీ, అవకరమున్న పడుచు.

రమణ తన డిస్పెన్సరీకి వచ్చిపోతున్నప్పుడు ఆ డాక్టరు ఎంతో ఆదరణగా చూసేవాడు. ప్లీడరుగారు ఆయన మనసులో నాటిన ఆశాబీజం మొలకెత్తి, తన కూతురికి యితనే భర్త అని గట్టిగా నిశ్చయమై, చిలవలు పలవలుగా ఆలోచనలు పెరగసాగాయి. విశ్వనాథం వైద్యం ఖర్చు ఎక్కువయిపోతోందే, ముఖ్యంగా అంతులేని పరీక్షలకోసం రోజూ వందలు కావలసి వస్తున్నప్పుడు అరువు ఖాతా ఏర్పాటుచేశాడు ఆ డాక్టరు. ఆ సమయంలో విశ్వనాథానికి విపరీతమైన ప్రాణభయం పట్టుకుంది. పద్మిని పుట్టినప్పుడే రమణకి పెళ్ళాం పుట్టిందని అందరితోనూ అన్నమాట తీసిపారేసే అవసరం కనిపించింది. రాసిపెట్టి వున్నచోటే పెళ్ళి అని ఒక సిద్ధాంతం కూడా మనసులోకి వచ్చేసింది.

''ఏరా రమణా! పద్మకి మంచి సంబంధం చూసి పంపిద్దాం. నా మాట యీ ఒక్క విషయంలోనూ వినరా... లేదా నన్ను ఆ గవర్నమెంట్ ఆస్పత్రిలోనో, అనాథరోగుల శరణాలయంలోనో పడేయ్. ఆయుష్షున్నన్నాళ్ళు బతికి, అది తీరగానే గుటుక్కుమంటాను'' అంటూ సెంటిమెంట్ మీద దాడిచేశాడు.



రమణ మంచివాడు. ధర్మానికి నిలబడాలని అంతరాంతరాల్లో అనుకునేవాడు. కానీ చెట్టంత తండ్రి తనని 'దేహి' అని ప్రాణభిక్ష అడుగుతున్నట్టు దృశ్యం కళ్ళముందు. తను నిరుద్యోగి, ఆస్తి ఏమీలేదు. ఎందుకూ అక్కరకు రానట్టు చెత్తడు డిగ్రీ.

పోనీ ఒకసారి ప్రయత్నం చేద్దాం - వైదేహి అత్తయ్య, మామయ్య ఏమంటారో - అసలు తనకి ఎప్పుడో అన్నెల్లకు గాని కనబడని పద్మిని ఏమనుకుంటుందో తెలుసుకోవాలని బాబాయితో సంప్రదించాడు. తన ఎరికలో వున్న స్నేహితులు, ఆస్తివున్న అబ్బాయిల సంబంధాలు కొన్ని చెప్పాడు. పిల్లలంతా చిన్నమామయ్యగా గౌరవిస్తూ, ఆయన సలహాకు ఎంతో దూకం యిస్తుంటారు. ఆయన అండే శివరాంగారు అటు అన్నగారి క్యాన్సరుకి తక్షణం ఆపరేషన్, ట్రీట్‌మెంట్ మొదలుపెట్టవలసిన తొందర గుర్తించాడు. నిజంగానే అది చావుబతుకుల సమస్య. ఆపరేషన్ చేస్తే అయిదేళ్ళో పదేళ్ళో జీవితం పొడిగించవచ్చు. చేయకపోతే ఏడాది కూడా గడవడం కష్టం. ''ఈ డాక్టర్లు లామే దేముళ్ళమైనట్టు మాట్లాడతారా. కానీ నమ్మక తప్పదుమా'' అన్నాడు రమణతో శివరాం.

''డాక్టరు గారి అమ్మాయి కూడా అధ్వాన్నంగా వుండదురా! పాపం అలాంటి పిల్లను నువ్వు చేసుకోవడంలోనూ పుణ్యముంది'' అని ఒక సమర్థింపుమాట అన్నాడు.

''సరే, నేను ఏదో ఒకటి అక్కడ సర్దిచెబుతాలే. నిజానికి, పద్మనికి ఏమంత వయస్సు మించింది? ఆ కుటుంబానికి అదే ఆధారం. నువ్వు చెప్పే సంబంధం మంచిదే. వెనుక కొంచెం వున్నవాడు కనుక పెళ్ళికిముందే మనం, అమ్మాయి తన జీతంలో కొంత తల్లిదండ్రులకు యిస్తుంది అని చెప్పేస్తే సరిపోతుంది'' అని అనుకూలమైన తీర్పు యిచ్చాడు.

నవ్వుతో కళకళలాడే పద్మిని రమణకి అనుక్షణం గుర్తుకు రాకపోలేదు. కానీ అది తన గుండెలో అడుగుకి తోసేయవలసిన బొమ్మ అని నిట్టూర్చాడు. ఇంత కథ వున్నది పద్మినికి ఒక కొత్త సంబంధం తీసుకురావడంలో. రాత్రి నిద్రపట్టలేదు ఎంతకీ. ''పద్మా! నిద్రపట్టడం లేదా?'' అన్నది కరుణ ఆ చీకట్లో. జవాబు లేదు - సన్నగా నిట్టూర్పు తప్ప.

''రమణబావ నీకు ఉత్తరం రాస్తానన్నాడట రాశాడా?'' అన్నది కరుణ.

''లేదు. అయినా యింకా రాసేందుకు ఏముందిలే. సరే, అక్క పురిటికి ఎప్పుడు వస్తుంది?'' అన్నది పద్మిని.

పెద్దక్క వరలక్ష్మికి యిది నాలుగో కానుపు. ఉండేది పెద్దపట్నమే అయినా, ఒక్కతీ చేసుకోలేదు కనుక పురుళ్ళకి పుట్టింటికే వచ్చేస్తుంది. పోనీ అమ్మని పంపిస్తాం అని అంటే, బావకి ఆ బాధ్యత తీసుకోవడం ఇష్టంలేదు. వరలక్ష్మిని పిల్లలతో సహా పంపేసేవాడు. అసలే కుంటుతున్న సంసారం. ఈ ఖర్చులతో మరింత అణిగిపోతుంది. మునిగే అప్పులు చేసిన నాన్న, గండాలన్నింటిని గట్టెక్కించడానికి ప్రయత్నాలు చేస్తుంటే, చూడలేక పద్మిని ఆ భారాన్ని తనమీద వేసుకుంటోంది. ఫలితంగా జీతంలో అన్నీ కోతలు. నెలనెలా యింటికి సొమ్ము పంపి, తను కటకటపడడం. పెద్దక్క వస్తోందన్న గొప్పవార్త వెనకాల యింత గొడవ వుంది.

''రమణ బావ చేసుకుంటున్న పిల్ల అవిటిది. బోలెడు కట్నం యిస్తారట. ఉద్యోగం యిప్పిస్తారట. మామయ్యకి ఆపరేషన్‌కి, వైద్యానికి ఏర్పాటు చేస్తారట మామగారు'' అన్నది కరుణ.

పద్మిని చిన్న విసుగుతో ''సరేలే, అవన్నీ దేనికి మనకి? పడుకో అక్కా'' అన్నది, తన నొకకసారి కలుసుకుని 'పద్మా ఏమి చేద్దామంటావు' అని సలహా అయినా అడగలేకపోయాడు బావ. చిన్నప్పటినుంచీ వున్న స్నేహం కూడా గుర్తుకురాలేదేమో. గుండెల్లో ఏదో గుచ్చి నట్లయింది పద్మినికి. తనని వదిలేయడమేకాక, కథల్లో చెప్పినట్లు సంబంధం వెతికి పంపిస్తు న్నాడంటే తనెందుకు లొంగాలని పౌరుషం వచ్చింది.

''అక్కా! పొద్దున బస్సుకి వెళ్ళిపోతానే!'' అన్నది. కరుణ లేచి కూర్చున్నది. ''వెళ్ళిపోతావా, వచ్చినవాళ్ళు ఏమనుకుంటారు?'' అన్నది భయంగా.

''నన్ను ముంచేస్తే నేను ఏమనుకుంటానని ఆలోచిందాదా బావ? పోయేది బావ పరువేగా, పోనీ, నాకు పెళ్ళిచూపులూ వద్దు, పెళ్ళీ వద్దు. అంతగా నేనేమీ పెళ్ళికోసం మొహం వాచి పోవడం లేదు. నిరుద్యోగి కనుక బావ కక్కుర్తిగా ఎవర్నో కట్టుకుంటున్నాడు. నాకు లక్షణమైన ఉద్యోగం వుంది. అంత అవాంతరంగా పెళ్ళి చేసుకోవలసిన ఖర్మ పట్టలేదు'' విసురుగా అన్నది.

ఇంతలేసి మాటలు భరించే శక్తి కరుణకి లేదు. ఆమెకు దడ పట్టుకుంది. పద్మిని మాత్రం ఎప్పుడో నిద్రలోకి జారిపోయింది. హఠాత్తుగా తెల్లవారుఝామున కాబోలు మెలకువ వచ్చింది. తనకు వచ్చిన కల స్పష్టంగా కళ్ళముందు తిరుగుతుండగా లేచి కూర్చుంది.

కలలో సుకుమార్, అతని భార్య సుమలత, తను జీపులో పెద్ద కొండమీద వెళుతున్నారు. కుడిపక్కకు చూస్తే పెద్ద లోయ. ఎడమపక్క చూపుకి అందనంత పెద్దకొండ. నిటారుగా భయంకరమైన ఎత్తు. ముందురోజు క్యాంపుకి వెళ్ళినప్పుడు కూర్చున్నట్లే పద్మిని వెనకసీట్లో వుంది. సుకుమార్ బండి నడిపిస్తున్నాడు. ఒకపక్కకు ఆపి, ''మీరు ముందుకు రండి. సుమ భయపడుతోంది. వెనుక ఆ సెంటరు సీటులో కూర్చుంటుంది'' అన్నాడు. పద్మిని సంచేహ పడుతోంది. తను ముందుసీటులో ఆఫీసర్ పక్కన కూర్చోవటమా?

సుమలత చిరునవ్వుతో తన శాలువా సవరించుకుంటూ దిగి, 'ఫరవాలేదు' అని వెనక్కు నడిచింది. పద్మిని జీపు దిగి ముందుకు వచ్చింది. కాలు మెట్టుమీద పెట్టబోతోంది. కల ఆగిపోయింది.

అప్పుడే మెలుకువ వచ్చింది పద్మినికి. ఏమిటి యిలా వచ్చింది? అనుకుంది. ఎప్పటికో కాకులు అరచినవేళకు కునుకుపట్టింది.

మరునాడు పొద్దున్నే ఎంతో చికాకుగా గడిచింది. ఆ వచ్చిన పెళ్ళికొడుకు చిట్‌ఫండ్ కంపెనీలో గుమాస్తా. బి.కాం. ఫెయిలయ్యాడు. అతని అమ్మా నాన్నా, మరెవరో పెద్దమనిషి



వచ్చారు పెళ్ళిచూపులకి. మామూలు తతంగం. అది ఎంచేతనో కుదిరే సంబంధంలా అనిపించలేదు యింట్లో ఎవరికీ. వాళ్ళు ముభావంగా కనిపించారు. వీళ్ళు మరీ ముభావంగా వున్నారు. 'మేనరికం ఎందుకని చెడిపోయింది' అని ఆ వచ్చిన అబ్బాయి తల్లి అడగడంతో అసలు చికాకు ఆరంభమైంది. ఏదో సర్దిచెప్పారు గానీ అది అతకలేదు. ఏమయితేనేం పెట్టినవి తినేసి వాళ్ళు వెళ్ళారు. నాలుగు మెతుకులు కతికి, పన్నెండున్నర బస్సు ఎక్కేసింది పద్మిని.

నాలుగవుతుండే బ్లాక్ ఆఫీసుకు చేరుకుంది పద్మిని. సేవక్ వెంకటనారాయణ టీ దుకాణంలో కూర్చుని వున్నాడు. పరుగెత్తుకొని వచ్చి సూట్‌కేసు, బుట్ట అందుకున్నాడు. క్వార్టర్స్‌కు చేరేలోగా, బి.డి.ఓ. ఎలా అగ్గిరాముడై భరతనాట్యం చేసిందీ, కూడా వున్న ఆఫీసర్లంతా తాళవాయిద్యాలు ఏవిధంగా మోగించిందీ చెప్పాడు. నిజానికి వాళ్ళంతా నోట పట్టిన అశ్లీలాలన్నీ చెప్పలేదుగానీ, యిప్పుడు కంటపడితే తుపాకీతో కాల్చేసేటంత కోపంగా వున్నాడని చెప్పాడు.

''అమ్మా! పెద్దయ్యగారు యీ రేత్రికి ఆఫీసులో ట్యాన్సులు చూస్తారంట. రేపు కొనాళ్ళ, సెట్లు, వాగులూ చూసి, మధ్యాన్నం ఎల్లిపోతారంట. మీరిపలాన అరి కాళ్ళట్టుకుని - విమ్మాళ్ళేం సేయడానికి యీల్లేదని కాయితం రాయించుకోండి'' అని తన చిన్నబుర్రకి తోచిన సలహా చెప్పాడు.

''ఛీ, కాళ్ళు పట్టుకోవడమేమిటి? పిచ్చిమాటలు'' అన్నది కసురుతూ పద్మిని. తను ఎంత వినయంగా వున్నా యీ బి.డి.ఓ.తో తలపడక తప్పేటట్లు లేదు. ఇంట్లోనే ఏదో సర్దుతూ కాలక్షేపం చేసుకుంటున్నట్లు తనను తానే సొనప్పుడ్చుకుని కూర్చుంది పద్మిని. మనసులో ఆరాటం సుడులు తిరుగుతోంది. ఒక ఎల్.డి. అసిస్టెంట్ వచ్చాడు ఆరున్నరకి, అయ్యగారు రమ్మంటున్నారని. ''నేను లీవుమీద వున్నాను, రాను. ఆహా, అది కాదులెండి. ఆఫీసు టైము దాటిపోయింది రానన్నానని చెప్పండి'' అన్నది ధీమాగా. అతను వెళ్ళిన అయిదు నిముషాలకి మనసు, చీర మార్చుకుని యిల్లు తాళం వేసుకుని బయలుదేరింది ఆఫీసుకి. బి.డి.ఓ. రూమ్ నుంచి చివరి స్టోర్‌రూమ్ వరకూ దీపావళిలాగా ఫెళ్ళున లైట్లు వెలిగిపోతున్నాయి. మీటింగ్ హాల్‌లో కోలాహలం, గట్టిగ దబ్బాడు. తను ఏటు అడుగువేద్దామా అని ఆలోచిస్తుండే సింగ రంగు పియట్‌కారు వచ్చి ఆగడం, సుకుమార్, సుమలత దిగడం జరిగాయి. తను ఎదురుపడింది కనుక నమస్కారం పెట్టింది. బి.డి.ఓ. తినేసేలా చూస్తున్నా, సుమలత గారిని అనుకుని నడుస్తూ లోపలి హాల్‌లోకి వచ్చింది.

''ఏమయింది? యింట్లో అందరూ కులాసాయేనా?'' అని అడిగాడు సుకుమార్. పద్మిని యీ ప్రశ్నకు సిద్ధంగా లేదేమో, అరక్షణం గుడ్లు మిటకరించి, ''సీరియస్ ఏమీ లేదండీ'' అన్నది.

తనను రక్షించి గ్రామ సేవికలు, బాలసేవికలు గబగబా పరుగెత్తుకుని వచ్చారు హమ్మయ్య మేడమ్ వచ్చేశారు తమకేమీ ఫరవాలేదన్నట్టు. గిరిజన బాలల కార్యక్రమాలు చూడడానికి

విచ్చేశారు యీ దంపతులు. పేరుకి గిరిజన బాలల కార్యక్రమం కానీ, సగంమంది బ్లాక్ ఆఫీసులోని ఉద్యోగుల పిల్లలే. పిల్లలంతా గొల్లుమని గోల. మైకుముందు స్థానిక సంగీత విద్వాంసుని పాట సాగుతోంది. పెద్దల రాకతో ఆ పాట ఫేడ్ అవుట్ అయిపోగా, బి.డి.ఓ. చిన్న ఉపన్యాసం ఆరంభించాడు. పద్మిని యీలోగా శరవేగాన పిల్లల డ్రస్సులు, పెదాల రంగులు సర్దేసి ఏమేమి అయిటమ్స్ వారు చేస్తున్నారో తెలుసుకుంది. ఇంక తనే వ్యవహారమంతా నడిపించాలి. ముందు అతనిని, తరువాత ఆమెని, చిట్టచివరిగా బిడిబిడిపోతూ బి.డి.ఓని చూసింది. కళ్ళల్లోంచి శూలాలు వదిలాడాయన. అమ్మగారి వంక చూస్తూ ఏదో నవ్వుతూ మాట్లాడి, పద్మినిని రమ్మని సైగచేసి పిలిచాడు సుకుమార్. కుర్చీల దగ్గరగా వెళ్ళింది పద్మిని.

''ఏమిటిప్పుడు ప్రోగ్రామ్?'' అన్నాడతను.

''గిరిజనుల పిల్లలు, యీవూరి పిల్లలూ కలిసి డ్యాన్సులు చేస్తారండీ. నాలుగు నెలల క్రితం హైదరాబాదు నుంచి మాష్టారు వచ్చి నేర్పారండీ'' అన్నది పద్మిని.

''ఇక్కడి వారి ట్రైబల్ డ్యాన్సులు వాళ్ళే వచ్చి నేర్చుకుని పోవాలిగానీ, ఆ మాష్టారు వీరికి నేర్పడమేమిటి?'' అన్నాడాయన. సుమలత మధురంగా నవ్వింది యీ మాటకు. పద్మినికి నిన్నరాత్రి కల గిర్రున మనసులో తిరిగింది. గుటక మింగి, ''వాళ్ళూ నేర్చుకున్నారు సార్! సితార్, హార్మోనియం, తబలా, గజ్జెలు అన్నీ కొన్నారు సార్. మంచి పెయింటింగ్ కూడా నేర్పారు'' అన్నది గబగబా.

అయ్యగారితో తను ఏకబిగిన స్వతంత్రంగా మాట్లాడడం, అందరూ, ముఖ్యంగా బి.డి.ఓ. చూడాలనే ఆ ధోరణి. పద్మిని తిరిగి స్టేజిమీదకు వెళ్ళబోతుంటే, అతను ''త్వరగా పూర్తి చేసేయండి. యీ హాల్లో ప్రతిధ్వని భరించడం కష్టం'' అన్నారు. సుమలత బుగ్గన వెయ్యి అనింది భర్తవంక చూస్తోంది. ఆమె చూపులో అతనంటే ఒక స్వంతరికం ఉట్టిపడుతోంది. కార్యక్రమం పూర్తయ్యేటప్పటికి పూర్తిగా 'రంగనాయకి అయ్యింది పద్మిని. మైకులో సున్నితంగా మాట్లాడడం, అందంగా అందరిపేర్లూ చెప్పడం, సన్నకంఠంతో పాటలు పాడి పిల్లలచేత ఆడించడం, అందరినీ క్రమపద్ధతిలో కంట్రోల్‌లో వుంచడం - అన్నీ ఒక ప్రత్యేకత స్ఫుటంగా కనిపించేటట్లుగా నిర్వహించింది. అందరూ అభినందించారు. బి.డి.ఓ. అంటే పడనివాళ్ళు మరీ ఎక్కువగా మెచ్చేసుకున్నారు. ఏలినవారు, ఆ దంపతులు పొగిడారు. వాళ్ళు వెళ్ళిపోతుంటే, అమ్మగారి సరసనే నడుస్తూ కారువరకూ వెళ్ళి సాగనంపింది. కారు స్టార్ట్ అయిన తరువాత ''రేపు వాటర్‌ఫాల్స్ చూడడానికి వెళుతున్నాము, మీరు రండి'' అన్నాడు సుకుమార్. పద్మిని తలూపింది. సుమలతగారు కూడా చిరునవ్వుతో అంగీకారం తెలిపింది. కారు వెళ్ళిపోయింది.

ఇక యుద్ధానికి సిద్ధపడాలని హాల్లోకి వెళ్ళి అన్నీ సర్దడం ఆరంభించింది. ఆయన విరుచుకుని పడినా బావుండును. ఏదో గొడవ తేలిపోతుందనుకుంటే, పలుకే లేకుండా రూములోకి దూరి కూర్చున్నారు. అందరినీ పంపి తమ యింటికి యీసురోమని బయలుదేరు



తుంటే, మేనేజర్ పిలిచి, రేపు పిక్నిక్ కోసం పాటూ, స్వీటూ మిమ్మల్ని తయారుచేసి తీసుకురమ్మన్నారు బి.డి.ఓ. అని 'అయ్యగారు రమ్మన్నారటగదా!' అన్నాడు సన్నగా.

''అన్నారు కదాని నేను వెంటపడితే ఏం బావుంటుందిగానీ, ఏమైనా వండడానికెం వండుతా! యిప్పుడు పదకొండు గంటలేగా అయింది. రాత్రి తెల్లవార్లూ టైముంది'' అంటూ విసురుగా యింటికి బయలుదేరింది.

'కోన' ఒకపన్నెండు కిలోమీటర్ల దూరం. వెళ్ళే దోవంతా చిట్టడవి. అర్థమే లేకుండా పెరిగిన చెట్లు, తీగెలు, పొదలు, ఎర్రటి మట్టినేల జీపు నడుస్తుంటే యింత ఎత్తున దుమ్ము లేస్తున్నది. వెనుక సీట్లో కూర్చున్న పద్మినికి మొన్నరాత్రి వచ్చిన కలే మనసునిండా. తనని అతను స్వయంగా ఆహ్వానించాడు రమ్మని. జంతికలు, మైసూరుపాకు యింకా ఏవో రెండురకాలు చేసింది ఆ రాత్రి రెండున్నర వరకూ కూర్చుని. తెల్లవారి మళ్ళీ ఆరింటికే లేచి బిర్యానీ కలిపింది. అవి పట్టుకుని వెంట సేవిక, అయ్యగారి ప్యూను, ఒక క్లర్కు, యీ పక్కన తనూ కొత్తజీపులో ప్రయాణం.

గిరిజనుల ఆచారాలు, నమ్మకాలు, పరిశుభ్రత విషయంలో వారి పద్ధతులు, వాళ్ళతో మొదట్లో తాను పడ్డ కష్టాలు, ఆ తరువాత వాళ్ళ అభిమానం చూరగొన్న పద్ధతి అన్నీ పద్మిని చెబుతోంది. అయ్యగారు, అమ్మగారు కూడా ఆమె మాటలు యిష్టంగా వింటున్నట్లు కనబడ్డారు. ఎంచేతో ఆ దొరవ యిచ్చేశారు.

జీపు స్పీడు తగ్గి, మెల్లిగా నడుస్తుంటే, కుడిపక్కన ఎన్నో వందల అడుగులున్న అగాధం. ''ఒకసారి యిక్కడ బొంబాయి నుంచి వచ్చిన ఫిలింటీమ్ వారి జీపు దొర్లిపోయింది సార్'' అని చెప్పింది పద్మిని. ''అరె! ఎవరైనా బతికారా లేదా?'' అన్నాడతను.

''అదే చిత్రం. అందరూ బతికారు. డ్రైవర్ మాత్రం పాపం కాళ్ళ ఒక వారంపాటు ఆస్పత్రిలో వున్నాడు. ఆ దెబ్బతో సినిమా వదిలేసి బొంబాయి తిరిగి వెళ్ళిపోయారు'' అని చెప్పింది. యింకా ఏదో ఆమె చెప్పబోతుంటే సుకుమార్ గులాబీరంగు తన అరచేయి అడ్డంగా ఆడిస్తూ, ''నో ప్లీజ్, డ్రైవ్ చేస్తున్నవారికి ఆ కథ యిప్పుడు చెవుల్లో వినిపించకూడదు'' అన్నాడు. పద్మిని నోరుమూసుకుంది.

''సుమా! ఒక్కోసారి నాకనిపిస్తుంది అభివృద్ధి చేస్తామంటూ వచ్చి, వీళ్ళ నాగరికత చెడగొడుతున్నామేమోనని. వీళ్ళ ప్రకృతికీ, ఋతువులకూ అనువైన ఆరోగ్య పద్ధతులున్నాయి. యుక్తవయస్సు వచ్చాకనే పెళ్ళి జరిపించే మంచి ఆచారముంది. సుధీకారంతో సొంపైన భాష వుంటుంది. వీటన్నింటిలో మనం, మన భావాలు జొప్పించి, వాళ్ళని చెదరగొడుతుంటాము. ఏం చేస్తాం, యిది మన డ్యూటీ అని సరిపెట్టుకుంటాం''.

ఆయన మాటలు ఎంతో స్పష్టంగా వున్నా, పద్మినికి ఏదో భాషలాగా వినిపిస్తున్నాయి. ఈ పల్లెవాసులను పైకితీసుకువద్దామనేగా తమ ప్రయత్నం. మరి ఈ విషయంలో సందేహాలేమిటి

అనుకుంటున్నది. కలలు నిజమవుతాయా? ఆమె గుండెలు గబగబా కొట్టుకుంటున్నాయి. ఆ ఆలోచన తుదిలేనా పోవడం లేదు. అందరూ వడిపోతే, అందరికీ ఏదయినా అయితే, బాబోయ్ కొట్టు విలువచేసే ప్రాణాలు ఏవి. కొన్ని అంగుళాల దూరంలో వున్న ఆ యువకుడిని, ఆఫీసరుని చూసి పద్మిని ముఖం ఎర్రబడి చెమట పట్టేస్తున్నది. ఎరుపెక్కిన చెవులు, నునుపైన చెంపలు, నల్లగా మెరిసిపోతున్న జుట్టు, గచ్చకాయ రంగు సూటులో మనోహరంగా వున్నా తనను - పేరే సుకుమారుడు.

ఊహలు గుర్రాలు. పగ్గాలు పట్టాలని ప్రయత్నించినా ఆగవు. కారువాన మబ్బులు, హోరుగాలికి తేలిపోతూ పయనమై పరుగులు పెడతాయి. ఆగకుండా కొట్టుకుంటున్న గుండె చప్పుడుని, ఎర్రమట్టి దారిలో పోతున్న జీపు చప్పుడుని కలిపి వింటున్నది. మనస్సులో ఏమి గజిబిజి వుందో ఆమెకే తెలియదు.

- అనుకున్నంతా అయింది. సబ్‌కలెక్టర్ సుకుమార్ సతీసమేతుడై పొలిమేర దాటాడో లేదో బి.డి.ఓ. పద్మినిని ఆఫీసు గదిలోకి బ్రెయిన్‌వాష్ కోసం పిలిచాడు. "హౌడుయుడూ?" నాగరికంగా కుశలప్రశ్నలు మొదలుపెట్టి, ఉద్యోగం తీయించేస్తానన్నంత వరకూ వెళ్ళాడు. డైరెక్టొరేట్‌కు రాస్తానన్నాడు. నెలకు ముప్పై నైట్‌హాల్ట్స్ చూపాలన్నాడు. ఆమె ప్రవర్తన గురించి బండారమంతా బయట వేస్తానన్నాడు.

కుంభవృష్టి లాంటి ఆయన మాటలన్నీ విన్నది పద్మిని తలవంచుకుని. ప్రవర్తన, బండారం అనే మాటలు వినవచ్చినప్పుడు మాత్రం బుసకొట్టినట్టు చూసిందొకసారి. ఇన్నన్ని మాటలు పడవలసి వస్తున్నందుకు దుఃఖం పొంగింది. తనని యిలాంటి స్థితిలో పడవేసిన ఆ టెలిగ్రామ్ యిచ్చిన మామయ్యమీద కోపం వచ్చింది.

"వెళ్ళింక, యీ బ్లాక్‌లో ఉద్యోగం చేయదలచుకుంటే, నా మాట జవదాటకుండా నడవాల్సిందే. కలెక్టర్ గానీ, ఆయనగారి బాబురానీ నా పవర్స్ ఎలా కాదంటారో నేను చూస్తాను" అని గర్జించాడు.

పద్మిని యింటికి తిరిగి వెళ్ళింది. ఆయన అన్నటువంటి యీ ముక్కలన్నీ కాగితం మీద ఎక్కించి సుకుమార్ గారికి రాస్తే సరి. తిక్క కుదురుతుంది, అనిపించింది. కానీ ఆయన అన్నాడనడానికి దాఖలా ఏది? సాక్ష్యం ఎవరిస్తారు? ఆవేశానికి, వివేకం బ్రేక్ వేసింది.

మర్నాటినుంచీ బెదిరించినంతపనీ చేయడం మొదలెట్టాడాయన. పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో వున్న ఒక కారడవి పల్లెలో ఆడవాళ్ళకి క్యాంపు ఏర్పాటు చేయమన్నాడు. బండిలో కొంతదూరం, కాలినడకన కొంతదూరం వెళ్ళాలి. చిట్టడవి. "ముందుగా చెప్పకపోతే వాళ్ళంతా అడవిలో పనులకు పోతారుగదండీ?" అన్నది పద్మిని. "పోనీ యివ్వాళ్ళే చెప్పిరా. ఎల్లుండి క్యాంపు సామాను పట్టుకెళుదువుగాని" అన్నాడాయన చదువుతున్న ఫైలులోంచి బుర్రయినా ఎత్తకుండా. పద్మిని పెదవి కొరుక్కుని "జీపులో వెళ్ళమంటారాండీ" అన్నది.



అప్పుడు తలెత్తి "జీపా! నయం, పుష్పక విమానమన్నావుకాదు.." అన్నంత హేళనగా చూసి, "పెట్రోలు మీ నాన్న పోయిస్తున్నారాండీ?" అన్నాడు.

పద్మిని ఆ మాట అవతలకు పెట్టి "బండిలో వెళ్ళాలంటే ఏకాయకీ వెళ్ళి, క్యాంపు సంగతి చెప్పి, అందరినీ పోగుచేసి మొదలుపెట్టేస్తాను. అడ్వాన్సుకి రాసిస్తాను కాగితం యిప్పుడే" అంటూ తిరిగి ఆయన మొఖం చూడకుండా తన సీటు దగ్గరకి వెళ్ళింది. ఏమైనా రాయాలంటే తెల్లకాగితం దగ్గర్నుంచి వెతుక్కోవలసిందే. కానీని తనే కొనుక్కొని దాచుకుంటే తలా ఒకటి పట్టుకుపోతారు.

యు.డి. గారికి యిండెంట్ తరువాత యిస్తానని చెప్పి, రెండు కాగితాలు అరువు తీసుకుని, అడ్వాన్సుకోసం రాసింది. అది మేనేజర్ నుంచి కదిలేటప్పటికి సాయంత్రం. తనకు యిదివరకు రావలసిన చిల్లర ఖర్చుల ఓచర్లు పెట్టి, డబ్బుకోసం మరో దరఖాస్తు రాసింది. సాయంత్రం అయిదు వరకూ చూసి, అప్పుడు బి.డి.ఓ. రూమ్‌లోకి వెళ్ళింది. తను పెట్టిన అడ్వాన్సుకి అర్ధై రూపాయలు తగ్గించి చేతికిచ్చి, పూర్తిమొత్తానికి సంతకం చేయమన్నాడు.

"అదెలాగండీ?" అన్నది పద్మిని.

"ఎలాగేముంది? ఓవర్లోగా పుట్టింది" అన్నాడు విసురుగా.

పద్మిని మాట్లాడకుండా సంతకం పెట్టి, నోట్లు తీసుకుని ఎందుకుని "యిదివరకు కంటింజెన్సీ బిల్లు పాసపెట్టాను. అది యిచ్చేస్తారా?" అన్నది. ఆయన "చూద్దాంలే" అన్నాడు. "నాకు చాలా అవసరం వుందండీ. యిచ్చేయండి."

"డబ్బు అవసరం లేని మనిషిని నాకు ఎవర్నైనా చూపిస్తావేమిటి? ఏమిటా తొందర, నువ్వెళ్ళొచ్చాక చూద్దాంలే" అన్నాడాయన మరో ఫైలు కట్ట విప్పుతూ.

"నా ట్రాన్స్‌ఫర్ టి.ఎ. బిల్లు యింతవరకూ రాలేదు. ఎన్నిటికని నేను సర్దుకోగలను?" అన్నది పట్టువదలకుండా, రెప్పవేయకుండా.

"ట్రాన్స్‌ఫర్ టి.ఎ. మతలబు మేనేజరుకు బాగా తెలుసు. ఆయన అడిగిన ప్రకారం చెయ్. రేపే పంపుతాడు" అన్నాడు యథాలాపంగా.

ఎంత బట్టబయలు వ్యవహారం? ట్రాన్స్‌ఫర్ టి.ఎ. బిల్లు ఎలా వేయాలండీ అని అడిగితే - మీ అమ్మా, నాన్న, అక్కయ్య అందరికీ చార్జీలు, లారీలో సామాను రవాణా మొదలైనవన్నీ మణుగుల తూకంతో సహా చెప్పాడు. "వాళ్ళందరూ రాలేదుకదండీ!" అంటే, మేనేజర్ చికాకుపడ్డాడు. "అలాగైతే మీకు వచ్చేదేమిటి? అందులో మీరు నాకు యిచ్చేదేమిటి?" అని దబాయించాడు.

పద్మిని యివన్నీ గుర్తుకు తెచ్చుకుంది. ఆమె యింకా అలాగే నిలబడడం చూసి బి.డి.ఓ. "వెళ్ళు! యిస్తానుగా డబ్బు" అన్నాడు. ఆమె వెడుతోంటే "రాత్రికి బండి కట్టించుకుని

వెడతావా?'' అన్నారు. ఇటువంటి ప్రశ్నవేయడం యీ సెంట్రో జుల్లో ఆయన యిది పద్నాలుగో సారి.

ఆమె యీ ప్రశ్నకి షాక్ కావలసిందే. కానీ అలవాటుపడ్డ ప్రాణి కనుక, ''అర్ధరాత్రి కారడవిలో బళ్ళుకోలే భూతాలు దొరకవండి. రేపు చీకటితో బయలుదేరతాను'' అన్నది.

''ఏమోలే, బిపిఆర్ఓ సుబ్బారావు తనకాపూళ్ళే వసుంది, రాత్రికి బయలుదేరు తున్నానంటే నీకు సాయం వస్తున్నాడేమో అనుకున్నాను'' అన్నాడు వంకర నవ్వుతో.

పద్మిని ముఖం కందగడ్డ అయింది. ఎంత విషం మనసులో గూడుకట్టుకోకపోతే అంత మాట అంటాడు.

కొంచెం సవరించుకుని, నిటారుగా నిలబడి, ''లేదండీ! బిపిఆర్ఓతో పగలు మాట్లాడ్డమే నాకు అసహ్యం కదా! రాత్రి బండిలో సాయం తీసుకుని వెడతానని, ఎలా అనుకున్నారు? నేను పద్మినినండీ. లంబిణిని కాదు'' అన్నది. వేగంగా బయటకు నడిచింది.

సుబ్బారావని పిఆర్ఓ చాలా వెకిలి మనిషి. అతని ప్రధాన వ్యాపకం అందరి గురించీ, ముఖ్యంగా ఆడవాళ్ళని గురించి చెత్తగా మాట్లాడ్డం. అందమైన లతలాంటి పద్మిని వచ్చి జాయిన్ కాగానే, అతనిలో పులకరింతలు ఆరంభమైనాయి. కంటి గుడ్లు కదలనట్లు, రెప్పలు వాలకుండా వాతం కమ్మినట్లు ఎక్కడికక్కడ చూపు నిలిపేసి ఆగిపోతుంటాడు. ఆమె చేరి చేరగానే ప్రేమలేఖలు రాసి అందించాడు. ఆమె పెద్ద గొడవ చేసింది. అప్పటినుంచి కక్షగా వుంటున్నాడు. మహిళా మండలి దగ్గర సినిమా వేయించమంటే కూడా వేయించడు. ఏది కావులే! నేనే వేయించుకుంటా అన్నట్లు పద్మిని వదిలేస్తే, భగ్నప్రేమికుడిలా తిరగడం అతనికి మామూలైంది. ఆ కథంతా తెలిసి కూడా బిడిఓ ఇలా మాట్లాడుతున్నాడంటే తనని ముల్లు కర్రతో పొడవాలని ఎంత కోరికో ఆయనకు.

అడుగడుగునా అవాంతరాలే. ఎవరైనా పై ఆఫీసరు మహిళలు వచ్చినపుడు చెప్పుకుంటే ''మనం ఏటన్నిటికీ అతీతమైపోయి, ముద్దుబారిపోవాలమ్మాయ్! అంటున్నానని అనుకోకు గానీ, చిన్నపిల్లలాగా యీ సిల్క్ చీరలు కట్టుకోకు. నేతచీరలు అర్దై నెంబరు వుంటాయి చూడు, అవి కుభ్రంగా అరడజను కొనేసుకో. అవే బావుంటాయి'' అని నీతులు చెబుతారు. కొందరు సానుభూతిగా వుంటారు. పరిస్థితి మార్చాలని విఫలయత్నమైనా చేస్తారు. తన కిలాంటి నీతులు చెప్పిన అమ్మగారు మాత్రం పెదవులకి, గోళ్ళకి, తలకి రంగులు పులుము కుని, మెరుపుల కాలిజోళ్ళతో మ్యాచింగ్ బొట్టు, క్లిప్పులతో పేరంటానికి వచ్చినట్టు యిన్ని నగలు పెట్టుకుని గ్రామాలు మొత్తం తిరిగేసింది. ఆమె కట్టిన తళుకు జరీ చీరలు చూస్తూ, గిరిజన స్త్రీలు, పిల్లలు చుట్టూ లోకాన్ని మర్చిపోయారు. ఆవిడ దేవకన్య అని అనుమానపడ్డారు.

''ఎస్ మేడమ్! నా పెండింగ్ బిల్లులన్నీ రాగానే, లోకల్‌గా నేస్తున్న నలభై నెంబరు చీరలు నాలుగు కొనేసుకుంటాను. అబ్బా! అర్దై నెంబరు కూడా చాలా పలచగా వుంటాయి బాబూ'' అని పద్మిని సమాధానం.



## 2

మర్నాడు తెల్లవారుజామున, చుక్కల వెలుగులో రెండెడ్లబండిలో ప్రయాణం. కూడా వెంకటనారాయణ. సీతమ్మవారు అడవిలో యిక్కట్లు పడిందట. ఏరికోరి మళ్ళీవెళ్ళి తనివితీరా కాలక్షేపం చేయాలనుకున్నదట. అడుగడుగునా ఆ తల్లికి ప్రకృతి సౌందర్యమే కనబడింది. పెనవేసుకున్న లతలనీ, నడయాడే మయూరాలను పలకరిస్తూ, పరవశంగా నడచి వుంటుందామె. చెట్టు, పుట్ట, మనిషి, ఋషి అందరూ ఆమెను జగన్మాతగా పూజించారు. మరి తనలాంటి ఆడవాళ్ళ? 'దీనికి' అనే అమర్యాద పదంతో పిలుస్తూ, ఎంత లాభం కొడుతున్నది అని మొదటి ప్రశ్న వేస్తారు. అవమానాలు దిగమింగి, జీర్ణింపజేసుకుంది. ఎంత కష్టపడ్డా జీతంరాళ్ళకోసమే. ఆమె లేకపోతే సంసారం కూలిపోతుంది. రమణబావతో తన పెళ్ళి ఎలాగూ ముగిసిపోయిన కథే. ఇక యీ జీవితం ఎటు తెల్లవారనున్నదో!

ఊరు చేరాదు ఉదయం పదిన్నరకి. ఒక పెద్ద ఖాళీ కొంప వుంది. అందులో దెయ్యాలు వున్నాయని వాడుక కనుక, సెంటర్‌కోసం కేటాయించారు పల్లెవాసులు. పగలుపిలిస్తే వస్తారు పట్టి బలవంతాన. కానీ రాత్రిళ్ళు ఒక్క పిట్ట రాదు. తనతోటి దౌర్భాగ్య ఉద్యోగులు తప్ప ఎవరూ అక్కడ వుండరు. కిందటిసారి ఆ కొంపలో గ్రామసేవికకి పెళ్ళున జ్వరంవస్తే పద్దెనిమిది కిలోమీటర్ల దూరం బండిమీదే తీసుకెళ్ళవలసి వచ్చింది. ఆ అమ్మాయి బతికి, మనిషిగా తిరుగుతున్న సంగతి చూసినప్పుడే, దేవుడనేవాడు వున్నాడని పద్మినికి నమ్మకం కుదిరింది. మరోవిధంగా జరిగివుంటే, పద్మినిని సజీవంగా పాతేసివుండురు.

చిన్నరాళ్ళు, బండరాళ్ళు, ముళ్ళతుప్పలు. ఆ అడవిలో నిశ్శబ్దం భోరుమంటున్నది. టేకుచెట్ల మొదళ్ళేగానీ, కొనల వరకూ తలెత్తిచూసే ధైర్యం వుండదు. ఎక్కడైనా ఎర్రచిగురుతో చిన్నమొక్క కనిపిస్తే, చేతితో నిమురాలనిపిస్తుంది. చిన్నమనుష్యుల చిన్నస్థాయిలో వుందికదా అని. ఒకచోట నల్లని మట్టి బీటలువేసి కనబడుతుంటే, మరోవైపు మెత్తటి ఇసుక మెరుస్తుం టుంది. గండుచీమలు, ఎర్రచీమలు, ఎన్నోరకాల తూనీగల్లాంటి పురుగులూ కనిపిస్తాయి బండి దిగి నడిస్తే. అడవిలో పుట్టి, అడవిలోనే సమసిపోయే యీ జీవాలను చూస్తుంటే, సృష్టికర్త ఆదర్శమేమిటో అని విస్మయం కలుగుతుంది.

ఇటువంటి జడ, చలన ప్రపంచం దాటివచ్చాక యీ ఊరు, ఎడారిలో నీటిచెలమలాగా చల్లగా అనిపిస్తుంది. తీరైన దారులు, బారులుగా కట్టిన గుడిసెలు, వాటిలో మనుష్యులున్న దాఖలాలుగా నీలంపొగలు, నల్లగా బూడిదబారిన శరీరాలతో బట్టలులేని పిల్లలు. ప్రతిఒక్కరి తల ఒక చిన్నసైజు అడవే. వళ్ళంతా ఆరోగ్యంగా ఎదిగినట్టు కనబడుతుంది కానీ పొట్టలు ఎత్తుగా ఉబ్బినట్టుంటాయి. కళ్ళలో కాంతి వుండదు. ఎక్కడో ఒక ముఖంలో చిన్న మెరుపు కనిపిస్తుంది. ఒక నవ్వత కనబడుతుంది. వచ్చినవారిని అనుమానంగా చూస్తూ, బెరుకు పడుతూ వుండే ఆ గిరిజనులను మచ్చిక చేసుకోవడం ఎంత బ్రహ్మాండమైనపనో అధికారులకి ఎప్పటికి తెలుస్తుంది?

సామానంతా చేర్చి, ఉస్సురుమని కూర్చునేసరికి విఎల్‌డబ్ల్యు, మలేరియా సూపర్‌వైజర్, గిరిజన స్టోర్స్ గుమాస్తా, గ్రామ సేవిక అంతా వచ్చారు. ఉండవలసిన వారంతా ఊళ్ళో వుండడం, పనిచేయవలసిన టైములో పట్నానికి చెక్కేయకుండా ప్రత్యక్షం కావడం గొప్ప అదృష్టం. అడవిలో దీపాలు ఎంత అరుదో, గ్రామాల్లో యీ ఉద్యోగులు అంత అరుదు. క్యాంపు, లేదా పట్నంలో పర్చేజెస్, లేకపోతే బ్లాక్‌లో మీటింగ్, అదీకాదంటే వచ్చే ప్రముఖుల కోసం రంగు కాగితాలు కత్తిరించడం - అంతేగానీ అభాగ్య గిరిజనుల సేవార్థమై ప్రభుత్వం జీతం 'రాళ్ళు' యిస్తున్నారుగదా అని అక్కడే పడివుందామనుకోరు.

సరే... వీరంతా అందమైన 'యంగ్' ముఖ్యసేవికకుస్వాగతం చెప్పి, ఊళ్ళో ఆడవాళ్ళెవరూ శిబిరానికి రామన్నారు అన్న శుభవార్త చల్లగా చెప్పారు.

''శిబిరం వుందని మీకెలా తెలుసు? ఎవరు చెప్పారు?'' అన్నది పద్మిని ఆశ్చర్యపోతూ.

''నిన్నరాత్రి బిడిఓ గారు వచ్చివెళ్ళారుగదా?'' అన్నదిగ్రామసేవిక.

పద్మినికి అర్థమయింది. జీపు వేసుకుని యీ ఊళ్ళన్నీ రాత్రి షికారుకొట్టి, కోళ్ళు, గుడ్లు, పనసపళ్ళు పట్టుకుపోయాడు. తననిమాత్రం సమం ఏరిగేట్టు బండిలో వెళ్ళమన్నాడు. పెట్రోలు ఖర్చు ప్లానింగ్ యింత లక్షణంగా వుంది అతని హయాంలో. పోనీ తనని కూడా పట్టుకొచ్చి యీ వూళ్ళో పడేస్తేనో? పదహారు రూపాయలు బండి కిరాయి, ఆ బిల్లు వచ్చేదెన్నడో? ''అహా అలాగే? ఆడవాళ్ళు ఎందుకు రానంటున్నారు. భోజనాలు పెడతాంగా?'' అన్నది పద్మిని.

''మాకు పనులుంటాయి, వచ్చి రోజూ మీ దగ్గర కూర్చుంటే మాకెలా గడుస్తుంది? మీకు పనిపాటా లేక మగాళ్ళతో తిరుగుతూ...'' అంటూ గ్రామసేవిక తన నాలిక చురుకుదనం చూపిస్తుండే, పద్మిని గుచ్చురిమింది.

''సరేలే! యీ మాటలు మనం చిన్నప్పట్నుంచీ వింటున్నవే. భోజనానికి కూడా రాము అనేంత గొప్పతనం ఏమొచ్చేసింది వాళ్ళకి?'' అని ఆమె అంటుండే విఎల్‌డబ్ల్యు నవ్వాడు. ''అన్నం! భోంచేయడానికి వస్తారటండీ. ఇక్కడ గిరిజన స్టోర్స్‌లో, పశువులు తినే బియ్యం



మాత్రం వున్నాయి. అవి తప్పిస్తే ఏ వస్తువూ లేదు. ఆ బియ్యం వండి, యింత ఉప్పు, పచ్చిమిరపకాయే కదా మీరు మాకు పెట్టేది అని వాళ్ళకి అనిపించి వుంటుందండి. అందుచేతనే రామని చెప్పారు'' అని అతగాడి వివరణ.

''ఎందుకూ? మనం పెట్టవలసిన మెనూ ప్రకారం పెడతాము. అప్పలనరసింహ దుకాణం వుందిగా. ఏమేమి దొరుకుతాయో, యీ లిస్టు ప్రకారం పట్టించుకురా లక్ష్మీ'' అన్నది బ్యాగులో కాగితం కోసం వెదుకుతూ.

''మరి కొటేషన్ కావాలి కదా మేడమ్?'' కాస్త వెటకారం మిళాయిస్తూ విలేజ్ లెవల్ కార్యకర్త.

''ఏవుంది! ఉప్పు కిలో ముప్పై నుంచి ఎనభై పైసల వరకూ మూడు కొటేషన్లిస్తూ మూడు కాగితాలు. ఈ ముప్పై వస్తువులకూ రేట్లు రాసిమ్మనండి. మూడు వేరువేరు రబ్బరు స్టాంపులు అతని దగ్గర వున్నాయి, వేసిమ్మను. అలాగే కట్టెపుల్లలకి, మంచినీటి బానలకి, అరటాకులకి కూడా బిల్లులు తయారుచేసి యిమ్మనండి'' అని చెప్పింది పద్మిని తడుముకోకుండా.

''అడవిలో కట్టెపుల్లలు, విస్తరాకులు కొన్నామంటే ఎవరు నమ్ముతారండీ?'' అన్నది గ్రామసేవిక. ''మీ బిడిఓ గారు నమ్ముతారండీ! ఒక అర్ధై రూపాయలు యీ బిల్లులో సర్దమని జేబులో వేసుకున్నాడు. నీటిబానలు ఎవరివైనా పట్టుకొచ్చి, బిల్లుమాత్రం సర్దింపొచ్చి యివ్వమనండి'' అన్నది.

ఈ పురమాయింపులన్నీ అయినాక, ఆ బ్యాగు చంకన పెట్టుకుని, ఒక్కో పూరింట్లో దూరి, యిల్లాళ్ళను పేరుపేరునా పలుకరిస్తూ, ''అమ్మా, తల్లీ రండి. అన్నం పెడతాం! మేం చెప్పే ముక్కలు వినిపోండి'' అంటూ ప్రచారానికి బయలుదేరింది.

- ఈ శిబిరం కార్యక్రమమంతా ముగించుకుని, యింటికి చేరేటప్పటికి మరో పిడుగు రెడీగా ఉంది. అందరికీ జీతాల్లో ముప్పయ్యేసి రూపాయల చొప్పున కటౌ ఎందుకు కట్ అంటే, సబ్‌కలెక్టర్ గారు సతీసమేతంగా వచ్చి, 'మేతలు' మేసి వెళ్ళినందుకు.

మొన్న క్యాంపుకి బళ్ళ కిరాయికి చేతిచమురు వదలగా, ఫెస్టివల్ అడ్వాన్సులు, వగైరాలు పోగా తనకిక చేతిలోకొచ్చే జీతమేముంది? తను నాన్నకి ఏమి పంపాలి? తనేం తినాలి?

మేనేజర్ దగ్గరకువెళ్ళి ''మొన్న వారి భోజనాలకైనా ఖర్చులేమిటో ఎకౌంట్ చూపిస్తారా?'' అన్నది, ఎంతో సీరియస్‌గా ముఖం పెట్టి. ఆయన చాలా మెత్తనివాడు. కళ్ళుకోడు పైనుంచి గానీ, కిందినుంచి గానీ చూస్తాడే తప్ప సమంగా నేరిని చూడడు. చేయదలచిన పనులూ అవిధంగానే చేస్తాడు.

ఈ గిరిజన బ్లాకు పుణ్యమాని కలవకు పైసా ఖర్చులేకుండా పట్నంలో యిల్లు కట్టాడు. జలగలాగు, అవసరమైతే కొండచిలువలాగు ప్రవర్తించగల దిట్ట.

ఇప్పుడు ఆయన కళ్ళజోడు పైనుంచి చూసి, ''ఏం? అడిట్‌కోసం వచ్చారా మేడమ్!'' అన్నారు.

''అంత వెటకారం దేనికిగానీండి, మీరు రాసే డబుల్ ఎంట్రీ ఎకౌంట్‌లు తనిఖీ చేసేంత తెలివే నా దగ్గరుంటే, మీరే నా ఉద్యోగంలో నూ, నేనే మేనేజర్ అయ్యేవాళ్ళం. అది కాదుగానీ, మేము చందాలిస్తున్న ధర్మకార్యం పద్దు ఏమిటో తెలుసుకుందామని'' అన్నది.

''అట్లాగా! ఏమోనండీ, వివరాలు నాకు తెలియదు. తలొక ముప్పయి రూపాయలు కట్ చేయమని బిడిఓ గారు చెప్పారు. ఆ ప్రకారం చేస్తున్నాం. ఏమైనా అడగాలంటే వారినే అడగండి'' అని చెప్పిన, కళ్ళజోడు కిందినుంచి కాగితాలు చూసుకోవడం మొదలుపెట్టాడు.

''నేను యివ్వనంటే?'' అన్నదామె పళ్ళు బిగించి. ''మీరు యివ్వేదాకా ఆగేవారు ఎవరట? ఆపరేషన్ మొదట్లోనే జరిగిపోయుంది కదా! సంతకం పెట్టకపోతే జీతం డబ్బులు కూడా చేతికిరావు'' అని నవ్వాడాయన.

బిడిఓను అడగాలట. ఆయనను అడిగేకంటే అడవిలో మానుమొద్దులనే అడిగితే నయం. తను నోరు పారేసుకోవడం తప్ప మరేమీ లాభంలేదు. ఎవరికి చెప్పుకోవాలి యీ బాధలు. అరణ్యరోదనం అనేమాట అక్షరాల నిజం.

ఒక్కసారి నిట్టూర్చి, ''నా ట్రాన్స్‌ఫర్ బిల్లులు కాలదోషం పట్టకుండా మీరు చూసిపెడతా మన్నారు గదండీ?'' అన్నది.

''అట్లాగా! దానికేం?... అట్లాగా! దానికేం?'' అన్నాడాయన, పునరుక్తిదోషం మర్చిపోయి. ''ఆపరేషన్లకు అలవాటుపడ్డాను కదా, అవేవో చేసి, శేషధనం యివ్వండి. ఫరవాలేదు'' అన్నది.

ఈ మాట వినగానే ఆయన ముఖాన తళుక్కున, అడవిలో మెరుపు తీగెలా, మందహాసం మెరసింది.

''అమ్మా! కోపంగా అన్నాగానీ, కరెక్ట్ మాట అన్నావు. ముసలివాణ్ణి అయిపోతున్నాగా, యింకెంతకాలం బతుకుతానో తెలియదు. కన్నకొడుకులైనా గానీ బాబుచేతిలో ముల్లెవుందని తెలిస్తేగానీ యింత అన్నంపెట్టరుగదా తల్లీ! వచ్చే జీతంరాళ్ళేమో పదోతారీకు వరకు కూడా సరిపోవు. మీ నాన్న ముసలివాడని నువ్వు బాధపడుతున్నావా లేదా? నేనూ అలాంటివాణ్ణే అనుకోవాలి'' అని మంచి కరుణరసమయమైన డైలాగు చెప్పాడాయన.

''అదంతా దేనికిలెండి! కని పెంచి, యీ దౌర్భాగ్యపు అడవిలోకి ఉద్యోగానికి పంపిన మా నాన్నెక్కడ? సంఘసేవలో మునిగి తేలిపోతున్న మీరెక్కడ? పోలికే లేదుగానీ, ఏదో ఒకటి నా బిల్లు త్వరగా పూర్తిచేయండని నా మనవి. అంతే!'' అన్నది.

ప్రోగ్రెసివ్ అసిస్టెంట్ అని ఒక కుర్రవాడున్నాడు. పేరు అవసరంలేని శాల్తీ. ''పద్మినిమేడం! మీరు మాట్లాడుతుంటే నిజంగా ఏ పబ్లిక్ ప్రాసిక్యూటరో అయిపోవలసిన వారని



అనిపిస్తుందండీ. ఇప్పటికైనా సరి స్టడీ లీవ్ పెట్టి 'లా' కాలేజిలో చేరిపోయి, చదువుకోండి'' అన్నాడు గొప్ప ఆరాధనగా చూస్తూ. ఈ పొగడ్తకి చిన్నగా నవ్వేందంటే చాలు, రేపీపాటికి ప్రేమలేఖతో సహా ఇంటిముందు వాలిపోతాడు.

''థాంక్స్! మనం పుట్టినప్పుడే జాతకాలన్నీ రాసేసి వుంటాయట. 'అడవిలో ఆర్గనైజర్ జీవితం' అని తాటికాయలంత అక్షరాలతో యీ నుదుటిమీద రాసేసి, యీ భూలోకంలోకి వదిలారు'' అంటూ చరచరా నడిచింది పద్మిని.

మనిషికి ముప్పయి రూపాయలు, చిన్న ఉద్యోగులకు ఏడేసి రూపాయలు మొత్తం ఎంతట? యింత డబ్బు దేనికట? పాపం వెర్రిమారాజు ఆ సమితి ప్రెసిడెంట్ యింటినుంచి బోలెడు సంభారాలు పట్టించుకుని వచ్చాడు. పెరుగు, నెయ్యి, కూరలు వగైరాలు. సబ్ కలెక్టరు గారు పక్కా శాకాహారి అని చెప్పుకున్నారు. అందులోనూ ఆ దంపతుల భోజనమే పరమ సుకుమారం. వారి రెండున్నర రోజుల భోజనానికి యిన్ని వందలు ఖర్చా! సుకుమార్ గారు ఎంతో నిజాయితీపరుడు. అయినా అడవిలో అన్నం కొనుక్కోవడానికి దొరకదు. డబ్బు తీసుకుని ఎవరు పెడతారు, వెంట వచ్చిన జమానులు వండిపెట్టరేమో యీ అప్రదిష్ట లేకుండా.

ఆలోచనలకు అంతులేదు. ఈ వలయంలో చిక్కుకున్న పక్షికి యింక విముక్తిలేదు. ఇక్కడే గిరికీలు కొడుతూ తిరగవలసిందే. చీకటిపడేవేళ, చేతిలో జీతం రాళ్ళున్న సంచి. ఇంటికి దగ్గరగా చేరుతోంటే, ఎవరో మనిషి హఠాత్తుగా వచ్చి తోసి, ఆమె బ్యాగు తీసుకుని పరు గెత్తాడు. ఆమె కెవ్వున అరిచింది. కెవ్వుకెవ్వున మళ్ళీ అరిచింది. ఆ మనిషి రెండు క్వార్టర్స్ దాటి వెనుకగా చేలోకి పరుగెత్తాడు. ఆమె మూడోసారి కంగారుగా అరిచేసరికి సేవక్ బయటకు వచ్చాడు. మరికొందరు గుమిగూడారు. ఆ మనిషి జాడ లేదు. పావుగంట తర్వాత డబ్బు లేకుండా కాగితాలు, తాళం చెవులతో బ్యాగు దొరికింది చెట్టుకింద.

పద్మిని ఆ రాత్రి ఎంతగా ఏడ్చిందో. మామూలు దొంగతనం కాదిది. కక్షకొద్దీ ఎవరో చేశారు. మనిషి పోలిక తెలియడం లేదు. తను యీనెల మొత్తం ఎలా గడుపుకోవాలి, యింటికి ఏమి పంపిందాలి? వాళ్ళు పెద్దాలకొట్లు ముఖం చూడాలంటే తనమీదే ఆధారం. తిండీ, బట్టా కోసం వెతుకులాడే పేదరికం ఎంతో ఘోరం.

పొద్దున్నే చేతికున్న గాజులు రెండూ తీసి, షావుకారు దగ్గర తాకట్టుపెట్టి, మూడొందలు తీసుకుని, రెండొందలు మనియార్డరు పంపింది యింటికి. ఆఫీసులో కూర్చుంటే ఒక్కొక్కరూ వచ్చి పరామర్శ చేసేవారే గానీ, ఆ మనిషి ఎవరో వూహించి, పట్టుదలగా పట్టిద్దామని లేదు. సేవక్ నారాయణ మాత్రం ఆ మనిషి ఎవరో రహస్యంగా చెప్పాడు. కానీ శత్రువులు ఎక్కువగా వున్న ఆమెకి, చివరంటా సాధించడం అసంభవం. మధ్యాహ్నం అవుతున్నకొద్దీ పద్మినిలో కోపం కూడా హెచ్చింది. తనకు ప్రమోషన్ వస్తుందా? వస్తే పెరిగే జీతం ఎంత? తనను మెచ్చుకునే వారికంటే వ్యతిరేకించే రిపోర్టులు రాసేవాళ్ళే ఎక్కువ. నోరున్నా మాట్లాడలేనట్టు, కళ్ళున్నా

చూడలేనట్లు ఎందుకొచ్చిన ఉద్యోగం యిది. ఈ పరిస్థితులలో తనెందుకు రాజీపడాలని ఉక్రోషం వచ్చింది. తెగువ తెచ్చుకుని సుకుమార్ గారి పేరున ఉత్తరం రాసింది. తన దయ నీయ స్థితి, ఆయన రాకవల్ల తనకు కలిగిన కొత్త యిక్కట్లు, సాదారణంగా విస్తరిస్తున్న అవినీతి అన్నింటిని గురించి కృష్టంగా రెండు పేజీల ఉత్తరం రాసింది. తనబోటివారికి రక్షణ లేకపోతే, యింక యీ గిరిజన బ్లాకులో సంక్షేమం అనేది జరగదని సూచించింది. ఆ ఉత్తరం పోస్టులో వేసి నిదానంగా కాళ్ళీడ్చుకుంటూ క్వార్టర్స్‌కు వెళ్ళి పడుకుంది.

సాయంకాలం ఐదున్నరకి దబదబా తలుపు ఎవరో బాదారు. ఆమె ఉలిక్కిపడి లేచి తలుపు తీసేసరికి రొప్పుతున్న సేవక్ కనిపించాడు. ''విన్నారా అమ్మా! ఎంత ఘోరం జరిగిపోయిందో. అప్పుడీడకొచ్చిన కలెక్టరమ్మగారు సచ్చిపోయినారటమ్మా!'' అన్నాడు. పద్మినికి తల తిరిగినట్ల యింది. ఆమె బెంబేలు ముఖంచూసి, ''అవునమ్మా యీడకు రాలేదూ లచ్చిందేవిలాంటి అమ్మగోరు. తలలో ఆదేదో నరం పగిలిందటమ్మా! సచ్చిపోయి నెలకూడా అయిందట అప్పుడే. మదరాసులో పొబట్టి మనకెవ్వరికీ తెలియలేదమ్మా! పసిపిల్లలు అయ్యగారి దగ్గర వున్నార టండీ'' అంటుండే పద్మిని నిస్త్రాణంగా కుర్చీమీద కూలబడింది.

తనకు ఆనాడు వచ్చిన కల ఏమిటి? అది యీ రూపంలో జరగడమేమిటి? ఆమె ముఖం ఎర్రబడింది, వేగంగా వూపిరి పీల్చసాగింది. ఒళ్ళంతా ఆవిరులు కమ్మినట్టయింది ఆవేశంతో. అలాగే ఆమె నిల్చుని వుండడం చూసి, సేవక్ ఆమెలో తను ఆశించిన విభ్రాంతి కనిపించక పోవడంచేత మరొక క్వార్టర్స్‌కి పరుగెత్తాడు.

ఒక అరగంటకు నిదానంగా ఆమె తేరుకుంది. ఇంత ఘోరం జరిగిన సంగతి తనకు తెలియక అతనికి ఉత్తరం కూడా రాసింది! ఏమనుకుంటాడో? ఆమెకు ఏం చేయడానికి తోచడం లేదు. ఎవరితోనూ చెప్పుకునే విషయం కాదు. సుకుమార్ తలకిందులైపోయినాడా? ఆయనకు ఎవరూ లేరా? తను విన్న యీ వార్తను ఎలా మనసులో యిముడ్చుకోవాలో తెలి యడం లేదు.

అన్నం వండుకోవాలంటే ఓపిక లేదు. ఇంటికి వెళ్ళిపోతేనో? అక్కడ మరీ సమస్యలు. నాన్నకు పెన్షన్ లేదు. నాలుగు ట్యూషన్లు చెబుతున్నాడు గానీ అది కూరగాయలకు, మందు లకూ సరిపోదు. కరుణ పాపం అర్థాకలి తింటుందో? కడుపులో పావుభాగమే నింపుకుంటుందో గానీ యింట్లోని బండచాకిరీ అంతా చేస్తోంది. ఏదైనా ఆదాయం వచ్చే పని నేర్పిద్దామంటే, 'దాన్ని వీధిలోకి ఎలా పంపిస్తామే, నలుగురూ ఏమంటారు? గతిలేనివాళ్ళమని అనరూ?' అనే సంకోచం అమ్మకీ, నాన్నకీ. ఒకసారి మాటవరసకు కరుణకు మళ్ళీ పెళ్ళిచేయాలని తను అన్నందుకు యింట్లో రాగాలు, రాద్ధాంతాలు. పోనీ ఏదైనా హాస్టల్లో చేర్పించి చదివిద్దా మంటే, ఏ కూడో తింటే, కులం గోత్రం మంటగలుస్తాయని గోల. చదువుకోమంటే కరుణకి తీరదు, కుదురూ లేదు. వంట్లో బలహీనత, అర్థంలేని వ్యథతో రోజులు నింపేసుకుని ఎండి పోవడం. తను జీవితంలో సాధిస్తున్న సంక్షేమం ఏమిటింక?



తను రమణ బావని పెళ్ళి చేసుకోవాలన్న మాట వచ్చినప్పుడు కూడా కరుణ సంగతి ఏమిటని సూటిగా అడగలేకపోయింది. చీకటి చీకటిగా వున్న యీ సాయంత్రాన్ని చూస్తుంటే అక్క గుర్తుకొస్తోంది.

కళ్ళు మూసుకుని, ఎంతోసేపు పడుకొని, చివరికి లేచి మనసుకు విశ్రాంతికోసం శరీరశ్రమ చేయడం నయమనిపించి, యిల్లు శుభ్రంచేయడం ఆరంభించింది.

## 3

వారం, పదిరోజులు, పదిహేను రోజులు అలా గడిచాయి. ఈలోగా చేతిలో డబ్బులేక అన్నిటికీ ఎంత యిబ్బంది పడిందో పద్మిని. ఇంటినుంచి ఉత్తరం రాలేదు. పెద్దక్క పురిటికి రావడానికి యింకా ఎంత టైముందో తెలియదు. బావగారు పెద్ద ట్రేడ్ యూనియన్ లీడరు. లోకమంతటికీ బోధించే కమ్యూనిజం యింట్లో, మామగారింట్లో వర్తింపచేయడు. అక్కడ మాత్రం దోపిడీతనం నిరాటంకంగా సాగిస్తాడు. మళ్ళీ జీతం వచ్చేనాటికి ఖర్చు సిద్ధం.

ఈ పరిస్థితిలో ఒకనాడు సబ్‌కలెక్టర్ గారి టూర్ ప్రోగ్రాం వచ్చింది. ఆయనీసారి ఎంక్వైరీకి వస్తున్నారట. గిరిజన వెల్ఫేర్ ఆఫీసర్ కూడా ఆయనవెంట వస్తున్నాడు. అందరి ముఖాల్లోనూ భయం. మూలలకు చేరి గుసగుసలు. పద్మిని ఒక్కత్తే గాలిలో తేలిపోతున్నట్లుగా సంతోష పడిపోతుంది. ఎందుకనో ఆయనకీ తనకీ మధ్య వున్న ఏదో గోడ కూలిపోయినట్లుగా మనసులో ఊహ. ఎంత దారుణం.

సుకుమార్ వచ్చినప్పుడు అనేక విషయాల మీద విచారణ జరిగింది. పద్మిని రాసిన ఫిర్యాదు మీద కూడా అతను పిలిచి, అడిగి రాసుకున్నాడు. కమిటీ హాలులో పెద్ద టేబుల్ దగ్గర కూర్చుని తనను పిలిచినప్పుడు ఆమె వెళ్ళి నమస్కారం పెట్టి నిలబడింది. కూర్చోమని సైగ. అతని చెవుల దగ్గర జుట్టు కొంచెం నెరిసినట్లున్నదేమిటి? ముఖంలో అలసటా, వాడినట్లుగా కాంతిహీనత. అవి వున్నాయా? లేక తన ఊహేనా? 'ఐయామ్ వెరీ సారీ సర్!' అన్నమాట పెదవుల చివరన ఆడుతోంది.

'ఇంత విషాదం జరుగుతుందని అనుకోలేదు' అని అందామని ఆలోచన. కానీ అతను మాత్రం ఆఫీసరులాగా మామూలు ధోరణిలో ప్రశ్నలడిగాడు. తను రాసిన కంప్లయింట్ విషయాలు, ఏదో పెట్రోలు ఓచర్లు, గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు ఆమె ప్రవర్తన, గ్రామీణులతో వ్యవహరించే తీరు, మొదలైనవాటిని గురించి ప్రశ్నలు. జవాబులు నిదానంగా చెబుతున్న పద్మిని కళ్ళలో సానుభూతి, కృతజ్ఞత, ఆరాధన మొదలైన భావాలు వచ్చేశాయి. అతను అవేవీ గమనించినట్లు కనబడలేదు,



ఆ మధ్యాహ్నం భోజనం చేసి మళ్ళీ ఆఫీసుకు వెడదామని పద్మిని సిద్ధమవుతుంటే, యింటి ముందుకొచ్చి జీపు ఆగింది, అయ్యగారు రమ్మంటున్నారని. ఏ అయ్యగారో అనుకుంటుంటే ''సబ్ కలెక్టర్‌గారు కోన దగ్గర జలపాతం చూడడానికి వెడుతున్నారు. మిమ్మల్ని కూడా రమ్మన్నారుట'' అని నవరసాలు ఒలికిస్తూ చెప్పాడు డ్రైవర్. పద్మినికి మతిపోయినట్లయింది. సరేలే అని తలూపి అతన్ని వెళ్ళమంది. ఇంటికివెళ్ళి కాసేపు కూర్చుంది. ఏమిటి దీని అర్థం? హడలిపోతున్న మనస్సు, వణికే చేతులతో ఎలాగో ముస్తాబై యింటికి తాళంవేసింది. నాలుగు కావస్తోంది. క్వార్టర్స్ దాటి మలుపు తిరిగేటప్పటికి కొత్తజీపు ఎదురొచ్చింది. ముందుసీట్లో సుకుమార్. వెనకాల ఒకడ్రైవు ఆయనగారి జవాను. ''ప్లీజ్ గెటిన్! అభ్యంతరం లేదుగదా!'' అన్నాడు సుకుమార్. ఆమె తల అడ్డంగా వూపింది. వెనకాలే ఎక్కి, రెండో ప్రక్కన సీట్లో కూర్చుంది. జీపు జలపాతం దగ్గరకు చేరేవరకు వూపిరి కూడా పీల్చలేదామె. అక్కడ కొండబాట చివరన ఆపింది, అతను దిగాడు. ''రండి! అలా వెడదాం వాగు దగ్గరికి'' అన్నాడు. డ్రైవరు, జవానూ కదలని బొమ్మలే.

జలపాతం హోరు వినిపిస్తోంది. ''మీతో మాట్లాడాలని యిలా పిలిచాను. మీరేమీ అనుకో లేదుకదా!'' అన్నాడు. ఆమె మళ్ళీ అడ్డంగా తలాడించింది. ''ఆ బండలమీద కూర్చుం దామా!'' ఈ ప్రశ్నకూ ఆమె జవాబు అదే - యీసారి అడ్డంగా.

కొంచెం ఎత్తుగా వున్న బండమీద కూర్చుంటూ నిదానంగా ''సుమలత పిల్లల్ని వదిలిపెట్టి వెళ్ళిపోయింది తెలుసా?'' అన్నాడు. ఆవిడ ఎక్కడకు వెళ్ళారు. అదేమిటి నేను విన్నమాట అబద్ధమా? అని బెంబేలుపడింది పద్మిని. ''వెళ్ళిపోయిందనే అంటాను చనిపోయింది అన లేను. ఆ నిజాన్ని భరించే శక్తి యింకా నాకు లేదు. పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక తప్పదని సత్యం తెలిసినా, అది నెత్తిన కొట్టినట్లుగా భగవంతుడు చెప్పినప్పుడు మనిషి నిలదొక్కుకోవడం కష్టం. కానీ అటువంటి దారుణ క్షణాల్లో కూడా నా బుద్ధి పనిచేస్తూనే వుంది. ఆమె వెళ్ళింది. మరి నాకు కనిపించదు. నాకు కనబడని మరో దేశానికి, సుదూర లోకానికి వెళ్ళింది అనుకుంటే ఆమె లేని లోటును భరించడం సాధ్యమవుతుందని నాకొక గ్రహింపు కలిగింది. ఆ దుఃఖం త్వరత్వరగా నాలో యింకిపోతోంది. ఇప్పుడింక నేను, నా పిల్లలు మిగిలాం'' అంటూ అతను ఆగాడు. కొండమీద నుంచి తెల్లనురుగుగా జారే నీటి వంక చూస్తూ.

ఎంత పర్సనల్ విషయం మాట్లాడేస్తున్నారో. మనసులోని దుఃఖం చెప్పుకోవడానికి, యింతదూరం, యీవూరు వచ్చారా, మీకు మంచి స్నేహితులు లేరా? హోదాగల కుటుంబం, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు ఎందరో బంధువులు వుండివుంటారు. వాళ్ళూ, మీరూ మాట్లాడుకునే స్థాయి వేరు. నేను యీ మూల కొండలో పడివున్న అతిచిన్న ప్రాణిని. నాతో యింత అంతరంగిక విషయం చెప్పేస్తున్నారేమిటో? అని తికమకపడుతున్నది పద్మిని. కానీ ఏదో ముఖ్యమైన సంగతే వుందని, నమ్మకం కలిగిపోతోంది. అరే! తనకు భార్య పోయిందని అదో పెద్ద విషాదమని పరాయి ఆడదానితో ఎందుకు చెప్తున్నట్లు

పద్మినికి అతను చెప్పబోతున్నది ఏమిటో నీటిబొట్టులాగా మనసులో జారిపడింది. నిమిషానికి వెయ్యిసార్లు గుండె కొట్టుకుంటున్నదేమో అనిపిస్తోంది.

''పిల్లలు నావాళ్ళు. ఆమె తల్లిదండ్రుల దగ్గర వాళ్ళు పెరగడం నాకు యిష్టం లేదు. నాకు వేరే ఎవరూ లేరు. ఈ సమయంలో నాకు యింట్లో ఆడతోడు కావాలి. ఆ లోటు, ఆ లోటు మీరు భర్తీ చేస్తారా?'' ఉపోద్ఘాతాలు లేకుండా సూటిగా అడిగేశాడు ఆ ప్రశ్న. అంటే తనను పెళ్ళిచేసుకోమని అడుగుతున్నాడా? ఒక్కసారిగా ఏనుగు అంబారీ ఎక్కించినట్లు, కుసుమాల పల్లకిలో కూర్చోబెట్టినట్లు, పారిజాతాలు గుమ్మరించినట్లు సంభ్రమం.

పద్మిని కూర్చున్న చోటులోనే కొంచెం కదిలింది. అతనివైపు కాక మరెటో చూస్తోంది. చందమామ లాంటి సుకుమారుడు, వెన్నెలంత వయసు నరనరానా నింపుకున్నవాడు, ఉన్నత శిఖరంపైన కూర్చున్న హోదాగల వరుడువాడు - తనని ఒక్కసారిగా అంత ప్రశ్నవేస్తే జవాబు ఏమి తోస్తుంది?

ఆమె సంభ్రమాన్ని పసిగట్టినట్లుగా ''ఐయామ్ సారీ! నోటీసు లేకుండా హఠాత్తుగా జీవితానికి సంబంధించిన అతిపెద్ద ప్రశ్నను మీ మీదకు విసిరాను. వ్యక్తిత్వమున్న స్త్రీ కావాలి నాకు. చదువు, తెలివితేటలు, చలాకీతనం, చక్కదనం అన్నీవున్న కొందరు ఆడవాళ్ళు స్వంత వ్యక్తిత్వమున్నట్లుగా కనబడరు. నాకు కావలసిన ఆ లక్షణాలు మీలో వున్నట్లుగా కనిపించాయి. నా పిల్లలను సరైన పద్ధతిలో పెంచే శక్తి వున్న మనిషి కావాలి నాకు'' అంటూ గబగబా మాట్లాడాడు.

పద్మిని అతనివైపు రెపరెపలాడే చూపు విసిరింది. 'మీ పిల్లలకుమంచి ఆయా కావాలన్న మాట' అనే భావం అస్పష్టంగా కదిలింది మనసులో. కాని సుమలత చోటు అంటున్నారు కదా, అది అతని మనసులో చోటే కదా మరి.

''మీవాళ్ళను అడగండి. నాకు ఏ పట్టింపులూ లేవు. మీరు సంక్షేమ రంగంలో వున్నారు కనుక మీకూ ఏ పట్టింపూ వుండరాదు. మీరు స్వయంగా ఆలోచించుకోండి'' అని ఆగాడతను. ఆమె తన చిన్న ఉద్యోగిని అన్నమాట మర్చిపోయింది యీ కొన్ని నిమిషాలలో. మామూలు జీవితంలో జరగని ఒక అదృష్ట సన్నివేశం ఎదురవుతున్నది. తనకి పెళ్ళియోగం సిద్ధించబోతున్నది. తన జీవితమే మారిపోయే శుభతరుణం ఉదయిస్తున్నది.

సుకుమార్ తను చెప్పదలుచుకున్నవన్నీ చెప్పేయడం ఆరంభించాడు. ''నాతో జీవితం ఎలా వుంటుందని చెప్పను? అది సుమకు తెలుసు. అదంతా మర్చిపోవడానికే నేను త్వరగా ఆఫీసులో చేరాను. నేను మగవాడిని కాబట్టి వెంటనే పెళ్ళి అంటూ పలవరిస్తున్నానని మీరు అనుకుంటారు. అది ఒక తీవ్రమైన విమర్శ. కాని తప్పదండి. నేనుగాని చనిపోతే సుమ మిగిలితే ఆమె ఎలాగో పిల్లల్ని పోషించుకునేదేగాని రెండోపెళ్ళికి సిద్ధపడేది కాదు. నా సుమ మరొకరి సొత్తు కావడం నేనూ సహించలేని ఆలోచన. ఇది అన్యాయమే కాని, పిల్లల్ని పెంచడం నా తరం



కాదని, నాలోని మువ్వాతిక భాగం నిర్జీవమైపోయిందని ఈ రెండు మూడు నెలల అనుభవం స్పష్టం చేసింది'' అంటూ అదే ధోరణిలో అతను అనర్గళంగా చెబుతుంటే, ఆమె మత్తెక్కిన మనస్సుతో వింటోంది.

ఇంకా ఆలోచనేమిటి పిచ్చిదానా? ఇంతకంటే నీకు జీవితానికి కావలసిందేమిటి? అంటోంది హృదయం ఒకప్రక్కన. అలా చెంగున దూకి పరుగెత్తడమేనా? వివేకం లేకుండా? అని మరోప్రక్కన సంకోచం.

అతను లేచి, ''పద్మిని యిలా రండి'' అంటూ నీటి దగ్గరగా అడుగులు వేశాడు. ఆమె వెంట నడిచిందేగాని, గాలిలో తేలుతున్నట్లే వుంది. ''ఒక్క సంగతి మాత్రం ముందుగా చెబుతున్నాను. మీరు ముఖ్యంగా ఆలోచించవలసిన విషయం. మీరు నా భార్య అయితే, మీ పిల్లలంటూ లేకుండా నా పిల్లల్నే మీవాళ్ళుగా చూసుకోవలసి వుంటుంది. అలా పజిల్‌గా చూడకండి. ఇద్దరితో సరిపెట్టాలన్న నిశ్చయం నేనే తీసుకున్నాను. మరో బిడ్డకు తండ్రి కావాలన్న కోరిక నాకు లేదు. ఈ దేశానికి, మన కుటుంబానికి కూడా యిద్దరే చాలునని నా అభిప్రాయం. ఈ సంగతి మీరు బాగా ఆలోచించుకోండి.''

పద్మిని నీళ్ళ దగ్గరగా కూర్చున్నది. పాదాలు నీళ్ళలో వదిలి ఆడుకోవాలంటే భయంగా వున్నది. ఇదివరకు తను వచ్చినప్పుడల్లా కనబరిచే చిలిపిదనం యిప్పుడు లేదు. అతను ఆపరేషన్ చేయించుకున్నానని తనకింక బిడ్డలు కలగడం యిష్టంలేదని స్పష్టంగా చెప్పాడు. కాని సున్నితంగా చెప్పాడు. 'అలాగే సార్, మీ పిల్లలే నా పిల్లలు' అని మనసు సమాధాన పడిపోతోంది ఆమెకి. ఆణిముత్యాల్లాంటి ఆ పిల్లలుండగా నాకు యింకా దేనికి అని ఒక ఆలోచన.

''మీరు యీ చిన్న ఉద్యోగం మానేస్తారు. నాకు యితర దేశాలకు పోవాలనే ఆలోచన వుంది. మీ వాళ్ళను వదిలి మీరూ రావలసి వుంటుంది. అది కూడా యిష్టముండాలి'' అన్నాడు.

నాగస్వరం వూదుతుంటే వింటున్న పాములాగా ఆమె అతని వంక చూస్తోంది. అంతలోనే దూర్తం చేతకాదన్నట్లు కళ్ళు ఆర్పుతోంది.

''నాకు ఎవరూ లేరనే చెప్పాలి. మా నాన్న చిన్నప్పుడే పోయారు. మా అన్నయ్యలిద్దరూ ఒకరు అమెరికాలో, మరొకరు మలేషియాలో వున్నారు. ఎవరి సంసారాలు వారివి. అమ్మ ఆరోగ్యం బావుండదు. పైగా సుమలతకంటే మిగతా కోడళ్ళతో సఖ్యత ఆమెకి. నా పిల్లలను చూస్తూ ఆమె ఇండియాలో వుండిపోవడం జరగదు. నేను విదేశాలకు వెళ్ళినా, ఆమె నా దగ్గర వుండదు. ఆయాల దగ్గర పిల్లలను వదలలేను. అందుకే మీ అండ నాకు కావాలి. రేపు సెలవు పెట్టి యింటికెళ్ళి మీ వాళ్ళను అడగండి. ఈపళాన మీరు నిశ్చయం చెప్పేసి, నాతో ముడిపెట్టుకోవడం జరిగేపని కాదని నాకు తెలుసు. నేనొక విధంగా పాతకాలంవాడినే కావచ్చు. మీ పెద్దలతో సంప్రదించనిది, వాళ్ళ అంగీకారం లేనిదిఏ నిర్ణయం తీసుకున్నా నాకు బాగుండదు, నేను బలవంతం చేయను. మళ్ళీ వారంనాటికి నాకు జవాబు కావాలి. ఓకే?'' అన్నాడతను.

ఆ అనడంలోని సొగసుకు పద్మిని శరీరం పులకరించింది. ఓకే ఓకే అన్నట్లు పిచ్చిగా చిరుగంటలా హృదయంలో అంగీకారం.

అతను కొంచెం దగ్గరగా వచ్చి ''మీరంటే నాకు చిన్నపాటి యిష్టం కూడా కలుగుతున్నట్లు అనిపిస్తున్నది'' అన్నారు. ''పోదాం పదండి. మీ బ్లాకు మొత్తం యీపాటికి గుప్పుమని పోతుంటుంది'' అన్నారు ముందడుగేసి. ఎంత సీరియస్సో అతని మాట.

ఆమె జీపు ఎలా ఎక్కిందో, యింటికి చేరిందో ఆమెకే తెలియదు. నిజంగా వూరు గుప్పుమన్నట్లుంది. అయ్యగారు ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజర్‌తో ఏకాంతంగా జలపాతం కోనకు వెళ్ళారనీ, చంద్రోదయం సమయానికి తిరిగి వచ్చారనీ. పద్మిని తాళంతీసి ఎదురుగా వున్న కుర్చీలో జారిపోయి కూర్చుంది. సుకుమార్ జీపు బంగళాకు వెళ్ళింది. పది నిమిషాలలో బిడిఓ స్వయంగా వచ్చి ''కలెక్టర్‌గారు రాత్రికి భోజనం ఎన్నింటికి పంపాలో చెప్పారా?'' అని అడిగాడు. ఆమెకి కలలో వున్నట్లుంది యింకా. ఏం జరిగిందో పూర్తిగా అర్థమే కావడం లేదు. ఈ ప్రశ్నకు ఆమె తెప్పరిల్లి ''నాకు తెలియదండి'' అన్నది మెల్లగా. బిడిఓ యీ మాట నమ్మినట్లు లేదు. ఆమెను పరిశీలనగా చూశాడు. కూర్చోమనాలన్న ధ్యాసే లేదు ఆమెకు.

''అంటే భోజనం గురించి మీతో చెప్పలేదా?'' అన్నాడు. తలకాయ అడ్డంగా వూపింది. మరి ఏం మాట్లాడారు అన్న ప్రశ్నలాంటి ముఖం పెట్టాడాయన. ఆయన వెళ్ళి జీపెక్కుతోండే, స్పృహవచ్చి తలుపు వరకూ వెళ్ళి ''నాకు రెండు రోజులు సి.ఎల్. కావాలండీ, మా వూరు వెళ్ళిరావాలి'' అన్నది. సరేనని ఆయన అంగీకరించేసరికి ఆ దయకి తట్టుకోలేక, ''ఆగండి సార్!'' అంటూ యింట్లోకి వెళ్ళి లీవులెటర్ గబగబా గిలికేసి ఆయన చేతిలో పెట్టేసింది.

''అలాగేనమ్మా! వెళ్ళిరా. ఫెస్టివల్ అడ్వాన్స్‌కి పెట్టావేమోగదా, పంపిస్తాను. అప్పుడు కొట్టేసిన నీ పర్సు దొంగతనం కేసు మళ్ళీ ఎస్ఐతో చెబుదామని కూడా అనుకుంటున్నాను'' అన్నాడాయన. ఒక్కో వాక్యానికి కంఠంలోని ఆప్యాయత డోసు పెంచేస్తున్నాడు. ఒక అరగంటకి రిజిస్టరుతో సహా ఎకౌంట్స్ అసిస్టెంట్ వచ్చి స్వయంగా డబ్బు లెక్కయిచ్చి వెళ్ళాడు.

రాత్రి చివరి బస్సు తొమ్మిది గంటలకు వుంది. వెళ్ళిపోతేనో? తనకింక ఎవరి పర్మిషన్ కావాలి? వెడుతూనే టూకీగా విషయం చెప్పేసి, నాన్నగారిని సబ్‌కలెక్టర్ గారి యింటికి పంపించాలి. పెళ్ళికి ఎంత ఖర్చవుతుందో, బుర్ర పనిచేయడం లేదు. అనుకున్న ప్రకారం రాత్రే బయలుదేరింది. మనసుకు దగ్గరైన ఫ్రెండు ఒక్కరూ లేరు యీ అడవిలో, తను యింత వార్త చెబితే సంతోషించేందుకు. బస్సు ఎక్కేవరకూ వెంకట నారాయణ మాత్రం కూడా వున్నాడు. 'అమ్మగారూ! సంగతేటండీ!' అని అడగాలని అతనికీ వుంది. అడగందే ఏమి చెబుతుంది. ఈలోగా బస్సు వచ్చి పద్మినిని ఎక్కించుకుంది. మీ యింటికి వెళ్ళండి, పెద్దవాళ్ళకు చెప్పండి, వాళ్ళ అనుమతి తీసుకోండి అని ఎందుకన్నారో ఆయన. అసలు తనకు పెళ్ళికాలేదని, యింత వయసనీ, ఫలానా కులమని ఎలా తెలుసుకున్నారో? అమ్మో! వాకబు చేసుండాలి. సుమలత



గారు - అవును అదే గౌరవంతో ఆలోచిస్తుంది ఆమెగారిని గురించి - చనిపోయాక పాపం ఎంతగా తల్లడిల్లిపోయారో? తనవాళ్ళందరికన్నా ఎక్కువగా ఎప్పుడో ఒకసారి చూసిన యీ చిన్న మనిషి ఆయనగారి మనసులో మెదలిందా? ఎంత అదృష్టం! తన జీవితం ముళ్ళదారిలోంచి, పూలబాట మీద ప్రయాణించడానికి, ఆయన వెతుక్కుంటూ వచ్చి తనను అడిగారు. కానీ తన సంసారం ఎంత పేదదో, ఆయనకు తెలియదు. నలుగురు మనుషులొస్తే కూర్చోవడానికి, కాఫీ అయినా ఇవ్వడానికి వసతి లేదు. అసలు ఎవరినీ రమ్మని పిలిచే తాహతే లేదు. పాపం పిచ్చినాన్న, ఒక యిస్త్రీ పంచె, చొక్కా దాచి అవే గొప్పగా వేసుకుంటారు.

తనకి పెళ్ళి అంటే లోన్ యిస్తారేమో? బట్టలు కొనడానికి ఎంత డబ్బు కావాలో? తనకి సొమ్ములే లేవు. ఉన్న గాజులు కూడా తాకట్టుకు వెళ్ళాయి కదా. గుండెల్లో దిగులు. కానీ తను ఏ నగా లేకపోయినా, కళగా అందంగా వుంటుందని అందరూ అంటారు. అవును, అందుకే 'ఆయన' లో ఆకర్షణ కలిగివుండాలి.

బస్సు వెంట ఎగిరివచ్చే మిణుగురుల్లా యిన్ని ఆలోచనలు ముసురుకుంటున్నాయి. ఏది ముందో? ఏది వెనకో? ఎలా పరిష్కారం చేసుకోవాలో? తెలియడం లేదు. ఇది ఎంత మంచి రోజు అని తనలో వస్తున్న సంతోషమైన నవ్వుని కొంగులో దాచుకుంది పద్మిని.

# 4

''ఏమిటమ్మా యిలా వచ్చావు?'' అన్నారు నాన్న మండువాలో వున్న మంచంమీద లేచి కూర్చుని. అమ్మ ఒక నిద్రపోయి లేచిందేమో కంగారుగా ''ఏమ్మా ఏమయింది? ఒక్కత్తివి యింత అర్ధరాత్రి వచ్చావేమిటి?'' అన్నది.

కరుణ మాత్రం యిలాంటి ప్రశ్నలేవీ వేయకుండా వెనక వసారాలో వున్న నులకమంచం దులిపి తెచ్చి, గదిలో తన మంచం ప్రక్కనే వాల్చి, బొంత పరిచింది. ''అన్నం వుంది తింటావా?'' అని అడిగింది. పద్మిని ముఖం వెలిగిపోతోంది. మామూలు చికాకులేమీ కనబడ్డంలేదు. ఉరకలేసే మనసుతో యింతదూరం వచ్చిందికానీ, అసలు విషయం ఎలా చెప్పాలో అర్థం కాలేదామెకు. ఇంట్లోవున్న ముగ్గురినీ పొగుచేసి ప్రకటించడం ఎలాగో అసలు తెలియడం లేదు. ''ఏంలేదు, వూరికినే. సెలవు ఒకరోజు కలిసొస్తే వచ్చాను. ఏం రాకూడదా నేను యింటికి?'' అన్నది అర్థంలేని కోపంతో.

''బావుందమ్మా వస్తూనే కసురుతావేమిటే? అన్నంతిని పడుకో, వేళగానివేళ ప్రయాణం అసలే'' అన్నది అమ్మ.

మరో అరగంట సేపటికి కరుణతో ఒంటరిగా వున్నప్పుడు ''అక్కా! నేనో మంచిమాట చెప్పడానికే వచ్చానే'' అన్నది. అంటుంటేనే ఓ చిన్న సంకోచం కలిగింది. అక్క జీవితం అలా అయింది కదా, తనంత సంతోషంగా యీ మాట చెప్పడం బావుంటుందా అని.

కరుణ లేచివచ్చి, పద్మిని మంచంమీద కూర్చుని, భుజాన చేతులు వేసి ''ఏమిటే అది, పెళ్ళి సంబంధం ఏమైనా కుదిరేలా వుందా?'' అన్నది. ఆమె ముఖంలో అతి ప్రసన్నమైన భావం, సంబరం, సంతోషం చూడాక పద్మిని సందేహం తీరిపోయింది. సుకుమార్ ఎవరో, అతని హోదా, దర్జా, డబ్బు అన్నీ ఎటువంటివో, తనతో అతనేమన్నాడో అన్నీ చెప్పింది. నిదానంగా సిగ్గుపడుతూ - మాటలకోసం వెతుక్కుంటూ.



కరుణ వెంటనే గట్టిగా కౌగిలించుకోలేదు చెల్లిని. మెల్లిగా అన్నది ''నువ్వు ఒప్పుకున్నట్లు చెప్పేశావా?'' అని, యింక ఒప్పుకోకపోవడం వుంటుందా అన్నట్లు అక్కవంక చూసి, ''నాన్నగారితో చెప్పి ఆయన్ని పంపించాలే వాళ్ళ యింటికి. వెళ్ళి మర్యాదగా అడగొద్దూ, మా అమ్మాయిని యిస్తామని?'' అన్నది. ఆ చిన్న బల్బు వెలుతుర్లో కరుణ ముఖంలో సంతోషం కోసం పద్మిని కళ్ళు వెతికాయి.

''చెల్లీ! కొంచెం ఆలోచించుకుని మరీ మాట యివ్వాలి. రెండోపెళ్ళి, యిద్దరు పిల్లలు, అసైన నీకంటూ పిల్లలుండరని ఖచ్చితంగా చెబుతున్నావు. ఆ సంగతి ఆలోచించుకోవద్దటే?'' అన్నది కరుణ.

''అయితే వద్దంటావా!'' అన్నది పద్మిని కొంచెం బాధపడుతూ.

''వద్దనడం లేదమ్మా! తొందర పడకుండా, పెద్దవాళ్ళతో కలసి యోచిద్దామంటున్నాను. నీకాయన బాగా తెలుసా? కులము, శాఖ ఏది తేడా అయినా అమ్మా, నాన్నా ఒప్పుకోరు. పెద్ద ఉద్యోగాల్లో వున్నవారికి ఏవైనా అలవాట్లు వుండవచ్చు. అవి విచారించుకోవాలి కదా! అంటున్నానుగానీ, వద్దనడంలేదమ్మా'' అన్నది కరుణ. ఇంట్లో నాలుగు గోడల మధ్య కూర్చునే అక్కకి యింతలేసి ఆలోచనలుంటాయని పద్మినికి ఎప్పుడూ తోచలేదు.

''ఇప్పుడు నీకు పెళ్ళి కుదరకపోతే, యింకెప్పుడూ కుదరదని నాకూ భయముందమ్మా! కానీ ఆయన అడిగారు కదా అనివెంటనే ఒప్పుకోవాలా? వద్దా? అని కూడా ఆలోచించాలి. నీకు పెళ్ళి చేయాలని లోపల నాన్నగారికి ఎంత తొందరవున్నా, ప్రయత్నమే చేయలేకుండా వున్నారు. చేతిలో డబ్బు ఆడక ఎంతో చిన్నతనంగా మసలుతుంటారు. ఎవరిని సంబంధం గురించి అడగాలన్నా భయమే ఎన్నివేలు అంటారోనని. అమ్మ రోజుకి ఒక్కసారైనా అంటూంటుంది చిన్నదానికి పెళ్ళిచేయకుండా ఆడపిల్ల సొమ్మంతా తింటున్నాము అని. తల కొట్టేసినట్లు బాధ పడతారు నాన్న, జవాబేమీ చెప్పలేక'' అని కరుణ ఆగిపోయింది. చెల్లిని ఆనుకుని కూర్చుని వీపుమీద చేయి వేసింది. ''నిజమే కదుటే పద్మా! నీ సంపాదన లేకపోతే అన్నం కూడా తినలేము. కానీ యీడు మించకుండా నీకు పెళ్ళిచేసి పంపాలని నాన్నకు మాత్రం వుండదా? ఇలాంటి సమయంలో నీకు అంత మంచి సంబంధం రావడం మంచిదే. కానీ సవతి పిల్లల్ని పెంచుకుంటూ సంతోషంగా వుండగలవా? ఎన్నేళ్ళకు బతుకు తెల్లవారుతుందే?'' అన్నది.

పద్మిని అలా గోడకేసి చూస్తూ కూర్చుంది. దీపం పురుగులు ఎగురుతున్నాయి అక్కడక్కడే వలయాలుగా. పెద్ద ప్రపంచాన్ని చూస్తున్నామని అవీ అనుకుంటున్నాయా? తనూ వాటి లాగానే ఆకర్షణలో పడిపోతుందా?

''ఏమోనే, నాకు యివన్నీ తెలియదు. నా సంపాదన యీ సంసారానికి వుండేట్లు కూడా నేను ఏర్పాటు చేసుకోవచ్చునుగా?'' అన్నది. కానీ మళ్ళీ నిట్టూర్చి, ''నేను యీ చిన్న ఉద్యోగం కూడా చేయలేనుకదే! పిల్లల్ని చూసుకోమని ఆయన నన్ను పెళ్ళిచేసుకుంటా నంటే నేను ఏ

ఉద్యోగం మాత్రం ఎలా చేస్తాను?'' అన్నది. తేలిపోయింది. తనకింక పెళ్ళిముచ్చట్లేమిటి? తక్షణం నెత్తిమీదకు వస్తున్న సమస్యలు గుర్తుకువచ్చాయి. ''సరే, పెద్దక్క ఎప్పుడు వస్తుంది? బావ తీసుకువచ్చి దిగబెడతాడా? మళ్ళీ నాన్నే వెళ్ళాలా తీసుకురావడానికి?'' అన్నది సన్నగా, నీరసంగా.

''రెండు మూడు రోజుల్లో వస్తుందేమో! బావకేదో మీటింగులట. పెద్దవాళ్ళద్దరినీ అత్తగారి దగ్గర వదిలేసి, చంటిదాన్ని తీసుకుని వస్తుంది'' అని చెప్పింది కరుణ. నీరసమైపోయిన చెల్లి మాటలు వింటే జాలేసింది.

''అలా పడుకో'' అని దిండు లాగి, తనూ పక్కన పడుకుంది. ''చెల్లీ, నీకన్నీ తెలుసునే, కాని ఏమీ తెలియనట్టు బెంబేలు పడతావు. అంత అందమైనవాడు, కలెక్టర్ కాబోయేవాడు తనంతట తానుగా నిన్ను అడిగాడంటే అదో గొప్ప అదృష్టం. అమ్మకీ నాన్నకీ యింతకంటే ఏమి కావాలి చెప్పు. రమణబావ ముఖంమీద కొట్టినట్టుగా వుంటుంది నీవు యీ పెళ్ళి చేసుకుంటే'' అన్నది చెల్లాయి మీద చేయి వేసి.

అలా ఎంతోసేపు మాట్లాడుకున్నారు అక్కాచెల్లి. తల్లికేవో విన్పిస్తున్నాయిగానీ, వచ్చి ఏమిటని అడిగితే, చిన్నది కసురుకుంటుందని భయం. కరుణ ద్వారా వినడమే మంచిది.

మర్నాడు ఆ యింట్లో ఎండా-వానా కలిసి తాండవమాడాయి అనవచ్చు. అతని కులమేమిటో తెలియదు. తను అడగలేదు. అతను ఎటువంటివాడో వాకబు చేయలేదు. కాని అన్ని లోపాల్ని కప్పిపుచ్చేందుకు అతని హోదా వుంది. వైదేహమ్మ మెరుస్తున్న కళ్ళతో కూతుర్ని చూసుకుంది. చిన్ననాడు తను వున్నట్టుగానే వుంటుంది పద్మిని - ముక్కూ, మూతి, వత్తయిన జుట్టు. మనసులో కులం, గోత్రం, జాతకాలు అంటూ కాస్త సందేహం వున్నా, నాన్న కూడా నిటారుగా నిలబడ్డారు. కలెక్టర్ గారికి మామగారినై పోతానేమో అన్నట్టు. ముఖ్యంగా బావమరిది విశ్వనాథానికి పెద్ద పాఠం చెప్పినట్లవుతుందని అతనికి. అందరికీ సంతోషం మనస్సుల్లో. కాని ఎంత ఖర్చవుతుందో అని ఒకపక్కన భయం. కొండంత దేవునికి కొండంత పత్రి ఎలా తేగలరు?

పద్మిని కాఫీ తాగే సమయంలో ఎంతో సందేహపడుతూ, కుంపటి పక్కన కూర్చుని, అమ్మతో నసిగింది. ''అమ్మా, నాకు పెళ్ళయితే, నా జీతం వుండదు కదమ్మా!'' అని.

వైదేహి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పట్టరాని దుఃఖం వచ్చింది. ''పిచ్చితల్లీ, నీ సంపాదన యిన్నాళ్ళుగా తింటున్నందుకే మేము సగం చచ్చిన ప్రాణంతో వున్నామే. నీ పెళ్ళి కూడా పడనివ్వకుండా చేసేంత కటిక దరిద్రులంకాము తల్లీ!'' అన్నది.

పద్మినికి దుఃఖం వచ్చింది. ''మీరు - నేను అని వేరుచేసి మాట్లాడకమ్మా. అయన్ను చూస్తే మీరు ఒప్పుకుంటారు. నాకు బొత్తిగా సిగ్గులేదని అనుకుంటున్నారా నాన్న'' అన్నది, చెంపలమీద నీరు కారిపోతోంది.



కూతురి కళ్ళు తుడిచింది వైదేహి. ''నాన్న మనసు నీకు తెలియదా? ఇన్నాళ్ళకు మనకో శుభఘడియ వచ్చిందని లోపల్లోపల పొంగిపోతున్నారే'' అన్నది.

పంచాంగం తిరగేసి, తిథి, వార నక్షత్రాలు, వర్జ్యాలు ఖచ్చితంగా చూసుకుని, ఆ మధ్యాహ్నమే తన ప్రయాణానికి బావుందని నిశ్చయించుకున్నాడాయన. ఆయనతోపాటు వెళ్ళేందుకు చినమామయ్య వుంటే బావుండేదని పద్మిని అనుకుంది. కానీ కబురెలా అందుతుంది.

ఆయన ఎక్కడకు వెళ్ళాలో, ఎలా మాట్లాడాలో అన్నీ పద్మిని చెప్పింది. ఆమెకు ఒకటే భయం చిన్న బంట్రోతులెవరైనా నాన్నని అవమానిస్తారేమోనని. ఆ సాయంత్రం సుకుమార్ గారి బంగళాలో ఆయనను కలుసుకున్న తరువాత, రాత్రి ఆఖరి బస్సుకైనా తిరిగి రావాలని నాన్నను ఆదేశించింది.

''తల్లీ! ఒకవేళ ఆయన కలవకపోయినా, బస్సులు దొరక్కపోయినా పొద్దున్న వస్తానమ్మా. చిన్నప్పుడు నా దగ్గర చదువుకున్నవాళ్ళు ఎవరో ఒకరు కనిపించకపోరు. వారింట్లో వుండిపోతాను. దాని గురించి కంగారు పడకండి మీరు మాత్రం'' అన్నాడాయన.

వైదేహి కలగజేసుకుంది. ''చిన్నపిల్ల, దాని ఆరాటం అర్థం చేసుకోకుండా ఏమిటా వాదన? వచ్చేయమని అది అంటోందిగా?'' అన్నది.

''సాధ్యమైనంతవరకూ వస్తాను. ఒకవేళ రాలేకపోతే అని చెప్తున్నాను. సరేనా?'' అని ఆయన సమాధానం.

రఘురామయ్య మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరాడు. ఎదురుగా మంచి శకునాన్ని రప్పించింది వైదేహి. తనని గురించి సుకుమార్‌కి ఏమేమి చెప్పాలో వివరించింది పద్మిని. చీదరికం మాటలు ఏమీ అనవద్దని ముందే హెచ్చరించింది. ఆయనగారి పిల్లలు ఎదురొస్తే ఏవిధంగా గారాబం చేయాలో వివరంగా చెప్పింది. ''నాన్నా! వాళ్ళకు ఏమి కొని పట్టుకెళ్ళకు. బూందీ, కారప్పూసలు, తింటారో, తినరో?'' అన్నది.

రఘురామయ్య ఆ వూరికి చేరేటప్పటికి మూడయింది. సబ్‌కలెక్టరు గారి బంగళా తేలికగానే తెలుస్తుందిగా అనుకుంటూ - రిక్షాకోసం చుట్టూ చూస్తోంటే, హఠాత్తుగా రమణ కనబడ్డాడు, మేనల్లుడిని చూడగానే గతుక్కుమన్నది ఆయన మనస్సు.

''ఏమిటి మామయ్యా యిలా వచ్చావు?'' అన్నాడు. కొంచెం దిక్కుపోయినట్లు కనబడ్డాడు రమణ.

''ఏం లేదోయ్, చిన్న పనుంది'' అంటూ రెండడుగులు ముందుకేశాడు రఘురామయ్య. చిన్నప్పటినుంచి పద్మినినే పెళ్ళి చేసుకుంటాడని అనుకుంటే తీరా వయసు వచ్చాక మాట తప్పాడు. కారణం ఏదైనాగానీ, బడిపంతులు రఘురామయ్యకి అబద్ధాలు చెప్పడం అలవాటు లేదు. బావమరిది విశ్వనాథం తనకి ఎంతో దగ్గరవాడని అనుకున్నాడు యిన్నేళ్ళనుంచి. పెద్దమ్మాయిలిద్దరూ వరలక్ష్మి, కరుణ పెళ్ళిళ్ళు చేసినప్పుడు తమకి కుడిభుజంలా నిలబడ్డాడు.

పద్మ పెళ్ళి గురించి సంబంధాలు వెతకవలసి వస్తుందనిగానీ, డబ్బుకోసం గిజగిజలాడవలసి వస్తుందనిగానీ కలలో కూడా అనుకోలేదు. రమణ అల్లుడై, కొడుకులాగా తనను ఆదుకుంటాడని ఆశపడ్డాడు.

ఇంత క్షోభకు కారణం విశ్వనాథం. నాన్న మాటకు తలవొగ్గి పద్మ చేయి పట్టుకోకుండా నట్టేట్లో వదిలేసిన రమణ. పోనీ అది వదలడం బాగానే వుంది. పద్మినికి గొప్ప దశ ఎత్తుకునేటట్లు వుంది.

''ఇంట్లో అందరూ బాగున్నారా?'' అన్నాడు రమణ. ఏదో మాట్లాడాలి కదా అని అడిగాడు ఈ ప్రశ్నను అని సరిపుచ్చుకుని, ''బాగానే వున్నారు. మీ నాన్నెక్కడ వున్నాడు?'' అని ఎదురు కుశల ప్రశ్నలు వేశాడు రఘురామయ్య. నాన్నకు మళ్ళీ జ్వరం వస్తోందని, పరీక్షలు చేయించి, ఆపరేషన్ లేదని నిశ్చయిస్తారని చెప్పాడు రమణ. ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో వున్నాడట. ఇవన్నీ జరిపించే డాక్టరుగారి పేరును కూడా చాలా గౌరవంతో నొక్కిచెప్పాడు. 'నీకు కాబోయే మామగారేగా' అని లోపల అనుకుని, మరికొంతదూరం అలాగే నడిచాడు రఘురామయ్య. ఏదైనా రిక్షా కేకేస్తే, తను వెళ్ళేది ఎక్కడికో తెలిసిపోతుంది. పోనీ మీ నాన్నను చూద్దాం పద అంటే, వెడుతున్న మంచిపనికి ముందు ఆస్పత్రిలోకి వెళ్ళడం అంత శుభంగా అనిపించడం లేదు. విధిలేక నడక సాగిస్తూ, ''నీ పెళ్ళికి లగ్నం కుదిరిందా?'' అన్నాడు.

రమణ ఒక్క క్షణం మాట్లాడలేదు. ఆ తరువాత ''యింకా లేదు మామయ్యా! అత్తయ్యకీ, నీకూ చాలా కష్టం కలిగించాను కదూ!'' అన్నాడు. అట్నే కష్టమేముంది అని తను అనాలను కున్నాడా? ''అదంతా దేనికిలే, నువ్వు ఎటు వెళ్ళాలి?'' అన్నాడు నాలుగురోడ్ల కూడలి చేరాక రఘురామయ్య.

''వెడతాలే! ముందు నువ్వు ఎక్కడికి వెళ్ళాలో చెబితే కూడా వస్తాను. ఈ వూరు మారిపోతోంది కొత్త యిళ్ళు రావడంతో. గుర్తుపట్టలేవు'' అన్నాడు రమణ. అతను అన్నది సదుద్దేశ్యంతోనే అయినా, రఘురామయ్యకు చాలా యిబ్బందిగా వుంది. మామయ్య తటపటాయించడం చూసి, ''ఫర్వాలేదు మామయ్యా! నేను పదింటికి ఆస్పత్రికి చేరాలి. నీ పని పూర్తయినాక అటే వెడదాము. నాన్న నిన్ను చూస్తే ఎంతో సంతోషిస్తాడు'' అన్నాడు రమణ.

కాబోయే కలెక్టర్ నా అల్లుడంటే మరీ సంతోషిస్తాడులే ఈర్ష్యతో అనుకుని, ''నా పని ఎప్పటికి అవుతుందో, ఏమో? నువ్వు వెళ్ళరాదూ! పని పూర్తయ్యాక నేనే అటుగా వస్తానులే. ఇంతకీ ఎక్కడా ఆస్పత్రి!'' అంటూ గుర్తు అడిగాడు.

రమణకి అర్థమైపోయింది, తను కూడా రావడం మామయ్యకి యిష్టంలేదని. ''తెలుసుకోవడం తేలికే మామయ్యా, కమలా నర్సింగ్‌హోమ్ అని అడుగు. ఇంకా గుర్తులు కావాలంటే సబ్‌కలెక్టర్‌గారి యింటికి ఎదురుగా అని చెప్పు'' అన్నాడు.

రఘురామయ్య మనస్సులోనే తెల్లముఖం వేసి, ''పోనీ పద, మీ నాన్నను చూద్దాం!'' అని మేనల్లుడితో కలిసి రిక్షా ఎక్కాడు.



దూరం సుమారు రెండు కిలోమీటర్లు వుంటుందేమో అంతసేపూ రమణతో ఏదో ఒకటి మాట్లాడక తప్పలేదు. కాసేపటికి మనస్సు కుదుటపరచుకుని, ''రమణా! నువ్వు నీ దారి చూచుకున్నావు కనుక పద్మకి వేరే సంబంధాలు చూస్తున్నాను'' అన్నాడు. రమణ కళ్ళజోడు తీసి, అనవసరంగానే రుమాలుతో తుడుచుకుని, ''మంచిపని చేస్తున్నారు మామయ్యా! వయస్సులో చిన్నవాడినైనా పెద్దవాడిలా అంటున్నాననుకోకు. ఎవరికి ఎవరితో రాసిపెట్టి వుంటే, అలాగే జరుగుతుంది. ఇంతకీ యీ వూళ్ళో ఏదైనా సంబంధం గురించి వచ్చావా?'' అన్నాడు రమణ.

పాపం, కుర్రాడేగానీ, తన మేలుకోరినవాడు అనిపించింది ఆ క్షణంలో. ఎవరో పరాయి వాళ్ళ నమ్మేకంటే, రక్తసంబంధం వున్నవాడు, పద్మంటే అపేక్ష వున్నవాడు రమణ. తనకు శత్రువు కాదుగదా! అతనితో చెబితే నష్టమేముంది అనిపించి, ''అవును రమణా! నీతో చెప్పకుండా దాచడమెందుకు గానీ, యిక్కడ సబ్‌కలెక్టర్ సుకుమార్ గారి భార్య పోయిం దటగదా యీమధ్య! ఇద్దరు పిల్లలు, అతనికిద్దామని మన పద్మని'' అని చెప్పేశాడు. కొంత దూరం రిక్షా సాగాక రమణ ''ఎవరు చెప్పారు యీ సంబంధం గురించి? అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడటనా?'' అన్నాడు.

''ఆయనే అడిగాడు పద్మినిని. నేనిప్పుడు ఆయనని కలిసి, లాంఛనంగా మాట్లాడాలి. అంతే'' అన్నాడు రఘురామయ్య. కులం, గోత్రం చూసుకునే చేస్తున్నావా అని చిన్నవాడైన మేనల్లుడు అంటాడేమోనని భయం. మరికొంతదూరం పోయేసరికి, అతడిని తనతో తీసుకు వెడితే మంచిదేమో అనే యోచన కలిగింది. పద్మకి కూడా రమణ మాటంటే గురి వుంది. అక్కడ ఏదైనా ఒకముక్క ఇంగ్లీషులో మాట్లాడవలసి వచ్చినా, ఏ బవాను చేతిలోనో ఒక రూపాయి పెట్టాలన్నా, కుర్రవాడు ఒకడుంటే మంచిదిగదా! అనుకున్నాడు.

''పోనీ నువ్వుకూడా వస్తావేమిటి నాతో'' అన్నాడు రఘురామయ్య. అలాగే అని, అసలైన రమణ ముభావంగా వూరకుండిపోయాడు. రిక్షా దిగాక, తనే డబ్బులిచ్చేసి, ''నువ్వు అక్కడికి వెళ్ళిరా, ముందు ఆ పని పూర్తిచేసుకోవడం మంచిది గదా! అదే సబ్‌కలెక్టర్ బంగళా. నేను ఆస్పత్రిలో వుంటాను'' అన్నాడు. ''అదేమిటి, నువ్వు రావా?'' అన్నాడు రఘురామయ్య. ''ఎందుకులెద్దూ, నువ్వెళ్ళిరా!'' అన్నాడు రమణ. పెద్ద ఆవరణ, గేటు, ఒకపక్క తగిలించి వున్న తెల్లటి అక్షరాలతో నల్లని బోర్డు చూడగానే, ఒక్కళ్ళే వెళ్ళి యింతపని సాధించగలనా? అనిపించింది రఘురామయ్యకి. ''నువ్వో నిమిషం రాకూడదా?'' అన్నాడు మొహమాటంగానే.

సరే పదమని, యిద్దరూ లోపలికి వెళ్ళారు. తోటలో పిల్లలు ఆడుకుంటున్నారు. బంట్రోతు ఎవరు కావాలని అడిగాడు. ఆ పిల్లల్నిచూస్తూ నిలబడిపోయాడు రఘురామయ్య. మన అమ్మాయి పెంచవలసినవాళ్లు వీళ్ళే కదా అన్నట్లు. రమణే అడిగాడు అయ్యగారు లేరా? అని.

''క్యాంపు నుంచి యింకా రాలేదండీ, రేతిరికి వస్తారేమో?'' అని చెప్పాడు బంట్రోతు. పిల్లలు ఆరేళ్ళలోపువారే. ముచ్చటైన డ్రస్సులతో పరుగెడుతూ, కొత్తగా వచ్చినవాళ్ళకు దగ్గరగా వచ్చారు.

''డాడీ లేరు'' అని చెప్పింది పాప, ఎవరూ అడగకుండానే. ముత్యం, పగడం లాంటి యీ పిల్లలతో కాలక్షేపం చేయడం గొప్ప భాగ్యమే అనిపించేసింది రఘురామయ్యకి. పాతదైనాగానీ ఆ బంగళా చుట్టూ తోట, మంచి డ్రస్సులో నౌకర్లు ఎంతో వైభవంగా కనిపించాయి. తను ముప్పయి ఐదేళ్ళ టీచర్ సర్వీసు చేసినా, ఎన్నడైనా యిలాంటి పెద్ద అధికారుల యింటికి వస్తేగదా! రమణ మాత్రం అవేవీ చూడనట్టుగా ''లేరుటగదా! పద, పోదాం. ఇంకా నిలబడ్డం దేనికి?'' అన్నాడు.

గేటు దాటగానే, ''మామయ్యా, పద్మినికి యీ సంబంధం ఎవరు తెచ్చారు?'' అన్నాడు రమణ. ఈ ప్రశ్న అడగడం యిది రెండోసారి.

''ఎవరు తెస్తారు? అదే తెచ్చుకుంది'' అన్నాడు రఘురామయ్య.

''ఎక్కడా విచారించే పని లేదంటావా అయితే?'' అంటున్న రమణ వంక చూస్తూ నడక ఆపాడు రఘురామయ్య.

''దేన్ని గురించి విచారించాలంటావు?'' అనడిగాడు. ఈ ప్రశ్న వేసిన తరువాత అయనకు తట్టింది - పెళ్ళికిముందు పెళ్ళికొడుకు వంశక్రమం, ప్రవర్తన, పేరుప్రతిష్టలు, అలవాట్లు వగైరాలను గురించి విచారించడం రివాజు అని.

''అన్నింటిని గురించీనూ. ఎందుకంటే అతను యీ ప్రాంతంవాడు కాదు. తల్లిదండ్రి ఎక్కడ వుంటారో తెలియాలా, వద్దా? మంచి లాయర్ స్నేహితుడున్నాడు నాకు, అతన్ని నేను కనుక్కొంటాను'' అన్నాడు రమణ. ఒకటికి రెండు పెద్దబుర్రలు యింతటి పెద్ద విషయంలో పనిచేయడం అవసరమే అనిపించింది రఘురామయ్యకి. ఇద్దరూ కలిసి నర్సింగ్‌హోంలోకి వెళ్ళారు. విశ్వనాథం పరిస్థితి ఏమీ బాగుండలేదు. అయన కాబోయే వియ్యంకుడు క్యాన్సర్‌కి చికిత్స అంటే చేయిస్తున్నాడు గానీ, బాధనీ, జబ్బునీ ఎక్కడ తీసేయగలడు? బావని దగ్గరకు పిలుచుకుని, చేయిపట్టుకుని అందరూ బాగున్నారా అన్నట్టు సైగ చేశాడు. ఆ తరువాత మంచం పక్క నున్న స్టూలుమీద కూర్చోమని, నిదానంగా మాటలారంభించాడు. తన కొడుక్కి ఎందుకని పద్మినిని చేసుకోలేదో చెబుతాడని అనుకున్నాడు రఘురామయ్య. కానీ ఆ వూసు లేకుండా, తనకు ఎక్కడ నొప్పి వుందో, ఎన్ని ఇంజక్షన్లు యిస్తున్నారో, అపరేషన్ తరువాత కొబాల్ట్ దీపం ఎలా పెడతారో? మొదలైన వివరాలు నిదానంగా చెప్పాడు.

మళ్ళీ వస్తానని చెప్పి, రఘురామయ్య బయటకు వస్తుంటే రమణ కూడా వచ్చి, రాత్రికి వుండిపోయి, రేపు ఏకంగా పెళ్ళికొడుకు దర్శనం చేసుకుని, వూళ్ళో మిత్రుల దగ్గర ఆయనగారి గుణగణాలు, మంచి-చెడ్డలు విచారించుకోమని సలహా చెప్పాడు. ఆస్పత్రిలో



మేడమీది రూములో పడుకుని, మేనల్లుడి సలహా ప్రకారమే చేశాడు రఘురామయ్య. మర్నాడు సుకుమార్‌గారి బంగళాకి మరొకసారి వెళ్ళాడుగానీ, అప్పటికీ రాలేదతను. అక్కడున్న బంట్రోతులకు మాత్రం కొంతవరకు తెలిసినట్టుంది ఈ ముసలాయన వచ్చిపోతున్న పని ఏమిటో!

తెల్లవారినాక రమణ లాయర్ మిత్రుడు చెప్పినది విన్నాక, రఘురామయ్యకి తల తిరిగి పోయింది. నిజమా? అబద్ధమా? సుకుమార్‌కి వేరే మనిషిమీద ఆలోచన వుంటే మనమ్మాయిని ఎందుకు అడిగినట్టు? పోనీ స్నేహం స్నేహమే - పెళ్ళి పెళ్ళే అని సరిపుచ్చుకోవాలా? లేకపోతే తను విన్నదంతా పద్మతో చెప్పేసి ఏం చేయమంటావమ్మా అని నిస్సహాయంగా చూడ్డమా? ఏమీ పాలుపోవడం లేదు. నిన్న యీపాటికి, వాకిట్లో పచ్చతోరణం కట్టడం, పందిరికి పురమా యించడం ఒక్కటే తరువాయి అన్న పరిస్థితి. ఇప్పుడు అనుమానంలో పడిపోయింది.

మామయ్య బస్సెక్కేదాకా వున్నాడు రమణ. ''పెళ్ళంటే నూరేళ్ళ జీవితం కదా మామయ్యా! నేను నాన్నకు మాట యివ్వవలసి వచ్చింది. ఆయనకు ఎలా వుంటుందో, ఒక్కడే కొడుకును కనుక నాదే బాధ్యత అనిపిస్తుంది. అయన ప్రాణానికీ నాదే పూచీ అనుకుంటాను. పద్మకి తొందరపడవద్దని చెప్పు. డబ్బు లేకపోయినా, చదువు, హోదా లేకపోయినా గుణం మంచిది వుండాలి మామయ్యా. ఇతగాడు ఎవరో ఆమెతో స్నేహంగా వున్నాడని మా ఫ్రెండు చెప్పాడు గదా! ఊళ్ళోనూ అంతా అనుకుంటున్నారు. పద్మ కూడా లోకం తెలియని చిన్నపిల్ల కాదు. బాగా ఆలోచించమను'' అని ఎంతోసేపు నూరిపోశాడు.

* * *

''ఏం నాన్నా ఏమయింది? ఆయన లేరా? నువ్వు కలవలేదా? సరిగ్గా మాట్లాడలేదా?'' అంటూ పరంపరగా ప్రశ్నలు వేసింది పద్మిని.

''ఉంటేనేం? లేకపోతేనేం? నేను వారింటికి వెళ్ళాను, అన్నీ చూశాను, కానీ మనమే కొంచెం నిదానంగా విచారించుకుంటే మంచిదనిపిస్తుందమ్మా!'' అన్నాడాయన. అంత ఆత్రంగా ఎదురుచూస్తున్న బిడ్డ నీరుకారిపోకుండా అసలు సంగతి చెప్పడమెలాగా? అని ఆయన ఆగాడు.

''విచారించుకోడమేమిటి? ఆలోచించుకోవడమేమిటి? మీరసలు వాళ్ళింట్లోకి వెళ్ళారా? వాళ్ళ వాళ్ళను చూశారా? పిల్లలు వున్నారా? మీ దగ్గరకు వచ్చారా?'' అంటూ మళ్ళీ ప్రశ్నలు.

''అవునండీ, ఆయనగారి బంగళాకి వెళ్ళలేదా?'' అంటూ వైదేహమ్మ అదనపు ప్రశ్న.

''వెళ్ళాను, వెళ్ళాను. ఆలోచించుకోవడమంటే - అందేనూ - ఆయనగారికి కాస్త మంచి పేరు వున్నట్టు లేదు. ఆ సంగతి తెలిశాక నేనింక ఆయన తిరిగొచ్చేవరకూ వుండలేదు. అదమ్మా సంగతి'' అన్నాడు రఘురామయ్య.

మంచిపేరు లేదా! అంటే తాగుబోతు, పేకాట, జూదం, రేసులు అలాంటి అలవాట్లు న్నాయా? అంతపెద్ద గవర్నమెంట్ ఉద్యోగికి అలాంటి అలవాట్లు వుండవచ్చుగా? లక్ష ప్రశ్నలు ముళ్ళలాగా పద్మినిలో గుచ్చుకుంటున్నాయి. ''అంటే ఏమిటి నాన్నా, ఎవరు చెప్పారు? ఒక్క పూటలో మీకు ఏం తెలిశాయి విషయాలు?'' అన్నది. నీరసంగా, తడితడిగా వున్న ఆమె మాటలు, రఘురామయ్య గుండెను కలచివేశాయి.

ఎదిగిన కూతుళ్ళిద్దరినీ ఎదురుగా పెట్టుకుని ఏం చెబుతాడు. కానీ విషయమేమిటో కుండబద్దలు కొట్టినట్టు చెప్పేయకపోతే వూరుకునేటట్టు లేదు యీ పిల్ల.

''అంటే క్లబ్‌కి బాగా వెడతాట్ట. అది సరేననుకో, భార్య వున్నప్పటినుంచే ఏదో కథ నడు స్తోందట. ఆమె పోయాక బాహాటంగానే ఎవరో లేడీ లాయర్‌తో...'' అని గోడవంక చూస్తూ నసిగాడు.

''లేడీ లాయర్‌తో ... స్నేహమా?'' అని చటుక్కున పూర్తిచేసింది పద్మిని. తల్లీ కూతుళ్ళిద్దరూ తల వొంచుకున్నారు యిలా తెగబడి ఆమె అడిగేసరికి. రఘురామయ్య తల వూప బోయి, తమాయించుకుని, ''ఏదో ఒకటి తల్లీ! మనకు పనికిరానప్పుడు ఎందుకు ఆ మాటలన్నీ అనుకోవడం? మరి ఆమెను పెళ్ళి చేసుకుంటాడనే అందరూ అనుకుంటున్నారట. తెలిసి కూడా మనం గోతిలో దిగరాదు గదా!'' అని ఆ విషయం ముగింప చూశాడు.

పద్మిని కళ్ళు పెద్దవైనాయి. ''ఇలాగని నీకు ఎవరు చెప్పారు నాన్నా? అసలు ఆ వూళ్ళో ఎవరు తెలుసునని అడిగావు? ఉన్న ఒక్కపూటలో ఎంతమందిని కలిసి మాట్లాడావు?'' అన్నది.

వైదేహి ఒలుస్తున్న గోంగూర చేటలోకి విసిరేసి, కూతురికి దగ్గరగా వచ్చింది. ''ఏమిటే నీ గోల? ఇంతగా నిలదీసేదానివి, నువ్వే పెళ్ళి వాకబు చేయలేకపోయావా? ఆయన చెప్పిన మాటలోని అంతరార్థం గ్రహించుకోవాలి. అంతేగానీ యింకా యింకా రెట్టిస్తావేమిటి? మాయకాలం, మాయదారి చదువులు రాబట్టి యింతగా బరితెగించిపోయారు'' అన్నది గట్టిగా.

పద్మిని ముఖం ఎర్రగా అయిపోయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏమీ మాట్లాడకుండా తలవొంచేసుకుంది. కాసేపు నిశ్శబ్దం... దానిమ్మ చెట్టు వంక పిచ్చిగా చూస్తున్న రఘు రామయ్య, పనిలేకుండానే పెరట్లో ఏదో సవరించాలని ప్రయత్నిస్తున్న వైదేహి, చెల్లికి దగ్గరగా జరిగి, ఏదో సర్ది చెప్పాలనుకుంటున్న కరుణ.

కొంచెం ఆగి, ''దాన్ని గదమాయించడం దేనికిలేవే, విశ్వనాథం మామయ్య అక్కడే ఆస్ప త్రిలో వున్నారు. రమణ బావ ఆయన దగ్గర వుంటున్నాడు. వాడు చెప్పాడు ఎవరో స్నేహితు లను అడిగి. అంతేనమ్మా. నేను మనిషి మనిషిని అడగలేదు. చెప్పినవాడు మనవాడే గదా అని మనం జాగ్రత్తగా వుండాలని సంబంధం ఖాయం చేసుకుని రాలేదు'' అంటూ టూకీగానాన్న చెబుతుంటే పద్మిని చలనం లేకుండా చూసింది.



ఈ మాటకు వైదేహి దగ్గరగా వచ్చేసి, ''ఆహా! అయితే రమణ చెప్పిన సమాచారమా? ఇంతకీ వాడికి డాక్టరుగారి అమ్మాయితో పెళ్ళిప్పుడో?'' అన్నది. పద్మినికంటే ముందుగా రమణ పెళ్ళి జరిగిపోవడం భరించలేని సత్యం. రోగి కదా మా అన్నయ్య ఎలా వున్నాడని అయినా అడగ కుండా, రమణ పెళ్ళిముచ్చట అడుగుతోంది అమ్మ అని అమ్మాయిలిద్దరికీ అనిపించింది.

వాళ్ళవంక చూసిన వైదేహి, ''పోనీ, ఎప్పుడైనా వాడి పెళ్ళి జరగనీగానీ, రమణ చెబితే ఎలా నమ్మారండీ? అసలు వాడి కడుపులో ఏముందో, ఎందుకిలా పుట్టిందారో, మనమూ గ్రహించుకోవాలి కదా!'' అన్నది. మరికాసేపాగి ''అయినా వాడితో ఎందుకు చెప్పారు యీ విషయాలు. అంత పెద్దమనిషి మనమ్మాయిని ఏరి, కోరి చేసుకుంటానని మాట యిచ్చాక, యీ రమణగాడి సలహా ఏమిటి మనకి. అసలు మీరొక్కరు కాకుండా, ఒక్కరోజు ఆలస్యమైనా గానీ చిన్నఅన్నయ్యను పిలిపించుకుని వెళ్ళవలసింది. విశ్వం అన్నయ్యగానీ, వాడి సంతానంగానీ మనకు ఒరగబెట్టింది లేదు. కానీ పుల్లలు పెట్టడానికి మాత్రం టైం చూసుకుని వచ్చేశారు. ముందుగానేమో తనే పెళ్ళి చేసుకుంటానని మాయమాటలు చెప్పాడు నాలుగేళ్ళపాటు. ఆ తరువాతేమో తగుదునమ్మా అని ఒక నాసిరకం సంబంధం పంపాడు పెళ్ళిచూపులకని. ఇప్పు డింక యీ సంబంధం చెడగొట్టాలని ఎత్తువేశాడన్నమాట'' అన్నది ఆవేశంగా.

పద్మినికి మనస్సులో ఉక్రోషం కుతకుతా వుడికిపోతున్నది. తనొచ్చి యిప్పటికే మూడు రోజులు అయింది. తిరిగి వెళ్ళిపోవాలి. అతనికి కబురే అందలేదు. తనింక ఏ ముఖం పెట్టు కుని ఆ బ్లాకుకి తిరిగివెడుతుంది? సుకుమార్‌గారు మాట్లాడిన అంతరంగిక విషయమేమిటో యీపాటికి అందరూ గ్రహించుకుని వుంటారు. తన దగ్గరివాళ్ళకైనా, తనంటే ప్రాణంపెట్టే కింది ఉద్యోగులకైనా చెప్పక తప్పదు ఏదో ఒక సందర్భంలో. అదంతా యిప్పుడింక, గాలికి ఎగిరి పోయిన పుప్పొడిగా అయింది. నిట్టూర్చిందామె.

''పోనీలే నాన్నా, ఎలా జరగాల్సి వుంటే అలాగే జరుగుతుంది'' అంటూ విసురుగా లేచి, విసవిసా నడిచి ముందు సావిట్లో మంచంమీద పడుకుంది.

ఆమె మనస్సంతా సుకుమార్ నిండి వున్నాడు. ఆ కొండకోనలో, జలప్రవాహం పక్కన, చల్లటి ఏటిగాలి పన్నీరు చిలకరిస్తుంటే, అడవిపూలు కూర్చి అతని మెడలో వరమాల వేసేయవలసింది. గాంధర్వ వివాహం చేసుకుందామని అతను మాటమాత్రం అంటే, మగత చూపుతో అతని గుండెలోకి ఒరిగిపోయేది. ఇంకా యీ పెద్దరికాలేమిటి, పెళ్ళి మాటలేమిటి? గంటలు గడిచాయి. అన్నం తినను పొమ్మంది. ఎక్కిళ్ళు వినపడకుండా ఏడ్చింది. అక్క కరు ణకి కూడా తనను ఓదార్చే మార్గం తెలియదు. ఈ అనుభవం తన స్వంతం. ఈ రాత్రి దీర్ఘమైంది. గడియారం పాతదే అయినా, ఈనాటి దాని గంటలు గుండెమీద సమ్మెట దెబ్బల్లా వున్నాయి. పిచ్చిగా మారిపోతున్న ఆలోచనని తమాయించుకో లేక, కన్ను మూతపడక, ఆ రాత్రి గడిపింది పద్మిని.

తెల్లవారుతోనే పెద్దక్క వరలక్ష్మి యిద్దరు పిల్లలతో దిగింది. ఒళ్ళంతా కట్టెలా వున్నా, కడుపు మాత్రం బానలా వుంది. రెండు పది రూపాయల నోట్లు తీసి, పాలకి, కూరలకి యింట్లో యిచ్చింది పద్మిని. చెల్లెలి కళ్ళు, ముఖం యింతలావున వాచివుండడం చూసి, ఏం జరిగిందని వరలక్ష్మి వచ్చిన గంటలోపే తల్లిని అడిగింది. పద్మినికి తెలుసు, అమ్మ పూసగుచ్చినట్టు అంతా చెబుతుందని, అది యిక తీర్పులివ్వడం మొదలుపెడుతుందని. అందుకే కదలకుండా పెరట్లోనే బట్టలు జాడించుకుంటూ వుండిపోయింది.



## 5

రోడ్డు కొండమలుపు తిరిగి, చీకటి మబ్బులాంటి చెట్లు కనబడగానే, ఆ వూరు, పంజరం లాంటి తన ఇల్లు గుర్తుకువచ్చి, పద్మిని గుండె బరువెక్కిపోయింది. బస్సు దిగి ఇంటికి వెళుతుంటేనే, తెలిసినవారందరి చూపులూ తనమీద కందిరీగల్లా వాలినట్లు ఒక స్పృహ. ఇల్లు దిమ్ముకుని, నీళ్ళు తోడుకుని, అన్నం వండుకుందామని ప్రయత్నిస్తుంటే, సేవక్ వచ్చాడు. ''ఏమిటమ్మగారూ, నాతో సంగతేటో సరిగా చెప్పకుండా యెళ్ళిపోయినారు? లగ్గ మెట్టేసినారాండీ? తమరు వూళ్ళో అడుగెట్టగానే చెప్పమన్నారండీ బిడిఓగారు. ప్రెసిడెంటరు గారైతే, మహిళా మండలోళ్ళందరికీ ఒక బస్సు మాట్లాడేస్తున్నారండీ, తమరి పెళ్ళికి రావడానికి'' అంటూ తన మనసులో యింత నిప్పు గుమ్మరించాడు.

''మంచిదిగాని, నేను వచ్చినట్టు నీవు ఎవరితోటీ చెప్పద్దు. ఆఫీసుకెళ్ళి ఎలాగూ సంతకం పెడతానుగా, అప్పుడే చూస్తారందరూ. అది సరే, పెరుగు, పాలు ఏమైనా దొరుకుతాయేమో చూసి పెట్టుకురా'' అన్న ఆమె సాదా - సీదా జవాబుకి వెంకటనారాయణ ఉత్సాహం చల్లారిపోయింది. అమ్మగారు చిరునవ్వుతో సిగ్గుపడిపోతే చూడాలని ఆశపడిన అతడికి నిరాశే ఎదురయింది. 'నువ్వు రానిదే నా పెళ్ళి ఎలా అవుతుంది నారాయణా, అసలు ఆ మొదటిసారి ఆయనగారు క్యాంపు వచ్చినప్పుడే నా ఎడమకన్ను అదిరింది - కాకపోతే పాపం భార్యపోయిన ఆయన దుఃఖం చూడలేకపోయినాను' అని తనతో చెప్పుకుంటే, ఎంతో సంతోషపడేవాడు. ఏదైవుంటుంది, పాపం డబ్బులు గురించి గాబరా పడుతున్నదేమో, షావుకారు దగ్గర యిప్పిస్తానని భరోసా చెబుదామా అనుకున్నాడు.

ఆఫీసుకువెళ్ళి, సంతకం పెట్టి సీటులో కూలబడింది. అందరి చూపులూ తనమీదే. అనవసరంగా ఏదో కల్పించుకుని మాట్లాడాడు మేనేజర్. వెకిలి మనిషి రామారావు కూడా ఎంతో మర్యాదగా నమస్కారం లాంటిది పారేశాడు.

బిడిఓ ఖాళీగా వుండడం చూసి, వెళ్ళి నమస్కారం పెట్టి నిలబడింది. ''కూర్చో, కూర్చో'' అని మర్యాద చేస్తుంటే, పద్మినికి తల తిరిగినంతపనైంది. ''చాలా సంతోషం. ఏదీ, సెలవు పొడిగించేసి, ఏకంగా కార్డులు పుచ్చుకుని వస్తావనుకున్నాను'' అన్నాడు నోట్లోని పళ్ళు చాలా వరకు కనిపింపజేస్తూ.

పద్మిని యిటువంటి పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో ఆలోచించనేలేదు. కార్డులేమిటండీ అని తెల్లబోదామంటే, అంత ఆకాశం నుంచి తనను ధభాలున నేలమీదకు పడేస్తాడు. చిన్నగా నవ్వి ''సింగరుపాలెంలో క్యాంపు పెడదామని అప్పట్లో అనుకున్నాము గదా! ఏ తేదీ నుంచి మొదలుపెట్టమంటారు అని అడగడానికి వచ్చానండీ'' అన్నది మెల్లిగా.

బిడిఓ తన సంతోషకరమైన సంభాషణకి జవాబురాని సంగతే గమనించక, 'ముందుచూపు రహదారి' పద్ధతిలో ''అప్పుడే క్యాంపు చేసికమ్మా! ఈ నెలకింక రెస్టు తీసుకో. అందులోనూ సింగరుపాలెం వృత్తి పాకిరీ వూరు, వంటరిగా పెళ్ళి నడిపిందాలంటే కష్టం'' అన్నాడు.

ఈ అతిమర్యాదకు పద్మిని అంత తేలికగా లొంగిపోతే, క్యాంపు మానేసి యిక్కడే వుండిపోవలసి వస్తుంది. పెళ్ళికూతురి నటన, జవాబులు చెప్పడం వంటి యిబ్బందులున్నాయి. అదీకాక క్యాంపు పేరున ఐదారు వందలు అడ్వాన్సు తీసుకుంటే యింటికి వంద యినా పంపేయవచ్చు. ఒకవేళ వరలక్ష్మి మొగుడు, ఆ బావ వచ్చినా, నాన్న పరువు నిలబడు తుంది, పప్పుకీ, ఉప్పుకీ వెతుక్కోనవసరం లేకుండా.

''పరవాలేదండీ, యిప్పుడు వాన, గాలీ ఏమీ లేకుండా వాతావరణం బావుంది, బాట కూడా సాఫీగా వుంటుంది. రాత్రికి రెండింటికి బండి ఎక్కితే, తెల్లారి ఎనిమిది అయ్యేసరికి చేరిపోతాను. అడ్వాన్సుకి పెడతాను'' అంటూ లేచి నిలబడింది.

ఇంకా సబ్‌కలెక్టర్ సుకుమార్, అతనితోటి కోన ప్రయాణం మైకంలోంచి తేరుకోనట్లున్న బిడిఓ, ''ఆ! బండీ అనే ఏముంది? ఒక గంట పని, జీపులో వెళ్ళి సామాను పడేసుకో'' అన్నాడు.

తనకి ఆఫీసర్‌తో పెళ్ళి కాబోతుందని, హఠాత్తుగా హోదా పెరిగి పోతుందని గుర్తించిన వాడు కనుక, యింత మర్యాద చేసేస్తున్నాడీయన. ఇప్పుడింక యీ పెళ్ళి జరుగకపోతే, తన పాట్లు మునుపటికంటే 'డబుల్' అయి కూర్చుంటాయి. సుకుమార్ జిల్లానుంచి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతే, తన ఉద్యోగం దుర్భరమవుతుంది. శాపానికి గురైన అప్సరసలాగా పరమ నికృష్టమైన స్థాయిలో పడేస్తారు. ఎలా యీ చిక్కులు దాటడం. రోజురోజుకీ ఎక్కువై పోతున్న యింటి బాధ్యతలను నడమంత్రంగా వదిలేయడానికి లేదే!

ఆరు వందల నగదు సాయంత్రానికి చేతికొచ్చింది. చివరి బస్సు డ్రైవరు చాలా నమ్మకస్తుడు. నైటుహాల్టు చేస్తాడు. ఉత్తరం రాసి వంద రూపాయలు అతని చేతికిచ్చి, నాన్నకు పంపేసింది పద్మిని.



బండికి కబురు పంపాలి. వళ్ళంతా పచ్చిముద్దలా వుంది. మనస్సయితే మరీ గజిబిజిగా వుంది. ఇక నాన్నవల్ల జరిగే కార్యం ఏమీలేదు. ఒకత్తే కూర్చుని ఆలోచిస్తుంటే, తను ఎలా యీ పని సానుకూలపరచుకోవడం అనే సంగతి తెగడం లేదు. తను వెడితే యీ వూరేకాక, ఆ వూరూ గుప్పుమంటుంది. అసలు ఆయన తనకు ఏమంత ఆప్తుడని పెళ్ళి అంతరంగికంగా మాట్లాడుతుంది. అదృష్టం వచ్చి తన తలుపు తట్టింది. చెవిటి మొద్దులాగా వినిపించుకోకపోతే తనకే నష్టం. ఇది ఇరవైయో శతాబ్దం. ఒక ఆడపిల్ల తన పెళ్ళిని గురించి సూటిగా చర్చిస్తే తప్పులేదు. కట్నాలు, కానుకలు, పెళ్ళి ఖర్చులు, ఎవరెవరికి బట్టలు – అన్నింటిని గురించి తనే ఆలోచించాలి. ఏర్పాటు చేసుకోవాలి. నాన్నకు వున్నదల్లా ఆ యిల్లు ఒక్కటే ఆధారం. పెళ్ళి అనగానే యిల్లు అమ్మేస్తాను అంటాడు. చెట్టుకిందకు వాళ్ళని కాపురానికి పంపి, తను బంగళాలో రాజభోగానికి వెడుతుందా? అలసిన మనసుని నిద్రపుచ్చాలని ప్రయత్నిస్తుండగా, వెంకట నారాయణ వచ్చి బండి ఎల్లుండిదాకా దొరుకుతుందని చెప్పాడు. అదీ బాగానే వుందనుకుంది పద్మిని.

–దక్కని సిల్కుచీర కట్టుకుని పొద్దున్నే ఏడుగంటలకల్లా బయలుదేరింది. బస్సులో ప్రయాణం ఒక గంట. తొమ్మిది కాకుండానే, సుకుమార్ గారి బంగళా చేరుకుంది. తీరా ఆ గేటు, తోట, యిల్లు చూసేసరికి తను చేస్తున్నపని సరైనదేనా అని ఒక చిన్న భయం. గేటు దగ్గర వున్న మనిషి ఏం కావాలన్నట్టు నిర్లక్ష్యంగా చూశాడు. నా సంగతి నీకు మరో నాలుగు రోజుల్లో తెలుస్తుందిలే అనుకుంది లోపల. ముందు వరండాలోని కేను కుర్చీలో కూర్చోబెట్టి చీటీ రాయించుకున్నాడు. లోపల నుంచి ఒక ఆడమనిషి వచ్చి తొంగి చూసింది. ఐదు నిమిషాలు, పది నిమిషాలు, పావుగంట దాటిపోతోంది. లోపల ఎక్కడో పిల్లల ఏడుపులు... కాసేపటికి ఆఫీసు తలుపు తెరుచుకుంది. గుండె గబగబా కొట్టుకుంటుండగా పద్మిని గదిలో అడుగు పెట్టింది. పగలు కూడా లైటు వెలుగుతోంది. ఆ వెలుగులో ఆయన!

''హలో! ఏమిటి యిలా వచ్చేశారు? రండి రండి కూర్చోండి'' అన్నాడు. నమస్కారం పెట్టి, కుర్చీ చివరగా సంకోచంగా కూర్చుంది. ఎంత తెలివి తక్కువ పని యిది, యిలా రావడం. అంతటి అధికారి, పెద్దమనిషి దగ్గర తను ఎలా మాట్లాడుతుంది?

''చెప్పండి, మీ నిర్ణయమేమిటో నాకు చెప్పనేలేదు'' అన్నాడు చిరునవ్వుతో. ఆ నవ్వు చూస్తుంటే పద్మిని నరనరాల్లో విద్యుత్. ఆమె తల మరింత వంచేసుకుంది.

''మీవాళ్ళెవరో వచ్చి వెళ్ళారట! అంటే మీ నాన్నగారు అయి వుండాలి. నాకు అప్పుడు కబురేమీ అందలేదు. మీరు యింటికి వెళ్ళలేదా?'' అన్నాడు మళ్ళీ. చేతిలో పెన్ను మూసి టేబుల్ మీద పడేశాడు.

''ఏమయింది అలా డల్‌గా వున్నారు? నేను చెప్పిన విషయంలో యింకా ఆలోచన పూర్తికాలేదా? లేకపోతే బ్లాకులో మళ్ళీ ఏదైనా ట్రబుల్ వుండి వచ్చేశారా?'' అని మళ్ళీ ప్రశ్న

ఓసీ మూర్ఖశిఖామణీ! ఏదో ఒకటి వాగు అని తనను తాను తిట్టుకోవడం పద్మిని. ఇలా జవాబులు యివ్వలేని ప్రశ్నలు వేయకుండా, మర్యాదలు మళ్ళిపోయి, సంస్కారవర్తనం పక్కకు నెట్టి, 'పద్మా, పద్మా, పద్మాలు' అంటూ తనను దగ్గరకు తీసుకుంటే అన్ని జవాబులూ అందులోంచే పుట్టుకొస్తాయి. అంత పెద్ద గది, అధికార హోదా యిద్దరి మధ్యలో. చిత్తు కాగితాలూ, బుద్ధిలేని మొద్దు చెక్కబల్లా.

ఎంతకీ జవాబు చెప్పని ఆమె లక్షణం చూసి, చిన్నగా నవ్వి "ఓకే మీరు ఏం జవాబు చెప్పాలో తెలియక తికమక పడుతున్నారు. లోపలికి రండి పిల్లలను చూద్దురుగాని" అంటూ లేచాడు. ఊపిరి బిగబట్టి, ఆమె కూడా లేచింది.

అతనివెంట లోపలికి నడుస్తుంటే, కాళ్ళకింద గరుకైన నార తివాచీ. డైనింగ్ టేబుల్ మీద కూర్చుని ఒక పాప, కుర్చీలో ఒకబ్బాయి, టేబుల్ మీద ఒలికిన పాలు. తల్లి-తండ్రి యిద్దరి అందం, సౌకుమార్యం పుణికి పుచ్చుకున్న బాలదేవతలు. ముఖాలు కడిగి, తలలు దువ్వి ముస్తాబుచేస్తే, మెరిసిపోయే మాణిక్యాలు. వంటావిడ కాబోలు వాళ్ళకి పాలు అరబోసి యివ్వాలని ప్రయత్నిస్తోంది. యాపిల్ పండు ముక్కలు చేత్తో నొక్కేసి, హింస పెట్టేస్తున్నాడు అబ్బాయి.

"ఆంటీకి నమస్తే చెప్పా" అన్నాడు సుకుమార్. ఎవరీ మనిషి, అన్నట్టు చూశారు పిల్లలు. కానీ పాప 'అమ్మా' అన్న ఏడుపు కంటిన్యూ చేసింది. సినిమాల్లోలాగా వెళ్ళి, ఆ పాపను ఎత్తుకుని, ముద్దాడి, ఓదార్చాలని పద్మినికి. కొంగు దోపుకుని పిల్లల్ని ఒక దారికి తెచ్చి, వంటావిడని నీ పని నువ్వు చూసుకో లోపల అని పంపేసి, చూపులో వలపు నింపి, 'నేను మీకు వర్తిస్తాను' అనాలని. కానీ అడుగు ముందుకు పడదుకదా. సినిమాలోలాగా తను ఎందుకు వుండలేక పోతున్నదో అర్థంకాక "పిల్లలు యిప్పుడే లేచినట్లున్నారు" అన్నది.

"కూర్చోండి, వాళ్ళిష్టమొచ్చినప్పుడు లేస్తారు. ఇష్టమైంది తింటారు. విన్నీ, యీవిడ పద్మిని అని మా ఆఫీసులో పనిచేస్తారు. టిఫిన్ తయారైతే అందరికీ పంపించు" అన్నాడతను కుర్చీ జరుపుకుని కూర్చుంటూ. మరో కుర్చీ లాగి "కూర్చోండి, అంత మొహమాట పడుతున్నారేమిటి?" అన్నాడు. మళ్ళీ నవ్వు. పాప తలమీద చెయ్యివేసి తనవేపుకు తిప్పుకో బోయింది పద్మిని. 'అమ్మా' అంటూ అది మరింత ఏడుపు.

తనని 'అమ్మా' అనే పిలుస్తుందా? అబ్బాయి లేచి తండ్రి దగ్గరకు చేరాడు. "నువ్వు యివ్వాళ వూరెళ్ళద్దు" అన్నది పాప గారాంగా.

"తీసుకోండి" అని ప్లేటు ముందుకు తోసి సుకుమార్ పాపని వళ్ళోకి తీసుకున్నాడు. పద్మిని చేతులు కడుక్కుందామని వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్ళింది. వద్దన్నా తన ముఖం అద్దంలో కనబడినప్పుడు చెవులు ఎవరో గిల్లినట్టు ఎర్రగా కందిపోయి వుండడం చూసి, కంగారు పడింది. కంగారెందుకు? - అదంతే అన్నట్టు బుగ్గలు కెంపుల్లా వున్నాయి.



"చెప్పండి మరి, మీరు నిర్ణయం తీసుకున్నారా యీ విషయంలో?" అన్నాడు సూటిగా చూస్తూ.

ఆమె తల బాగా వంచేసుకుంది.

"నాకిష్టమేనని చెబుదామని వచ్చానుసార్!" అన్నది.

"మీ నాన్నగారు వచ్చి, వెళ్ళిపోయారట. ఇంటివరకూ వచ్చినా నాకు కనబడలేదు. మళ్ళీ ఎప్పుడొస్తారు?" అతను తిరిగి అదే ప్రసక్తి తెస్తుంటే మనం మైనారిటీ తీరిన మనుషులంగదా, మా నాన్న ఎందుకు? అని సందేహం ఆమెకు.

"వస్తుంటారొచ్చు, మీరు లేరుటగదా ఆయన వచ్చినప్పుడు? అయినా నిర్ణయం నాదైనప్పుడు ఆయన ప్రమేయం ఏముందింక?" అన్నది.

"అంటే వాళ్ళకు యిష్టం లేదా?" సూటి ప్రశ్న.

పద్మిని కొంచెం ధైర్యం పుంజుకున్నది. "వాళ్ళ యిష్టాయిష్టాలతో సంబంధం ఎందుకుండాలి సార్" అని చెప్పబోతుంటే...

"ఈ విషయం మాట్లాడేటప్పుడైనా కనీసం ఆ 'సార్' తీసేయండి, యిబ్బందిగా వుంది" అన్నాడతను.

'మీరు కూడా అండి అనడం మానేయండి, మరీ బాధగా వుంది' అని అనాలని ఆమెలో కోరిక - అది కోరికే.

"వాళ్ళ మాట లేకుండా నేను నా యిష్టం చెప్పకూడదా? దానికేమీ విలువలేదా?" అన్నదామె కళ్ళెత్తి అతని వంక చూస్తూ.

అతడు కొంచెం ఆగి, "ఐసీ... మీ నాన్నగారికి ఎంచేత యిష్టంలేదని అంటున్నారు. మా యింటివరకూ రెండుసార్లు వచ్చివెళ్ళిన ఆయన మరోసారి వచ్చి, పెళ్ళి ఏర్పాటు చేస్తానన కూడదా? అలా ఆయన చెయ్యరని మీకనిపిస్తున్నదా, కారణమేమిటి?" అన్నాడు.

పద్మిని యీ ప్రశ్న వస్తుందని అనుకోలేదు. తెలివిగా తను ఒక ప్రేమికురాలిగా మేనేజ్ చేయగలనని అనుకుంది. అది కాదిది. ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూ లాగా పరిణమించింది. ఊళ్ళో వాకబులు, కులగోత్రాలు, సంప్రదాయం, ప్రవర్తనా నియమావళి మొదలైన లాంఛన ప్రాయమైన ముఖ్య విషయాలను గురించి మా పెద్దలు ఆలోచిస్తున్నారని ఎలా చెప్పడం, మహిళా న్యాయవాదితో తమరి స్నేహం మాట ఏమిటి, అది పుకారేనని చెప్పేస్తారా - అని అడగడానికి తనకి మాటలు రావడంలేదే.

"మైడియర్ పద్మా" అంటూ అతను ఆరంభించగానే, ఏదో చెప్పేస్తాడని ఆమె గుండె జల్లుమంది. "ఈ వ్యవహారం నువ్వు మేనేజ్ చేసేద్దామని వచ్చినట్లున్నావు. అలాంటప్పుడు నిష్కర్షగా మాట్లాడాలి. మనసులో సందేహాలు వుండకూడదు. రెండు పొరలు పెట్టుకొని వాటి

మధ్యలోంచి మాటలు రానివ్వకూడదు. ఏమంటావు?'' అన్నాడతను. ఆమె బెనని తలూపింది. కానీ తను విన్నవి, పెద్దలు అన్నవి, జనం అనుకునేవి చెప్పే వీలు, మాటలు దొరకడం లేదే.

''చూడు, నువ్వంటే యిష్టం కలిగింది. కానీ నన్ను, నా పరిసరాలను, నా వాళ్ళను మర్చిపోయేంత మైకం కాదది. అలాంటి పెర్రిప్రేమ, వ్యామోహం యీ వయస్సులో, నా యీ పరిస్థితిలో కలగవు. ఈ అత్యవసర పరిస్థితిలో నాకు కావలసింది ఒక ఆడమనిషి తోడు. నా బిడ్డలను చూసుకుని, యిల్లు చక్కదిద్ది, నాకు ఆఫీసులోకి యీ చికాకులు ప్రవేశించకుండా చూసే మనిషి కావాలి. నా జీవితంలో భాగంగా, నా బిడ్డలను పెంచే తల్లిగా నువ్వు స్థిరపడిన తరువాత నీలోని మంచి లక్షణాలు నన్ను ఆకట్టుకోవచ్చు. అప్పుడు నువ్వు నాకు దగ్గర దానివవుతావు'' అంటూ ఆగాడతను.

ఎప్పుడు? భవిష్యత్తులో, భార్య అనే ఉద్యోగంలో కన్ఫరమ్ అయినాక, దగ్గరదానివవుతాను. అంతవరకూ పొజిషన్ యిలాగే. ఈ భాషలో అర్థమవుతున్నది పద్మినికి.

''నేను ముసలివాడను కాదు, నువ్వు కురూపివి కావు. అందుచేత నీ పట్ల ఆకర్షణ, శారీరకంగా మనకు సంబంధం ఏర్పడుతాయి. అప్పుడైనా నాకు చెప్పవలసిందేగా. మీ పెద్దలు యీ పెళ్ళి జరిపించడానికి ఎందుకు సిద్ధంగా లేరో'' అన్నాడతను.

ఎంత స్పష్టత, ఎంత పదును, ఎంత జాగ్రత్తో తూకంగా పడే పదాలు. ఈ లక్షణాలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇన్ని మాటలు మాట్లాడకుండా, యిష్టంగా 'పద్మినీ' అని ఒక్కసారి పిలిచినా చాలు. తన సర్వస్వం అర్పించడానికి సిద్ధంగా వుందామె.

''వాళ్ళు తమకు యిష్టం లేదని అనలేదు సార్ - మావాళ్ళు చాలా పేదవాళ్ళు. పెద్దఎత్తున పెళ్ళి చేయలేమని జంకుతూ వుండవచ్చుకదా'' అన్నది మరోవిధంగా అతని ధోరణి మార్చాలని.

''కదా - అంటే నేనేమి చెబుతాను? నా అభిప్రాయం గ్రహించి కూడా గుర్తించనట్లు ప్రవర్తిస్తున్నావు. నో... నువ్వు నాతో నిజం చెప్పడంలేదు. వాళ్ళు నీ పెళ్ళి చేయము పొమ్మన్నారు. ఆ సంగతి నాతో సూటిగా చెప్పడానికి యిష్టపడటంలేదు. వాళ్ళు చేస్తారా సరే, లేదా...'' అర్ధోక్తిలో ఆగి, ఏం జరుగుతుందో నాకే తెలియదన్నట్లు, చేతులెగరేసి, పెదవి విరిచాడు.

'లేదా' మనం చేసేసుకుందాం. అని అతడు అనలేదు. తన మనసులో అనేసుకుంటే ఏం లాభం. కొంచెం నిటారుగా కూర్చుందామె. పిల్లల్ని అప్పటికే పిన్నిగారు బయటకు తీసుకెళ్ళింది. అతడు లేచి, ఆఫీసు రూము వేపుగా వెళ్ళసాగాడు. ఆమె అనుసరించింది. మళ్ళీ తన అధికార స్థానంలో కూర్చున్నాడు. బల్లకు అటువేపున్న కుర్చీలో సంకోచంగా యిదివరకులాగే కూర్చుంది. ''స్వతంత్రించి ఆడపిల్లలు పెళ్ళిచేసుకోవడం మీరు అంగీకరించరా సార్'' అన్నది.

* * *



అతడు వినలేదు ఈ మాట. విన్నాడేమో కానీ ఫైలుకట్ట ముందుకు లాక్కోవడం మానలేదు. ఫైల్లోంచి ఒక కాగితం తిరగేశాడు. దీపం వెలుగులో దివ్య మనోహరంగా వున్నది ఆ మూర్తి. వరాలు యివ్వడానికి అధికారం వుండి కూడా ఏ భక్తుడు ఎటువంటి వాడో తూకం వేసుకుంటున్న మూర్తి అది. పద్మిని మనస్సులో ఆశాతారక కిందికి దిగి రాలింది. ఒక రాగ తరంగం ఒడ్డుకు చేరకుండానే విరిగింది.

''నేను వస్తా'' అన్నది లేచి నిలబడి. అతను తలెత్తి, తన చిరునవ్వు వెలిగించుకుని, ''ఎట్లా వెడతావు - జీపులో దింపమంటావా?'' అన్నాడు.

'అమ్మగారిని దింపేసిరా' అని డ్రైవర్ని పిలిచి చెప్పడానికి కొన్ని అడుగుల దూరం వుందో లేదో, కొన్ని యుగాల వ్యవధి వుందో లేదో ఆమెకే అర్థంకాలేదు.

''వద్దండీ, నేను వెళ్ళిపోగలను. నమస్తే సార్'' అన్నది చేతులు జోడించి. బైటకు నడిచింది. అతను చివరికి చిరునవ్వు నవ్వాడు. తల పక్కకు వంచి, వెళ్ళమని అనుమతి యిచ్చాడు. అందులోని అర్థం ఎప్పటికైనా తనకు తెలుస్తుందా.

'ఉండు పద్మా, మీ పెద్దవాళ్ళ గొడవ ఎందుకు, మనం పెళ్ళి చేసేసుకుందాం' అని వెనక్కి పిలవడం లేదు. ఎందుకా తొందర వెళ్ళిపోవడానికి అనడంలేదు. ఈ పిల్లలతో వేగలేకుండా వున్నాను, ఎంత తొందరగా చార్జ్ తీసుకుంటావు అనడంలేదు. తనని నిజంగా వరించి, కోరి అడగలేదు. ఒక ట్రయల్ వేశాడు. అంతే అయ్యుండాలి. పద్మినికి ఏడుపు వచ్చేస్తోంది.

ఎండ చుర్రుమంటోంటే బయటకు వచ్చింది. జమానుల వంక, వరండాలో అయ్యగారి దర్శనానికి వచ్చి కూర్చున్న జనం వంకా చూడకుండా, తల వంచుకుని, ఆగని కన్నీరు తుడుచుకునే ప్రయత్నం చేయకుండా నడిచేస్తోంది.

ఎంత తెలివి తక్కువ మనిషి తను, తను ఆశించినదేమిటి, ఆలోచించినదేమిటి, కోరుకున్నదేమిటి, అతనితో అన్న ముక్కలేమిటి, నిజాయితీ ఎవరిలో లోపించింది? అతను తన భావం పసిగట్టినట్లే వుంటాడు. కానీ అంతర్యం గ్రహించనట్లుగా నిర్దయగా తుంచేస్తాడు. బోధపడనట్లు చక్కని సంభాషణ చెబుతాడు.

మీకెన్ని బలహీనతలున్నా, ఎన్ని బాధ్యతలున్నా, నాదంటూ ఏమీ లేకపోయినా, నా వాళ్ళెవరూ అండ నిలవకపోయినా మిమ్మల్ని పెళ్ళాడతాను. మీ పురుషత్వానికి, హోదాకి, అందానికి, సిరకి అంకితమైపోయి, కేవలం ఒక ఇల్లాలిగా, వివాహితగా స్త్రీత్వాన్ని సార్థకం చేసుకుంటున్నట్లు నిలబడ్డం నాకిష్టం - అని ఎలా చెప్పాలి? తను మూగది, అతను చెవిటివాడు.

* * *

బ్లాకుకి తిరిగివచ్చి, తలుపేసుకుని, ముసుగుపెట్టి పడుకుంది. నారాయణ వచ్చినా పలకలేదు. వంట లేదు. తిండి లేదు. గ్రామ సేవిక ఎవరో వచ్చి తలుపు కొడితే, తలనిండా

తువ్వాలు చుట్టుకుని బయటకు వచ్చి, ''నాకు ఒంట్లో బాగాలేదు, తల బద్దలైపోతోంది. రేపు మీరు క్యాంపుకి సామాను తీసుకుని డైరెక్ట్‌గా వచ్చేయండి'' అని చెప్పింది. ఎవరి ముఖమూ చూడాలనిపించడంలేదు. సుకుమార్ తనని దగా చేశాడు. అగౌరిల్లి, మాట తప్పాడు. ఉక్రోషం, దుఃఖం, నిరాశ, బతుకు ఎడారి ఎండలో పడేసినట్లు తాపం, ఆవేదన, కనుచూపు మేర అంతా శూన్యం.

మర్నాడు ఏ కళనున్నాడో గానీ బిడిఓ జీపు యిచ్చాడు క్యాంపు వెళ్ళడానికి. నాలుగు రోజులు కటిక పల్లెటూరిలో, దరికి ముడుచుకుపోతున్న గుడిసెల మధ్య గడిపేసింది. తిరిగి వస్తూనే, ఒక నెల కోసం మెడికల్ లీవ్ పడేసింది. ఊరెళ్ళి సర్టిఫికెట్ పంపిస్తానని మేనేజర్‌కు చెప్పింది. 'మేము విన్న శుభవార్త నిజమేగా, ముహూర్తం ఎప్పుడు?' అనే ప్రశ్నలు వేసిన వారికి పిచ్చి నవ్వుతో 'చెబుతానుగా?' అని జవాబిస్తూ, ఆఫీసులో వున్న కాస్సేపు గడిపింది.

ఇంటికి వెళ్ళగానే చేసిన పని, మెడికల్ సర్టిఫికెట్ తీసుకుని పంపించడం, రీజనల్ డైరెక్టర్ గారికి తనకు బ్లాకు ట్రాన్స్‌ఫర్ యిమ్మని ఒక దరఖాస్తు పెట్టుకోవడం.

పదిరోజులు గడిచాయి. అక్క పురిటి సమయంలో యింట్లో సాయం వుండామని వచ్చా నమ్మా అని సంజాయిషీ, తన యింట్లో తనే చెప్పుకునే పరిస్థితి. వరలక్ష్మి పురుడు సజావు గానే ఆస్పత్రిలో అయింది. తల్లీపిల్లా యింటికి వచ్చారు. పెరిగి యిద్దరు మగపిల్లలు, యిద్దరు ఆడపిల్లలు. ఆ సమయంలో పద్మిని వుండడం వల్ల జరిగిన గొప్ప మేలు, ఆపరేషన్ చేయిం చేయడం. బావగారి నిర్ణయానికి వదిలినా, నిరసప్రాణి వరలక్ష్మి తెలివికి వదిలినా అది జరిగేది కాదు. పిల్లకి నెల వెళ్ళకుండా తను యింటికి తిరిగి వెళ్ళింది వరలక్ష్మి

అంతకు ముందే పద్మిని మీద బ్లాకువాళ్ళు గిట్టక పంపిన ఫిర్యాదులు, యీమె ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్ రెండూ కలసి, చివరకు బదిలీ అయింది. మరో బ్లాకు, మరో కథ, మరోరకం యిక్కట్లు, డబ్బులు, అప్పులు, ఆఫీసులో అద్వాన్నులు, యింటి ఖర్చులకు పంపడం, నాన్నకి, అమ్మకి చిన్న సుస్తీలు, అంతులేని వలయం. ఆయనకు ట్యూషన్లు లేని రోజుల్లో మరీ యిబ్బంది. అయినా విసుగు పడదు పద్మిని. చీమని ఒక సీసాలో పడేస్తే, అక్కడక్కడే ఎంతో సందడిగా తిరుగుతుంటోంది. చిన్న చక్కెర పలుకులు పడేసినా చాలు. అదే ఆహారం, అదే సర్వస్వం, అదే లోకం. మనస్సున్న పద్మిని అంతే.



## 6

పొద్దుగూకి పోయింది. పక్షులు చెట్లకు చేరి గోలగోలగా అరుస్తున్నాయి. దీపం వేయాలన్న ధ్యాస లేకుండా, పద్మిని కూర్చుండిపోయింది యింట్లో. తలుపు దగ్గరగా వేయబడింది. పాలమ్మి వచ్చిందేమో లోపలికి వచ్చి గిన్నె తీసుకుంటుందిలే అని ఆమె కదలలేదు.

వరండాలో లైటు వెలిగింది. వెంటనే 'పద్మా' అనే పిలుపు వినబడింది. గంతేసి బయటకు వెళ్ళి నువ్వా అనాలని ఆత్రం లోపల. అయితే ఎందుకొచ్చాడు అని కంట్లో నలుసులాంటి సందేహం. పోనీ ఎదలోని సొద చెప్పుకునేందుకు యీరోజుకు ఒక తోడు అని పురెట. పద్మిని కదలబోతోంది-

''చీకటిగా వుంటే లేవేమో అనుకున్నాను. ఏమిటి తలుపేసుకోకుండా కూర్చున్నావు'' అన్నాడు రమణ, గదిలో స్విచ్ వెతుక్కుని లైటువేసి.

''రా బావా కూర్చో'' అన్నది తను మడత మంచం వేసుకుని, అతనికి కుర్చీ చూపిస్తూ. ఐదారేళ్ళయింది తను రమణబావని చూసి. మనిషికి చాయ వచ్చింది. కండ పట్టింది. ఖరీదైన బట్టలు తాజాగా కనిపిస్తున్నాయి. ఆమె వంక పరీక్షగా చూశాడు. రంగు తగ్గింది, మెరుపు తగ్గింది, అందం తగ్గింది. సామాన్యమైన చీర, శ్రద్ధలేకుండా వదిలిన జుట్టు, మాసిన కాటుక, కడగని ముఖంమీద చెరగబోతూ మిగిలిన కుంకుమ.

''ఏం పద్మా అలా వున్నావు, ఒంట్లో బావుండలేదా, జ్వరమొచ్చిందా?'' అన్నాడు.

దయగల యీ ప్రశ్నకి పద్మిని భోరుమని ఏడవవలసిందే. ఎందుకలా వున్నావని రమణ అడుగుతుంటే, నీకు తెలియదా జవాబు అని గొంతు చించి అరవాలనిపించదూ? నీ వల్లనే యిదంతా అనాలంటే, తన కుటుంబ పరిస్థితికి అతనెలా కారణమవుతాడు అని ఒక సహే తుకమైన సందేహం. నిరసంగా కుప్పగా కూలిపోవాలనుంది నిజానికి. కానీ కింద కటికనేల తప్ప మరో ఆధారం లేదు. అలాంటి ఆధారంగా బావే వుండివుంటే, ఎలా వుండేదో ఆ పరిస్థితి!

''బాగానే వున్నానే, యీవేళే క్యాంపు నుంచి వచ్చాను. కొంచెం హైరానా అయింది'' అన్నది. రమణ గదిని పరిశీలిస్తున్నాడు. చిన్న గది, చిన్న లైటు, సాదా సామాను, గూట్లో పొందికగా సర్దిన బట్టలు, పుస్తకాలు.

''ఎన్నాళ్ళనుండో రావాలని. కానీ కుదరలేదు. ఈవేళ ఫ్రెండు కారు యిటు వెడుతోంటే వచ్చేశాను. ఇంటిదగ్గర అక్కావాళ్ళు కులాసాయేనా?'' అన్నాడు కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ. ఆ సర్దుకోవడం మనస్సులో వున్న యిబ్బందిని కప్పిపుచ్చుకోవడానికి.

''బాగానే వున్నారు బావా, నేను యింటికి వెళ్ళి రెండు నెలలు దాటిపోయింది. ఇదివరకటి బ్లాకు అయితే దగ్గరగా వుండేది. ఇప్పుడు ప్రయాణం కాస్త ప్రయాస - మీ వాళ్ళంతా బావున్నారా'' అని ఎదురు కుశల ప్రశ్న వేసింది. మీవాళ్ళు మనవాళ్ళు కాదు - బావ భార్య, పిల్లలు, అత్తయ్య. అతనికి యిద్దరు పిల్లలు అన్నట్లు విన్నది. పోనీలే పాపం వికలాంగురాలైన ఒక పిల్ల జీవితానికి అర్థం కల్పించాడు అని అప్పట్లో సంతోషించింది. మామయ్య చాలా జబ్బుగా వుండగానే, గుళ్ళో పెళ్ళి జరిపించేశాడు యింగితజ్ఞానమున్న ఆ డాక్టరుగారు. విశ్వనాథం మామయ్య పోయినప్పుడు కూడా అమ్మ ఒక్కతే వెళ్ళి, చూసి వచ్చింది. ఇంకెవరూ వెళ్ళలేదు. యమ యాతన పడి పోయాడని చెప్పుకున్నారు. రమణ మామగారు ఆ డాక్టరుగారికి ఒక్కతే కూతురు కావడం వల్ల యితడిని తన దగ్గరే వుంచుకుని, అన్నివిధాలా ఆదుకున్నారు. ఇల్లరికం అని కాదుగానీ, నెలలో సగం రోజులు వారింట్లోనే అని వైదేహి మేనల్లుడి కాపురం గురించి వ్యాఖ్యానం చేసింది.

పద్మిని అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పకుండా రమణ జేబులోంచి ఒక కాగితం తీశాడు. ''నీకు బెజవాడలో విమలానంద బుక్ డిపో తెలుసా?'' అన్నాడు. తెలియదని అర్థంగా తలూపింది పద్మిని.

ఆ కాగితం వంక చూస్తూనే ''ఎన్నాళ్ళిలా వుంటావు?'' అన్నాడు. ఒంటరిగా, పెళ్ళి కాకుండా మోడైపోతూ, చెంపలు నెరిసిపోతుండగా, సంబంధాలు వెతికేవాళ్ళు లేని ఏకాకిస్థితి అని అతని ఉద్దేశ్యం. ఆ సంగతి, ఆ ప్రశ్న అర్థమయినాయి పద్మినికి. కానీ తానెందుకు గుర్తించినట్లు మాట్లాడాలి.

''ఎన్నాళ్ళేముంది, మరో వూరికి ట్రాన్స్‌ఫర్ అయ్యేదాకా వుండవలసిందేగా'' అని పద్మిని జవాబు.

రమణ నవ్వి, ''నీ మాటలు ఎప్పటికీ మారవు పద్మా'' అన్నాడు. బావ ఎందుకొచ్చాడో పద్మిని బుర్రకి తోచింది. ఆ బుక్‌డిపో అయనిప్పుడు పుస్తకాలు కొనిపెట్టడానికీ కాదు - తనకి పుస్తకాలు ఏంది యిమ్మని అడగడానికీ కాదు. తమ బ్లాకుకు కావలసిన పుస్తకాలు, స్టేషనరీ విమలానందా బుక్‌డిపో నుంచే తెచ్చుకుంటారు. ఎందుకంటే కమీషన్లు, బిల్లులు, సమయానుకూలంగా సప్లయిలు అతనికి బాగా తెలుసును.



తనకీ బావకీ మధ్య మాట్లాడే వ్యవహారం ఏముంది? అతడిని చూస్తే మనస్సు జివ్వుమని తెలియని అసూయ వస్తోందా? తనది దారిదాపులేని ఏటిలో ప్రయాణం. అతడు భద్రమైన పడవ ఎక్కి, ఒడ్డుకి చేరి కూర్చున్నాడు. ఎన్నిసార్లు, ఎన్నివిధాలా ఆలోచించినా సత్యం యిదే.

''పొద్దుట పాలలో కాఫీ కలపనా? లేకపోతే యీపూట పాలొచ్చేవరకూ ఆగుతావా?'' అన్నది.

''ఆ బుక్‌డిపో అతను చాలా మంచివాడు. గ్రాడ్యుయేట్. నాకు కాలేజినాడు ఫ్రెండ్'' అంటూ మళ్ళీ కాగితం పరిశీలన మొదలుపెట్టాడు.

పద్మినికి అతడొచ్చిన పని ఏమిటో తెలిసిపోయింది కనుక, ''గోత్రం, పుట్టిన తేది, పూర్తి చిరునామా రాసుకొచ్చావా ఆ కాగితంమీద'' అన్నది. ఉద్యోగరీత్యా కొంత, తనకి తారసపడే మనుషుల గడుసుతనం, లౌకబారు స్వభావాలు చూచి చూచి మరికొంత, అనుకున్నదివెంటనే అనేయడం అలవాటయింది.

రమణకి మళ్ళీ నవ్వొచ్చినా, చిన్న కోపం, ముసుగుపొరలా ఆ నవ్వుమీద పడింది.

''నువ్విలా మాట్లాడితే నేనేం చెప్పను? నామీద యింకా కోపంగానే వున్నావుకదూ!'' అన్నాడు. తన మనస్సు మీద తట్టి, పాత విషయాలు రేపుతున్నాడు. మనుషుల మధ్య కోపాలు, అనురాగాలు, అలకలు, అనునయింపులు అన్నీ పద్మిని మర్చిపోయి చాలా రోజులయింది. తనకి తెలిసిందల్లా నిరంతర జీవన పోరాటం. రూల్స్, పని, సేవ అంటూ ఆఫీసులో కొట్టుకొని పోవడం, పెరిగిపోతున్న యింటివారి అవసరాలను తీర్చడానికి తన ఖర్చులు తగ్గించుకుని వారికి డబ్బులు పంపడం. ఇటువంటి బతుకులో నీకో మనసుంది, అందులో నామీద కించిత్ కోపం వుంది అంటూ వచ్చిన, తనకిష్టమైన యీ పురుషుడికి ఏం జవాబివ్వాలి?

కాస్త సర్దుకుని కూర్చుంది పద్మిని. జారుముడి వేసుకున్న జుట్టు వూడిపోతున్నట్లు అనిపించి గట్టిగా బిగించి చుట్టుకున్నది. ''నాకు ఒకప్పుడు కోపం వచ్చిందని, ఆ కోపం యింకా అలాగే సాగుతున్నదని నీకెవరు చెప్పారు?'' అన్నది. రమణ కొంచెం దిగాలుగా ముఖం పెట్టాడు. అమె అంత చనువుగా తనతో వాదులాడడం ముచ్చటగానే వుంది. చిన్ననాటి తమ గిల్లికజ్జాలు గుర్తుకొచ్చాయి.

''నన్ను ఆటపట్టించకు పద్మా. సీరియస్‌గా మాట్లాడే సమయాలు కూడా వుంటాయిగా. అలా మాట్లాడటానికే నేను వచ్చానిప్పుడు. చెప్పు, నువ్వు నా యీ ఫ్రెండ్‌ని - అతడు నీకు నచ్చితేనే సుమా - పెళ్ళి చేసుకోవాలి. అన్నివిధాలా నీకు తగినవాడు. ఏర్పాట్లు నేను చూస్తాను. నిన్ను అడక్కుండా అత్తయ్యతో, మామయ్యతో అనడం బాగుండదని సరాసరి నీ దగ్గరికే వచ్చాను'' అన్నాడు.

తనకి పెళ్ళి కావాలని నాన్న, అమ్మ రోజులోని ముప్పొద్దులా అనుకుంటున్నా, గుమ్మందాటి పెళ్ళి ఎక్కడ వెతకాలో తెలియనివాళ్ళు. కరుణ పెద్దకళ్ళతో, జాలిగా, ప్రేమగా

చూస్తుందేగానీ, నోరువిప్పి ఏమీ చెప్పలేదు. తను కాదన్న పద్మినికి జీవితంలో అదో పెద్ద కొరత వుందని యింకా గుర్తుంచుకున్న రమణబావ ఎంత మంచివాడు. పోనీ అతను చెప్పినట్లు వినేస్తే సరిపోతుందేమో. కానీ, యిది మనస్సులో ముగిసిపోవడం కాదు, తలకాయతో ఆలోచించవలసిన సంగతి కూడా.

పద్మిని లేచి ''సరేలే, ఆ పాలతోనే కాఫీ కలిపేస్తాను'' అంటూ లోపలికి వెళ్ళింది. బావి దగ్గరున్న బక్కెట్‌లో నీరు కాళ్ళమీద దిమ్మరించుకుని, మరో రెండు చేదలు తోడి, ప్లాస్టిక్ బక్కెట్లో పోసింది. తన కాళ్ళమీద నుంచి జారిన నీళ్ళు పక్కనున్న మల్లెమొక్కకి పోయేలా, కాలితో మట్టి సరిచేసింది. ఆకులు దూసేసిన మల్లెమొగ్గ దిగుళ్ళు రాలబోతున్నాయి. నీళ్ళు పోయినా మంచిదే. బావ చెప్పిన యీ సంబంధం గొడవ తనని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కానీ గుండె దిగబట్టి, కర్తవ్యం ఏదో ఒకటి స్ఫురించాలిగదా అని తన లోపల వెతుక్కుంటోంది.

మళ్ళీ ముందు రూములోకి వచ్చి, ''కాళ్ళూ చేతులు కడుక్కో బావా, ముందు కాఫీ యిచ్చేస్తా. త్వరగా వంట చేసేస్తా, భోజనం చేద్దువుగాని'' అన్నది.

రమణ తన ఆలోచనలో తానున్నాడు. తండ్రి విషయంలో పూర్తి బాధ్యత తీసుకున్నాడు. తన భార్యాబిడ్డల విషయంలో ఏ లోటూ రానివ్వకుండా ఉద్యోగం చేస్తూ, మామగారు పెట్టే కొన్ని చిన్న వ్యాపారాలు కూడా నిర్వహిస్తూ, డబ్బు సంపాదిస్తున్నాడు. అత్తవారివేపు బంధువుల్లో మంచివాడని పేరు తెచ్చుకున్నాడు. పద్మినికి పెళ్ళి చేసేయాలి. అత్తయ్య కుటుంబానికి తను అన్యాయం చేశాడని వాళ్ళు అనే మాట అబద్ధం చేయాలని తాపత్రయ పడుతున్నాడు. కానీ, ఎందుకో మొండిగా వాదన సాగిస్తోంది పద్మ. ఎదురు దెబ్బలు తిని, తిని చేదుగా మారింది ఆమె మనస్సు అని సమాధాన పరచుకుంటున్నాడు.

ఆమె అడిగిన ప్రశ్న కొంత సేపటికి అర్థమైనట్లు వులికిపడ్డాడు.

ఆమెవంక తేరిపార చూశాడు. చిక్కినట్లున్నా నాజూకు వుట్టిపడుతోంది. వాడినట్లున్నా పొగడపూవులా అందంతో ఆకట్టుకుంటున్నది. ఉంగరాల చేత్తో, జుట్టు నున్న ఉంగరాలు సరి చేసుకుంటూ, ''భోజనానికి తొందరేముంది? నువ్విలా కుదురుగా కూచుని, ఒక్క పావుగంట మాట్లాడితే, నేను వెళ్లిపోతాను. నేను చెప్పిన పెళ్లికొడుకు విషయంలో ఒక్క అభ్యంతరం వుంది. అదేమిటంటే, అతని భార్య పోయి రెండేళ్లయింది. ఇదేమిటా, బావ యిల్లాంటి సంబంధం పట్టుకువచ్చాడు అనుకోకు. నీ మంచిని కోరుతున్నవాడిని, పరిస్థితులకు అనుగుణంగా మనం నడుచుకోవాలి'' అన్నాడు రమణ.

ఈ మాటలన్నీ అతను ఎంతో మనస్ఫూర్తిగా అంటున్నాడనడానికి నిదర్శనంగా, అతని కంఠంలో వణుకు, కళ్లల్లో నీటిపొర కనిపించాయి పద్మినికి.

''చూడు బావా! నాకు వంట అంటే అర్జెంటుగా చేయడం రాదు. రాకరాక వచ్చావు. ఎట్లాగో పొయ్యి, కుంపటి, స్టవ్ అన్నీ రాజేసి బాగా వండిపెట్టడానికి ప్రయత్నిస్తాను. సరే



ముందు కాఫీ యిచ్చి, ఆ తర్వాతే వంట చేస్తానులే'' అంటూ పద్మిని కాఫీ కలిపి, వేడి చేసి కాచి, అతనికిచ్చి, తనూ కాస్త తీసుకుంది.

''నేనీ కాఫీ తాగి వెళ్లిపోతాను. ఎంత పెంకిదానివి నువ్వు! అంతేకాదు, నామీద కక్ష సాధించడానికి నిశ్చయించుకున్నావు. జబ్బు చేసిన నాన్న పోనేపోయాడు. మిగిలినదల్లా నాకు ఉద్యోగం, మామగారి కూతురు, నా భార్య! మీరంతా శత్రువులై పోయారు. కట్నం కోసం ఆశపడి చేసుకోలేదు నేను ఆ పెళ్లి. నాన్నకి వైద్యం చేస్తానన్న డాక్టరు నాకు ఆ సమయంలో భగవంతుడిలా కనబడ్డాడు. నాకు ఉద్యోగం లేదు. దారిదీజాడ కనబడలేదు. నీకు ఉద్యోగం వుందికదా అని, నీమీద ఆధారపడి ఎన్నాళ్లు బతక వలసి వస్తుందో తెలియని రోజులు. అటువంటి స్థితిలో ఒక మంచి ఉద్యోగం కోసం కక్కుర్తిపడ్డాను. నాకు పెళ్లయి, పిల్లలున్నారు కనుక, 'నువ్వంటే ప్రాణమే' అనలేకుండా వున్నాను. అందుకనే నామీద నీకింత కోపం? ఆ కోపంతోనేనా అడవి పూళ్లన్నీ ట్రాన్స్‌ఫరు పేరుమీద చుట్టబెడుతున్నావు?'' అన్నాడు రమణ. ఆవేశం, ఆయాసం అతని మాటల్లో.

అతను ఖాళీ చేసిన గ్లాసును, తన కప్పు తీసుకుని, ''ఉండు, కుంపటి అంటించి నాలుగు దుంపలు ఉడకబెడతాను. నీకు వేపుడు ఇష్టంగా! తిరిగ్గా కూడో బావా, అన్నీ చెబుదువుగాని'' అని లోపలికి వెళ్లింది. అతను కూడా కుర్చీలోంచి లేచి, లోపలకు వెళ్లాడు. చిన్న వంటిల్లు, పెంకుటి వసారా, పక్కనే మరో చిన్న రూము.

కుంపట్లో కాగితం పెట్టి విసురుతూ, ''ఆ బక్కెట్లో నీళ్ల తోడివుంచాను. కాళ్లు, చేతులు కడుక్కో! ప్రాణం పోయిమనిపిస్తుంది. ఆ తాడు మీద టవలు పెట్టాను'' అన్నది.

అతను జరీపంచె దోపుకుని, లాల్చీ చేతులు పైకి మడిచి, దోసిట్లోకి నీళ్ళు తీసుకున్నాడు. ''ఆ మిగిలిన నీళ్ళు చెట్టుమీదకి పోసెయ్, పాపం పిచ్చిమొద్దు దిగులేస్తోంది'' అన్నది పద్మిని. ఆ మాటలోని ధ్వనికి పక్కకి తిరిగి చూశాడు రమణ. ఇంత తెలివి, యింత సున్నితత్వం తనకిలోకంలో మరొక మనిషి దగ్గర కనిపిస్తుందా, పద్మిని కూడా అతడిని పరిశీలనగా చూస్తోంది. మంచి ఉద్యోగం, హోదా, వుండడానికి గూడు, తిండికి లోటులేని సంపాదన మనిషికి ఎంత పుష్టినిస్తాయో బావని చూస్తే అర్థమవుతున్నది. బరువుగా ఊపిరి వదిలి, చూపు మరల్చుకుంది.

బంగాళ దుంపలు కడిగి నీరు పోసి గిన్నె కుంపటి మీద పెట్టింది. ఎసరు నీళ్ళు స్టౌ మీదకు ఎక్కించి, చేటలో బియ్యం పోసుకుని గబగబా చెరిగేసింది. లోపలికి వచ్చి, చేట ఒళ్ళో పెట్టుకుని మళ్ళీ మంచంమీద కూర్చుంది. జేబులోంచి దువ్వెన తీసి తల దువ్వుకుంటూ, గోడకున్న చిన్న అద్దంలో ముఖం చూసుకున్నాడు రమణ. ''ఆ పడక్కుర్చీ వాల్చుకో, కాస్త సౌకర్యంగా వుంటుంది'' అన్నది పద్మిని.

మట్టిబెడ్డలు ఏరి, కిటికీలోంచి బయటకు విసిరేస్తూ, మామూలుగా, ''నువ్వు చెప్పే ఆయనకి కరుణక్క, వయస్సు ఎక్కువవుతుందంటావా బావా'' అన్నది.

రమణ ముఖం జేవురించింది. ''అంత వేళాకోళంగా వుందా పద్మినీ, యింతసేపూ నన్ను కూర్చోబెట్టి మర్యాద చేసింది, యీ మాట అడగడానికా?'' అన్నాడు.

పద్మిని ఆశ్చర్యంగా చూసింది. ''వేళాకోళమేముంది, అతనికి రెండోపెళ్ళి, అక్కయ్య, మీ మగవారి భాషలో చెప్పాలంటే, అనాఘ్రాత పుష్పం. నాకంటే చక్కనిది. నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే ఆ యిల్లు గడవడం కష్టం. కాని అది వెడితే కొంత భారం తగ్గుతుంది. నేను యీ డిపార్టుమెంటులో పనిచేస్తూ దానికి నాలుగు అక్షరం ముక్కలు అంటించలేకపోయాను. ఏదారీ లేని అక్క, పెద్దదైపోయాక, ముసలిదై పోయాక ఎలా బతుకుతుంది. కరుణ అని పేరు పెట్టినందుకు అందరి కరుణ మీద ఆధారపడవలసి వస్తుంది'' అన్నది. ఎంతో శాంతంగా సబబు పుట్టిపడేటట్లు ఆమె చెబుతోంటే, అందుకు జవాబు ఏమీ తోచనట్లు అతడు తువ్వాలుతో అనవసరంగా ముఖం తుడుచుకుంటున్నాడు.

''నా మంచి కోరేవన్నావు కదా? అనడం కాదులే, నిజంగా నా మంచిని కోరేవాడివే. నేను ప్రాణంగా ప్రేమించే ఆ అనాథకు ఆశ్రయం కల్పిస్తే నాకు మంచి చేసినట్లే'' అన్నది మళ్ళీ.

నిండుగా, ఎర్రగా వున్న రమణ పెదవి పంటితో కొరుక్కోవడంచేత, మరింత ఎర్రబడింది. ''నీకు రెండోపెళ్ళి వాడిని చేసుకోవడం యిష్టంలేదని సూటిగా చెప్పరాదూ, అదే నీ జవాబను కుని వెళ్ళిపోతాను'' అన్నాడు.

పద్మిని నవ్వింది, బియ్యంలో రాళ్ళు తీయడం పూర్తయింది. ''ఇవి ఎసట్లో పోసి వస్తానేం?'' అన్నది.

తిరిగి వస్తూనే, ''ఏమిటంటావు బావా, నాకు రెండో పెళ్ళివాడిని చేసుకోవడం యిష్టంలేదా, యింత మరుపెలా వచ్చింది నీకు. రెండో పెళ్ళయినా, పిల్లలున్నా ఫరవాలేదని మా ఆఫీసర్ని చేసుకునేందుకు సిద్ధపడ్డానుగా? సిద్ధపడటమేమిటి, విశ్వప్రయత్నం చేశాను'' అన్నది.

ఇది మరో చిన్న దెబ్బ రమణకి. ''అవునులే, అదీ నేను పడగొట్టాననంటావు. కులగోత్రాలు మనకు సరితూగవని, కేరెక్టర్ లేనివాడని తెలిసింది కనుక చెప్పాను. అది దాచేసి మామయ్యను ముంచేంత దుష్టుడిని కాను. అయినా యిష్టమేనని నువ్వు చేసుకుందామని అనుకున్నావు కాబోలు, అది కుదరలేదేమో. నన్నేం చేయమంటావు, అదీ నా నేరమేనా?'' అన్నాడు కొంచెం తీవ్రంగానే.

పద్మినికి యీసారి నవ్వు రాలేదు. మనస్సు చివుక్కుమంది. ''తీరికగా వచ్చి నాతో పోట్లాట ఎందుకు పెట్టుకుంటున్నట్లు'' అన్నది. ఆమెకి ఆ గడచిపోయిన రోజులను తలచుకుని దుఃఖం ముంచుకొచ్చింది. తనెంత గొడవ పడింది? ఇంట్లో నచ్చి చెప్పలేక, తనమాట విని నిలబడి, కార్యం చక్కబరిచే దిక్కులేక ఎలా గిలగిలలాడింది? బయట ఆఫీసులో చూస్తే, అలవికాని సమస్యలు.

కళ్ళు గట్టిగా తుడిచేసుకుని, ''సుకుమార్‌ని చూస్తే, అతనితో మాట్లాడితే అతని ఆకర్షణలో పడకుండా వుండడం అసంభవం - నాబోటి ఆడవాళ్ళకి. ఏమైతేనేం, ఆ ముచ్చట గడచిపోయి



మూడేళ్ళు దాటినా, నువ్వు యింకా ఆవేశంగా ఏదో సంజాయిషీ యిస్తున్నావు. అదంతా తవ్వడం దేనికిప్పుడు?'' అన్నది.

ఆమెకు విసుగు వస్తోంది. మనస్సు లోపల చిరచిర మంటున్నది. సుకుమార్ జిల్లా కలెక్టరయినాడు. ఆ తరువాత ఢిల్లీలో వేరే ఉద్యోగం వచ్చి వెళ్ళిపోయాడని చెప్పారు. లసిపికట అడవిలో, పెళ్ళికాని ఆడదానిగా, అందరికీ అలుసుగా బతుకుతోంది.

''సరే అయితే వెళ్తాను. ఎప్పటికైనా నువ్వు బాగుండాలని కోరుకునే వాడిని, అది గుర్తుంచుకో'' అన్నాడు.

''అదేమిటి వెడతానంటావేం? ఇంత అన్నం, కూరనేనం చేసుకుంటాను. భోంచేసి వెళ్ళు'' అని - కొంచెం ఆగి ''వెళ్ళమంటున్నానని అనుకోకు, వుండిపో, తెల్లారి మొదటి బస్సుకి వెడుదువుగాని'' అన్నది.

''బిడిఓ సార్ రమ్మంటున్నారు మేడం'' అంటూ వచ్చాడు బ్లాకు ఆఫీసు నుండి ఒక అసిస్టెంట్. బ్లాకు వేరు, మనుషులు వేరు, వాతావరణం వేరు. కాని కథ ఒక్కటే. కొన్నిచోట్ల నల్లటి నలుపు పరిస్థితులు. మరికొన్నిచోట్ల ఆ నలుపులో కొన్ని మంచితనపు మెరుపులుంటాయి. ఇది అలాంటి చోటు.

''ఎందుకో కొంచెం కనుక్కుంటారా, ప్లీజ్? మా బంధువు ఒకాయన వచ్చారు, యిప్పుడే వంట చేస్తున్నాను. విషయం ఏమిటో కనుక్కుని చెప్పండి'' అన్నది తలుపు వరకూ వెళ్ళి.

''ఏం లేదు మేడమ్, స్పెషల్ ఆఫీసరుగారు కొత్తగా ఛార్జ్ తీసుకున్నారు కదా! ఆయనా మిసెస్ కలసి సోమవారం నాడు వస్తారట. మీరు ఏదైనా విజిట్ ఏర్పాటు చేస్తారని, అది మాట్లాడడానికి పిలిపించినట్లున్నారు. నేను చెప్తానులెండి. మీకు యింట్లో పనుంటే చూసుకోండి'' అంటూ, మాట్లాడుతున్నంతసేపూ రమణని సర్వ సమగ్రంగా చూసేశాడు.

ఈ బంధువు అందమైన పురుషుడనే సంగతి మరో గంటకో, పూటకో పసిపిల్ల, బాలాది సైతం గుర్తించేస్తారు. ఎన్ని శతాబ్దాలైనా మానవ స్వభావం మారదని మరొక్కసారి రుజువవుతుంది.

వంట పూర్తిచేసింది. రమణ చేతికి ఒక పేపరు, పత్రిక యిచ్చి చదువుకోమన్నది చిన్న టేబుల్ దగ్గర రెండు కుర్చీలు వేసి వడ్డించింది. బావ రాకతో మనసు దల్లగానూ వుంది. మిఠాయిని పొగొట్టుకున్నలాంటి వెలితిగానూ వుంది.

తనకి ఆర్థికంగా స్వేచ్ఛ వుంది. ఒకరి చేతికింద బతకవలసిన అవసరం లేదు. ఉద్యోగంలోనూ మంచి పేరుంది. ఒకటి రెండు ప్రమోషన్లు వచ్చే అవకాశమూ వుంది. దానిలోనే, తాత్కాలికంగా సాధించే చిన్నచిన్న విజయాలలోనే తను సంతోషం వెతుక్కోవాలి, సంతృప్తి పొందాలి. కాని యీ రమణ బావలాంటివాళ్ళు వచ్చి ఒక రాయి వేస్తారు. అశాంతి అలలుగా విస్తరించి పోతుంది.

''బావా మీ ఆవిడ అందంగా వుంటుందా? పిల్లలు నీ పోలికేనా?'' అన్నది. రమణ ఎదురు చూడని ప్రశ్న అది. ''చాలా మందిది. పెళ్ళి చేసుకుని నేను తనను ఉద్ధరించానను కుంటుంది. పిల్లలు నా పోలికే అంటారు. సరే, యింతకీ నీ నిర్ణయం చెప్పవా?'' అన్నారు రమణ.

''నీ పోలికంటే చక్కని పిల్లలే'' అన్నది. రమణ నవ్వారు. ''నువ్వు ఒప్పుకుంటే, మా ఆవిడ నీ పెళ్ళి దగ్గరుండి మరీ జరిపిస్తుంది'' అన్నారు.

''అదే కరుణ పెళ్ళి అయితే జరిపించదా?'' అన్నది. రమణ మాట్లాడకుండా అన్నం కలుపుకున్నారు.

పెరట్లో రెండు మంచాలు వేసి, పక్కలు పరిచింది. ''బావా, యింతాక మల్లెమొక్కకు నీళ్ళు దిమ్మరించమని అన్నాను గుర్తుందా? ఏటేటా దాని ఆకులు ముదిరిపోతూ వుంటాయి. నాలాంటిదాని ఆశలూ అంతే. ఆశలు ముదిరి, పండి, రాలిపోతుంటాయి. ఆ ముదురు ఆకులు గిల్లేస్తాం మనం. నీటో టివారు ఎవరో వచ్చి దయగా యిన్ని నీళ్ళు పోస్తే, కొత్త చిగుళ్ళు, కొత్త ఆశల వలే పుడతాయి. రెమ్మలు వేసి పూలు పూస్తాయి. బతికినన్నాళ్ళూ యిది జరుగుతూనే వుంటుంది. అందుకే నాకు ఆ మొక్కను చూస్తే జాలి. నీమీద నాకు కోపం లేదు. నీ గ్రంథు సంబంధం తప్పకుండా చూడు. నా ఫోటో యిస్తాను పట్టుకెళ్ళు. అంతా స్థిరమయ్యేవరకు మాత్రం నాన్నకు, అమ్మకీ చెప్పకు'' అన్నది.

మంచంమీద కూర్చున్న రమణ నిట్టూర్చారు. ''ఎంత బాగా వుంది పద్మినీ పోలిక. ఆ మొక్కలకీ, పువ్వులు విరబూసే సమయం వస్తుంది. అవునూ, ఒంటరిగా వున్నదానివి నన్నిలా రాత్రికి వుండిపొమ్మన్నావు - నీకు భయంలేదా?'' అన్నారు.

చిరునవ్వు కదిలించినట్లు నవ్వింది పద్మిని. ''భయంలేదా అంటున్నావా? ఆశవుందా అంటున్నావా?'' అన్నది. ఇంత కవ్వింపుకి తగిన జవాబు రమణ దగ్గర లేదు. తెల్లవారు ఝామున బస్సుకే తిరిగివెళ్ళారు రమణ, ఫోటోని పదిలంగా కవర్‌లో పెట్టి, లాల్చీ జేబులోకి తోసేసి.



## 7

బావ దగ్గర నుంచి గానీ, యింటి నుంచి గానీ ఒక నెల రోజులపాటు ఉత్తరాలు లేకపోవడం చూచి, ఆ విజయవాడ సంబంధం కుదరలేదని అర్థమయింది పద్మినికి. ఆ రాత్రి బావ వుండి వెళ్ళినందుకు, బ్లాకు ఆఫీసువాళ్ళు, పాలమనిషి, మహిళా మండలి మెంబర్లు, మేనేజర్‌గారి పెద్దకొడుకు మొదలైన వారంతా యథాశక్తి ఒకరి చెవులు ఒకరు కొరుక్కున్నారు. చిటుకులు కొన్ని పోగుచేసి మంట వేశారు. కొంచెం దుమ్ము-ధూళి కలిపారు. ఏటన్నింటికీ అతీతమై నప్పటికీ, లోపల నవ్వుగానే వుంది. కానీ ఎంత లోకువైన బతుకు అని చింతపడింది కూడా.

పెద్దక్క యిద్దరు పిల్లలతో సహా వచ్చి పది రోజులై పుట్టింట్లోనే వుందని పూరి మాస్టారు ఒకాయన చెప్పేసరికి పద్మిని తికమక పడింది. ఎందుకొచ్చిందో అమ్మ రాయలేదు, అక్క రాయలేదు. రెండ్రోజులు వరుసగా సెలవలొచ్చాయి. ఊరికి ప్రయాణమైంది. ఆఫీసు పనులు 'సదా మామూలే' అనే ధోరణిలోనే వున్నాయి.

ఇంట్లో పేదరికం తాండవిస్తోందనడానికి దాఖలాగా ఎన్నిచోట్లో కుట్టిన రెండు చిరుగుల చీరెలు పెరటిలోనే ఆరేసి వున్నాయి. అమ్మకి ఎన్నిసార్లో చెప్పింది - యిలాంటి బట్టలు ముందు వాకిట్లో వేయవద్దని. బ్యాగు ఒకచేత్తో పట్టుకుని, రెండో చేతిమీద ఆ చీరలు రెండూ వేసుకుని లోపలకు వెళ్ళింది. చెల్లాయి వచ్చిందని అక్కలిద్దరూ ఎదురొచ్చి పలుకరించలేదు.

వరలక్ష్మి గుమ్మం పక్కన చాపమీద కూర్చుని, బియ్యం ఏరుతోంది. చెల్లివంక చూసిందే గానీ పలుకరించడానికి ప్రయత్నించలేదు. ''ఎప్పుడొచ్చావక్కా? మాస్టారు చెప్పారు నువ్వు వచ్చి నట్టు. నాకెవరూ ఉత్తరమైనా రాయలేదు. ఏం జరిగిందా అని కంగారు పుట్టి పరుగెత్తు కొచ్చాను. పిల్లలేరి? ఇప్పుడు సెలవలా?'' అంటూ ప్రశ్నలతోనే వరలక్ష్మి దగ్గరగా వెళ్ళింది పద్మిని.

''ఏం లేదు, పూరికనే వచ్చాను. ఏం? నేను రాకూడదా?'' అన్నదామె ముఖం సైతం అంత చేసుకుంటూ.

ఓయమ్మో అనుకుని, ''అదేమిటే అక్కా, రావద్దు అనడానికి నేనెవరిని? హఠాత్తుగా వచ్చావంటే, అమ్మకుగానీ, నాన్నకుగానీ బావుండలేదా, లేకపోతే ఎవరికైనా ఏ ప్రమాదమైనా జరిగిందా అని రకరకాల ఆలోచనలు వచ్చాయి. అందుకే ఆదుర్దాగా అడిగాను. కోపం వద్దు వరాలూ!'' అన్నది.

కరుణ కూడా కనిపించలేదు, ఎటు వెళ్ళిందో ఏమో, అమ్మ మాత్రం బయట మాటలు విని వింటి వచ్చింది. ''వచ్చావా?'' అన్నది తనకోసమే ఎదురు చూస్తున్నట్లు.

పెద్దక్కని అలాగే వదిలేసి లోపలికి వెళ్ళింది పద్మిని. తను ఎప్పుడొచ్చినా ఏదో ఒక అవాంతరమే జరుగుతున్నట్లు అనిపిస్తున్నది.

''ఇందా, కాఫీతాగు, దాన్నేమీ అనబోకు అసలే ఏడుస్తోంది. పిల్లలిద్దరినీ గుళ్ళోకి తీసుకెళ్ళింది చిన్నక్క'' అన్నది కంఠం తగ్గించేసి అమ్మ.

''నేను దాన్నేమంటానమ్మా, ఏమయిందసలు?'' అని అడిగింది పద్మిని. ఆమె గుండె గుభేలుమంది - అమ్మవాలకం చూస్తోంటే. ఏమయింది? బావ ఉద్యోగం పోయిందా? ఏదైనా కేసులో యిరుక్కుని జైలుపాలయినాడా? మరీ అంత నాయకుడు కాకపోయినా, కొన్ని కార్మిక వర్గాలకు అతనంటే గురి వుంది. రెండుసార్లు రాజకీయ పార్టీలు అటూ - యిటూ ఫిరాయింపులు చేసినా, అధికారంలో వుండేవారికి అనుకూలంగా పలుకుతూ, తనని నమ్మినవారికి ఏవేవో పనులు చేసిపెడుతుంటాడు. మధ్యమధ్యలో హైదరాబాద్ వెళ్ళి, గవర్నమెంటులో కొన్ని వ్యవహారాలు సాధించుకుని వస్తాడు. నలుగురు పిల్లలకి తిండీ, బట్టా లోటులేకుండానే గడుస్తోంది. దొరికినప్పుడు వేల రూపాయలు పట్టుకుని వస్తాడు. కొన్నాళ్ళు ఏమీ వుండదు. కానీ వరలక్ష్మిపాపం గుట్టుగా సంసారం నడుపుకుంటూ వస్తోంది. పిల్లలు ఎక్కువమంది అన్నమాటే గానీ చిదిమి దీపం పెట్టుకునేంత చక్కనివాళ్ళు. వాళ్ళ చిన్నారి ముఖాలు చూసినప్పుడు 'పోనీలే నలుగురైతేనేం' అనుకుంటుండేది పద్మిని.

అమ్మ నుదుటిమీద చేత్తో కొట్టుకుని, ''పెద్దబావ అనకాపల్లిలో కాపురం పెట్టాడట. అంతా అక్కే. ఏమిటే ఆ చూపు? అర్థం కాలేదా? ఎవర్తో తగులుకుంది. ఐదేళ్ళనుంచి నడుస్తోంది భాగోతం. దానికిప్పుడు ఏకంగా యిల్లు అద్దెకు తీసుకుని కాపురమే పెట్టేశాడు. ఒక కొడుకు కూడా పుట్టాడట. ఫలానా ఆయన భార్యని అని చెప్పుకుని తిరుగుతోందట'' అన్నది అమ్మ కంఠంలో ధ్వని నొక్కేసుకుంటూ.

పద్మినికి కస్సున కోపం వచ్చేసింది. ''ఇదెందుకు వూరుకుంది? అక్కడే తిట్టేసి అంతు తేల్చవలసింది'' అన్నది.

''ఏమిటే అంతు తేల్చేది? అదెవతో గానీ మన పిల్ల వుసురు పోసుకుని చస్తుందిలే. ఆ పీడా విరగడయ్యేది ఎప్పుడో?'' అన్నది అమ్మ కళ్ళల్లో నీళ్ళు, కంఠం నిండా ఏడుపు. అయ్యయ్యో



యింత పెద్ద ముప్పు వచ్చిందా వరాలు కాపురానికి? ఆ పిచ్చిమొద్దుకి బావమీద గొప్ప ఆరాధనాభావం. ఎక్కడో పేపర్లో ఒక చిన్న మూల కార్మిక నాయకుడు 'రవిగారు' అని పడితే, దీని దాచుకుని పదిసార్లు చదువుకుని, యింటికి పట్టుకొచ్చి తనకి చూపించేది. అంత ప్రాణం పెట్టే పెళ్ళాం చేదైపోయిందా ఆ రవిగారికి?

''తనూ, పిల్లలు యిక్కడకు పారిపోయి వచ్చి కూర్చుంటే దక్కబడుతుందా కాపురం?'' అన్నది పద్మిని.

అప్పటికే గుమ్మం దగ్గరకు వచ్చి నిల్చుందేమో వరలక్ష్మి యీ మాట విన్నది. బియ్యం చేట కింద పడేసింది. కొంగు చుట్టూ తిప్పుకుని చీర కుచ్చిళ్ళలో చెక్కుకుంది. బాగా కోపం వచ్చిందని పద్మినికి వెంటనే అర్థమయింది. ''అది కాదక్కా, బావ ఎక్కడున్నాడో ఏమిటో...''

''ఆయన ఎక్కడుంటే నీకెందుకే? నువ్వు సంపాదన పరురాలివమ్మా, అందుకని ఎన్నేసి మాటలన్నా అందరూ పడుతూ వుంటారు. నేను అప్పుడే పోతానంటే వద్దని వుందారు యీ ముసలివాళ్ళిద్దరు. బావ నాకూ, నా పిల్లలకూ యింత అన్నం పెడతారులే. ఎవరిదగ్గరికీ పారిపోయి వచ్చి నెత్తిన ఎక్కే అవసరం మాకు లేదు'' అన్నది ఆమె ఆవేశంగా.

''అక్కా, నువ్వలా అంటావని నాకు తెలుసు. బావ నీకెంత ద్రోహం చేసినా వెనకేసుకునే వస్తావు. అమ్మ కూడా ఎవర్తో అదది ఆయనను బుట్టలో వేసుకుంది అంటుంది. అంతేగానీ, నలుగురు బిడ్డల తండ్రి, నీతో జీవితాంతం తోడుగా నిలుస్తానని ప్రమాణం చేసినవాడు, ఎందుకని వెళ్ళి మరొకరి బుట్టలో పడ్డాడని మీరు తిట్టరు. అసలు ఆలోచిస్తారా అని నా అనుమానం?'' అని ఆగింది.

అక్కవంక జాలిగా చూసింది. వంటలు చేసిచేసి, నీళ్ళు తోడితోడి మొటుబారిపోయాయి చేతులు. తమ ముగ్గురిలోకీ ఆమె చక్కనిది అంటారందరూ. సరిగా దువ్వుకోని జుట్టులోంచి, నాలుగు వెంట్రుకలు ముఖంమీద పడుతున్నాయి. పాతచీర అస్తవ్యస్తంగా కట్టుకుని, తన అందమంతా మరుగున పడేసుకుని, అనాథలా నిలబడిన అక్కని చూస్తే పద్మినికి గొంతులో మింగలేని దుఃఖం వచ్చింది. తను ఏం చెప్పినా బుర్రకి ఎక్కించుకునే స్థితిలో లేదసలు.

''ఇలా కూర్చో అక్కా. నా పక్కన కూర్చో. నాకంటే నిన్ను ప్రేమగా చూసేవాళ్ళు ఎవరైనా వున్నారా? నీమీద కక్షతో నేనెందుకు మాట్లాడతానే? పిచ్చిదానా, నువ్వు బిడ్డల తల్లివి అయిపోయావు కనుక నీమీద మోజు తీరిపోయింది. మరో పడుచుదనం కోసం వెతుక్కున్నాడు. తను స్టైలా పచ్చిసుగా వున్నాడుగా మరి. నీకు చదువురాదు, తనతో సమానంగా కాలుమీద కాలేసుకుని కూర్చుని, ఇంగ్లీషు పేపరు చదివే ఆడది కావాలి. వ్యామోహంలో పడి, కళ్ళు కప్పుకుని పోయి, ధర్మం తప్పి, వేరే కాపురం పెట్టినా ఆ సిగ్గుమాలిన తనాన్ని నువ్వు సమర్థించడానికి ప్రయత్నిస్తున్నావు. ఎందుకూ అని నేను ప్రశ్న వేస్తే నామీద విరుచుకు పడతావు. ఎందుకొచ్చిన పొరుపొలే యివి'' అన్నది పద్మిని.

వరలక్ష్మి అక్కడే కూలబడి ఏడుస్తోంది. ''అవే అను, నేను ముసలిదాన్ని. పోనీ నువ్వు వయసులో వున్న అందగత్తెవుగదా నీకు పెళ్ళి ఎందుకు కావడం లేదు?'' అన్నది ఆ దుఃఖం లోనే ఉక్రోషం నిండిన కంఠంతో.

ఎంత దెబ్బ కొట్టింది. ఎనిమిదేళ్ళుగా ఉద్యోగం చేస్తూ, తన ప్రతి పైసా తన కుటుంబం కోసం ఖర్చుపెడుతూ, తలకు మించిన పనైనా అక్కకి రెండు పురుళ్ళు కూడా జరిపించింది. అయినా తనని దెప్పి పొడవడానికి ఆమెకి అవసు కనబడింది. తను యింక డబ్బుమాట ఎత్తితే మరింత గొడవైపోతుంది. అది రాద్ధాంతం చేస్తుంది, నాన్నకు బ్లడ్‌ప్రెషర్ వచ్చేస్తుంది, అమ్మ ముందే శోకాలు పెడుతుంది. అందుకే తమాయించుకుంది. వచ్చిన సమస్యని చీల్చి పరిష్కరించాలి.

''నాకు పెళ్ళికాలేదని నేను ఏడవడం లేదక్కా. నేనెవరికీ భారం కాను. నా అన్నం నేను తింటున్నాను. చేతనైనంత కన్నవారికి పెట్టుకుంటున్నాను. అసలు నీ బతుకు ఎంత అన్యాయమైపోతున్నదో నువ్వు గ్రహించుకోలేకపోతున్నావు. తన సంపాదన పంచి యిస్తున్నాడు, తన ప్రేమ పంచి యిస్తున్నాడు, తన జీవితమే పంచి యిస్తున్నాడు - ఆ మహా గొప్ప సామ్యవాది! ఇంకా ఎందుకు వెనకేసుకొనివస్తావు? ఇంట్లో ఏమైనా డబ్బులిస్తున్నాడా, అదీ లేదా?'' అన్నది పద్మిని.

అమ్మ కలుగజేసుకుంది. పెద్దకూతురి దగ్గరగా కూర్చుని, వీపు నిమురుతూ ''ఏమ్మా చెప్పు, పద్మాలు రాలేదేమని పొద్దున్నుంచి నాలుగుసార్లు అడిగావు. తీరా అది వచ్చేసరికి కోపంతో మండిపడుతున్నావు. పాపం అది కూడా ఏదైనా ఆలోచన చెబుతుందిగా, మీ ఆయన నీ చేతికి డబ్బులిస్తున్నాడా అని అడుగుతోంది'' అని సర్ది చెప్పబోయింది వైదేహి.

ఈ విషయాలన్నీ చెల్లెలికి చెప్పడం యిష్టంలేదు వరలక్ష్మికి. కసురుకుంటూ ''నాకు తెలిసిందిలే ఆ ప్రశ్న. ఏదో ఒకటి యిస్తారు. ఏదో ఒకలాగా బతుకుతాం. పెళ్ళయి యింట్లోంచి అవతలికి పోయినదాన్ని నా గొడవలు అసలు మీకెందుకు? నేను నీదొక్క పైసా ముట్టుకోనులేవే, నా ఖర్మానికి నన్ను వదిలేయి. కన్నప్రాణం అమ్మ నా కోసం కొట్టుకుపోతుందని వుండి పోయాను. అప్పుడే వెళ్ళాల్సిన దాన్ని!'' అంటూ యింకొంచెం రాగాలు తీసింది వరలక్ష్మి

మనస్సు విప్పి నా బాధ యిది అని చెప్పుకోడానికి కూడా వరాలుకి ఆత్మాభిమానం అడ్డొస్తుంది. ఏం చేద్దామే అని కుటుంబం మీద వచ్చిపడిన సమస్యగా చర్చించడానికి కూడా చెల్లాయి వివేకం పనికిరాదు ఆమెకి. అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ, నాన్న దిగాలు పడి పోతూ, 'అయ్యో కూతురా, నీ బతుకేంకానే' అంటూ బావని వల్లోవేసుకున్నదాన్ని తిట్టిపోస్తూ కూర్చుంటే అన్నీ చక్కబడతాయని అనుకుంటున్నట్లుంది. ఈ పిల్లలేమిటి, వీళ్ళ భవిష్యత్తు ఏమిటి, రోజు గడిచేదెట్లా? తండ్రి వ్యవహారం వాళ్ళకు అర్థమైతే వాళ్ళు పెద్దయినాక ఎంత కుమిలిపోతారు. అనే ఆలోచనే కనబడ్డంలేదు. బాగా చీకటి పడ్డాక కరుణ వచ్చింది, పిల్ల



లిద్దరినీ తీసుకుని. పిల్లవాడికి ఆరేళ్ళు, పిల్లకి నాలుగేళ్ళు. మరి యిద్దరు పెద్దవాళ్ళను, ఏ కళనున్నదోగానీ, వాళ్ళ బామ్మగారు వుంచేసుకున్నదట, అక్కడ బడిలో చదువు కుంటున్నారట. ఇదంతా ఎప్పుడు జరిగిందో తమకి మాటమాత్రమైనా తెలియదు.

''పిన్నీ'' అంటూ పిల్లలిద్దరూ దగ్గరకు వచ్చారు. పద్మిని పక్కవీథిలోని దుకాణం వరకూ వాళ్ళను తీసుకెళ్ళి, బొమ్మలు కొనిపెట్టి, వాళ్ళిద్దరికీ యిచ్చి తినిపిస్తూ యింటికి వచ్చింది. వాళ్ళు అవి తింటూనే గుళ్ళో చూసిన విశేషాలు చిలకల్లా చెప్పడం మొదలెట్టారు. అమాయకంగా, జీవితమే ఒక పెద్ద క్రీడా విలాసంగా మాట్లాడే వాళ్ళని చూస్తే, పద్మిని మనస్సు కలుక్కు మంటున్నది. తమకి కనిపించిన చంద్రకాంతలు, పున్నాగపూలు లోకంలోకల్లా అపురూప పుష్పాలైనట్లు, గుళ్ళో గంట అందుకోవడమే మహా ఘనవిజయం అయినట్లు ముద్దుముద్దుగా చెప్పేస్తోన్న ఆ చిన్నారులను చూసి ఎంత పెద్ద జీవిత సమస్య యీ అక్కయ్యకి అని పద్మిని గుండె బరువెక్కిపోయింది.

అప్పటికింకేమీ మాట్లాడలేదు. తను ఎన్నిరోజులని సెలవుపెట్టి వుంటుంది? వరలక్ష్మి తిరిగివెళ్ళి తన కొంపలో తాను పడివున్నాగానీ ఎంగిలి మెతుకులు విదుపుతాడు బావ. అసలా పల్లెలోని ఆ చిన్న యింట్లో తీరిక దొరికాక తన పెళ్ళాం పిల్లల దగ్గరికి వచ్చిపోతుంటాడేమో! ఇది దెబ్బలాడుతుంది, ఏదో ఒకటి అంటుంది - దాంతో సంసారం వీధిన పడుతుంది. డబ్బు సమస్య ఒకటి, పరువు సమస్య యింకొటి.

''ఏమే కరుణా, ఆ పిచ్చిమొహం పెద్దక్కయ్య పిల్లల్ని ఎలా పెంచుతుందే?'' అన్నది బాధగా. కరుణ ఎందుకో నోరు విప్పలేదు. పిల్లలకి అన్నాలుపెట్టి తనూ తినేసి వెళ్ళి పడుకుంది. ఎందుకిలా వుంది చిన్నక్క అని పద్మిని మనస్సులో ఆలోచన కలిగింది. ''నువ్వెళ్ళి అన్నంతిను, మధ్యాహ్నం ఎప్పుడనగా తిన్నావో?'' అన్నది చెల్లెలితో. పెద్దక్క, సంగతులు చర్చించడానికి ఓపిక లేనట్టుంది.

తను అమ్మా నాన్నలతో కలసి కూర్చుని అన్నం తింటూ, అక్కని పక్కన కూర్చోబెట్టుకుంది పద్మిని. అందరి భోజనాలు అయినాక కరుణ పడుకున్న మంచం పక్కనే పడక్కుర్చీ వేసుకుని వాలిపోతూ, ''ఆలోచించినకొద్దీ కసి ఎక్కువవుతోంది. పదిహేనేళ్ళు కాపురం చేసినవాడు, ఎంగిలి మెతుకులు విదిలిస్తే అవి తిని వాళ్ళకిన్ని పెడుతుందా? అరటిపండు తొక్కలా కట్టుకున్న భార్యనే పారేశాడు. ఇంక అతగాడికి జీవితంలో విలువైనదంటూ ఏమున్నది? కొత్తగా దొరగా కనబడ్డ పండుమీద మనసుపోయి మొహం వాచినట్టు వెంటబడిపోయాడు. మానాభి మానాలు వదిలేసి కాపురం కూడా పెట్టాడు. సిగ్గులేని ఆ మనిషి మొహం చూడడానికి దీనికి సిగ్గులేదటే?'' అన్నది పద్మిని.

ఇన్నివిధాలుగా, ప్రత్యక్షంగా తమ ఎదుటలేని బావని పద్మిని దులిపేస్తోంటే కరుణ ఒక్క మాట కూడా కలపడం లేదు. ''ఏమిటే, ఏమీ పలకవు. మీరంతా ఏంచేద్దామని అను కుంటు

న్నారు. పెళ్ళి సంగతంతా కనుక్కుని, బావని దీపావళ్ళు పెట్టి కాపురం చక్కదిద్దాలా వద్దా ఎవరైనా, ఎన్నాళ్ళిలా సాగుతుంది? ఊరుకున్నకొద్దీ బెడిసికొడుతుందిగాని, కలిసిరాదుగా?'' అన్నది పద్మిని మళ్ళీ.

కరుణ యిటువక్కకి తిరిగింది. మనసులో ఎన్ని ఆలోచనలున్నా పైకి అనే స్వభావం లేదు. తన రాతకి తగ్గట్లుగానే అణగిమణిగి పడివుండాలి అనుకుంటోంది. చదువుకోవే అంటే నాకిప్పుడు చదువేమిటి అంటుంది. పదోక్లాసు పుస్తకాలు తెచ్చిపడేసి, ట్యూషన్ పెట్టిస్తే, బుర్రకి ఏమీ ఎక్కడంలేదని మానేసింది. ఆ టీచరు కూడా అమాటే అన్నది - 'ఇంగ్లీషు, లెక్కలు రావడం కష్టమంటి' అని. ఇప్పుడు చెల్లాయికి ఏం సలహా చెబుతుంది. ''నాకేం తెలుస్తాయి అవన్నీ? నేనేం చేయగలను? అమ్మకు వంటలో సాయం, యింట్లో నీళ్ళుతోడి పోసేందుకు సాయం. పెరట్లో నాలుగు కాయలు, పూలు పండించేందుకు సాయం. అంతే నాకు చేతనైన పనులు. పెద్ద విషయాలు నాకు తెలియవమ్మా, నువ్వే తెలుసుకో'' అన్నది. ముఖాన చెయ్యి అడ్డుపెట్టుకుని పడుకుంది. తనకింక విశ్రమిస్తున్నట్లు, ఏమీ చర్చించడానికి సిద్ధంగా లేనట్లు.

పద్మినికి కొంత ఆశ్చర్యం వేసింది. ఈమాత్రమైనా విసుగ్గా ఎన్నడూ మాట్లాడలేదు అక్క. ప్రతి సమస్యా తన సొంతమే అయినట్లు బాధపడిపోయి, ఆరాటపడే మనిషి ఎందుకిట్లా నిర్లిప్తంగా అయింది? ఎవరి బతుకు వాళ్ళది అని ఆమెకి అర్థమవుతోందా? ఇంతేగదా నా బతుకు అని ఏడుస్తూనో, బండబారిన రాయిని అనుకుంటూనో కాలం గడిపేస్తున్న కరుణ యితరుల సమస్యలంటే విసుగు పడడం వరకూ మారిందన్నమాట. కాని పద్మినికి యీరోజు ఆమెమీద కోపం వచ్చింది. ''నీకెందుకు తెలియదే, నా పెళ్ళి విషయంలో పెద్ద పెద్ద సలహా లిచ్చావు. తెలివితక్కువదానా? అన్నింటికీ నాకు ఆలోచన తెగాలికదా'' అన్నది. కరుణ ఏమీ జవాబివ్వలేదు. ''అసలు యింటికి అద్దె, పెద్దాలకు డబ్బులు, స్కూలు జీతాలు యిస్తున్నా డంటావా, ఆ మనిషి ఎవరో గాని ఉద్యోగం చేస్తోందా, పెద్దక్క ఏమేమి చెప్పింది?'' అన్నది మళ్ళీ పద్మిని.

''నాకేమీ తెలియదని చెప్పాను గదటే. అది ఏమీ మనకు చెప్పదని నీకు తెలుసుగా? ఏమైనా అడిగితే 'నన్ను పొమ్మంటున్నారు, ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను, కన్నతల్లికి, భూమికీ కూడా భారం తగ్గుతుంది' అని భోరుమని ఏడుస్తుంది. మనమేం చేస్తాం, యిదంతా నీ ఖర్మానికి నీ మెడకు చుట్టుకోవడానికే వచ్చిందే పద్మా!'' అన్నది కరుణ.

ఇంట్లో ఏ గొడవ వచ్చినా ఆరిందాలా నిలబడి పరిష్కారం చేయడం పద్మిని బాధ్యత. కిందపెట్టి, మీదపెట్టి డబ్బు ఏదో ఒకటి పట్టుకొస్తోంది. లోన్ కోసం దరఖాస్తులు, ప్రావిడెంట్ ఫండ్ మీద అప్పులు, ఫెస్టివల్ అడ్వాన్స్, క్యాంపుల్లో మిగిలిన అలవెన్సు డబ్బులు.

పెద్దలు పెద్దలుగా ఆలోచన చెప్పరు. పిన్నలు పిన్నలుగా తెగువ చూపించరు. ఎలా జీవితాలు నడిచేది? మొగుడు వదిలేసి పెద్దకూతురిని, ఆమె సంసారాన్ని సాకుతారా -



వైధవ్యంపాలైన రెండో కూతురు శేషజీవితానికి మార్గం చూపిస్తారా? వయసింకా ముదరకుండా మూడోదాని పెళ్ళికి అన్వేషణ కొనసాగిస్తారా - మధ్యతరగతిలో పుట్టి, ప్రయోజకుల మంటూ పెరిగి, పెత్తనంచేసి, యీనాడు అతి పేద స్థితికి దిగజారిన ఆ దంపతులు ఏం నిర్ణయాలు తీసుకోగలరు? నడుం వంగిన పరువు కోసం, లేని బలాన్ని వెన్నులోకి తెచ్చుకుని, నిలబడి చూస్తున్న నాన్న, ధీమాగా యిలా చేద్దామనడానికి సత్తా ఏది? అలాగే పడక్కుర్చీలో పడుకుని కళ్ళు మూతలు పడేవరకు గోడమీది దీపాన్ని, పురుగుల్నీ చూసింది పద్మిని.

మర్నాడు పొద్దున్నే యింట్లో పనులన్నీ పూర్తయి, అందరూ అన్నాలు తిన్నాక, పద్మిని వెళ్ళి, వరలక్ష్మిని గదిలోకి తీసుకువచ్చింది. ''రా, యిలా కూర్చో'' అని భుజంమీద చెయ్యివేసి, దగ్గరగా తీసుకుంది. ''అక్కా, నేను చెప్పినట్లు వింటావా?'' అంది. చెల్లెలు సీరియస్‌గా అడుగుతోందని పసిగట్టింది వరాలు. అలాగే అని తలూపింది. ''బావ ఎలాగయినా అమె రిందని, పిల్లల మొఖం చూసి, నువ్వు ధైర్యం తెచ్చుకోవాలి. వాళ్ళని చదివించి ప్రయోజకులను చేయాలి. పెద్దపిల్లకు మేనరికం వుంది, రెండవదానికి అయిన సంబంధం వుంది అని మీ అత్తామామ చెబితే పెళ్ళిమాట ఎత్తనివ్వకూడదు. వాళ్ళకి వీళ్ళకీ ముడి వేయించేస్తే, సమస్యలు తీరిపోతాయనుకోకు. పిళ్ళందరిని చదివించడమే నీ జీవిత ధ్యేయం, వీలుంటే నువ్వూ చదువుకోవాలి'' అంటుంటే, ''నాకు చదువేమిటి, ఏదో క్లాసు పుస్తకాలు అరంభించాలి'' అని అడ్డు చెప్పబోతున్న అక్క నోటిని చేతితో, మూసివేసింది పద్మిని.

''ఆ మాట వినపడకూడదు తెలిసిందా? చదవకపోతే కిరాణా దుకాణం పెట్టు, లేకపోతే కూరగాయలమ్ము, మిషన్ కుట్టు. ఏదో ఒకటి అది తరువాత ఆలోచిద్దాంగానీ ముందు నువ్వు, నీ పిల్లలు సామానులు సర్దుకుని ప్రయాణం కట్టండి. మీ అత్తగారి యింట్లో దింపు తాను నిన్ను. పిల్లల్ని ఏం చేసుకుంటారో మీ అబ్బాయిగారు కన్న సంతానం అని చెబుతాను. నిన్ను ఆదరించి వుండమంటారా సరే, లేకపోతే నాతో తీసుకుపోతాను. ఆ అబ్బాయి రాసలీలలేమిటో వాళ్ళు గ్రహించుకోవాలి. కోడలు, మనుమలు బజారుపాలు కావాలో, పరువుగా తమ యింట్లో వుండాలో వాళ్ళే చెప్పాలి. నువ్వే నిర్ణయానికి లొంగి రావాలి'' అన్నది. ''ఉన్నచోటే వుంటాను అంటేనేను ఒప్పుకోను. బావ నీ బాధ్యత పూర్తిగా తీసుకోడు. తిరుగుతూ వుంటాడు. నువ్విక్కడికి వచ్చి పదిరోజులు అయిందికదా, చంటి వాళ్ళతో ఎలా వుంటోంది అని వాకబు చేశాడా? ఒక కార్డుముక్కయినా రాశాడా? రోజువారీ ఖర్చుకు నీకు అవసరం వుంటుందని ఓ పది రూపాయలు పంపాడా? పెద్దవాళ్ళిద్దరూ తాత దగ్గర వున్నారుకదా వాళ్ళ జీతాలన్నా కడుతున్నాడా? వాళ్ళకు పెన్సిలు, రబ్బరు, చాక్లెట్ ఏమి కావాలన్నా ఆ తాతగారే యిస్తున్నారా?'' అన్నది.

వరలక్ష్మి యింక బింకం వదిలేసింది. పిల్లల్ని తలచుకుని కళ్ళలో నీళ్ళు పెట్టుకుంది. చెల్లి నిలదీసి అడుగుతోంటే, తను ఎంత నిరాధారపు పక్షి అయిందో తెలిసిపోతోంది.

''ఏమిస్తారే, ఆ ముసలాయన పింఛను డబ్బులు ఎంతని పాపం? ఆయనకున్న ఖర్చు లెక్కువ. పెద్ద కొడుకు కదా అని బావమీద యిష్టం ఎక్కువ. మా మరుదులిద్దరూ కొంచెం డబ్బు పంపిస్తారు. ఈ వయసులో వాళ్ళకి చిన్నపిల్లల్ని సాకడమంటే కష్టం కదుటే?'' అన్నది.

చిన్నగా ఏడ్చి, కళ్ళు తుడుచుకుంది. ''నేను అక్కడికి వెడితే, పిల్లలందరితో సహా వాళ్ళ నెత్తిన ఎక్కడానికి వచ్చానని గోలపెడతారే. పైగా బావకి కోపం వచ్చి పోట్లాట పెట్టుకుంటా రేమో?'' అన్నది.

పద్మినికి చిరాకొచ్చింది. ''చేసింది చాలక యింకా ఆయనకి కోపం ఎందుకే? ఏమని పెట్టుకుంటాడు పోట్లాట? నేను నా రెండో పెళ్ళాంతో వుంటాను, నువ్వు మాత్రం నోరు మూసుకుని పడుండు అంటాడు. అసలు మా అమ్మా-నాన్న దగ్గరికి పెద్ద పిల్లలని మాత్రం ఎందుకు పంపారు అని దెబ్బలాడటానా? భయమెందుకు? నిజమే, పోట్లాటవుతుంది. పెద్ద పోట్లాట. నాకు భయంలేదు. పెద్దపులులతో, ఎలుగుబంట్లతో, అడవి దున్నలతో నేస్తాలు కడుతున్నాను. కష్టాలతో ఆడుకుంటున్నాను. అందుచేత నాకు భయం లేదు. పద, లే, నడు, నా మాట విను. నేనున్నాను'' అంటూ అక్కని గట్టిగా వాటేసుకుంది. పద్మినికి దుఃఖం ముంచుకొచ్చింది. ఇద్దరూ శబ్దం పైకిరాకుండా ఏడ్చారు.

రెండు గంటలకి అక్కని, పిల్లల్ని వెంట పెట్టుకుని, జీవితాన్ని ఎదుర్కోవడానికి, జీవన సమస్యలు చీల్చి ఎండేయడానికి పెద్దల పెద్దరికంలోని నిజాయితీకి గీటురాళ్ళు వెదకడానికి ప్రయాణమయింది పద్మిని. పనిదీక్షలతో వెడుతున్న ఆడపడుచుకి పసుపు, కుంకం మినహా మరేమీ యివ్వలేనంటూ వైదేహి కన్నీళ్ళతోనే సాగనంపింది.

## 8

రెండు నెలల్లో వరలక్ష్మి సమస్య కొంతవరకు సర్దుకుందనే చెప్పాలి. ఆ 'మనిషి' ఉద్యోగస్తురాలు. మహారసికుడు బావ యిద్దరినీ ఆదరిస్తున్నట్లు, డబ్బులు యిచ్చినప్పుడు యిచ్చి, యివ్వనప్పుడు పలాయనం చిత్తగించి, పురుష పుంగవుణ్ణని విర్రవీగి పోతున్నాడు. రాజసమే లక్షణం రక్తంలోనే వుండబట్టి, పిల్లలు 'నాన్నగారు' అని పిలుచుకోవడానికి ఆయన వుంటే మంచిదని గౌరవిస్తున్నది వరలక్ష్మి అంతమాత్రానికే సంతోషిస్తోంది. తరతరాల సతీత్వం జీర్ణించుకుపోయి, అతగాడొస్తే 'ఏవండీ వంటయింది, భోంచేయండి' అని వినయంగా అన్నం పెడుతూనే వుంది.

ఆ రెండో మనిషిని పెళ్ళి చేసుకున్నట్లు దాఖలాలు వున్నాయి కనుక ఉద్యోగాలు వూడిపోయే ప్రమాదం వుందని, కోర్టుకెక్కితే వందలు, వేలు వదలడమే కాక, నెలనెలా వరలక్ష్మికి జీవనభృతి యివ్వవలసి వస్తుందని పద్మిని తన సహజ ధోరణిలో హెచ్చరించింది. పిల్లల జీవితాలు చింపిన విస్తళ్ళు కాకుండా ఏదో బడికిపోయి చదువుకుంటున్నారు. అనేకవేల మంది, లక్షల మంది భారతీయ లలనామణులులాగే, కట్టుకున్నవాడి కుటిల వేషాలను భరించి, 'సర్దుకుని'పోయి కాపురం చేసుకుంటోంది వరలక్ష్మి



పద్మినికి ఒక ట్రాన్స్‌ఫర్, ప్రమోషన్ వచ్చాయి. ఇంటికి కొంచెం ఎక్కువ డబ్బు పంపిస్తోంది. ఇలా వుండగా, ఒకనాడు యింటినుండి, వెంటనే రమ్మంటూ టెలిగ్రామ్. నిజానికి యిదేక అలవాటైపోయింది పద్మినికి. షాకయిపోవడం మానేసి, తాపీగా ఆలోచిస్తూ, పనులన్నీ పూర్తి చేసుకుని బయలుదేరింది. పెద్దక్క మళ్ళీ తిరిగొచ్చిందా, నాన్నకి సుస్తీయా, యిల్లు వేలం వేసేస్తున్నారా అప్పులవాళ్ళు, తనకి మళ్ళీ ఏదయినా 'పెళ్ళిచూపుల' గోలా? అని ఆలోచిస్తూనే యింటికి చేరేసరికి, అక్కడ బోలెడు నిశ్శబ్దం ఎదురయింది.

వెనకాల ఎక్కడో వంటింట్లో అమ్మ, నాన్న, చిన్నమామయ్య, కాఫీ గ్లాసులు, అమ్మ ముఖం నిండా శోకం. ''ఏమిటమ్మా, ఏం ముంచుకొచ్చింది? నేను ఉద్యోగం చేస్తున్నానన్న మాటేగానీ, ఎప్పుడూ భయమే, ఏం వార్తలు అందుతాయోనని'' అన్నది నేల మీద కూర్చుంటూ.

''ఏమిటి పద్మా, వస్తూనే ఆ తొందర?'' అన్నాడు మామయ్య తన మామూలు డైలాగు చెబుతూ.

పద్మినికి భగ్గుమని వచ్చింది ఆగ్రహం. ''ఏమీ తొందరలేదు మామయ్యా. కనుకే నన్ను రమ్మని టెలిగ్రామ్ యిచ్చారు. పనులు మానేసుకుని నువ్వు దిగావు. పిచ్చిమొహం వేసుకుని ఉరుకులు పరుగులుగా నేనొచ్చాను. ఇంక తొందరేముంది? కూర్చుంటాలే, నాకూ కాస్త కాఫీ పోయండి'' అన్నది.

గ్లాసు అందుకుని ''అక్కయ్య ఏది?'' అనగానే, అమ్మ కొంగు నోటికి అడ్డం పెట్టుకుని పెద్ద ఏడుపు ఆరంభించింది. చేతులోని గ్లాసు కిందపడిపోయినంత పనయింది పద్మినికి. ''ఏమిటమ్మా? నాన్నా ఏమయింది? అక్క ఏదంటే చెప్పరే?'' అంటూ పెద్దగా అరిచింది పద్మిని. అక్క చచ్చిపోయిందా ఏ నూతిలోనైనాపడి? పద్మినికి వణుకు, గాభరా.

''ఉందమ్మా, అది బతికే వుంది. కానీ మనందరికీ అది లేనట్టే లెక్క. చచ్చిందనే అనుకోవాలి'' అన్నది అమ్మ ఏడుస్తూనే.

చిన్నమామయ్య కూడా తన చెల్లెలి దుఃఖానికి కరిగిపోయి, కళ్ళొత్తుకున్నాడు. ''అది వెళ్ళిపోయిందే పద్మా!'' అన్నాడు. వెళ్ళిపోయిందా, ఎక్కడికి? దానికి అన్నంపెట్టే దిక్కెవరు? రిక్షా ఎక్కడానికైనా దానిదగ్గర డబ్బుల్లేవు. ఎక్కడికి పోతుంది?

''ఈ పుణ్యాన్ని కూడా మీ రమణబావే కట్టుకున్నాడు. భ్రష్టుడు. వాడు పుట్టిందే మన సంసారంలో చిచ్చుపెట్టడానికి'' అన్నది అమ్మ.

''రమణబావ మొన్న పొద్దున్న గుడిదగ్గరికి రమ్మని దాన్ని తీసుకుపోయాడమ్మా! విజయవాడ తీసుకెళ్ళి, ఎవడో పుస్తకాల షాపు వాడికిచ్చి పెళ్ళిచేస్తాడట. నాకు యీ ఉత్తరం ముక్క నాలుగు రోజులనాడే రాసిపడేసి, దీన్ని లేవదీసుకు పోయినాడు'' అన్నాడు మామయ్య

''రమణబావ పదిరోజులనాడు ఒకసారి వచ్చాడే! చూచిపోవడానికేమో అనుకున్నాను. నేను వంటింట్లో వుండగానో, నాన్న పిల్లలకు పాఠాలు చెబుతున్నప్పుడో దాంతో గుసగుస

లాడినట్టున్నాడు. పెధమొద్దు మాతో చెప్పిందా? ఈ అప్రాచ్యపు మాటలేమిటని ఆలోచించిందా? లోపల్లోపలే పన్నాగం వేసేసుకుంది. ఎటువంటి వంశం, నాన్నగారికి ఊళ్ళో ఎంత పేరు! మొగుడు చచ్చాక తను మళ్ళీ పెళ్ళికి సిద్ధపడటం ఏమిటి? బ్రహ్మరాసిన రాతల్ని తను మార్చేద్దామని అనుకున్నదన్నమాట'' అంటోంది వైదేహి.

బరువుగా ఊపిరి పీల్చి వదిలింది పద్మ. హృదయంలోనే ఏదో ఒకమూల తనకి పెళ్ళి తప్పిందని చిన్నగా కలుక్కుమంది. ఆ తరువాత, గుండెలోనే కొన్ని యోజనాల దూరంలో సన్నాయి మోగినట్టు సంగీతం. సంతోషం సెలయేరులా ప్రవహించిన ధ్వని. తను వేళాకోళానికి, ఎత్తిపొడుపుకీ అన్న మాటలోని సమంజసతను గుర్తించిన బావని ద్రాష్టుడు అంటుందే అమ్మ. శూన్యాకాశంలోకి ప్రయాణం ఆరంభించిన పాదు జీవితాన్ని వెలుగుదుక్కగా మార్చిన మనిషిని చిచ్చుపెట్టాడు అంటుందేమిటి?

''నువ్వు పెట్టే శోకాలు యిందుకేనా? తప్పేమిటమ్మా, అది పెళ్ళేగా చేసుకుంటున్నది. అందులో తప్పేమిటి నాన్నా?'' అన్నది నిజమైన సందేహంతో పద్మిని.

'అయ్యయ్యో, యీ పాపిష్టి ఆలోచనలు నీకెలా వచ్చుతున్నాయే? నీ చదువు నీకు బుద్ధి యివ్వలేదా?' అన్నట్టు చూస్తూ అమ్మ బాధపడిపోతోంది. భరించలేని దుఃఖాన్ని దిగమింగి శిల అయినట్టున్నారు నాన్న. మామయ్య సరేసరి, లోకం మొత్తం మునిగిపోయి, మనుషులు ప్రాణాల కోసం అల్లల్లాడుతుంటే, ఒడ్డున కూర్చుని ఆర్తనాదాలు చేస్తున్న భంగిమ!

''ఎప్పుడు పెళ్ళి?'' అన్నది పద్మిని నిలబడి. మళ్ళీ గుర్తొచ్చి, వంగి, ఆ కాస్త కాఫీ గొంతులో పోసుకుంది.

''వెడతావా ఏమిటే కొంపతీసి?'' అన్నాడు మామయ్య.

''అవును, చేతనైతే మీరూరంతి ఆక్షింతలేద్దురుగాని. లేకపోతే యిక్కడే వుండండిగానీ శోకాలు మానేయండి. అక్క దిక్కు లేని పక్షి కాదు. నేను వెడతాను దాని పెళ్ళికి. ఎక్కడో ఏ టైమో చూసి చెప్పు మామయ్యా!'' అన్నది పద్మిని. అప్పటికే ఆమె ముఖం చేతులు కడుక్కొని యింటి నుంచి పట్టుకెళ్ళదగిన వస్తువులు, బట్టలు ఏమేమి వున్నాయని గాలించేస్తోంది. డబ్బులు ఎలాగా అని ఆలోచిస్తోంది.

ఆమె అడిగింది ''నాన్నా, మీరు కన్నబిడ్డ కదా అది? శాపనార్థాలు పెట్టాలని మీకెలా అనిపిస్తోంది?'' ఈ ప్రశ్నకు జవాబు వస్తుందని ఆమె అనుకోలేదు. తలకాయలు పట్టుకొని కూర్చునే వున్నారు అమ్మా-నాన్న. అయినా తనకి ఎందుకు రాయలేదు బావ? సంతోషంగా అన్ని ఏర్పాట్లూ చేసేది కదా? తన ప్రమేయం లేకుండా యీ సత్కార్యం తను ఒక్కడినే చేసేయాలని అనుకున్నాడు. తనతో కలసి ప్లానువేసి చేస్తే అది మరీ కుట్రగా కనిపిస్తుంది అనుకున్నాడేమో. అన్నిటికన్నా ఆశ్చర్యం కరుణ ఒప్పుకుని, ఎవరితోనూ మాటచెప్పే అవసరం కూడా లేనట్టు, దూకేసి వెళ్ళిపోవడం. అంత ధైర్యం దానికి ఎలా వచ్చిందో? ఊహాకే అందడం లేదు. బావమీద దానికెంత నమ్మకం. ఎప్పుడు చెప్పాడో ఎలా చెప్పాడో?



''అసలు ముహూర్తం టైము తెలుసా? అడ్రసు రాశాడా బావ నీ ఉత్తరంలో?'' అంటూ ఆమె తొందరపడుతోందే, చిన్నమామయ్యలోనూ కాస్త చలనం కలిగింది. పర్సు వెతికి, జేబులోంచి రమణ రాసిన ఉత్తరం తీశాడు. కళ్ళజోడు పెట్టుకుని, వివరాలు మరోసారి చదివి, తనూ దొక్కా తొడుక్కున్నాడు.

అది చూసిన పద్మిని, ''మామయ్యా, నువ్వు రాకూడదూ వెడదాం. పాపం అది ఒక్కర్తీ ఎలా చేసుకుంటుంది పెళ్ళి?'' అన్నది పద్మిని మెల్లిగా. ఆమె కంఠంలో అభ్యర్థన, ఆపత్సమయంలో ఆదుకోమనే వేడుకోలు. 'సరే పదా' అన్నాడు మామయ్య.

ఒక చిన్న మంచుకొండ యీవిధంగా కరిగింది ఆ ఛాందసపు సంసారంలో. మూర్ఖత్వం, పాత ఆచారాల మంచు శిఖరమే విరిగిపడింది. అదింక సుజలమై, మనుషుల దప్పిని తీరుస్తుంది. వాళ్ళిద్దరూ ప్రయాణమై వెడుతోందే, యీ అవివేకపు పిల్లకు సాయం వీరు బయలుదేరారా అన్నట్టు చూసింది అమ్మ. జాతకం, నక్షత్రాలు, ముహూర్తాలు చూచి చూచి చేసిన వరలక్ష్మి పెళ్ళి పెటాకులుగా మారిన సత్యాన్ని తలచుకున్నాడు రఘురామయ్య. గ్రహబలాలు బేరీజువేసి, జరిపించిన కరుణ పెళ్ళి అల్లుణ్ణే మటుమాయం చేసింది. కుర్రమేళాలు, కుర్రచేష్టతనంలో చేసే యీ కరుణ రెండో పెళ్ళి సవ్యంగా ముగిసేనా? అని ఆ దంపతుల మనస్సుల్లో శంకలు, కానీ ఆపే ధైర్యం లేదు. ఆమోదించే ఔదార్యం అసలే లేదు.

* * *

మరో నాలుగైదేళ్ళు గడిచాయి. తానుకన్న ముగ్గురు కూతుళ్ళ జీవితాలూ మూడు తీరులుగా పరిణమించినందుకు తట్టుకోలేకపోయినాడు ఆ తండ్రి. ఒక్కరి కాపురమూ సలక్షణంగా తాను గర్వపడే రీతిలో లేదు. పద్మ సరేసరి. పెళ్లికాని ఆడపిల్లలా మిగిలిపోతున్నది. పెద్ద అల్లుడు భార్యని బాగానే చూసుకుంటున్నట్టు కనబడుతున్నా, 'ఎంగిలిపడటం' మానడంలేదు. ఏన దానికే ఎంతో అసహ్యంగా వున్న ఆ బలహీనతని వినన్నట్టుగా తోసేసినా, వాస్తవం మాత్రం అదే. ఏదో సంపాదిస్తున్నాడు. పిల్లలకింత పడేస్తున్నాడు. కీచులాటలతో, అనుమానం, అవమానాల మధ్య ఆమె జీవితం గడుస్తున్నది. కరుణను ఉదారంగా రెండో పెళ్లి చేసుకున్న అతను ఎంతో సౌమ్యుడు. వారికి ఇద్దరు పిల్లలు. ముగిసిపోయిందనుకొన్న ఆమె జీవితానికి, కొత్త ఆలంబన దొరికి, అనూహ్యమైన రీతిలో ఆమె గృహిణిగా స్థిరపడింది.

ఆలోచించి, ఆలోచించి మెదడు వేడెక్కిపోయింది ఆయనకు. పిల్లలు ముగ్గురిమీదా జాలితో నిండిన ఆ గుండె ఆవేశాలకు తట్టుకోలేక ఒకనాడు ఆగిపోయింది. అనాయాసంగా, చెప్పాపెట్టకుండా ఆయన కన్నుమూస్తే, వైదేహి నిర్ఘాంతపోయింది. దుఃఖించడానికి కూడా చేతకానంత అయోమయంలో పడిపోయింది. యాభై ఏళ్లకు పైగా కాపురం చేసిన తర్వాత అంత పెద్ద ప్రయాణానికి సిద్ధపడిపోతున్నట్టు తనతో చెప్పవద్దా అనుకుంది. ఇల్లు అమ్మి అప్పులు తీర్చి, మిగిలిన డబ్బు ఆమె పేర బ్యాంకిలో వేసి, పద్మిని భారమైన మనస్సుతో ఆ ఊరు

వదిలేసింది. పంతులుగారు ఎంతో పరువుతో బతికినా, చిన్నదానికి పెళ్లిచేసి బరువు దింపు కోలేకపోయాడని, ఊళ్లో తెలిసినవాళ్లు సానుభూతి మాటలన్నారు.

మూలవిరాట్టుగా ఆయన వుంటేనే ఆ ఊరికి తనురావడం, పోవడం, ఆయన లేకపోయిన తనకి ఏ ఊరు అయితేనేం? తనకి బదిలీ అయిన ఊరికల్లా అమ్మని తీసుకువెళ్లి పోతున్నది. అక్కలిద్దరికీ పుట్టిల్లు అమ్మ వున్న ఊరే. అయినా వరలక్ష్మి సంసారం పెద్దది కనుక యింక పండగలకి, సెలవులకి పుట్టింటిపైన ఆశ వదులుకొంది. ఏ పండుగకో అడ్వాన్సు తీసుకుని మంచి చీరెలు కొని అక్కలిద్దరికీ పంపిస్తుంటుంది పద్మిని. అమ్మకి అదే గొప్ప సంతోషం.

మరో రెండేళ్లు గడిచిపోయినాయి. పద్మినికి ప్రమోషన్ వచ్చింది. ఒకటేపని, టూర్లు. ఇంకా ఓపిక వుంది కనుక వైదేహి వంట చేసి కమ్మగా భోజనం పెడుతుంది. పద్మినికి ఒక్కొరోజు కాగితాలు ముందేసుకుని కూచుంటే స్నానం, తిండి ధ్యాస కూడా వుండదు. ''నేనున్నాను కనుక సరిపోయింది. లేకపోతే ఆ కాఫీ నీళ్ల మీద బతుకుతుంది'' అంటుంది వైదేహి. ''నువ్వుం డక ఎక్కడికి పోతావమ్మా? ఎప్పటికీ నాతోనే'' అంటూ తల్లిని గారాబం చేస్తుంది పద్మిని. ఆ మాట వినగానే గుండెలో కలుక్కుమంటుంది తల్లికి. ''చాలే! నేను ఎక్కడికి పోతాను? నువ్వు పెళ్లి చేసుకుని అత్తవారింటికి వెడితే, అక్కడికీ తప్పదు ఈ గుదిబండ'' అంటుంది వైదేహి.

పద్మిని ఆమెను ఓదార్చి సవరదీయలేక సతమతమౌతుంది. ''చూడమ్మా! నేనెన్నో మంచి పనులు చేస్తున్నాను. నా జిల్లాలో నాలుగు గ్రామాల్లో మగవారిచేత తాగుడు పూర్తిగా మానిపిం చాను. చాలా గ్రామాల్లో జనాభా మొత్తం అక్షరాలు నేర్చుకున్నారు. పిల్లలందరూ బడికి వెడు తున్నారు. కూలికి వెళ్లేవాళ్ల పిల్లలను చూసేందుకు బాల కేంద్రాలు ఏర్పాటు చేశాను. ఇవన్నీ మంచి రిపోర్టురాసి పంపిస్తున్నానమ్మా! నలుగురికీ సేవ చేయడంలో ఎంత సంతోషం వుంటుందో నమ్మా!'' అని ఎంతో వివరంగా చెబుతుంది.

అల్లాంటి కబుర్లు చెప్పిన ఒక రోజున వైదేహి ఎంతకీ సమాధానపడక, కళ్ల నిండుగా నీళ్లు పెట్టుకుని, ''ఎంత పనిచేసినా, ఎంత డబ్బు సంపాదించినా ఏం లాభమమ్మా - ఒక యింటి దానివైతే నీకు సంతోషం - నేను నిశ్చింతగా కళ్లుమూస్తాను'' అన్నది. ఈ మాటలు వినడం పద్మినికి ఎన్నోసారో! తీరా తాను ఆఫీసుకి బయలుదేరి వెళ్లిపోతూ వినుక్కుంటే, రోజంతా అదే ధ్యాసలో వుండి ఆమె బాధ పడుతుంది.

''చూడమ్మా! నాకు పెళ్లి గీత వున్నదనే జాతకం చూసిన ప్రతి ఒక్కరూ చెప్పారుకదా! ఇంకెందుకు, జరిగి తీరుతుంది'' అన్నది.

''ఎప్పుడమ్మా? నేను కాటికి వెళ్లిపోయాకనా?'' అన్నది వైదేహి. మూతి బిగించి జవాబివ్వకుండా వుండిపోయింది. ఆవేళ ఆఫీసులో చాలా ముఖ్యమైన మీటింగు వున్నది. ఢిల్లీ నుంచి ఒక అధికార బృందం వస్తోంది. ఇల్లాంటి సమయంలో తను మనస్సు పాడుచేసుకున్నా, అమ్మని చిన్నబుచ్చినా, పనంతా పాడైపోయినట్లు వుంటుంది. ''అమ్మా బాధపడకమ్మా! నాకు



నీ దీవెన వుంటే చాలు'' అన్నది. బ్యాగు పట్టుకుని జీపు ఎక్కింది. వెనకాల ఫైల్సు, నీళ్ల బాటిలు పట్టుకుని ప్యూన్ ఎక్కాడు.

ఆవేళ ఆఫీసు, ఇన్‌స్పెక్షను కోసం ముస్తాబయి కళకళలాడుతోంది. పూర్వంలాగా కాకుండా ఎర్రమట్టితో తీర్చినరోడ్డు, పక్కన తెల్లసున్నం పూసుకున్న అందమైన చెట్లకుండీలు, జండాకొక వేదిక, రాళ్లు, ఆధునికత ఉట్టిపడుతోంది. పద్మినిని నడి వయస్సు మనిషిగా, నిజాయితీ, సమర్థత నిరూపించుకొన్న ఆఫీసరుగా సాధారణంగా అందరూ గౌరవిస్తుంటారు. ఐనా లంచాలు మరిగిన ఆఫీసర్లు, వెకిలితనం నరాల్లో జీర్ణించుకుపోయిన మగవారు మాత్రం తమ బుద్ధి పోనివ్వకొక, ఏదో పొటుకు మాటలు అంటూ వుంటారు. అదృష్టవశాత్తు ప్రస్తుతం బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు మంచి మనసున్న మనిషి. సమర్థతను గుర్తించి ప్రోత్సహించే అధికారి. అందుకు గత రెండేళ్లుగా మహిళాభ్యుదయ కార్యక్రమాలు ముమ్మరంగా పద్మిని సాగిస్తున్నందుకు ఆయన ఎంతో అండగా నిలబడుతున్నారు. ప్రభుత్వం నుండి వచ్చిన నిధులను అప్పటికప్పుడే వివిధ పథకాల ద్వారా అవసరంలో వున్న ఆడవారికి అందేట్లు చూస్తు న్నారు. పద్మినికి ఎంతో ఉత్సాహంగా సంతోషంగా వుంటున్నది.

''రిపోర్టు టైపింగు అయిపోయిందా అమ్మా?'' అన్నాడు ఆయన పద్మిని రూములోకి రాగానే.

''చివరి పేజీ కొడుతున్నారు సార్! ఇప్పుడు వస్తున్న ఆఫీసరుగారి పేరు ఏమిటండీ?'' అన్నది.

''నీకు పంపానుగా ఉత్తరం?'' అన్నాడాయన.

''లేదండీ-ఫలానా తేదీన ఢిల్లీనించి ఎవరో వస్తారు. మన మహిళా స్కీములు ప్రత్యేకం చూస్తారు అన్నారుగానీ, నాకు ఆ రిఫరెన్సు చూపలేదండీ'' అనగానే ఆయన తన టేబిలు సొరుగులోంచి ఫైలు తీశాడు.

''ఇది ఒక బృందంగా వస్తోందమ్మా! ముఖ్యంగా ఇందులో...'' అంటూ పైకి చదువుతూ ''శ్రీ సుకుమార్, ఐ.ఏ.ఎస్. ఫ్రమ్ ప్యారిస్'' అన్నారు. పద్మిని గుండె ఆగిందో, తల గిర్రున తిరిగిందో తెలియదుకానీ, ఆమె చెవులు వినబడ్డం మానేశాయి. ఆ పేరు తనకి కరెంటు షాకులా తగులుతుందని, ఇన్నేళ్ల తరువాత తన గుండె లయ తప్పుతుందని ఊహించలేక పోతోంది.

''ఈయన మన ఆంధ్రాలో పనిచేసి, ఆ తర్వాత ఏకంగా న్యూయార్కు, ఆ తర్వాత ప్యారిస్ పెద్దపొజిషన్లో వెళ్లిపోయారటమ్మా! ఇప్పుడు మన బ్లాకులో జరిగేపని ఒకమోడలుగా తీసుకుని, ఆసియా దేశాలన్నింటికీ ఇది ఉదాహరణగా చెప్పాలని వుద్దేశ్యంట. నీకు మరో ప్రమోషన్ మాత్రం ఖాయం పద్మినీ! నువ్వు సిగ్గుపడకుండా, భయపడకుండా చక్కగా వివరించి వారిని ఆకట్టుకోవాలి'' అంటూ ఆయన ఏదో చెబుతున్నా ఆమె బుర్రకి ఎక్కడంలేదు.

ఈ రూములోంచి వెళ్ళిపోవాలా, ఆఫీసు విడిచి ఇంటికి పారిపోవాలా, సెలవు పెట్టి ఊరే విడిచి ఎక్కడికైనా పోవాలా అని కడుపులోంచి ఒక గాభరా. ''మంచిది సార్!'' అంటూ తేలిపోయే ఒక జవాబిచ్చి లేచివెళ్ళి పద్మిని తన రూములో కూచుంది. ఆ పేరు వినగానే ఒంట్లో ఆవిర్లు కమ్ముకుంటున్నాయి. కళ్ళల్లో నీరు తెరలుగా పరచుకుంటోంది. అరచేతుల్లో చెమట పట్టినట్లవుతోంది.

మరో పది నిముషాల్లో ట్రిపు పూర్తయి రిపోర్టు వచ్చేసింది. ఛ-ఏమిటీ వెర్రితనం, ఆ కాగితాలు చేతిలోకి తీసుకుంటుంటే అర్థంలేని ఆవేశం అని వివేకంగా ఒక ఆలోచన వచ్చింది. ఎప్పుడో ముగిసిపోయిన అధ్యాయం, ఇప్పుడు తన పని, పని ద్వారా సాఫల్యత - యివే వుండాలి. తనని కాదని వెళ్ళిపోయిన, తనకు కాకుండా పోయిన ఆ మనిషి పేరు వింటే తనకెందుకు అంత కలవరం? కొంతసేపటికి ఆమె గట్టి ప్రయత్నంమీద మనస్సు కూడదీసుకుని రిపోర్టు పేజీల మీద దృష్టి పెట్టింది.

ఆఫీసువాళ్ళు కొందరు వచ్చి 'బెస్ట్ ఆఫ్ లక్' అంటూ, తనకేదో ప్రమోషన్ తాంబూలంతో సహా సిద్ధంగా వున్నట్లు మంచిమాటలాడారు. మహిళా అసిస్టెంట్లు వచ్చి ఆమె నారింజరంగు జరీచీర, జుట్టు ముడి, ఆపైన అమరిన దొండు మల్లెపూవు, నాజూకైన నగలూ చూసి మెచ్చుకొన్నారు. ''ఎంతమందిలో వున్నా ఎంతో అందంగా వుంటారు మేడం!'' అంటూ మనసు పురివిప్పింది, చిన్న సంతోషం కలిగించారు.

మీటింగు సమయం వచ్చింది. అధికార బృందం మూడు కార్లలో వచ్చింది. మీటింగు హాలులోకి వస్తున్న ఆకారాలేవీ పద్మినికి సరిగా కనబడడంలేదు. గేటులోంచి, పరచిన ఎర్ర నార తివాచీ మీద నుంచి, మీటింగు హాలు పెద్ద తలుపులోంచి, కట్టిన తోరణాల కింద నుంచి లోపలికి వచ్చిన ఆ మూర్తిని చూస్తోంది. సుకుమార్ వచ్చి మధ్యన వున్న కుర్చీలో కూర్చున్నాక మిగిలినవారంతా కూర్చున్నారు. వినయంగా ఫైల్సు విప్పి ముందుంచుతున్నారు. ఫోటో ఆల్బమ్‌లు చూపిస్తున్నారు. పెద్ద టేబిలు మీద పరచిన తెల్లబట్టల మీద గ్రామాలలోని కుటీరాల నమూనాలు, స్త్రీలు చేసిన వస్తువులు అందంగా అమర్చివున్నాయి. ఎదుటి వరసలోనే, చివరి కుర్చీ దగ్గర నిలబడ్డ పద్మిని, చేతులలోని సత్తువ అంతా ఉపయోగించి కుర్చీని అదిమిపెడ్తోంది.

అతని అందం రెట్టింపు అయిందా, చెంపలు నెరిసినా, నీడే ప్రతిఫలిస్తున్నట్లున్న ఆకుపచ్చ ఛాయల గులాబీవనం - పద్మిని అర్జెంటుగా తనముందున్న కాగితాలు తిరగేయసాగింది. ''సార్, మా ప్రాజెక్టు ఆఫీసరు పద్మిని'' అని బి.డి.ఓ. చెబుతున్నారు. సుకుమార్ కొంత ఆశ్చర్యం, కొంత నవ్వుతో ''ఐ సీ హౌ'' అన్నారు. ఎల్లా అని ఎవరూ అడగలేదు. మీటింగులో వున్నంతసేపూ ఆమె ఊపిరి బిగపట్టుకునే, తను విధిగా చెప్పవలసినవన్నీ చెప్పింది. ఆయన తన కళ్ళలోకి చూశాడా, ఎల్లా బ్రతుకుతోంది అని ఆలోచించాడా అనేవి పసిగట్టడం కష్టం.

మధ్యాహ్నం ఒకటిన్నర వరకు ఈ మీటింగు అయింది. ప్రత్యక్షంగా రెండు మూడు బ్లాకుల్లో చేస్తున్న పనిని ఆ బృందం చూసి వచ్చింది. ''తలనొప్పిగా వుంది సార్!'' అంటూ



పద్మిని బాధగా ముఖంపెట్టి మెల్లిగా జారుకొంది. ఆమె లేకుండానే రెండు జీపులు, రెండు కార్లలో వాళ్ళంతా వెళ్ళారు. వారు తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రమైంది. అసలే చీకటి, అందునా చుట్టూ కొండలూ, అడవులు. నిశ్శబ్దంలో వినబడే బస్సు చప్పుళ్ళు. నిజంగానే తలనొప్పి వచ్చేసి, తలకి బట్టకట్టి పడుకుంది పద్మిని.

వాకిలి ముందు జీపు ఆగేసరికి ఆమెకి ముచ్చెమటలు పోశాయి.

''అమ్మా పద్మినీ!'' అంటూ బిడిఓ గారు లోపలకు వచ్చారు. కంగారు పడిపోయింది పద్మిని.

''మధ్యాహ్నం అల్లా అయిపోయావేమిటమ్మా! ఆయన నీ గురించి అడిగారు'' అనగానే ఏమడిగారు అని ఆమె మనస్సులో సందేహం మెదిలింది.

''ఇక్కడే సైటు హౌస్‌లో ఆయనగారు, మరో యిద్దరు, ఒక బ్యాచి వెళ్ళిపోయారు. మరి నీ స్కీములను గురించి మాట్లాడాలన్నారు. వస్తావా?'' అన్నాడాయన. ఇదివరకు ఆయనతో ఎంతో మాట్లాడాను. ఏమిటి ఫలితం అనుకుంది ఆమె.

''మీరు చెప్పేయండి సార్! మన స్కీములు మీకు తెలియనివి ఏమున్నాయి, నాకు చాలా తలనొప్పిగా వుంది'' అన్నది.

''అల్లాగంటే ఎల్లాగుతల్లీ! మన బ్లాకుకి పెద్దఎత్తున ఫారిన్ నుంచి డబ్బు వస్తుందన్నారు. అదంతా నీకు విడమర్చి చెప్పాలని ఆయనకు ఆత్రంగా ఉంది. ఒక మాత్ర వేసుకో. కాస్త కాఫీతాగి బయలుదేరమ్మా! ఇల్లు పక్కనేగా, నేను నడిచిపోతాను. జీపు వుంచుకో. నేను వారి భోజనాల ఏర్పాట్లు చూసివస్తాను. ఆయన త్వరగా భోజనం పూర్తిచేసుకొని విశ్రాంతి తీసుకుంటారేమో!'' అంటూ మాట దొరనివ్వకుండా, సిద్ధంగా జేబులో వేసుకొచ్చిన తలనొప్పి మాత్ర యిచ్చాడు.

బ్లాకులో ప్రోగ్రాములు ఎల్లాపోతే తనకెందుకు, డబ్బులు వస్తేనేం, రాకపోతేనేం అని గట్టిగా అనుకోలేకపోతోంది. తన జీవితం యింకా యీ కార్యక్రమాలతోనే ముడిపడివుంది. ఈ పని లేకపోతే తనింక ఏం చేస్తుంది? మాత్ర వేసుకొంది, కాఫీ తాగింది, మంచి చీర కట్టుకొంది. గుండెలో దిగులు, ఏదో బరువెక్కిపోతున్న ఆ బాధ తనది కానట్లు జీపులో గెస్టుహౌసుకి బయలుదేరింది.

సుకుమార్ పెద్ద హాలులో సోఫాలో కూర్చొని వున్నారు. అరగంటసేపు స్కీముని గురించి విశదంగా చెప్పారు. చుట్టూ మనుష్యులున్నా కూడా తనతో ఆయన ప్రత్యేకించి మాట్లాడుతున్న సంగతి అందరికీ తెలిసిపోయింది.

పథకాలను గురించిన చర్చ పూర్తికాగానే ''మీకు చెప్పారో లేదో ఆమె, మాకు దగ్గర బంధుత్వం వుంది. ఆమె కూడా యిక్కడే భోంచేస్తారు'' అన్నారు. అందరూ విస్తుపోయారో,

ఊపిరి వదలడం మర్చిపోయారో గానీ అనుకోకుండా ఆయన తిప్పిన ఈ మలుపుకి పద్మిని మాత్రం నిర్ఘాంతపోయింది. తిరుగులేని అస్త్రం అది.

''కూర్చోండి పద్మినీ! అమ్మ ఎలా వున్నారు?'' అంటూ ఆరంభించిన ఆ సంభాషణ విన్న ఉద్యోగులు ఒక్కొక్కరే బయటకు నడిచారు. తాము ఎవ్వరూ అక్కడ వుండడం ఆయనకు ఆమోదం కాదని తెలుసుకొని వెళ్ళిపోయారు.

చాలా ఏళ్ళ క్రితంలాగ బయట చీకట్లు ముదురెక్కుతోంటే, లోపల వెలుగు వాస్తవాలను స్పష్టంగా గోచరింప చేస్తోంది.

హఠాత్తుగా అతను ఆమె వున్న సోఫాలోకి మారిపోయి కూచుని ''క్షమించాలి, యిల్లా నిన్ను యిబ్బంది పెట్టేస్తున్నందుకు - నేను నీతో యీ మాటలు కొన్ని మాట్లాడకపోతే, ఎంతో నేరస్థుడిగా మిగిలిపోతాను'' అన్నాడు.

ఇన్నేళ్ళ తర్వాత ఆమె లోలోపల వణుకుతోంది. ''పద్మినీ నామీద యింకా ఎంతో కోపంగా వున్నట్టున్నావు. వేరే పెళ్ళి ఎందుకు చేసుకోలేదు?'' అన్నాడు.

''నేను వెడతాను సార్ యింక!'' అన్నది గొంతు పెగుల్చుకుని. ఎంతో జాలి నిండిన చూపుని ఆమెవైపు తిప్పి ''కక్షగా నీ బతుకు నువ్వు నాశనం చేసుకుంటున్నావు ఎందుకు? నన్ను ఒక మిత్రుడిగా అనుకుని చెప్పలేవా?'' అన్నాడు.

ఈ సంభాషణ తుంచేసి, పరుగు పరుగున గుమ్మంలోంచి బైటకు పోలేదు ఆమె. ఆయన అడిగేవాటికి జవాబులిచ్చి తీరవలసిందే. అతని అధికారం, దర్పం కంటె ఎక్కువగా ఒకనాడు మనస్సులు దగ్గరైన వ్యక్తిగా, అతనికి తన స్వవిషయాలు అడిగే హక్కున్నట్టు అనిపిస్తోంది. సుదీర్ఘమైన ఒక జవాబు చెప్పడానికి దుడుకుగా వూపిరి వదిలింది.

''నిజమే సార్! మీరు నాకు మంచి ఫ్రెండ్. కానీ నేను యిప్పుడు బాగా బతకడం లేదని ఎందుకు అనుకుంటున్నారు సార్! బాగానే సంపాదించుకుంటున్నాను. మా అమ్మని పువ్వుల్లో పెట్టి చూసుకుని తల్లి ఋణం తీర్చుకుంటున్నాను. మా అక్కయ్యలిద్దరికీ ఎంతో అండగా వుంటున్నాను. ఆఫీసరుగా మంచి పేరు తెచ్చుకుంటున్నాను. మీ దయవల్ల మరో ప్రమోషను వస్తే హైదరాబాదు వెళ్ళిపోతాను'' అన్నది.

సుకుమార్ ఎంతో పరిశీలనగా ఆమెను ఆపాదమస్తకం పరిశీలిస్తున్నాడు. పెద్దగా నిట్టూర్చాడు. ''నువ్వు నన్నింకా క్షమించలేదు. అప్పుడు నేను చేసింది పెద్ద పొరపాటే. వేరే ఒకచోట మాట యిచ్చినట్టి నిన్ను వదిలేశాను. ఐతే, నేను చేసిన ఆ పని, నిన్నింత అన్యాయం చేస్తుందనుకోలేదు'' అన్నాడు.

పద్మినికి యింకా యింకా ఈ ఆవేశంలోకి అంతంలేని ఆవేదనలోకి వెళ్ళడం ఎంతో యిబ్బందిగా వుంది.

''నేను వెడతాను సార్!'' అన్నది మెల్లిగా.



అకారణంగా అతను రెచ్చిపోయాడు. ''వెడతాను వెడతాను అంటావు. మనసులో మాట ఎవరితోనూ చెప్పుకోవాలని వుండదా? బతుకంటే ఈ ఉద్యోగం ఒక్కటేనా?'' అన్నాడు విసుగ్గా.

నామీద కోపగించుకునే అధికారం మీకున్నదా - అని ఎదురుప్రశ్న వేయాలనిపించడం లేదు. ఈ మిత్రుడు తన స్నేహహస్తం చాస్తున్నాడు. తాను మెలకువలో, కలలో ఎన్నోసార్లు స్పష్టంగా చూసుకున్న సన్నివేశం. పద్మిని శరీరమంతా ఆవిరి కమ్మినట్టైంది. మరుక్షణం నీరసంతో చప్పబడినట్టైంది.

''బతుకంటే యీ ఉద్యోగం ఒక్కటే కాదు సార్! ఆడపిల్లకి చదువు ముఖ్యమా, పెళ్లి ముఖ్యమా అనే చర్చలు ఎన్నో జరిపింది చదువే ముఖ్యం అని కంఠం చించుకుని చెప్పినదాననే. కానీ యిప్పుడు... యిప్పుడు తోడులేని జీవితం ఎంత నిస్సారమో... ఎంత గింజుకున్నా గడచిపోయిన వసంతాలు తిరిగిరావనే పచ్చి నిజం ఎంత హృదయవిదారకమో అర్థమౌతున్నది సార్ - అల్లా నావంక జాలిగా చూడకండి సార్! నేను భరించలేను'' అని తలవంచుకుని జల జల జారిన కన్నీటి చుక్కలను ఆపలేకపోయింది. చాలా ఏళ్ళ క్రితం పద్మినిని సమీపంగా చూశాడు. అంతటి చక్కనిది, తెలివైనది, స్ఫటికంలాంటి స్వచ్ఛమైన అంతరంగం గల వ్యక్తి మరొకరు లేరని నిర్ణయించుకున్నాడు. కానీ మరో వయ్యారి తనని వగలతో ఆకట్టుకుంది. పదుముదనం పోగరులో ఈ స్వచ్ఛ సుందరి తనకి పనికిరాలేదు.

పద్మినికి తన మనస్సు రేకులు విప్పుకుని ఒక్కటొక్కటే గత చరిత్ర పుటలు ఇతని ముందు విప్పాలనిపిస్తోంది. ''ఆడపిల్లకి పెళ్లి చేయలేకపోయాను. ఆమె సంపాదన తింటున్నాను, అనే పాత భావాలతో మా నాన్న కుమిలిపోయి కన్నుమూశారు. ఇల్లు వేలం అయిపోయింది. అమ్మని పువ్వుల్లో పెట్టి ఏ కొడుకూ చూడనంత బాగా సేవించుకుంటున్నాను, తల్లి ఋణం మనసారా తీర్చుకుంటున్నానని చెప్పాను కదా సార్! కట్నం అడిగినవాడిని పెళ్లి చేసుకోకూడదని నేటికీ ఉపన్యసిస్తూనే వున్నాను. చదివించుకోండి అమ్మలారా అని అందరికీ ఉపదేశిస్తున్నాను. నా మాటలు వింటున్న ఆ అక్క చెల్లెళ్లందరూ అమాయకులు. నామీద గొప్ప గౌరవంతో ఎదురు ప్రశ్న వేయరు. ''నీ మాట విని పిల్లల్ని చదివించినాం, కట్నం యివ్వనని కూచున్నాం. మా పిల్లలకి పెళ్లిళ్లు కాకపోతే ఎట్లా చారసానీ'' అని ఎప్పుడూ నన్ను ఎదిరించి అడగరు. ''నీలాగానే జుట్టు తెల్లబడేదాకా అట్లనే వుండిపోతె ఆమె బతుకేం గావాలె - అని నా దగ్గర జవాబులేని ప్రశ్న నన్ను అడగరు'' అని ఏకబిగిన చెబుతోంటే సుకుమార్ కళ్లార్పకుండా చూస్తున్నాడు. తను తిరిగిన దేశ దేశాల్లో కనిపించని ఈ మానవత్వం, ఈ స్పష్టత - ఎన్నో రోజులకి తారసపడగా, తబ్బిబ్బవుతున్నాడు. ''పద్మా! ఒక్క మాట చెప్పు. భరించలేని ఒంటరితనం నిన్ను బాధపెట్టదా? తోడు కావాలని తపించిపోవా?'' అన్నాడు ఎంతో మృదువుగా. ఆ మెత్తని మాటకు పద్మకు లోపల్నుంచి దుఃఖం ముంచుకొచ్చింది. చేతులలో ముఖం దాచుకుని భుజాలు కుదిలిపోగా ఏడిచింది. సుకుమార్ ప్రశ్న అడిగాడే కానీ, యీ ఆవేశానికి యిబ్బంది పడిపోయి చూస్తున్నాడు. పరిశీలనగా చూస్తున్నాడు.

ఒక్కసారిగా ఆమె తనకు తానుగానే తమాయించుకొని, ''నన్నింత సూటిగా అడిగిన వారె వరూ లేరు సార్! అందుకే చలించిపోయాను'' అంటూ కంఠం గద్గదం కాగా తోసుకు వస్తున్న కన్నీటిని తుడిచేసుకుంది.

''ఎంతో ఒంటరిగా, నాకు ఒక అండ, తోడు కావాలని రాత్రిళ్లు పిచ్చిగా కోరిక పడిపోతుం టాను. శూన్యంలో చేతులు చాచి, మధుర స్పర్శ కోసం తపిస్తాను. ఒక్కనాటైనా నా జన్మ స్త్రీగా సార్థకం కావాలని, నాకు పరిచయం కాని మమతల్లో తేలిపోవాలని కోరుకుంటాను. కానీ ఆ చీకటిలోనే, నా వూహ ఎవరైనా పసిగడతారేమోనని బెదురు కళ్లను గట్టిగా మూసుకుంటాను. ఎంత పాపిష్టి కోరిక అని ప్రాణం నులిమేసుకుంటాను. నాకు ఎప్పుడూ ఆ బంధం అనుభవంలోకి రాదని భయపడిపోతాను. అంతేసార్! నా బాధ అంతేసార్! సిగ్గువిడిచి మీతో యిల్లా చెప్పి నందుకు నవ్వకండి'' అన్నది. మాటలు తడబడి పోతున్నాయి.

ఆమె కుదుటపడేవరకు ఆగి, ''నీకు వయస్సు ఎంతుంటుంది పద్మినీ? ముప్పై ఆరు. ముప్పై ఏనిమిది... ఆహ - అల్లా కనబడుతావని కాదు. ఇరవై ఆరు అంటే నమ్మవచ్చు...'' అంటూ అతను ఆగగానే, ఆమె నవ్వింది. ''ఎందుకు సార్? నాకు పెళ్లి సంబంధాలు చూస్తారా?'' అన్నది.

అతను భుజాలు ఎగురవేశాడు. ''ఎందుకు చూడకూడదు? ఇతర దేశాల్లో యిది ముది రిన వయస్సు కానేకాదు. యవ్వనం గానే అనుకుంటారు. నేను నిన్ను అర్థాంతరంగా వదిలేసి, నీకు అపచారం చేశాననిపిస్తోంది. అందుకే నన్ను ఒక ఉపకారం చేయనివ్వు. నేను ఢిల్లీ నుంచి మీ డిపార్టుమెంటుకి రాయిస్తాను - కొన్నాళ్లు ఒక ప్రాజెక్టులోకి నిన్ను డిప్యూట్ చెయ్యమని. ముందు నీనుంచి నాకొక దరఖాస్తు కావాలి. ఆ తర్వాత కొన్నాళ్లకి నిన్ను పారిస్ పిలిపించు కుంటాను. అక్కడ ఎందరో వుంటారు. నీ తెలివిని, పటిష్టమైన పనినీ, గ్రామీణ అనుభవాన్ని మెచ్చుకునేవారు. నీ జీవితం మలుపు తిప్పే అవకాశం నాకు యివ్వు పద్మా'' అన్నాడతను.

ఈ మాటలు గబగబ అంటోంటే, తన వూహాకి తనే సంతోషపడుతున్నట్లు తోచింది పద్మినికి.

పద్మిని కళ్లు తళుక్కుమని మెరిసిపోలేదు, యీ భవిష్యత్తు తలచుకుని. ఆశలు చిగుళ్లుగా, పచ్చని వెలుగులుగా, కుసుమించడంలేదు.

''వద్దు సార్! మా అమ్మ ముసలిదై పోయింది. ఒక్క క్షణం నన్ను చూడనిదే వుండలేదు. ఆమెను...'' అంటుంటే, సుకుమార్ చికాకుగా ముఖం చిట్లించాడు. ''మీ అక్కయ్యల దగ్గర వుండమను కొన్నాళ్లు - నీవు వేల డాలర్లు సంపాదిస్తుంటే... ఒకవేళ సంపాదిస్తోంటే, వారికీ కొంత పంపవచ్చును. నా మాట విను పద్మినీ! రేపు నాతో బయలుదేరు. హైదరాబాదు నుంచి ఫ్లయిట్ టిక్కెట్లు ఢిల్లీకి బుక్ చేయిస్తాను, ప్లీజ్!'' అన్నాడు.

పద్మిని తల వంచుకుంది. తెల్లబడిపోతున్న ముంగురులు పచ్చని నుదుటిన కదలాడు తున్నాయి. వాలిన కాటుక కళ్ల నుంచి, పొడుగాటి రెప్పల వెంట్రుకల నుంచి, కన్నీటి బిందువులు చేతిమీద రాలుతున్నాయి. తేర్కొంది. ''నామీద మీరు ఎంత జాలి కురిపించినా గడచిన రోజులు తిరిగిరావు. అందుకు కాదుసార్, నేను బాధపడుతున్నది. మీ మంచితనానికి - అంత ఎత్తున వున్నా, కిందికి చూసి, యీ నిస్సహాయ ప్రాణిని గురించి ఆలోచిస్తున్నందుకు'' అన్నది.

తేరుకొని, ''నేనింక వెళ్లనా సార్?'' అనగానే, సుకుమార్ చాల విసుగుపడిపోయాడు. ''నేను చెప్పిన విషయానికి జవాబిచ్చే పనిలేదా? ఇప్పుడే చెబితే, నేను ఫోన్ చేయిస్తాను. ముందొక నెలపాటు సెలవు పెట్టేయి. ఢిల్లీలో కూడుని ఆలోచిద్దాం. పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేయాలి. హైదరాబాదులో నువ్వు సంతకాలు పెట్టి కాగితాలు యిచ్చేయి. వీలైనంత వరకు నీ ఖర్చంతా నిన్ను తీసుకునే ఏజెన్సీవారే పెట్టుకొనేటట్లు చూద్దాం'' అన్నాడు.

పద్మిని మళ్లీ నవ్వింది - వానలోంచి తొంగిచూసిన ఎండలా ''సరే సార్!'' అన్నది.

సరే అంటే ఏమన్నట్లు - వస్తున్నట్లా, రానట్లా? ''సరే, నువ్వు నాతో వస్తున్నావని అర్థం చేసు కున్నాను. నీ ప్రయాణం గురించి యిక్కడ, హైదరాబాదు మీ ఆఫీసులో ఏం చెప్పాలో ఆలో చించే పెట్టుకున్నాను. ఓకే!'' అన్నాడు, విసుగుని అణచిపెట్టి, కొత్త ఆశ ధ్వనింపచేస్తూ.

పద్మిని మనస్సు యీ మాటకు ఎగిరి గంతులు వేయలేదు. చూపులో అనుమానం, మాటలో శంక. ''సార్! నేను పారిస్ వస్తే, మీ సంసారంలో... మీ మధ్య...'' అంటూ ఏమనాలో తెలియక ఆగిపోయింది. ఆ ప్రణయానికి మళ్లీ కొత్త బీజం వేద్దామనుకుంటు న్నాడా?

సుకుమార్ దెబ్బతిన్నట్లు చూశాడు. ''పద్మా ఎంత నీచంగా అనుకుంటున్నావు నన్ను గురించి. పని వేరు, వ్యక్తిగతంగా కాపురాలు వేరు. నీ పనికి గుర్తింపు రావాలని, నీ తెలివి విస్తరించాలని అనుకుంటున్నాను. నడి వయస్సులోకి వస్తున్నవాళ్లం. నలుగురి బిడ్డల తండ్రిని... విను. యీమెకు కూడా పిల్లలున్నారు... నేను నిన్ను ఏ దృష్టితో పిలుస్తున్నానో అర్థం చేసుకునే వివేకం నీకుంది. కానీ - కావాలని నన్ను నొప్పిస్తున్నావు'' అన్నాడు.

పద్మిని నిట్టూర్చింది. ''అమ్మనడిగి, కబురు చేస్తాను'' అన్నది. బయట జీపు వచ్చి ఆగిన ధ్వని. ''ఇంక నేను వెళ్లనా సార్?'' అన్నది నిలబడి.

సుకుమార్ కూడా లేచి నిలబడి, పళ్లు బిగించి, ''ఆ సార్ అనే మాట యికనైనా వదిలేయి! నా స్నేహితురాలిగా మసలడం నేర్చుకో. నా భార్య... మామూలు అపార్థాలు చేసుకుంటూ, బతుకు నరకం చేసే మనిషి కాదు'' అన్నాడు.

పద్మిని నవ్వి, ''ఓకే సార్!'' అన్నది. జీపు వరకు అతను వెళ్లలేదు. గిరుక్కున తిరిగి లోపలికి వెళ్లాడు.

ఇదివరకు లాగానే ఆఫీసు మొత్తం గుప్పుమని పోయింది. ఒకప్పుడు కలెక్టరుగారు యీమెను ప్రేమించారుట. ఎందుచేతనో పెళ్లి జరుగకుండా ఆగిపోయిందట. ఆమెగారు పెళ్లి

చేసుకోకుండానే వుండిపోయింది. ఇప్పుడు మళ్లీ గుసగుసలు మొదలు పెట్టారు. అంటూ యిన్నేళ్లుగా ఆమెపట్ల పెంచుకున్న గౌరవాన్ని, మర్యాదను వదంతుల గాలికి ఎగురకొట్టేశారు.

మర్నాడు ఉదయం పద్మిని ఆఫీసులో తనకున్న పని పూర్తి చేసుకుంటోంది గాని, బుర్రంతా అల్లకల్లోలం. ఇతను రాత్రికో రేప్పొద్దునకో గాని వెళ్లరు... తనకి ఆలోచన తోచక గిజగిజ మంటోంది. రోజంతా సవ్యంగా గడుస్తుందా? అతని రాక తనకి ఒక కలగా మిగిలి పోతుంది - తను ఏమీ అనకపోతే. యథాప్రకారం యీ జీతం రాళ్లతో, ఉద్యోగం ఆటుపోటు లతో, ఎదాపెదా పరిస్థితులు వాయిస్తోంటే బతకాలి.

ఏదికానీ, తను ఎప్పుడూ విధి నిర్వహణలో ముందే వుంది. ఎక్కడ పనిచేసినా, తన వల్ల పొరబాట్లు జరగవనీ మంచి పేరు తెచ్చుకుంది. ఇప్పుడు, తన వ్యక్తిగత ఆవేశాలు, బాధల వల్ల, అలజడి వల్ల, పని ఎందుకు పాడుకావాలి? వేల డాలర్లు వచ్చిపడే అవకాశం వుంది, తన గజిబిజ వల్ల, అదెందుకు వెనక్కిపోవాలి?

మనస్సు దిటవు చేసుకుంది. బుర్ర దులిపేసుకుంది. ఆయన ఒక అధికారి, అంతర్జాతీయ స్థాయిలో. తనూ ఒక అధికారే, యీ జిల్లా స్థాయిలో. ఈ యంత్రాంగం నడవాలంటే, తనవంటి చిన్న బ్రష్షు భాగాలకి కూడా పనుంటుంది. వెన్నెముక, వ్యక్తిత్వం గల ఉద్యోగిగా, నిటారుగా కూచుంది పద్మిని.

ఫైలులో అన్ని కాగితాలూ సర్దింది. రాబోయే మూడు సంవత్సరాలలో గ్రామాల్లో మొత్తం అభ్యుదయానికి చక్కని పథకం తయారు చేసింది; ప్రభుత్వం యిచ్చే నిధులు కాక, ప్రజల భాగస్వామ్యం వుండేట్లు కట్టుదిట్టం చేసింది. నూరు గ్రామాల్లో వికాస పథకం అమలు చెయ్యాలని బ్లాకుల మ్యాపు, అందులో చిన్న బొమ్మలతో గుర్తులు పెట్టింది. అన్నీ చేశాక అందమైన ఆ బొమ్మలు, అంకెలు చూస్తోంటే ఆమెకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఇంత బృహత్పథకంలో పద్మిని అనే చిన్న మనిషి ఎంతో అప్రధానమైన పాత్ర వహిస్తుంది. కాని తనే ఏదో గొప్పదానినని, తనవల్లనే అన్నీ జరుగుతున్నాయని ఏదో భ్రమ. తను యిక్కడి నుంచి కదలి వెళ్లిన మరుక్షణం, మరొకరు పగ్గాలు పుచ్చుకుంటారు. ఏదో వూళ్లో పొదాలు, మరో వూళ్లో సుబ్బలక్ష్మి, కొన్నేళ్ల నారాయణ లాంటి సేవక్ - అందరూ తనంటే ప్రాణం పెట్టారు. కాని తను రంగం నుంచి యివతలకు రాగానే, వారి స్మృతిలోనూ మరుగున పడింది.

మనుషులు కలుస్తుంటారు, విడిపోతుంటారు. స్నేహాలు పెనవేసుకుంటాయి, బంధాలు సడలిపోతుంటాయి. చివరి ముడి సడలి తాను స్వేచ్ఛగా ఎగిరిపోయే తరుణం ఎప్పుడు వస్తుందో!

''అమ్మా! పద్మినీ!'' అంటూ బి.డి.ఓ. వచ్చారు. ఆమె పరిస్థితి చూశారు. ''పదమ్మా! నిన్ను యింట్లో దింపి నేను వెడతాను'' అన్నాడు.



ఆమె లేచి నిలబడి ఫైలు కట్ట ఆయన చేతికిచ్చింది. 'అంతా పూర్తయింది సార్! వారింక ఆమోదించి మంజూరు చేయడమే తరువాయి' - అని చెప్పాలని, మాట పెగలడం లేదు. ఆయన తీసుకొని, అసిస్టెంటుని పిలిచి ''నా అల్మారాలో పెట్టు ఈ ఫైల్సు అన్నీ'' అని చెప్పి 'పద' అన్నట్టు తాను ముందు నడిచారు.

ఇంటికి వెళ్లాక తానూ జీపు దిగి ఇంట్లోకి నడిచారు. ఆ బ్లాకులో డ్రైవర్లు, సేవకులు కూడా అయ్యగారికి పద్మిని పట్ల వున్న సోదర వాత్సల్యం అర్థం చేసుకొన్నవాళ్లే. కనుక తాటాకులు కట్టి, వూరంతా టముకువేసి, దుష్ప్రచారం చేసే ప్రమాదం లేదు.

నిస్సత్తువగా, బలాన్నంతా ఎవరో గుంజేసుకున్నట్టు, తేలిపోతున్న అడుగులతో యింట్లోకి వచ్చిన కూతుర్ని చూసి, ''ఏమిటమ్మా! జ్వరం తగిలిందా?'' అంటూ భుజం పట్టుకుని అక్కడే వున్న మడత మంచం మీద కూర్చోబెట్టింది. ''ఏమీ కంగారు లేదమ్మా! కొంచెం కాఫీ కలిపి యివ్వండి'' అన్నాడు.

కాస్సేపటికి పద్మిని తేరుకున్నాక ''అమ్మా! మీ అమ్మాయి చాలా కలత పడుతోంది. ఢిల్లీ నుంచి వచ్చిన ఆఫీసరు సుకుమార్ గారిని కలిసి మాట్లాడినప్పట్నుంచి మరీ మథనపడి పోతోందమ్మా!'' అన్నారు బి.డి.ఓ.గారు.

ఆ పేరు వినగానే వైదేహికి అంతా అర్థమైంది. ''బాబూ! ఆయన... ఆయన అమ్మాయికి తప్పిపోయిన సంబంధమండీ! ఎంతో మోజు పడిపోయింది అప్పుడు. అతగాడే దీనిని కాదని ఎవరినో చేసుకున్నారు. బిడ్డ మనస్సు విరిగిపోయింది'' - అని క్లుప్తంగా సంగతి వివరించింది.

కంఠం పూడుకుపోతుండగా పద్మిని తన మనస్సులో పేరుకున్న ఆవేదన అంతా బయటకు చెప్పింది. బిడ్డలను కన్న తండ్రి ఆయన. ఎంతో సానుభూతితో అర్థం చేసుకొన్నారు. తను యిప్పుడు ఎంతో ముఖ్యమైన సలహా యివ్వాలని గ్రహించుకున్నారు. పద్మిని జీవితం యిప్పుడు నాలుగు రోడ్ల కూడలిలో వున్నది.

ఎంతో నిజాయితీతో పనిచేసే ఈ శ్రమజీవికి గుర్తింపు, ఆనందం దొరికేదెప్పుడు? జీవితం ఒక మలుపు తిరిగేదెప్పుడు? అటు తన భవితవ్యం, యిటు తనమీద ప్రాణాలుంచుకుని బతుకు తున్న అమ్మ - ఏం చేయాలో తోచక సందిగ్ధంలో పడుతున్న యీమెకు తను చక్కని సలహా యివ్వాలి.

ముందు ఆయన తల్లివేపు తిరిగారు. ''పద్మ కొన్నాళ్లు మిమ్మల్ని విడిచి వుండవలసి వస్తే, మీరు ఓర్చుకోవాలమ్మా!'' అన్నారు. వైదేహి బిక్కముఖంతో చూసింది. అంటే- అని ఆమె ప్రశ్న.

''మీ అమ్మాయికి గొప్ప ప్రమోషను, ఢిల్లీలో కొన్నాళ్లు, అమెరికాలో కొన్నాళ్లు ఉద్యోగాలు వచ్చే అవకాశం వుంది. నేనిక్కడే మా అమ్మ వద్ద కూడుంటాను అంటే, అట్లాంటి అవకాశం రానే రాదు. మరొకళ్లు ఎగరేసుకుని పోతారు'' అని వివరించి చెప్పారు.

వైదేహి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ''అదేమిటి బాబూ! పిల్లది పైకి వస్తానంటే, నేను అడ్డు వస్తానా? - నేను కరుణమ్మ దగ్గరుంటాను. లేకపోతే - ఎక్కడో... అక్కడ...'' అంటూ ఎంతో ధైర్యం చూపాలని ప్రయత్నించింది.

పద్మనికి కళ్లల్లో నీరు తిరిగింది. ''పిచ్చి అమ్మా! నిన్ను అడవిలో వదిలేసి, పరాయి పంచన పడేసి పోతానా అమ్మా!'' అన్నది.

''అదేమిటే - చిన్నక్క పరాయిదెల్లా వితుంది? వాళ్లాయన కూడా ఎంతో నిదానస్తుడు... అంతగా కాకపోతే నా దగ్గర కొంత డబ్బుందిగా - అది వాళ్లకి యిచ్చేస్తాను'' అన్నది. ఆమె చాదస్తమంతా ఎక్కడపోయిందో, భీతియమంతా ఎల్లా మటుమాయమయిందో - తనకే ఒక భవిష్యత్తు సృష్టించేసుకుంటూ మాట్లాడుతోంది.

''అదేమిటమ్మా! పద్మని పెద్ద జీతం తెచ్చుకుంటుందే, మీ పోషణకీ, చేతి ఖర్చుకీ డబ్బులు పంపిస్తుంది. మీరు ఎవ్వరికీ భారం కాకుండా చూస్తుందమ్మా! ఏం పద్మా?'' అన్నాడాయన.

పద్మనికి పరిస్థితి అరటిపండు వలె విచ్చిపోతూ, స్పష్టంగా కనుపిస్తోంది. చీను, తను ఎవరి మీద అలకతో ఎవరిమీద కోపంతో, వున్నచోటే మగ్గిపోతూ, అణచివేసే సంఘానికి తలఒగ్గాలి?

ఆయన కాఫీ తాగి పద్మ సవ్యంగా మాట్లాడేందుకు సిద్ధంగా వుందని నమ్మకం కుదిరాక, వెళ్లాడు. ''నేను పెళ్లి సారికి కనబడతాను. నిన్ను ఏం చేయమని ఆయన సలహా యిచ్చినా, నీకు సమ్మతమే అని చెప్పేస్తాను. ఏం? మళ్లీ మాట మార్చేయవు కదా?'' అన్నాడు. గుమ్మందాకా వెళ్లి, జీపు ఎక్కబోతూ, ''జీవితంలో వచ్చే అవకాశాలను వదులుకోకూడదమ్మా! అంతా భగవంతుని నిర్ణయంగానే భావించుకోవాలి'' అన్నాడు. పద్మ తల వూపింది.

ఆయన వెళ్లగానే ''అమ్మా!'' అంటూ వైదేహిని కావలించుకుని ఒక కోకం పెట్టింది. ''ఏమిటే ఆ ఏడుపు? నాకు ఏమంత వయస్సు మీరిపోతోందని! మగ్గిపోయిన పండుని కాదు రాలిపోవడానికి! ఇంకా నలుగురికి వండిపెట్టగలను. నేనేం చంటిపిల్లనా నన్నే చూసుకుని నువ్వు కూర్చోడానికి? పిల్లలు వృద్ధిలోకి వస్తోంటే, సంతోషించి, దీవించడానికేనమ్మా నాలాటి పెద్దవాళ్లున్నది. ఏదీ, ఆ మూడు ముళ్లూ పడిపోతే...'' అనగానే, గోముగా ఆమె నోరు మూసేస్తూ, ''నువ్వు ఆ మాట మాత్రం మానవు కదా అమ్మా!'' అన్నది పద్మ.

రాత్రి అమ్మ అలసిపోయి నిద్రలోకి జారుకున్నాక, ఆమె మీద చేయి వేసుకుని, దగ్గరగా పడుకుంది పద్మ. కండలన్నీ సంసారం కోసం కరిగించిపోసి, ఎముకలు చేతులకి తగిలేట్లు, సన్నగా అయిపోయింది వైదేహి. మూసుకొన్న ఆ కళ్లల్లో యింకా ఏమి కలలు మిగిలాయని? పసుపు బట్టల్లో పద్మని చూడాలని... అదే తుది కల.

నిట్టూర్చి లేచి, కిటికీ దగ్గరకు వెళ్లి కూచుంది పద్మ. చీను, తను యీ వలయంలోంచి బయటపడాలి. ఎప్పుడో అప్పుడు పరిభ్రమిస్తున్న యీ గానుగ చక్రం మీద నుంచి దూకాలి. నా



బతుకింతే, పెళ్లికాని మోడుని అనుకుంటే, ఏడిస్తే ఏం ప్రయోజనం! ఎవరికోసమో తానెందుకు త్యాగాలు చేయాలి? విదేశాలకు పిల్లలు వెళ్లిపోతే, ఆ తల్లిదండ్రులు యిక్కడ వారి ముచ్చట్లు చెప్పుకొంటూ సంతోషంగానే వుంటున్నారుగా! అమ్మా అంతే మరి. ఒక నాలుగేళ్లు ఎక్కడైనా తిరిగి రావచ్చును. కరుణకీ, వాళ్లాయనకీ గట్టిగా చెబితే, వాళ్లు చూసుకుంటారు. ఏదోవిధంగా అమ్మకి చేతినిండా డబ్బుండేట్లు చూడొచ్చు.

అందరు ఆడపిల్లల్లాగ కాకుండా తానెందుకిల్లా ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది? రమణ బావ మాట తప్పిపోబట్టా? నాన్న సంబంధాలు సరిగా వెతకపోబట్టా? సుకుమార్‌ని చేజేతులా జారవిడుచుకున్నందుకా? ఆఫీసు పనిలో మరీ మునిగిపోతూ, సహజంగా స్త్రీకుండే కోమలత్వం, సాటివారికి కనబడకుండా, కరుడు గట్టినట్లు పేరు తెచ్చుకోవడం బట్టా? - ఇన్ని కారణాల చేత తాను ఏకాకిగా మిగిలిపోయింది. వృద్ధ కన్యగా ముద్ర వేయించుకుని, అందరి జాలి చూపులకీ, 'నీకేం తెలుసు, పెళ్లి కాని దానివి!' అనే మామూలు వ్యాఖ్యానాలకీ గురి అయిపోతోంది.

పెళ్లి కాకపోతే రక్షణ లేదా? పెళ్లి కాకపోతే ఆర్థికంగా భద్రత లేదా? సమాజంలో గౌరవం లేదా? తనని అందరూ గౌరవించినట్లే కనబడుతున్నారుగా? ఎవరో కొందరు లోపల తనని సానుభూతిగా, చూస్తుండవచ్చును. తన సంపాదన చూసి, ముడిసిపోయి, ఎరవేసి పట్టాలని చూసిన చవుకబారు, స్వార్థ పురుషులు ఒకరిద్దరు, సంతోషిస్తూ వుండవచ్చును. కిటికీలో కూచుని చూస్తోంటే దూరంగా నల్లని కొండలు ఎత్తుగా కనిపిస్తున్నాయి. చంద్రుడు ఆకాశంలో యిటునుంచి అటుగా ప్రయాణించి నిశ్చలంగా వెలుగులు వెదజల్లుతున్నాడు. ఎంతసేపు అల్లాగే కూచుందో గుర్తులేకుండా పోయింది. వెన్నెల తేలిపోయింది.

ఉదయాన సూర్యుడు అరుణ కమలంపైన కూర్చొని వస్తున్నట్లు సాక్షాత్కరిస్తున్నాడు. తాను ఎన్నడూ చూడని భవ్యమైన బంగారు కిరణాలు నిరంతంగా భూమిపైకి ప్రసరింపచేస్తూ, కాలచక్రాన్ని సుందరంగా త్రిప్పుతూ వస్తున్నాడు. ఎందుకో యీరోజు ఆ భగవానుడు ఏడు గుర్రాలు పూన్చిన రథముపైన లోకంలో జీవశక్తిని నింపడానికి వస్తున్న దివ్య పురుషునివలె వున్నాడు.

పద్మని కళ్లు పెద్దవిచేసి చూడాలని ప్రయత్నిస్తోంటే, చూడరాని తేజస్సుతో మునుముందుకు, పైపైకి వస్తున్నాడాయన. అరుణోదయం యింత వైభవంగా వుంటుందనీ, కొత్తవెలుగులకి ద్వారాలు తెరచి, తనని ఆహ్వానిస్తుందనీ పద్మని ఎన్నడూ అనుకోనట్లే విచ్చారిన నయనాలతో చూడసాగింది.

తను ఎవరికోసమూ, యిక్కడ క్రుంగిపోయి, చీకటిలో తడుముకోవలసిన అవసరం లేదు. ఈ పరిస్థితిని ఛేదించుకొని తాను బయటపడాలి. అమ్మ- అమ్మ కూడా అనుమతించింది. తాను నేరం చేస్తున్నట్లు బాధపడకుండా, స్పష్టంగా ఆశీర్వదించింది.

తను ఎందుకు యిన్నేళ్ళు సంప్రదాయాలనుకొంటూ, మర్యాదలనుకొంటూ పాతుకుని పోయింది? ఆదర్శాలలో కూరుకుని పోయి, వ్యక్తిత్వాన్ని గాలివాటానికి వదిలేసి, ఎటుపడితే అటు మొగ్గుచూపింది?

ఆదర్శాలు ఎంతో ఉన్నతంగా వుంటాయి. ఈ దేశంలోని హిమాలయాల వలె శిఖరాలతో నిండి, అందుకోరానివిగా వుంటాయి. మంచు నిండిన, ఘనీభవించిన ఆ హిమశిఖరాలు, మానవులకు అందవు. అవి కరిగి, స్వచ్ఛమైన శీతల జలాలుగా ప్రవహించినప్పుడే మనుష్యుల మనుగడకై శీకరములు చల్లుతూ, ప్రాణమిస్తాయి. హిమము పవిత్రమైనదే. ధవళస్నిగ్ధమైనదే. కాని చల్లదనంతో చేతులు కాల్చి, కొరికే ఆ ప్రదేశం నివాసయోగ్యం కాదు. తొణికిసలాడే జీవం మొలకెత్తి, అందగించదు.

చెదరిపోతున్న ఆలోచనలు ఒక దరి చేరాయి. పరిణయం, ప్రణయం అనే మాటలు మనస్సు అడుగు పొరలోకి నెట్టివేసి, విశాల ప్రపంచంలోకి విహంగము వలె ఎగిరిపోవాలని ఒక తీవ్రమైన కోరిక నరాల్లో చోటుచేసుకుని, పరవళ్లు తొక్కుతూ శరీరమంతా వ్యాపిస్తోంది. తెల్లవారిన సంగతి చూడనట్లుగా, యింకా నిద్రపోతున్న అమ్మ పక్కన చేరి, దుప్పటిలో దూరిపోయింది. ప్రయాణానికి యింకా చాల టైముంది. సుకుమార్‌కి కబురు పంపడానికి, మరో గంట టైముంది - అనుకుంటూ నిద్రలోకి జారిపోయింది.



# జనసంద్రంలో రక్త తరంగం

''అమ్మమ్మా'' అని కావలించుకుని పెద్దగా ఏడిచింది జయ. అమ్మమ్మ శ్యామలమ్మకీ దుఃఖం వచ్చింది. కడుపు చెరువైంది మనుమరాలిని చూడగానే. ఇద్దరూ బిగ్గరగా శోకాలు పెట్టారు. పెద్దావిడే ముందుగా తేరుకుని, ''ఊర్కో బిడ్డా ఊర్కో. ఎంతేడిచినా పోయినోళ్ళు తిరిగి రారమ్మా'' అంటూ వెన్ను నిమిరింది. జయ వెనకాల మిగతా ఇద్దరు ఆడపిల్లలూ ఉన్నారేమో అని చూసింది.

''నేనొక్కత్తినే వచ్చాను అమ్మమ్మా. పెద్ద చెల్లి కాలేజీలో చేరను గుంటూరు పోయింది. రెండోదానికి పరీక్షలు'' అన్నది. శ్యామలమ్మ కిటికీ తెరిచి, కాస్త వెలుతురు రాగా పరీక్షగా చూసింది జయ వంక.

చిన్న కుచ్చుగా కట్టిన జుట్టు, మూతికి ఎర్రరంగు, పొట్టిగా ఒక పరికిణీ, అపైన ఒక నల్లని నలుపు షర్టు. కనీకనిపించని బొట్టు. విదేశాల్లో డాక్టరు పరీక్షలు పాసై వచ్చిన మనుమరాలి ఈ వేషం చూసి గతుక్కుమంది. పల్లెటూరికి రావలసిన వేషమా ఇది? బయట ఆగిన బండి దగ్గర ఎందరో నిలబడి వింత చూస్తున్నారు. మనుమరాలిని బల్లమీద కూచోబెట్టి, బయటి దర్వాజా దగ్గరకు పోయి అక్కడ ఉన్న ఊరి జనాన్ని కసిరింది. ''పొండే. నా మనుమరాలు వస్తే మీరంతా చూసే ఇసిత్రమేంది? పొండి. రోగాలుంటే మాపటేలకొచ్చి ఆమె చేత మందు రాయించుకు పొండ్రి'' అన్నది.

జయ నీరసంగా నవ్వింది. ''నా డ్రెస్సు వాళ్ళకి కొత్తగా ఉందేమో అమ్మమ్మా. ఏం చేయను? ఎనిమిదేళ్ళయి అలవాటైపోయింది. అమ్మ - మా అమ్మ చీరలు తెచ్చానుగానీ, విప్పితే ఏడుపొచ్చింది'' అంటూ గొంతులోంచి మాట రాక కన్నీళ్ళు కార్చింది. క్యాన్సరుతో చచ్చిపోయిన కూతురు పద్మను తలుచుకుని, కడుపులో పోటు పొడిచినట్టు బాధ వచ్చి, శ్యామలమ్మ ముఖాన కొంగు పెట్టుకొని, శబ్దం పైకి రాకుండా ఏడిచింది. కాస్సేపటికి సర్దుకొని, ''పద తల్లీ. తానం చేసి, బువ్వ తిందువుగాని, ఎండనబడి వచ్చినావు'' అన్నది.

జయ బల్లమీద నుంచి లేచి, చిన్న గుమ్మాలున్న లోపలి గదిలోకి వెళ్ళింది. పెట్టె తెరిస్తే అమ్మ చీరలలోని మొగలిపూల వాసన. కన్నీళ్ళు కారుస్తూనే బట్టలు తీసుకుని స్నానం చేసి, చీర కట్టుకుని మళ్ళీ ఎవరూ తప్పు పట్టకుండా కుంకుమ దిద్దుకుని, భోజనానికి కూచుంది. ఆవురుమంటూ పప్పు, నెయ్యి కలుపుకుని తిన్నది. ఉసిరికాయ పచ్చడి చూస్తే మళ్ళీ తన చిన్నతనం, పదేళ్ళనాడు అమ్మ కలిపిపెట్టిన అన్నం గుర్తుకొచ్చి గుటక మింగలేకపోయింది.

''అమ్మమ్మా, అమ్మకి ఉసిరికాయ పచ్చడి ఎంతో ఇష్టం. కానీ, గొంతులో క్యాన్సరు వచ్చాక ఏదీ తినలేకపోయింది. మంచినీళ్ళు కూడా దిగలేదట'' అని గుర్తు తెచ్చుకొని, తినలేకపోతూనే అన్నం తినడం పూర్తిచేసింది. మెల్లిగా ''తాత లేరా అమ్మమ్మా, చిన్న మామయ్య కూడా లేడ ట్లుంది'' అన్నది.

''లేదమ్మా మీ తాతయ్య. ఆయనకున్నన్ని పంచాయతీలు ఊర్లో ఎవరికీ లేవు తల్లీ. జయమ్మా చూడు, మీ తాత ఈడ కొన్నాళ్ళు ఉండేట్లు లేదు'' అన్నది.

''అదేమిటమ్మమ్మా, తాత పెద్ద దొర కదా. పట్వారిగిరీ కూడా ఉందాయె. ఆయన మాట ఎవరు కాదంటారు'' అన్నది జయ.

శ్యామలమ్మ నెత్తి కొట్టుకుంది. ''కాని కాలం వచ్చిపడినాది కానీ, నీకీ సంగతులన్నీ ఎందుకు? అమ్మ – అమ్మ బాధపడిందటనా'' అన్నది మరో తెరగా దుఃఖం వస్తోందగా.

''నాకు మాత్రం ఏం తెలుసు అమ్మమ్మా, నన్ను రష్యాకు పంపి ఎనిమిదేళ్ళయింది. రెండేళ్ళ తర్వాత ఒక్కసారి వచ్చాను ఇంటికి. ఆ తర్వాత నన్ను రానివ్వలేదు. మా నాన్న ఎక్కడికో వెళ్ళిపోయాడని తెలుసు. మా అమ్మ ఆ చిన్న టీచరు ఉద్యోగం చేస్తూ పడుతున్న తిప్పలు కూడా నాకు పూర్తిగా తెలియవు. పెద్ద చెల్లి సుజాతకు పన్నెండు, చిన్న చెల్లి మంగళకు పది, నేను వెళ్ళేటప్పటికి. ఎప్పుడూ ఒకటే మాట అమ్మ ఉత్తరాల్లో, బాగా చదువుకో. దేశదేశాలు తిరుగు. మాకు డబ్బు అవసరం లేదు. నీవు బతికితే చాలు. ఇదే వరస. అసలు నాకు మెడిసిన్‌కి ఆ సీటు రాకపోయినా పోయేది. అందరితో కలిసి ఇక్కడే పడుండేదాన్ని'' అని గ్రరున నీరు కమ్మిన కళ్ళను తుడుచుకుంది జయ.

జయ తల్లి పద్మ తన పదహారో ఏట పదో తరగతి చదువుతూ, పక్కింటి అబ్బాయితో ప్రేమలో పడి, గుళ్ళో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయింది. ఆ అవమానానికి తల్లి శ్యామలమ్మ, తండ్రి వైకుంఠరావే కాక ఆ పెద్ద కుటుంబం యావత్తూ అవమాన భారంతో కుంగిపోయింది. పద్మ అంత ప్రేమించిన అబ్బాయి సరైన మనిషి కాదని తేలిపోయింది – ఏడెనిమిదేళ్ళలోనే. హైదరాబాద్‌వెళ్ళిపోయారు. అతను ఏవో చిన్న ఉద్యోగాలు చేసి, ఇంట్లో డబ్బులు ఇచ్చీ ఇవ్వక తిప్పలు పెడుతోంటే, పద్మ తానే ఒక ఉద్యోగంలో చేరింది. తనకి వచ్చే జీతం ఎంతో పొదుపుగా వాడుతూ, ఆడపిల్లలు ముగ్గుర్నీ చదివించుకుంటూ, ఒక కో–ఆపరేటివ్ సొసైటీలో చేరి, చిన్న ఇల్లు కూడా కట్టించుకుంది. ఎప్పుడేనా వచ్చి, మాయ మాటలు చెప్పి, బెదిరించి, పిల్లలపైన ఆపేక్ష ఒలకపోసి, రెండు మూడొందలైనా తన ఖర్చుకి పట్టుకుపోయేవాడు ఆ తండ్రి. పద్మ ఎంతో ఓర్పుతో, పట్టుదలతో పిల్లలకు ఎక్కడ మంచి చదువు వస్తుందంటే అక్కడ చేర్పించి, వాళ్ళని పరీక్షలు పాస్ చేయించింది. జయ 'ఎంసెట్'లో ముప్పయి నాలుగో ర్యాంకు వచ్చి మెడిసిన్‌లో సీటు సంపాదించుకుంది. అప్పుడే యునెస్కో స్కాలర్‌షిప్పులు వస్తున్నాయంటే దరఖాస్తు చేసింది. పదిహేడేళ్ళు నిండగానే భారతదేశం ఎల్లలు దాటి, విశాల ప్రపంచంలోకి దూసుకుపోయింది. అక్కడ రష్యన్ భాష నేర్చుకొంది. ఎంతో కష్టపడి మెడిసిన్ పూర్తిచేసింది.



తల్లి ప్రోద్బలం మీద భారతీయ సంస్కృతి, అలవాట్లు, వేడుకలు మొదలైన వాటి మీద చిన్న సమావేశాలు ఏర్పాటుచేసి, తనకొచ్చిన డ్యాన్సు, పాటలు నేర్పుకొంటూ నలుగురితో స్నేహం కలుపుకొంది. ప్రతి సెలవులకి ఏదో విధంగా ప్రయాణమై యూరోపియన్ దేశాలు అనేకం సందర్శించింది. ఆ భాషలు కూడా అయిదారు నేర్చుకొంది. తన తెలివి, విజ్ఞానం, పరపతి పెంచుకొంటూ, ఎంతో విశాల దృక్పథం అలవడుతోంటే గర్వపడక అణకువ నేర్చుకొంది. తనకు ఇంత ప్రోత్సాహమిస్తూ ఉత్తరాల ద్వారా, అతి క్లుప్తమైన టెలిఫోన్ సంభాషణల ద్వారా తమ యోగక్షేమాలను గురించి చాలావరకు అమ్మ అబద్ధాలు చెబుతోందని గ్రహించలేదు జయ. ఆమెకి క్యాన్సరు వచ్చింది. ఆమె పనిచేస్తున్న స్కూలు మేనేజిమెంటువారే ఒక క్యాన్సరు ఆస్పత్రికి దాతలు కనుక, మగదిక్కు లేకుండా పిల్లలను పెంచిన పద్మను చూస్తే వారికి జాలి కలిగి, చాలా తక్కువ ఖర్చుతో చికిత్స జరిపించారు. గవర్నమెంటు డాక్టర్లు కూడా తమ పిల్లలకి బళ్ళో పాఠాలు చెప్పిన టీచరుగా ఆమెకు చేతనైన సాయం చేశారు. కానీ, ఆ జబ్బు అలాంటిది. ముదిరింది. మంటగా వ్యాపించింది. విషప్రణంగా సలిపింది. పద్మ తిండి లేక యమ యాతన అనుభవిస్తూ తెలివి, మగతల మధ్య చావుబతుకుల మధ్య కొట్టాడుతుండగా, అప్పుడు జయకి కబురు అందింది. అప్పటికి ఆమెకి మెడిసిన్ పూర్తయింది. ఇంక స్వదేశానికి తిరిగి రావాలని ఉరకలు వేస్తున్న సమయంలో, తల్లికి వచ్చింది మామూలు నలత కాదని, పెను రక్కసని తెలిసింది. ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రితం చూసిన చక్కని కుందనం బొమ్మలాంటి అమ్మ ఎండిన తీగలా, నలువెక్కిన ముళ్ళకంచెలా కనిపించగానే జయ గుండె బద్దలైపోయింది.

''ఏమిటమ్మా ఇది? ఎందుకమ్మా ఇట్లా'' అంటూ గోలగా ఏడిచింది. తన వైద్య విజ్ఞానం ఎందుకూ కొరగాని స్థితి ఆమెది. దిక్కులేని మేకపిల్లలా ఉన్న చెల్లెళ్ళు ఎంత సమర్థంగా అన్ని పనులూ చేసుకుంటున్నారో చూసి జాలితో కరిగిపోయింది. పెళ్ళాం సంపాదించిన ఇల్లు, సామాన్లు తనిఖీ చేసే దుర్మార్గమైన ఉద్దేశంతో వచ్చిపోతున్న తండ్రిని అరిచి వెళ్ళగొట్టినంత పని చేసింది. అయినా, తన ప్రాణంలో ప్రాణం, తన ఉనికికి ఆధారం, కళ్లల్లో దేదీప్యంగా కదలాడే తల్లి దక్కనే లేదు. జీవితమంతా శ్రమించి, విష రోగంతో పోరాడి, అలసి, ఓడిపోయి, సేదదీరి నట్లు నిశ్చలంగా కళ్ళు మూసుకున్న అమ్మను చూసి, పసికందుల్లా ముగ్గురూ అలమటిం చారు.

ఇంత విషాదంలోనూ జయ రష్యా నుంచి వస్తూ ఒక శుభవార్త మోసుకొచ్చింది. అమెరికా లోని ఒక తెలుగు డాక్టరుగారు, జయ రాసిన లెనిన్ తాతగారు అనే కవితను చదివి, ముచ్చట పడి, తన కొడుక్కి ఆమెను చేసుకుంటానని కబురు చేశారు. అది ఎంతో విచిత్రంగా సాగిన కథ. జయ వారితో ఎలా సంభాషించిందో, ఢిల్లీలో వాళ్ళను ఎలా కలుసుకుందో, ఆ అబ్బాయి తనకి ఎంతగా నచ్చిపోయాడో, ఆమె వారిని ఎలా ఆకట్టుకుందో – అదంతా కలలాంటి ఒక కథ. ఇన్నేళ్ళు రష్యా చలిలో వణికి, వచ్చి బతికిన తాను, తిరిగి ఖండాంతరం వెళ్ళి, అమెరికాలో ఉండిపోతాననే వార్త అమ్మకి ఎలా చెప్పాలా అనే బాధపడింది కానీ, ఆ మాతృమూర్తి కథ

ముగిసిపోతుందనుకోలేదు. రెక్కలు సరిగా రాని ఈ చెల్లాయిలను ఏం చేయాలి? తన మీద ప్రేమ కురిపించి, మధురమైన ఆశలు రేకెత్తించిన అమెరికా అబ్బాయిని వదులుకోవడం ఎలా? అన్ని విషయాలు చక్కబెట్టుకుని రెండు నెలల్లో వస్తానని మాట ఇచ్చింది కదా తాను.

పద్మ వెళ్ళిపోయింది. ఎందుకూ పనికిరాని ఆ మొగుడు ఆమెను బూడిద చేయడానికి సకాలంలో వచ్చాడు. ఆ పని చేసి వచ్చాక మేమూ ఉన్నామంటూ వచ్చిన దూరపు బంధువులతో కలిసి, నాలుగు మెతుకులు కతికి, తన మనసులోని కుటిలమైన ఆలోచనను బయటపెట్టాడు. ఆ ఇంట్లో తానూ ఉంటాడట పిల్లలను కనిపెట్టుకుని. జయతో ప్రాక్టీసు పెట్టించి, తాను కాంపౌండరుగానైనా దగ్గర ఉంటాడట. ఛీత్కరించింది జయ. ''మా అమ్మను చచ్చిపోయాక కాల్చి వచ్చావు. మమ్మల్ని బతికుండగానే పీక్కు తింటావా'' అన్నారు ఆడపిల్లలు ముగ్గురూ. చేసేది లేక వెళ్ళాడు. తన పెళ్ళి సంగతి కూడా చెప్పాలనిపించలేదు జయకు.

తమని కబళిస్తున్నట్లు మీదమీదకు వచ్చే కెరటాల వంటి పరిస్థితులకు తట్టుకుని నిలబడ్డ ఆ పిల్లలకి ఎంతో తెగువ. కొన ప్రాణంలోంచి పుంజుకొని ఊపిరి పీల్చుకున్న ఆ ముగ్గురూ ఒకే మందం, ఒకే కంచం తీరుగా నిలబడ్డారు. ఏం చేయాలి? చెదరిన బతుకులను ఎలా కుదురు చేసుకోవాలి? పది పన్నెండు రోజులు గడిచాయి. విదేశాలలో ఉండి వచ్చిందేమో జయకు కర్మకాండలపైన అపరిమితమైన నమ్మకం ఏర్పడింది. అందుకే అన్నీ సక్రమంగా జరిపించారు. పద్మ తనకి ఉన్నంతలోనే ఇన్సూరెన్సు చేసింది. ఆ డబ్బూ వచ్చింది.

అప్పుడు చెప్పింది జయ తన పెళ్ళి విషయం. చిన్నవాళ్ళిద్దరూ పిచ్చిగా సంబరపడిపోయారు. ''మమ్మల్ని ఎల్లాగే వదిలి వెళ్ళేది'' అని ఏడిచింది.

''ఫర్వాలేదు. మేమూ చదువుకోవడానికి వస్తాం'' అన్నారు. అమ్మ ప్రాణం ఉండగా ఈ వార్త ఆమె చెవిన వేయలేకపోయామని గిలగిలలాడారు. ''నా పెళ్ళి నేనే చేసుకోవాలా'' అనే ప్రశ్న వచ్చింది జయకి. ''అమ్మమ్మ దగ్గరికి వెళ్ళిరావే'' అన్నది పెద్ద చెల్లి.

పద్మ జబ్బుగా ఉందని తెలిసినా, రోజుల్లో ఉందని కబురు చేసినా, ఫోను చేసినా అమ్మమ్మ రాలేదు. అంటే, తాతయ్య ఆవిడని రానియ్యలేదు. 'చచ్చావనుకున్నాను' అన్న తాతయ్య చచ్చినా కూడా రాలేదు. భార్యను రానివ్వలేదు. మరింక ఇప్పుడు పెళ్ళి జయ ఏం చెబుతుంది? తన ముఖమైనా చూస్తారని నమ్మకం ఏమిటి? కాని, ఈ దేశంలో తనకి మిగిలిన ఒక్క బంధం అమ్మమ్మే నిజానికి. పద్మ ఆ ఇంట పుట్టిందన్నమాట తాను వెళ్ళి గుర్తుచేస్తే ఏమంటారో! అయినా, తనకి సిగ్గు ఏమిటి? మొహమాటం ఏమిటి? ఒక్కసారి వెళ్ళి ఆ పెద్దవాళ్ళ కాళ్ళకి దణ్ణం పెట్టి వస్తే నష్టమేమిటి? అలా అనుకునే వచ్చింది జయ ఇప్పుడు తన తాత వైకుంఠరావు గారింటికి. మనుమరాలిని చూడగానే ఏనాడో కనుమరుగై పోయిన తన తొలి సంతానం పద్మ పసిపాపలా మదిలో మెదిలింది. ఒక ఆవేదన సన్నగా కమ్ముకుంటే, మరొక ఆనందం తెర ఆ బాధను మాయం చేస్తూ గుండెలోకి వస్తోంటే - శ్యామలమ్మ ఆ పిల్లకి ఏదో చేయాలని సందడిపడిపోసాగింది.



చీకటి పడబోతోంది. ఎర్రని నిప్పుబంతిలా సూర్యుడు పడమటి దిక్కున మాయమౌతోంటే చెట్ల కొమ్మల నుండి చీకటిని జార్చే ఆకాశం దిగులుగా ఉంటుంది. గుబులు మంటూ ఆవరించిన మసకబారిన దారిలోంచి ఎవరో వచ్చారు ఇంట్లోకి. ఎవరో కాదు, ఎందరినో వెంట బెట్టుకుని వైకుంఠరావు తాతయ్య. లోపల గజగజమని వణుకు జయకి. ఎప్పుడో ఒకసారి చూసిందో, లేదో ఆ తాతను. ఇల్లంతా లైట్లు వేసేశారు. కరెంటు మోటారు చప్పుడు ఎక్కణ్ణించో. ఎద్దుని అదిలించిన పాలేళ్ళ కేకలు. వాటిని మించి బుసకొడుతూ తల ఎగరేసిన ఎద్దు మువ్వల గలగల. అందరి మీదా ఎందుకో అరుస్తున్నట్లున్న తాతని వసారాలోనే చూసి, గువ్వపిల్లలా వంటసావడిలో ఉన్న అమ్మమ్మ దగ్గరికి వెళ్ళిపోయింది.

''అమ్మమ్మా! తాతయ్యొచ్చారు'' అన్నది. గొంతులో వణుకు. బయట ఆయన రైతుల మీద, పనివాళ్ళ మీద ఎవరెవరి మీదో అరుస్తుండడం విని, ''నువ్వెందుకొచ్చావే భడవా'' అని తనని ఉప్పు చెంప మీద కొడతాడనిపిస్తోంది.

ఆయనతో కూడా వచ్చిన రెండో కొడుకు రాజేశ్వరరావు లోపలికి వచ్చాడు. శ్యామలమ్మ పెట్టిన మంచినీళ్ళు ఒంపి, గ్లాసు తీసుకొని బయటకు వెడుతూ, కింద పీట మీద కూచున్న జయను చూశాడు. శ్యామలమ్మకి గర్వంతో మాట రాలేదు.

''పద్మక్క బిడ్డ- జయ- డాక్టరమ్మరా'' అంది. 'ఇది మేనకోడలా' అన్నట్లు ఎంతో ఆసక్తిగా చూశాడతను. అందులో స్నేహం కనబడింది జయకి.

''ఏందా పంచాయతీ? మీ బాపు ఒక్కనాడైనా నిర్రంధిగా ఇంట్లో ఉండడు గదా'' అన్నది. మళ్ళీ వచ్చి చెబుతానంటూ రాజేశ్వర్ బయటికి వెళ్ళాడు.

''దొరసానీ! పది కప్పుల చాయ్ పంపియ్యమన్నాడు దొర'' అని నౌకరు చెప్పాడు. ఇవతల వసారాలోని కిరసనాయిలు స్టవ్ ముట్టించుకోమని చెప్పి, చాపత్తా, చక్కెర, పాలు అన్నీ అందించింది శ్యామలమ్మ. జయ కూడా పని అందుకొని కప్పులు జమ చేసి ఇస్తోంటే ఆమెకెంతో సంతోషమైంది.

బయట కాస్త సద్దుమణిగింది. చాలామంది వెళ్ళిపోయినట్లున్నారు. ''రాజేశ్వరీ! నేను పెద్ద చేనుకాడికి పోయివస్తాను'' అని అక్కడనుంచే కేకపెట్టాడు వైకుంఠరావు. ఆయన లోపలికొస్తేనేమో, ప్రయోజకురాలైన మనుమరాలిని చూపించి, కాళ్ళకు మొక్కించుదామని అనుకొంది. ఆయన రానేలేదు.

రాజేశ్వర్ మాత్రం లోపలికి వచ్చి ఉయ్యాల బల్ల మీద కూచుని, మేనకోడలి వంక పరీక్షగా చూశాడు. విదేశాలకు వెళ్ళివచ్చిన నాగరికత, ఏదో సొంత ఇంట్లో ఉన్నట్లుగా ఒక చనువు కనబడ్డాయి. ఆమె ముఖంలో, చీర కట్టులో, కత్తిరించిన జుట్టు జాలులో ఆకర్షణ కనబడిందతనికి.

''ఇది పుట్టిననాడు పద్మక్కకి జబ్బుచేస్తే, దయతలచి మీ నాయన నన్ను దవాఖానకు తీస్కపోయిండు. చెట్టంత నా బిడ్డ కష్టాలకే ఖతమైపోయింది'' అని ఆపుకోలేకుండా ఏడిచింది

శ్యామలమ్మ. రాజేశ్వరరావుకి గొంతులో ఏదో కదిలినట్లయి, మింగలేక బాధపడ్డాడు. అక్క కంటే తాను చాలా చిన్నవాడు.

అంతట్లోనే శ్యామలమ్మ తమాయించుకుని, ''దీన్ని చూడరా. అదేదో దేశమట. అక్కడకు పోయి పెద్ద డాక్టరైంది. ఇంకా ఎన్నెన్నో దేశాలు తిరిగిందట. భాషలు నేర్చింది. లక్ష రూపాయలలో ఏమో తమికు సర్కారు ఇచ్చిందట'' అని చెబుతోంటే, ''అవన్నీ దేనికి అమ్మమ్మా'' అన్నది జయ.

అమె సోవియట్ యూనియన్‌లో చదువుకుందనీ, కేవలం ప్రతిభ వల్ల స్కాలర్‌షిప్పులు తెచ్చుకుందని, యూరోపులో కూడా ప్రయాణించి ఎంతో లోకజ్ఞానం సంపాదించిందని జయతో కాసేపు మాట్లాడాక తెలుసుకున్నాడు రాజేశ్వర్.

''రాజేశ్వర్ మామయ్యా! తాతయ్య ఎవరితో దెబ్బలాడుతున్నారు'' అన్నది, తాను కొంత ఇక్కడి పరిస్థితులు అర్థం చేసుకోవాలి కదా అని.

''మీ తాతతో దెబ్బలాడేటోళ్ళు ఈ గడ్డమీద పుట్టలేదమ్మా మనుమరాలా! అయన నోరు విప్పితే ఎంత జాగీర్దారయినా గానీ పిల్లిలా పారిపోవలసిందే'' అన్నది శ్యామలమ్మ.

రాజేశ్వర్ నవ్వాడు. ''నీ పేరు జయ కదూ! విక్టరీకి సంకేతం. చూడు జయా, అయన తిట్ల పంచాంగం తీసి సరిపెడితే ఫరవాలేదు. అంతే అనుకోకు. నీవు ప్రపంచ స్థాయిలో ఆలోచిస్తావు. కానీ, ఇక్కడ ఒక విచిత్రమైన ప్రపంచమే ఉంది. నీకు అర్థం కాదులే. మా నాయనకు కోపమొస్తే ఆడాళ్ళు, మొగోళ్ళు, చిన్నోళ్ళు, పెద్దోళ్ళని లేదు. లోకంల అన్ని తిట్లు ఉన్నాయని నాకే తెలవదు. కోపం మండిపోయే స్థాయిలో వస్తే, చెప్పులు తెగేదాకా అవతలోడిని కొడతడు. ముళ్ల కట్టె తీస్కొని పాలేర్లను బాదిండంటే అళ్ళింక అర్నెల్లవరకు పుళ్ళకు మందులు రాసుకుంట ఏడ్వవలసిందే.''

శ్యామలమ్మ తల వంచుకుని కూచుంది. నలభై ఏళ్ళ కాపురంలో తాను కూడా ఈ మర్యాదలన్నీ చవిచూసింది. జయ కళ్ళు పెద్దవైనాయి. ''అట్లా కొడితే ఊరుకుంటారా? పోలీసు రిపోర్టు ఇవ్వరా'' అని నాలిక్కరుచుకుంది. ''అంటే తాతయ్య లాంటి పెద్ద జమిందారుకి అటు వంటివి ఏమీ ఉండవేమోలే'' అన్నది.

రాజేశ్వర్ చిన్నగా నవ్వాడు. ''అసలు ఇక్కడి స్థితి నీకు తెలవదు. ఎప్పటికీ తెలవదు. పని బడి వచ్చినావు కదా అని చెప్తున్నాను. తాతల నుండి వందల ఎకరాలు కరుసు కాగా, కాగా మిగిలినది నూట యాభై ఎకరాల తరి, రెండొందల ఎకరాల ఖుష్కీ. తరి అంటే వెట్ - మాగాణి భూమి. ఖుష్కీ అంటే మెరక- డ్రైలాండ్'' అని జయ ఎంతవరకు ఎంటోందో నని ఆగాడు.

''చెప్పు మామయ్యా! నాకు తెలుసుకోవాలని చాలా ఇష్టం. మా అమ్మ కూడా చెప్పేది తాతయ్యకి కోపం ఎక్కువని. అందుకేగా ఇన్నేళ్ళు, మా అమ్మ ప్రాణం పోయాక కూడా చూడలేదు'' అన్నది.



''పోలీసులకి చెప్పే మొనగాడెవరైనా ఉన్నారనుకుంటున్నావా ఈ పల్లె మొత్తంలో? మా బాపుకెదురే లేదు. అయన చెట్టు, చేమ, పందిరి గుంజతో కూడా పని చేయిస్తడు. పట్వారీగిరిలో, జమాఖర్చుల లెక్కలలో గట్టి బుర్ర. అయితే, అయన కలం ముట్టేది లేదు. గుమాస్తాలు రాయవలసిందే. ఆఫీసర్లను, తాసిల్దారులను పటాయించడంలో ఎంతో గొప్ప ట్రిక్కు'' అని రాజేశ్వర్ చెబుతుండగానే బయట ఏదో గొడవ. రాజేశ్వరరావు వెనకాలే జయ కూడా బయటకు వెళ్ళింది. ''ఏంటి బాపూ, ఏమైంది? మీరంతా పల్లెనుంచి వచ్చింర్రా'' అని రాజేశ్వర్ కర్ర ఎత్తబోతున్న తండ్రికీ, వచ్చిన నలుగురు రైతుల మధ్యకు వెళ్ళాడు.

''దొరా! రెండు కుంటల కలిపి వంద తాడిచెట్లున్నాయి. మాకు అమ్మిన జాగాల్లనైతే యాభై ఉన్నయ్. అవి మాకే కద వస్తయి. అయి మేం కల్లు గీయొద్దంది, అకు, మట్ట కొట్టుకుపోవద్దంటే ఎట్ల దొరా? అంత అన్యాయం సేయకుంర్రి దొరా'' అని మొత్తుకుంటున్నారు ఒకరు.

వైకుంఠరావు ఉగ్రావతారుడైనాడు.

''అరేయ్! ఎన్నిసార్లు చెప్పాలిరా? నేను భూమినమ్మినాను గాని, చెట్లను అమ్మలేదు అని. ఆ చెట్లు నావే. నీకు దిక్కున్నచోట చెప్పుకో పో! ఇంకోసారి వాకిలి ముంగిట వచ్చినావంటే పళ్ళు ఇరగ తంత మూతిమీన'' అని కొన్ని తిట్లు గుమ్మరించాడు.

ఈ వితండవాదాన్ని కాదనే ధైర్యం ఎవరికీ లేదు. వాళ్ళు కూచున్నారు ఎంతోసేపు. కాసిని నీళ్ళు తాగి, ఆ చెట్టుకింద పైపంచె పరుచుకుని పడుకున్నారు. ఒకసారి చాయ్ పోసి, పచ్చడి బువ్వ వేడిగా పెట్టింది శ్యామలమ్మ. వాళ్ళలో వాళ్ళు మంతనాలాడుకున్నారు.

వైకుంఠరావు ఆలోగా మనుమరాలిని చూశాడు. పద్మ మీద తన కోపం గుర్తుకొచ్చి కొంత, ప్రయోజకురాలై విదేశాల్లో విద్యావంతురాలై వచ్చిన మనుమరాలు తన కాలు మొక్కుతోంటే కలిగిన సంతోషం కొంత - అంతటి కరుకు మనిషీ చలించిపోయాడు. కళ్ళు ఒత్తుకున్నాడు.

''మీరంత బాగేన బిడ్డా! మీ అమ్మ ఇల్లు కట్టిందట. మీ నాయన ఎప్పుడైన వచ్చి చూస్తడా'' అని ఎన్నో ప్రశ్నలు వేశాడు. జయ చిలకలాగ ముద్దుగా బదులిస్తే సంతోషపడ్డాడు.

దిక్కున్న చోట చెప్పుకోమన్నాడు కదా వైకుంఠరావు. వాళ్ళకి కనబడ్డది ఒకే ఒక దిక్కు. అన్నలు! వాళ్ళకే పోయి చెప్పుకున్నారు. తమ మీద అయన జులుం చేశాడు. ప్రతిరోజు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అన్నివిధాల దోపిడీ చేశాడు. ఆ వివరాలన్నీ విన్న అన్నలు అప్పుడు రంగంలోకి దూకారు. అట్నుంచి నరుక్కొని రమ్మన్నట్లు వాళ్ళు చాకలి, మంగలి, కటారి, వడ్లోళ్ళ దగ్గర్నుంచి ఉన్నవాళ్ళందరికీ పాఠాలు చెప్పారు. ఈ తిరుగుబాటు వ్యూహం పాలేళ్ళ దాక పాకింది. 'దొరకి ఊడిగం చేస్తూ మనం పడి ఉండాల్సిన పని లేదు. ఈ భూమి అందరిదీ. పండించిన కండరాలు మనవి. మన చెమటతో తడిసి పండిన ఈ పంటలు అయనెందుకివ్వాలి?' ఇలా ఆలోచించారు.

గ్రామంలోని ఈ వృత్తిపనివాళ్ళంతా ఒకనాడు సేవకులు, భృత్యులు. కానీ, ఈనాడు ఎదురు తిరిగిన కుర్రవాళ్ళ దళంతో వచ్చారు. కుర్రవాళ్ళే - కానీ, మీసాలు మొలిచిన

కుర్రవాళ్ళు. చేతిలో ఏదో ఒక పనిముట్టు, దౌర్జన్యానికి పనికివచ్చేది పట్టుకొచ్చారు. వారి కళ్ళల్లో నిప్పులు మండుతున్నాయా? లేదు. బతకాలన్న కాంక్ష మండుతోంది.

''దొరా! మేం చెప్పినట్లు నువ్వు వినకుంటే నీ కొలువు చేసేది లేదు. మీ చేలు పాడు బడతాయి. నీ ఇంటి గుమ్మం ఊళ్ళవాళ్ళు తొక్కరు. పనులన్నీ బందు పెట్టిస్తాం'' అని బిగ్గరగా, గుండెలదిరేట్లు చెప్పారు.

వైకుంఠరావు లోపల బాగా బెదిరిపోయినా, పైకి గాంభీర్యం పోగొట్టుకోలేదు.

''పొండిరా. మీరు నాకు చెయ్యకుంటే నాకు రోజులెల్లవా? పొండి. ఒరేయ్, ఇటు రారా. నువ్వెవర్రా? బిచ్చమెత్తుకొనే దచ్చినాడవు నా ముంగట నిలబడి మాట్లాడుతున్నావ్'' అని గాండ్రించాడు. రంకెలు వేశాడు.

ఆ సాయంకాలం, దాటుగా వాళ్ళ లీడరును పట్టుకోవాలని చూశాడు. వాడిని పటాయించి, నాలుగు పైసలు తినబెడితే లొంగుతాడనుకొన్నాడు. కానీ, అప్పటికే ఆ లీడరుకీ, అతని సభ్యులకూ తెలిసిపోయింది - వైకుంఠరావు దొర హిట్ లిస్టులో ఉన్నాడని. ఆయన భూమి, సొమ్ము మొత్తం మనదే అయేటట్లుంటే ఇంక ఈ చిన్న బేరం దేనికని వాళ్ళు మొరాయించారు.

ఇదంతా జరుగుతున్నప్పుడు జయ అక్కడే ఉంది. ఫోన్ లేదు. కారు లేదు. కనీసం తాను నడిపే మోపెడ్ అయినా లేదు. ఊరికి కోసు దూరంలో వచ్చే బస్సే ఆమెకు గతి హైదరాబాద్ పోవడానికి. అమెరికా నుండి ఫోన్ వచ్చి ఉండవచ్చు. ఇంటి పక్కన ఈ-మెయిల్‌లో చూసుకోవాలి. ఫ్యాక్సు కూడా వచ్చి ఉండొచ్చు. అమెరికాలో ఉన్నవాళ్ళు తీరుతీరులుగా గ్రీటింగ్ కార్డులు పంపిస్తారు. అత్యాధునిక ప్రణయానికి దారి చూపిన ఆ కథనంతా అక్కడ వదిలి తాను ఇక్కడ ఉండడమేమిటి? అమ్మమ్మ ముఖం చూస్తే కదల బుద్ధి కావడంలేదు. తల్లి లేని బావురుమనే కొంపలో చెల్లాయిలు ఎలా అలమటిస్తున్నారో అని ఆరాటం. చేతిలో డబ్బులు, గుండెలో కాస్తంత ధైర్యం. ముందుకే సాగాలనే పట్టుదల, ఏటికెదురీదగల బలం - అన్నీ ఉన్నాయి. అందుకే ఆకాశమంటే, అనంత శూన్యమంటే భయం లేని పక్షుల్లాగ ఆ ముగ్గురు అప్పచెల్లెళ్ళూ బతికేస్తున్నారు.

అమ్మమ్మకి ఏడుపొచ్చింది. ''తల్లీ! నువ్వు అమెరికాకు పోయే ముందు ఒక్కసారి ముగ్గురూ వచ్చి పొండ్రి. నేను కూడ మీకాడికి రావొచ్చును గానీ, మీ తాత పరిస్థితి ఏమీ బాగలేదు. ఇంత అన్నం ఉడకేసి పెట్టేవాండ్లు కూడా లేరు కదా. నా ప్రాణాలన్నీ ఆయన మీదే ఉంటాయి. పక్క పల్లెలో సావుకారు కుటుంబాన్ని ఖతం చేసిండ్రు. ఇంత ఆస్తి వదిలేటట్లు లేదు. పోనీ, ఉండేటట్లు లేదు'' అని ఎంతో సేపు తన మనసు విప్పి చెప్పింది.

''తాతయ్య అంత కోపంగా వాళ్ళని ఎప్పుడూ దావగొడుతూ ఉండొద్దు అమ్మమ్మా. వాళ్ళూ మనుషులేగా? ఒక్క రోజు కూడా ఆయన తన పని తాను చేసుకోలేడు గదా. వాళ్ళు లేకపోతే ఎట్ల బతుకుతాడు'' అన్నది జయ.



''ఆయనకు అట్లనే అలవాటైందమ్మా. తిట్టినా గానీ, తాతది పెట్టే చేయి. ఏటేట కట్నాలు, ధాన్యాలు పుట్లకు పుట్లు పంచిపెట్టేది ఆయనే. పనివాండ్లకు ఈ కాలంలో కడుపు నిండ బువ్వ పెట్టేవాండ్లు ఎవ్వరూ లేరు జయా'' అని వైకుంఠరావు బారీ గుణాన్ని వర్ణించింది శ్యామలమ్మ.

ఆ ఏడు నాగళ్ళు బందు పెట్టే పరిస్థితి తెచ్చారు. అంతేకాదు, వైకుంఠరావు దొర దగ్గర పాలేళ్ళెవరూ ఉండవద్దని దప్పుగొట్టి చెప్పారు. బురుజు లోపలి బంగళా బూజుపట్టి చెత్తతో నిండిన దశకు చేరుకున్నది.

ఈ కథ జరుగుతుండగనే జయ హైదరాబాద్ తిరిగివెళ్ళిపోయింది. అమెరికా వెళ్ళేందుకు వీసా తతంగం పూర్తి కావడం లేదు. తన పెళ్ళి తానే చేసుకోవాలంటే, అక్కడికే వచ్చేయమన్నారు వాళ్ళు. మనిషిగా జయను మెచ్చి, కోడలిగా స్వీకరించాలన్న వాళ్ళ స్థిర నిశ్చయం అట్లాంటిది. ఫారిన్ సంబంధం అనగానే లక్షలు, కోట్ల రూపాయల్లో కట్నాలు ఆశించే రోజుల్లో, జయను వరించిన వారి వైఖరి ఎంతో అభ్యుదయమనే చెప్పాలి.

ఉన్న డబ్బులో బట్టలు, రకరకాల డ్రస్సులు, పెళ్ళి తతంగానికి కావలసిన బాసికాలు, ఉత్తర జంధ్యాలు, ఉంగరాలు, మధుపర్కాలు - అన్నీ కొనుక్కొన్నది జయ స్వయంగా. అసలే చితికిన అమ్మమ్మను ఏమి అడగాలని, తానే పురోహితుడి దగ్గరికి వెళ్ళి, ఆడపెళ్ళివారిగా తాము జరిపించవలసినవి అన్నీ అడిగి రాసుకుంటుంటే, ఆయన జాలిపడ్డాడు, ముచ్చట పడ్డాడు. వివరంగా ప్రతి ఒక్క తతంగానికీ, వేడుకకూ ఉన్న అర్థాలు రాసి ఇచ్చాడు.

''ఒక్కసారి పోయి అమ్మమ్మను చూద్దామే! మిమ్మల్ని ఆమె కాళ్ళ దగ్గర పడేసి, మీకొక దిక్కున్నదని నాకు నేను ధైర్యం చెప్పుకొంటానే'' అని బతిమాలింది చెల్లెళ్ళను. వాళ్ళకి సెలవు దొరకాలి. చదువు మితిమీరిపోయి ఒక్క క్షణం తీరిక లేనట్లు తయారైనారు వాళ్ళు. అక్క ఫారిన్ నుండి తెచ్చిన బట్టలు, నకిలీ నగలు ప్రదర్శించుకోవడానికైనా కాలేజీకి వెళ్ళాలనే యువ ప్రాయం వాళ్ళది.

ఒక ఉదయం ఎక్కడి నుండో ఊడిపడ్డ నాన్నను చూసి హడలిపోయారు, చీకాకు పడ్డారు. సూట్‌కేసులో బట్టలతో వచ్చి, షేవింగు సెట్టు వగైరాలన్నీ పరిచేసి, లోపలి గదుల్లోకి వెళ్ళి సామాన్లు సవరిస్తూ, సెటిలయిపోదామన్నట్టు తిరుగుతున్న ఆయన్ను చూసి తెల్లముఖాలు వేశారు. అమ్మ పోనే పోయింది కదా. ఈయన్ని పెద్ద దిక్కుగా ఒప్పుకుని ఇంట్లో పెట్టుకోవచ్చనే ఆలోచనే ఎంతో అసహ్యంగా తోచింది. ఆయనొక విషపురుగు, జిత్తుల జంబుకం అని బుద్ధి తెలిసినప్పటి నుండి వాళ్ళు గ్రహించుకున్నారు. వీలున్నప్పుడల్లా డబ్బు దండుకుని పోతుంటే, ఆయన రావడంతోనే పర్సులు, బ్యాగులు, బ్యాంక్ పాస్, చెక్కు బుక్కులు అతి జాగ్రత్తగా బీరువాల్లోకి తోసేసే ప్రమాదంలో అమ్మ ఎప్పుడూ ఉండేది. ఒంటి మీద మెరుస్తూ బంగారు ముక్క కనబడితే గుంజుకుంటాడని వణుకు.

ఏవో కొనుక్కొద్దామని బయటికి వెళ్ళి జయ అప్పుడే వచ్చింది. సూట్‌కేసు ఎవరిదా అని ఆశ్చర్యపోతుండగానే తువ్వాలుతో తల తుడుచుకుంటూ లోపల బాత్‌రూమ్‌లోంచి బయ

టకు వచ్చి, పళ్ళు కనిపించేట్లు తన సంతోషాన్ని తెలుపుతున్న నాన్న! ''ఎందుకొచ్చావు మళ్ళీ'' అంది జయ.

ఆయన సరదాగా కోపం నటిస్తూ, ''నా ఇల్లు. నా పిల్లలు. రాకుండా ఉంటానా'' అన్నాడు.

''మా అమ్మ రక్తం చెమటగా కార్చి, రూపాయి, రూపాయి కూడబెట్టి కట్టిన ఇల్లు. నీది ఇందులో ఒక్క పైసా లేదు. ఇది మా ఇల్లు. తన పిల్లలు అనాథల్లా అలమటించకుండా మా అమ్మ కట్టించిన గూడు. ఇందులో నాగుపాములకి ప్రవేశం లేదు. పొద్దున్నే ఇంటికొచ్చావు గనుక ఇన్ని కాఫీనీళ్ళు పోస్తాను. తాగిపో'' అన్నది.

ఆయన వినిపించుకోలేదు. రూములోకి వెళ్ళాడు. అద్దం దగ్గరికి వెళ్ళి, ఉన్నవాటిలో మంచి దువ్వెన వెతికి తల దువ్వుకున్నాడు. అక్కడున్న ఫారిన్ పౌడర్లు, సెంట్లు వాసన చూస్తూ, దండిగా పట్టించుకున్నాడు. కాళ్ళు దులుపుకుని డబుల్ కాట్ మంచం పైన వాలబోతుంటే, ''నువ్వు అక్కడ పడుకోవడానికి వీల్లేదు'' అని గట్టిగా అరిచింది జయ. అమ్మకి ద్రోహం చేసిన మనిషి పెద్ద దిక్కుగా, సర్వాధికారినన్నట్లు వచ్చి, ఇంట్లో తిష్టవేయడం భరించరాని సంగతి.

''నేను ఇక్కడే పడుకుంటానే. మీరు చిన్న పిల్లలు. రెక్కలు రాని పక్షులు. గాలికి వదిలేస్తే నలుగురూ నన్నే తిడతారు. పెళ్ళికాని ఆడపిల్లలు ముగ్గురూ ఒకరి అధీనంలో ఉండాలి. ఆ బాధ్యత నాదే కదా తల్లీ'' అని కంఠం మార్చి ఎంతో అనునయంగా చెప్పారు.

జయ కస్సుమని లేచింది. ''మా అమ్మని అంత ఉద్ధరించావు. ఇంక మా పెళ్ళిళ్ళు, పేరంటాలు జరిపిస్తావా? చాలు, వెంటనే లేచి వెళ్ళిపో. వెళ్ళకపోయావా'' అని ఆమె చెయ్యి ఎత్తబోయింది.

ఆయన మంచం మీద నుంచి లేచాడు. ఎత్తిన ఆమె చేతిని మెలిబెట్టాడు. ఆమె మూలిగింది.

''ఏమే రాక్షసిలాగ విరుచుకుపడుతున్నావు? మిమ్మల్నందర్నీ చితక తన్ని ఒక గదిలో పడేసి, ఈ ఇంటి యజమానిగా మిమ్మల్ని తైతెక్కలాడించగలను. పిల్లకాకీ, ఏమనుకుంటున్నావే'' అని మరోసారి ఆమె మీద దౌర్జన్యం చేయబోయాడు.

మిగిలిన ఇద్దరు పిల్లలూ వచ్చి నాన్నకీ, అక్కకీ మధ్య నిలబడ్డారు. ''అక్కా, దూరంగా రా అక్కా. ఆయనేం చేస్తాడో? మాకు భయం వేస్తోంది జయా'' అని గొడవగా అరుస్తూ అక్కను హాల్లోకి లాక్కెళ్ళారు.

''ఒసేయ్, చిన్నవాళ్ళు, మీకైనా బుద్ధుంది. నా సత్తా ఏమిటో మీకు తెలుస్తోంది. ఈ ఇంటికీ, డబ్బుకీ, మీ ముగ్గురికీ నేనే యజమానినే. మీ దుంపతెంచి ధూపమేసి దారిలో పెడతానే'' అంటూ రంకెలు వేయసాగాడు.

పిల్లలు ముగ్గురూ వణికిపోయారు. ఈయన్ని గౌరవించడం ఎలా? ప్రేమించడం సాధ్యమా? అమ్మ ఫొటో అతి దీనంగా, వాడిన జాజిపూల వాసన లోంచి ఏడవలేక నవ్వుతున్నట్లు బల్లమీద



ఫ్రేములో. ఈయన్ని ఇంట్లోకి రానిచ్చి పెత్తనమంతా ఒప్పగిస్తే, రెండు నెలల్లో కొంప గుల్ల చేసి పెడతాడు. తాను వెళ్ళిపోతే, ఈ చిన్నపిల్లల్ని అదించి, ఏ భ్రష్ట స్థితికి తెస్తాడో తెలియదు. ఆ ప్రమాదం లోంచి వీళ్ళను తప్పించాలంటే ఇప్పుడే తెంచి పారేయాలి.

జయ చెల్లెళ్ళ పట్టు నుంచి విడిపించుకుంది. ''నువ్వు తండ్రివి కాదు. మమ్మల్ని మాయ బుచ్చి, అమ్మ సంపాదించినదంతా కాజేయడానికి వచ్చిన దొంగవి. ఇన్నాళ్ళూ గాలికి ఎలా బతికావో, తాగి తందనాలాడుతూ, ఎవరి నెత్తినో చేయి పెట్టి అన్నం తింటున్నావో అల్లాగే ఉండు. అమ్మ కంటే ముందే నాన్న పోయాడని సమాధానపడ్డాం. ఇప్పుడింక నువ్వు పిశాచిలాగ వచ్చి, మమ్మల్ని పీడించకు. దీన్ని దెయ్యాల కొంప చేయకు. గెటౌట్'' అని గొంతు చించుకుని అరిచింది.

ఆమె కళ్ళల్లో మెరుపులు, ఆయన మీద విసరడానికి చేతుల్లో పట్టుకున్న వస్తువులో ఎంతో శక్తి. తాను విజృంభించాలి. ఈ దుష్టశక్తిని తరిమికొట్టాలి. తాగివచ్చి, తూలుతూ అమ్మని కొట్టి, తిట్టి, ఏడుస్తున్నా, కాళ్ళ మీద పడుతున్నా వినకుండా, ఆడపిల్లలు ముగ్గుర్నీ దరిద్రమైన అసహ్య దృష్టితో చిరకాలం చూసిన ఈ నరరూప రాక్షసుడిని తన్ని తగిలేయాలి. జయ ఉగ్ర రూపం చూశాడాయన. భయపడ్డాడా, బెదిరిపోయాడా? ఇదే చివరిసారి వీళ్ళతో తలపడడం అనుకున్నాడా? ఏదైనాగాని, గబగబ బట్టలు తీసుకుని సూట్‌కేసులో సర్దేసి మూసేశాడు. ఆమె చేతిలోని ఫ్లవర్ వేజు విసరనే విసిరింది. వీపు బద్దలయ్యేట్లు అతనికి కొట్టుకుని కిందపడింది. ''అబ్బా'' అని అరిచాడు. వెనక్కి తిరిగి, చేతికి అందిన వాళ్ళ చెప్పులు, బట్టలు అన్నీ విసిరి కొట్టాడు. పిల్లలకి అవి తగిలాయి.

అయినా, జయ ఆగలేదు. అపరశక్తిలా విరుచుకుపడింది. సూట్‌కేస్ గుంజుకుని వీధిలో పారేయబోయింది. ''మమ్మల్ని శాంతంగా బతకనివ్వు. తల్లి లేకపోయినా, ఆమె మాకిచ్చిన నీతి, ధైర్యం మాలో ఉన్నాయి. నీలాగ బజారున పడి బతికేవాళ్ళం కాదు. ఇన్నాళ్ళూ నీకెవరు తిండి పెడుతున్నారో, ఎవరి పంచన కుక్కలా పడివుంటున్నావో అక్కడికే పో'' అని అరచింది. గొలగొలగా కేకలేసింది. ఆయనింక లాభం లేదనుకున్నాడు. ఈ బాల కాళికావతారాల ముందు తానింక నిలువలేనని తోచింది.

పోతూ ''గుర్తుంచుకోండే! దిక్కులేకుండా, పరువు లేకుండా చెట్టుకీ, పుట్టకీ తలొకరూ అయిపోతారే! ఒంటరిగా చస్తున్నారని వచ్చాను గాని, మీరు పడేసే మెతుకులకి ఆశపడి వచ్చే కాకి వెధవను కాను. జన్మనిచ్చిన తండ్రిని కొట్టి వెళ్ళగొడుతున్నారు కదటే? మీకు పుట్టగతులుండవు'' అంటూ శాపనార్థాలు పెట్టాడు.

ఆయన వెళ్ళాక తలుపేసుకుని, గుండెలవిసేట్లు ఒకరిని చూసి ఒకరు ఏడిచారు. తల పట్టుకుని ఏం చేయాలో తోచక కూలబడ్డారు. తమ ప్రవర్తన తమకు బాగుండలేదు. ఆవేశం అలా అవహించింది. తిరిగి తీసుకురాలేని అమ్మ పడిన యాతనలు, వాళ్ళ మనసులో చేదు విషంగా మిగిలాయి. జ్వాలగా రగిలాయి.

జయకి ఆ రోజే ఫోన్ వచ్చింది. అమెరికాలో వాళ్ళు ముహూర్తం పెట్టించారు. రెండు నెలల వ్యవధి ఉంది. ఈలోగా బోలెడు పనులు.

''చెల్లీ! మనం ఒక్కసారి అమ్మమ్మని చూసివద్దాం. మనని పలకరించే వాళ్ళే లేని ఈ దిక్కులేని స్థితి ఎందుకే'' అన్నది జయ కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ.

''అక్కా! మనకెందరో స్నేహితులు ఆసరాగా ఉండగా, నువ్వెందుకు భయపడి పోతున్నావ్? అమ్మని కనీసం ఇరవైనాలుగేళ్ళు చూడని తాతయ్య చచ్చిపోయినా వచ్చి ఆ కట్టెను చూసి ఏడవని అమ్మమ్మ మనకెలా దగ్గరవుతారే'' అన్నది పెద్ద చెల్లి.

''కాదే! నాకు అమ్మమ్మ దగ్గరుంటే కడుపులో ఏమిటో చల్లగా ఉంటే! అన్ని భయాలూ పోయి, ఆమె దయలో మునిగిపోయినట్లు నిశ్చింతగా ఉంది. రక్త సంబంధానికి అంత శక్తి ఉంటుందని నాకు అప్పుడే అర్థమైంది. మిమ్మల్ని తీసుకెళ్ళి ఒక్కసారి వాళ్ళకి చూపించకపోతే, ఆ ఇంట్లో ప్రేమగా పెట్టిన ముద్ద తినకపోతే, మీరు ఎంతో కోల్పోతారు. నేను కూడా మనసు కుదుటపరచుకొని పోలేను'' అంటూ జయ తడిగొంతుతో చెప్పింది.

ఇల్లు తాళాలేసి చుట్టుపక్కలవారికి చూస్తూండమని అప్పగింతలు చెప్పి, విలువైనవి బ్యాంక్‌లో దాచి, అన్ని పనులూ సమర్థవంతంగా చక్కబెట్టుకుని ప్రయాణమైనారు. అంత దూరాన ఊరు కనిపిస్తోంటే, ఆ పిల్లలు సంతోషంగా చూడసాగారు. ఆధునికమైన డ్రస్సులు, కత్తిరించిన జుట్టు, ఖరీదైన సూటుకేసులు, బ్యాగులు - వాళ్ళేదో లోకం నుంచి దిగి వచ్చిన వాళ్ళలాగ కనబడ్డారు. వైకుంఠరావు దొర ఇంటికి వెళ్ళాలంటే, బస్సు నుంచి ఉన్న దూరం మూడు కిలోమీటర్లు ఎవరైనా బండి కడతారు. ఎక్కువ మంది ఊరికి నడిచేపోతారు, బోలెడు బరువులు మోస్తూ.

భోజనం వేళకి ఇంటికి చేరారు. మామయ్య ఎదురొచ్చాడు. స్వాగతం పలుకుతున్నట్లు ఎంతో సంతోషం, నవ్వు అతని ముఖంలో. చిన్నవాళ్ళిద్దర్నీ చూసి మరీ మురిసిపోయాడు. ''అంతా అక్క పోలికే'' అన్నాడు. మనుమరాళ్ళను ఎన్నో విధాల గారాబం చేసింది శ్యామలమ్మ. ఉడుకుడుకు నీళ్ళు పోసుకొని, సువాసన సాంబ్రాణి ధూపాలేసుకుని, కాళ్ళకి పసుపు, పారాణి పెట్టుకొని సంబరంగా తిరిగారు. వెన్నకాచిన నేతితో భోజనాలు చేసి, మధ్యాహ్నం సకినాలు, భక్ష్యాలు తింటూ తమ పట్నం జీవితాన్ని మరిచిపోయారు. అమ్మను తలచుకుని కన్నీటి బొట్లు విడుపుతూనే ఉన్నారు.

జయ ఇప్పుడు కూడా మళ్ళీ అడిగిన ప్రశ్న - ''తాతయ్య ఏది అమ్మమ్మా'' అని. శ్యామలమ్మ నిట్టూర్చింది. ''పోలీసులతో మంతనాలకు పోయినాడమ్మా'' అన్నది.

జయకి నిజంగా భయం వేసింది. ''పోలీసులా? ఎందుకమ్మమ్మా, భయం వేయదూ వాళ్ళను చూస్తే?''



శ్యామలమ్మ గొంతు తగ్గించింది. ''అన్నలు కానా పరేశాన్ చేస్తున్నరు. ఏ రోజు ఎట్ల బతుకతమో తెలవదు. చిట్టీ రాసి పంపించిండ్రు. సేనికాడ కుప్పవేసే పాలేళ్ళను బెదిరించి దోచుకున్నారు. దొర, దొర అని ముంగలనైతే పిలుస్తరు కానీ, ఎప్పుడు కసిగ ఎల్లకొడదామా అని ఆలోచన. అన్నల నుంచి బచాయించాలంటే పోలీసులతో దోస్తీ తప్పదని అనుకున్నడు తాత. అందుకే పోలీసులకి తినబెడుతున్నడు. ఇది తెలిసిన అన్నలు ఇంకో చిట్టీ పంపించిండ్రు లక్ష రూపాయలు తొందరగా కట్టమని. ఊరవతల చెట్టు కిందకి రమ్మన్నరు. అది చూసి తాత ఆగమాగమైపోయి, ఊరిడిచి పారిపోయిండు'' అంటూ వణ్కింది చెబుతోంటే, మనమరాళ్ళు దగ్గరగా ఒదిగి కూచుని కళ్ళు పెద్దవి చేసి విన్నారు. ''పోలీసులొచ్చి అన్నలను పట్టుకుని పోవచ్చుకదా అమ్మమ్మా'' అన్నది జయ.

''ఎంతమందినని పడతరమ్మా? ఎంతమందిని స్టేషనులో పెడతరు? అసలు అందరూ ఒక ఊరి వాళ్ళయితిరి. సిన్నప్పటినుంచి ఒకరికొకరు ఎరుకఉన్నవాళ్ళే: అన్న, బాబు, భయ్యా అని పిలుచుకొన్నవాళ్ళే. ఇప్పుడు అన్నలు ఎంతకైన తెగించేటట్లున్నరు. మందుపాతరలు పెట్టి జీపులు లేపేస్తున్నరు. రైలు స్టేషన్లు, పంచాయతీలు, పెద్ద దొరల ఇండ్లు అన్నీ కాల్చిపడేస్తున్నరు. దాటుగ నిలబడి పోలీసు ఖాకీ కనిపిస్తే చాలు కాల్చేస్తున్నరు. తాత పోలీసుల మనిషని తెలిసినాక, ఏంచేస్తరోనని గుబులైపోతున్నది'' అని కళ్ళల్లో నీరు నిండిపోతోంటే కంఠం తడబడింది.

''అమ్మమ్మా, మీరిక్కడ ఉండొద్దు. అమ్మ కట్టించిన ఇల్లు చిన్నదైనా నాలుగు రూములున్నాయి. మండాలున్నాయి. చుట్టూ స్థలముంది. అక్కడికి వచ్చేయండి అమ్మమ్మా'' అన్నది చిన్నది.

శ్యామలమ్మకి నవ్వొచ్చింది. ''మా తల్లే! నీకింత ప్రేమ ఎట్లా వచ్చిందో? ఇంత ఆస్తి, పంటలు, జాగిర్ వదులుకొని ఎక్కడికి వస్తామమ్మా? లక్ష రూపాయలు ఎట్లనైన ఇస్తే కూడ అన్నలు ప్రాణాలు తీయాలనే చూస్త ఉంటరు! దొరలు వాండ్లను పండల ఏండ్లుగ సతాయిస్తున్నారని, దాని రంపాన పెట్టి పెట్టి చాకిరీ చేయించారని కోపం. దబ్బులపై వడ్డీలు తిప్పుకునే షావుకార్లంటే కోపం. కనిపిస్తే చాలు పిట్టల్లాగు కాల్చిపారేసే పోలీసులంటే కోపం. బంగాళాలల్ల ఉంటూ, మోటార్లల తిరిగే బడా నాయకులంటే కోపం. అన్నిటికీ కత్తులు, తుపాకులు, బాంబులు, మందుపాతరలు తయారుచేసి సిద్ధమౌతున్నరు బిడ్డా'' అని ఉద్యమాన్ని వివరంగా చెప్పింది శ్యామలమ్మ.

వైకుంఠరావు తాత పరారీలో ఉన్నాడని అర్థమైంది పిల్లలకి.

ఏడబోయిండు దొర, ఎప్పుడొస్తడు అని అడుగకుండనే ఊరోళ్ళ పన్ల చేస్తున్రు. పాటక్ బయటనే నిలబడి, 'ఏం పన్జేయమంటవు దొరసాని' అని అడిగేటోళ్ళు. ఈరోజు మనకు అర్థమైతున్నరు. ఎన్నాళ్ళిట్ల తాత ఇల్లిడిసి అడవుల్లోనో, దూరం పల్లెల్లోనో దాక్కునేది అని ఏది తోచక, నేనే ఆ పోరగాండ్లను - వాళ్ళు సిన్నాళ్ళయినాగానీ పేరు అన్నలే - వాండ్లను పిలిచి బేరం

పెట్టిన. దొర ఎంతో మంచోడని వాండ్లకు సమఝూయిందిన. మాట దెబ్బ కొట్టినట్టున్న గాని, మనసు ఎన్నఫూస అని, ఒక్క పైస కూడ ఎదదాది పెట్టలేదని చెప్పిన'' అంటూ ఆగింది శ్యామలమ్మ.

''నువ్వట్ల చెబితే నమ్మారా అన్నలు'' అన్నది పెద్ద చెల్లె. శ్యామలమ్మ తల అడ్డంగా ఊపింది.

''మునుపురాయిందింట్రు. అందరూ ఒకే తీరుగ నవ్వబట్టింట్రు. వాండ్లు నా మాట నమ్మ లేదమ్మా! మీ తాత ఇంట్ల బంగారం, వెండి ఏతానో పాతరేసి ఉన్నాయని అనుకుంటుంట్రు. లక్షలకు లక్షలు రూపాయలు దాచిపెట్టింట్రు అంటుట్రు. మీ తాత పోలీసులతో దోస్తీ చేసి, ఎట్లయిన అన్నలను బెదిరించగలను అనుకున్నడు. నర్సిలురెడ్డి తాతకు ఒక కొడుకువోలె దగ్గరైపోయి, రెండురోజులకొక మారైన మనింటికొచ్చి నేను అన్నం, రొట్టెలు, మిఠాయి పెడితె తినిపోతుండె. నర్సిలురెడ్డి ఈ ఊళ్ళల్ల వచ్చినప్పుడల్ల పోరగాళ్ళందర్ని దొరికినోళ్ళను దొరికినట్టు లోపలేసి గొడ్లను బాదినట్టు బాదుతుండె. ఊరు మొత్తం తాతకు ఖిలాఫయిపోయింది. అంత అల్లకల్లోలమాయె. ఎవ్వళ్ళకు మూడో కంటోనికి తెలియకుండ ఆగం చేసిండు నర్సిలు. మొగోళ్ళందరూ గుట్టలు పట్టుకునిపోతే, సీఆర్పీవోళ్ళు ఆడోళ్ళని బిడాయిండారు. అందర కందరు తాతమీద, ఆయన కుటుంబం మీద అగ్గిమీద గుగ్గిలమైపోతుండ్రమ్మా'' అని పూస గుచ్చినట్టు ఊరిలో తమ పరిస్థితి గురించి చెప్పింది. ఎంత ప్రమాదంలో ఉన్నారో జయకూ అర్థమైంది.

''అమ్మమ్మా రష్యాలో కూడా స్టాలిన్ అనే ఆయన చాలా క్రూరుడు. ఆయనకు ఎంతో శక్తి. తనకు అడ్డువచ్చిన వాళ్ళను చంపించాడు. సహనం లేదు. తనకి దాసోహం అనని వాళ్ళమీద దయలేదు. తన సహచరుల మీద కూడా అభిమానం లేదు. తానూ లెనిన్ అంత గొప్పవాడినను కునేవాడు. కాని, ఆ మహామహుని దయ, మానవత్వం ఈయనలో లేవు. అయినా, తాను ప్రపంచానికి దేవుడివలె అన్నిచోట్లా వ్యాపించాలన్నాడు. తన శిలా విగ్రహాలు ప్రతి మూలా పెట్టించాడు. ఆయన సమక్షంలో ఎవ్వరూ నోరు మెదపడానికి లేదు. మెదిపితే తలకాయ లేచిపోయిందన్నమాటే. స్టాలిన్ నోట్లో నుంచి వచ్చిన ప్రతి మాటా అతి పవిత్రం. మనుషులకు స్వాతంత్ర్యం అంటేనే బూర్జువా అన్నాడు'' అని తనకి తెలిసిన చరిత్ర చెప్పింది.

శ్యామలమ్మ నిట్టూర్చింది. ఆమెకి ఈ మాటలేవీ అర్థం కాలేదు కాని, తాతయ్య కూడా ఎంతో దుష్టుడని అంటోందని తెలిసింది. ''మీ తాత మనిషిగా ఎంతో మంచోడమ్మా! మన ఇంటి ముంగల బిచ్చానికొచ్చినోడు 'దొరా, నీ కళ ఏంది' అని బెదిరిస్తున్నడంటే ఓర్వలేకున్నాడు. ఈ ఇలాకా మొత్తంల తన ఇంట్ల బువ్వ తిననోడు, తాను కొలిచి ఇచ్చిన దాన్యంతో కండలు పెంచనోడు లేడని ఆయన నమ్మిండు. ఆ నమ్మకం మీద దెబ్బ కొట్టేవరకు ఉగ్రుడైపోయినడు'' అన్నది.

ఒక్కరోజులో ఊరి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితి, అన్నలవల్ల తలయెత్తిన విప్లవం



గురించి ఏదో కొంత తెలిసినట్లనిపించింది ఆ అప్పచెల్లెళ్ళకు. అంటే ఎప్పటికీ దౌర్జన్యమే నెగ్గుతుందా? దౌర్జన్యం చేయబోయిన నాన్నను తాము తరిమి కొట్టారే! రక్త సంబంధం ఉన్న తండ్రినే తాము అంత ద్వేషించారంటే, తమను పీల్చి పిప్పి చేసి, మృగ జీవితానికి దిగజార్చిన భూకామందులంటే యువ జనానికి మంట పుట్టిందంటే ఆశ్చర్యముందా? వెట్టి చేసినా, కండలు కరిగింది, ఎముకలు పిండి చేసుకుని, పని జీవితాలను బుగ్గి చేసుకొని, ఏళ్ళకి ఏళ్ళు తరతరాలు మట్టిలో బతుకుతూ, మట్టిలోనే కలిసినా కనికరం ఉందా? ఏమిటా అహం, ఏమిటా అధికారం, జులుం, కసాయితనం, ధనమదం, కుల మదం, వర్గ సవాలు గిరి? ఇంత లోతుగా ఆలోచించి, జయ తన భావాలు చెల్లెళ్ళకు చెప్పింది. మామయ్యతో చర్చించింది. అమ్మమ్మను ఆనుకొని కూచుని, ఈవిధంగా ఆవేశంగా ఆమె మాట్లాడుతోంది, శ్యామలమ్మ నోరు తెరుచుకుని విన్నది. ''అయితే బిడ్డ! మీ తాతదే తప్పు అంటున్నవా? ఈ పోరగాండ్లు చేసేది సరైనదే అంటావా'' అన్నది ఆగలేక.

''అమ్మమ్మా! ఆలోచించు. వాళ్ళ కడుపు మంట నిజం. వాళ్ళ గుండెల్లో రేగిన నిప్పూ నిజమైనదే. కణకణమని మండుతోంది. కానీ, వాళ్ళకి దారి తెన్నూ తోచక, మనుషులను చంపడం, దోపిడీలు చేయడం మంచిది కాదు. అమాయకులు కూడ బలైపోతారు. సంఘం దిగజారి పోతుంది. మానవత్వం విలువలు మసైపోతాయి. పిల్లలకి చదువులు లేక, ఆడవాళ్ళకి ఆరోగ్యం లేక, యువకులకు చేసే పనిలేక, ఉన్నా చేసుకుందామనే బుద్ధిలేక, పెద్దలకు శాంతిలేక అస్త వ్యస్తమైపోతుంది వ్యవస్థ. ఇట్లా బలిచేయడం, ఒకరినొకరు చంపుకోవడం న్యాయమేనంటావా? ఈ భూగోళం మీద ప్రతి ఒక్క దేశం ముందుకుపోయి, కొత్త కొత్త సుఖాలను సృష్టి చేసుకుంటు న్నాయి. మన ఈ పవిత్ర భారతదేశంలోనే కొన్ని ప్రాంతాలలో కిరాతకమైన బతుకునే ఖాయం చేస్తోంది. కత్తితో, తుపాకితో ఎవరిని ఎవరు దారిలో పెట్టగలరు'' అని సవాలు చేస్తున్నట్లు అడిగింది.

ఇంతకీ జయ ఎవరిని తప్పంటోందో ఆమెకు తెలియలేదు. పాపం ఆ పెద్ద ముత్తయిదువ ఏం చెబుతుంది? తన కళ్ళ ముందు ఏమి ఘోరాలు జరుగుతాయో అని వణికిపోతోంది.

ఒక పొద్దున్నే ఒక వార్త వచ్చింది. వైకుంఠరావు ఊరికి దక్షిణాన కడుతున్న ఇల్లు కూలగొట్టి, గోడలు మాత్రం ఉంచారు అన్నలు. భూములన్నిటిలో ఎవరైనా కొంటే ఖబడ్దార్ అని ఎర్ర జెండాలు పాతారు. కొన్నవాళ్ళను లేపేస్తామని అక్కడా చిట్టీలు పెట్టారు. వైకుంఠరావుకి పంతం ఎక్కువైంది. పోలీసులని, ముఖ్యంగా నర్సిలు రెడ్డిని అడ్డుపెట్టుకొని, వాళ్ళని బాగా దువ్వి తనకు ప్రత్యేక రక్షణ ఏర్పాటు చేసుకుందామనుకున్నారు. కానీ, పొంగెత్తి వస్తున్న జనవాహిని ముందు పదిమంది పోలీసులనగా ఎంత? వారెవరు, వీరెవరు. అందరిదీ ఒకే భాష, ఒకే జాతి, తమ లాగే వారు జొన్న అంబలి తాగి పెరిగి పెద్దయినవాళ్ళే. తమతో కలిసి కాయ, కసురు పంచు కుని తిన్నవాళ్ళే. అయితేనేం, ఈ విప్లవం వల్ల పగవారైపోయినారు. పోలీసులు శత్రువులు. న్యాయం విచారించకుండా పిట్టలలాగ దళం వారిని కాల్చి చంపుతున్న ఆ పోలీసు అధికారులు

పరమ శత్రువులు. వారి అండ చూసుకొని, ఎత్తులకు పైఎత్తులు వేసి, అడవిని సొంత సామ్రాజ్యంగా అనుకుంటున్న భూస్వాములు అందరికంటే పెద్ద శత్రువులు.

ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. ఒకసారి ఎనిమిది మంది కుర్రవాళ్ళు – ఎనిమిదిమంది, ఆశల కుసుమాలు వికసించని చిన్నారి బాబులు నేల కూలారు. అడవిలోని ఎండాకులపైన వారి రక్తం ప్రవించి, ఎండిపోయి దారికట్టింది. పోలీసుల చేతులు తీట వదుల్చుకున్నాయి.

పది రోజుల తర్వాత వైకుంఠరావు ఇంటికి వచ్చాడు. ముగ్గురు మనుమరాళ్ళను చూసి మురిసే స్థితిలో లేడాయన. వాళ్ళ పేర్లు కనుక్కొని ఏమేమి చదివారో తెలుసుకుని ''మా ఊర్లు బాగున్నాయా'' అని ఒక నవ్వు తెచ్చి పెట్టుకుని పలుకరించాడు. కానీ, ఆయన జీవన్మరణ సమస్య మధ్య కొట్టుకుంటున్నాడు. పిల్లవాళ్ళకు దాసోహమని వాళ్ళు ఆడించినట్లు ఆడలేడు. వారడిగినంత డబ్బులు ఇవ్వడానికి తన దగ్గర లేవు వాస్తవానికి. పోలీసులు తనని ఎంతవరకు కాపాడగలరో తెలియదు. పల్లెలో ఈ చివర నలుగురు పట్టుబడితే, ఆ పల్లె ఆ చివర పదిమంది విజృంభిస్తున్నారు.

ఆ రాత్రి పెద్ద పేలుడు చప్పుడు వినబడింది. సర్కిలురెడ్డి బలగం అడవిలోని దొర్లన్నకారులను గాలించడానికి బయలుదేరింది. ఆ సంగతి అన్నలకి తెలిసింది. చిన్న వంతెన దగ్గర మందుపాతరతో జీపు ఎగురకొట్టారు. ఎనిమిది మంది పోలీసులు పోయారు. సర్కిలు రెడ్డి, వైకుంఠరావుకి ఎంతో కావలసినవాడు. కన్ను మూశాడు.

ఆ కుట్ర పన్నినవాళ్ళు ఎవరో, ఏ దళంలోని సభ్యులో పోలీసులకి తెలుసు. వైకుంఠరావుకి కబురు తెలిసింది. వివరాలు తెలిశాయి. తునాతునకలైన కాళ్ళు, చేతులు, మొండాలు, ఆకాశంలోకి చూస్తున్న తేలవేసిన కళ్ళు, భయానక దృశ్యం చూసి వచ్చినవాళ్ళు వర్ణిస్తే విన్నాడు. తాను ఆ దరిదాపులకి వెళ్ళే ప్రశ్నేలేదు. ఇప్పటికే ఆయన ఇన్‌ఫార్మర్‌గా, బాగా తినబెడుతున్న దగుల్బాజీగా అన్నలు గుర్తించారు. కొన్ని రోజుల క్రితమే కొందరు కుర్రవాళ్ళు, దళంలోని వారు బిటయినారని సంతోషించాడు. కానీ, వారిలో కక్ష రగిలి పోలీసులపైన బదులు తీర్చుకున్నారు. దెబ్బకు దెబ్బ, మరణానికి మరణం బదులు తీర్చుకున్నారు.

శ్యామలమ్మ, రాజేశ్వర్, మనుమరాళ్ళు అందరూ వణికిపోయారు. తమ నెత్తిన ఉండనుకున్న ప్రభుత్వ పోలీసు గొడుగు ఎగిరిపోయింది. తమను కాపాడుతోందనుకున్న అభయ హస్తం వేలు, కీలు ఊడిపోయింది. పత్రికా ప్రకటనలు, ఘాతుకాన్ని నిరసిస్తూ ఉపన్యాసాలు, ఎర్రని మరకల ఫోటోలు, సంతాప వచనాలు, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు అన్నీ అయినాయి. ఒక వారం తరువాత చనిపోయిన సర్కిలు రెడ్డి బంధువు వచ్చి, ''దొరా! నీకు సాయం నేనుంటనుగానీ, రిటన్‌గా ఏమిస్తవో చెప్పు. నువ్విస్తే దాన్ని బట్టి ఈ చుట్టుముట్టు ఉన్న అన్నలందర్నీ లేపేస్తా. ఇంక నీకు పరేశాన్ ఉండదు. నీ దిక్కు వచ్చేవాడుండడు'' అని చెప్పాడు. వైకుంఠరావు వేరే గతిలేక, తనని బెదరిస్తున్న వాళ్ళమీద కంప్లయింట్ రాసిచ్చాడు. రెండూళ్ళకూ మధ్య పోలీసు బలగం చేత క్యాంపు పెట్టించాడు. పోలీసు రికార్డులలోకి ఎక్కిన అన్నల



పేర్లు కచ్చితంగా రాసిన వైకుంఠరావు శాశ్వతంగా బయటపడిపోయి, వాళ్ళ పక్షం అని అందరికీ తెలిసిపోయింది. ''మా మీన కంప్లయింట్ రాస్తవ'' అని వాళ్ళకి ఉగ్రంగా కోపం వచ్చింది.

ఏ క్షణాన ఎక్కడ తుపాకీ పేలుతుందో తెలియదు. ఎవరిని పగబట్టి మందుగుండు, బాంబులు పెడతారో తెలియదు. వెల్లువలా ఆవేశం వచ్చిందంటే ఏ ఊళ్ళో జనం మీదపడి ఏం చేస్తారో తెలియదు. ఎన్‌కౌంటరో, దాడో, ఊచకోతో, వెన్నుపోటో, పట్టపగలు నడివీధిలో హత్యో – అన్నీ సాధ్యమే. పద్ధతి ఏదైనా, పేరు ఏది పెట్టినా పర్యవసానం ఒకటే – చావు. నిలువునా ప్రాణాలు కత్తిరుటనే తీసేసి, బొందలో పడేయడమే. ఇందులో ఆటవిక న్యాయం ఉందా? మృగరాజ్య విధానం ఉందా? 'ఎవరు ఎవరి కోసం, ఎందుకోసం, ఏ లక్ష్యంతో ఈ మారణహోమానికి దిగుతున్నారో విశ్లేషణ అరంభించేసరికి శవాలు పోతున్నారు. చర్చ ప్రాథమిక దశకు వచ్చేసరికి వేలకొద్దీ ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. జనాభా లెక్కల్లో పెద్ద మార్పులు వచ్చేస్తున్నాయి.

ఆ కారులో వరిపంట ఇబ్బడి ముబ్బడిగా పండింది. వర్షాలు భారీగా కురిశాయి. బావుల్లోనూ నీరు పుష్కలంగా ఉంది. కరెంటు కోతలూ తక్కువే. అప్పటికింకా వైకుంఠరావు పాలేళ్ళు విప్లవం ప్రకటించలేదు. కష్టం ఒడిగి పని చేశారు. బంగారు పంట ఇంటికి చేరాక హారతులిచ్చి, ఎడ్లకు పసుపు కుంకాలు పెట్టి ఆహ్వానించుకొన్నారు, దొరసాని శ్యామలమ్మ, ఆమె పట్నం మనుమరాళ్ళు.

ధాన్యం కొట్లాలు నిండాయి. గుమ్ములో ధాన్యం పెట్టి, పైన పెండపూసి, పురి కట్టారు. ఇదంతా అయేసరికి బాగా పొద్దుపోయింది.

వైకుంఠరావు పక్క చూపులు చూస్తూ, మధ్య మధ్యలో దర్పా మరువక గర్జిస్తూ పని పూర్తి చేయించాడు. ముంగిలి ఊడ్చి, నీరు చల్లి, ముగ్గులు పెట్టారు దాసీవాళ్ళు. ఇంట్లోను, పెరట్లోను ఉన్న దీపాలన్నీ వేశారు. గుమ్మం ముందర ఉన్న మల్లె పందిరి కింద చెక్క బల్ల మీద బాలీసులు వేయించి పడుకున్నాడు వైకుంఠరావు. పక్కన అరుగుమీద పరుపు వేసుకుని రాజేశ్వర్, నమ్మకస్తులైన ఇద్దరు పాలేళ్ళు ఫాటక్ దగ్గర చాపలు, కంబళ్ళు వేసుకొని కావలి పడుకొన్నారు. ''తలుపులు గడియ పెట్టుకోండి'' అని వైకుంఠరావు కేకవేయగానే చప్పుడు చేయకుండా పందిరి పట్టె మంచం మీద అక్కచెల్లెళ్ళు ముగ్గురు పిల్లుల్లాగా ఒకరి మీద ఒకరు చేతులు, కాళ్ళు వేసుకుని పడుకున్నారు. వాళ్ళ కళ్ళు నక్షత్రాల్లాగ, దీపాల కాంతులు పడి మెరుస్తున్నాయి. తలకాయలు తాటికాయల్లా కోసి పడేస్తున్న ఈ సీమలో, ఎంత ధైర్యంగా పడుకున్నాము అనుకుంది జయ. శ్యామలమ్మ వేరే గదిలో పడుకుంది.

చాలా రాత్రయింది. కుక్కలు మొరిగాయి. కీచురాళ్ళు అరుస్తున్నాయి. ఉన్నట్లుండి హడావిడి. పాలేళ్ళ కేకలు, మగగొంతులతో వినాదాలు. మెలకువ వచ్చినా కిక్కురుమనకుండా పడుకున్నాడు వైకుంఠరావు. బొంగురుపోయిన కంఠంతో కేకలు. శ్యామలమ్మ బిగ్గరగా అరుస్తూ మనుమరాళ్ళను లేపింది. వాళ్ళు లేచి ముందు గదిలోకి వచ్చారు. కాగడాలు,

బ్యాటరీలైట్లు, పెద్ద వెలుతురులో పాతిక, ముప్పైమంది కుర్రవాళ్ళు. కాలయముళ్ళలా వాళ్ళు తమ మీదకు సాయుధులై వస్తోంటే పాలేళ్ళు ఇద్దరూ వాళ్ళని కొట్టడానికి చిన్న రాయైనా దొరకక లోపలకు పరుగెత్తికొని వచ్చారు. వైకుంఠరావు దగ్గర పిస్తోలు లేదు, లైసెన్సు లేదు. తుపాకీ అసలే లేదు. పై పంచె భుజాన వేసుకొని, కళ్ళ జోడు సవరించుకుంటూ అటు ఇటూ దూకడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

''దొరా! బండ్ల కొద్ది ధాన్యం తెచ్చుకున్నవేం? అది కాలబెట్టనీకి వచ్చినం. నీకు బుద్ధి చెప్పనీకే వచ్చినం'' అంటూ వాళ్ళంతా ముంగిట్లోకి వచ్చి ఎగబడ్డారు. తోసుకుంటూ, దొక్కా చేతులూపుతూ భయంకరంగా యుద్ధం చేయడానికి సిద్ధమైన యోధుల్లా ఉన్నారు.

''పోలీసులతో చెప్పి, మావోళ్ళను కాల్పిస్తవా? బొక్కలు ఇరక్కొట్టించి, లాకప్‌లో ఏయిస్తవా? నోరు లేని జీవాలను బాదినట్లు బాదిపిస్తవా? ఇహ నీవీడ ఉండే పనిలేదు. అద్దులే. మేం మనుముల్ని కాలబెట్టడం ఇప్పుడే మరూ చేస్తున్నం. ముంగల ధాన్యం తగులబెడతం. ఆ కొట్టకు అగ్గిపెడతం. ఈ ఊరికి నిప్పంటిస్తం. తిండిగింజలు లేకుండ ఎట్ల నకనక లాడాల్నో, సావాల్నో నీకు ఎరికైతది'' అని రకరకాలుగా, వేర్వేరు గొంతుకలతో అరిచారు.

వైకుంఠరావు వణికిపోతున్నాడు. గజగజమనే దవడల్లోంచి మాటలు రావడం లేదు. శ్యామలమ్మ ముందు సావిట్లోంచి బయటకు వచ్చింది. వైకుంఠరావు నిలబడ్డ బల్ల పక్కకు వచ్చింది. నిండా కొంగు కప్పుకుంది. జుట్టుముడి బిగించుకుంది. వీళ్ళు తన కొంపకు, సంపదకు, సౌభాగ్యానికి నిప్పు పెట్టడానికి వచ్చారు. ఆమె కళ్ళల్లోకి ఒక అరుణిమ వచ్చింది. శివదేవి వలె శక్తి పుంజుకొంది.

''రేయ్! ఆ వడ్లు కాలబెడితే మీకేమొస్తుందిరా, బూడిద! కాలిన నల్ల బూడిద తింటావురా నీవు? మాది మసిఅయితే చాలుననుకుంటున్నావుగాని, నీ చేతిలోకి వచ్చేది ఏముందిరా? ఆలోచన చేసినవా? అన్నం కాలబెట్టుకుంటార్రా ఎవరైన? పిచ్చి లేదివోళ్ళు కూడ అన్నం కండ్లకు అద్దుకుని తింటారురా! మాది పోయిన మాకు మంజూర్‌గాని, నీ పొట్టయిన నిండితే చాలనుకుంటానురా'' అన్నది.

గుంపులోని కుర్రాళ్ళలో ఏదో ఒక ఆలోచన. ముఖాలు చూసుకుంటున్నారు. శ్యామలమ్మకూ వారి ఆలోచన అర్థమౌతున్నది. కత్తి తీసి దావగొట్టే దొరతో లడాయి పెట్టుకోవడం తేలిక. కాని ఈ తల్లితో ఎట్ల మాట్లాడేది?

''సూడరా! నీవొచ్చి 'మా ఇండ్లల్లో గింజలు నిండుకున్నయి, రెండు సంచులు కొలిసి పొయ్యి' అంటే నేను ఇవ్వకుందునా? మాది, మీది అనకండిరా బిడ్డలూ! ఇస్తరాకులేసి అన్నం పెట్టి పెట్టి ఈ సేయి సూడరా ఎట్ల మెత్తగైపోయిందో! ఇదుగోరా ధాన్యం కొట్టు తాళంచేయి. మీకు కావలసినవి తీస్కపొండి. ఆ నూనె డబ్బా అవల బెట్టండి'' అని వైకుంఠరావు దగ్గర్నుంచి తాళాల గుత్తి తీసి వాళ్ళవేపు పడేసింది.



ఆయన నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. ''ఇన్నొద్దులు దొరపడక పారిపోయినాడను కుంటున్నారా? ఆయనకు పానం బాగలేదు. మీ గురించి ఆలోచించి, దిమాకు ఖరాబైంది. పట్నంల దవాఖానాలో పరీక్ష నిన్ననే వదిలి వచ్చిండు. అయన్నేమీ అనకండి, పానానికే ముప్పు రాగలదు. ఆయన బాగుంటేనే నేను బతికేది'' అంటూ కంఠం రుద్ధమై మాట రాక ఆగిపోయింది. జయ, అమ్మమ్మ కరుణారుణ వదనం వంక చూస్తున్నది. కుటిలత, దోషమూ లేని ఆమె ముఖం వెన్నెల కాస్తున్న జాబిల్లిలా ఉన్నది. ఆ కౌముదీ మధురిమ ధారలై, ఆ పిల్లలందరి మీదా కురుస్తున్నట్లుంది.

వారు తలలు వంచుకున్నారు. ''మా ఆడపిల్లలు బెదిరిపోతున్నారు. అరచేతిలో ప్రాణాలెట్టుకుని ఎంతకాలం బతకాలి? వందల ఏండ్లు మా తాతలు, తండ్రులు, మీ తాతలు, తండ్రులు సోపత్తుగ ఉండలేదురా? ఇప్పుడు కానికాలం వచ్చిపడింది. మేము ఎట్లబోయిన పోతం గానీ, మీకు భూమి దున్ననీకి, పంటలు వేసి పండించడానికి వస్తదంటరా? రాదు. మీకు ఆ భూమాత మీద ప్రేమ లేదు. సేద్యం లేక, సదువులు లేక ఎందుకురా సెట్లును, పుట్టను పట్టి తిరుగుతున్నరు? నా మాట ఇనుండ్రి. సదివి బాగుపడండి. పోలీసోళ్ళకి సదువుంది. ఆఫీసర్లకు సదువుంది. మా ఇంటి ఆడుబిడ్డలకు సదువుంది. మీకు అదే లేకుంటే వాండ్లతో కయ్యానికి ఎట్ల పోతరు? నిలబడి మాట్లాడడానికి ఏమొస్తుంది'' అంటూ ఆమె ఉపదేశం చేస్తోంటే కళ్ళప్పగించి విన్నారు.

''సిన్న దొరా! ఈ తల్లి మొకం చూసి మిమ్మల్ని ఏమీ అంటలేం. ముందు ముందు రోజులు ఇట్ల నడవయి'' అన్నాడొకతను. నేల మీద నుంచి తాళం చెవి తీసి అతని మీదకు విసిరాడు. రాజేశ్వర్ వణికిపోతూనే ఆ తాళం చెవి తీసుకుని, భయంతో పాలిపోయిన ముఖంతో వాళ్ళవంక చూస్తున్నాడు.

శ్యామలమ్మకి ఇప్పుడు పట్టు చిక్కింది. ఆగ్రహోదగ్రులైన ఆ బిడ్డల్లో ఎక్కడో వర్షగింజెత్తు మానవత్వం పొడచూపుతోందని గ్రహించింది. మైకం దిగి మనుషులవుతున్నారు. ''రాజేశ్వర్! చూస్తావెందుకు? ఖాళీ సంచులు చూసి, అందరకూ తలా సంచి నింపి ఇచ్చేయి! పో బిడ్డా'' అన్నది. ఆ గొంతులో మార్దవం. గాంభీర్యం, ఆజ్ఞ! రాజేశ్వర్ ఆ పనికి దిగాడు. వైకుంఠరావు బల్లమీద కూలబడ్డాడు. చావుకి అంగుళం దగ్గరగా పోయి, వెనుతిరిగి వచ్చినట్లయింది. పంట యావత్తు సర్వనాశనం చేసి, తనను గొడ్డలితో నరికి పోగులు పెట్టకుండా, తన భార్య, ఆ సాధ్వి ఎలా ఆపిందో ఆయనకింకా అవగతం కావడం లేదు.

ఎప్పుడికో వెళ్ళారు ఆ కుర్రాళ్ళు. వాళ్ళలో పెద్దలూ ఉన్నారు. ఒంటిమీద సరిగా బట్టలు లేక, పగుళ్ళు, పుళ్ళు నిండిన కాళ్ళకు చెప్పులు లేక, సంస్కారం లేని చింపిరి తలలతో - రెప్పార్పని వారి చూపులలో ఏ భవిష్యత్తు ఉన్నది? రేపటి గురించిన ఆశలు ఆ గుండెలలో అంకురిస్తాయా?

జయ విస్తుపోయి చూస్తున్నది. మానవ జీవితంలోని ఒక కెరటాన్ని చూసి, దాని అంచుల ఉధృతం చూసి ఉక్కిరిబిక్కిరవుతున్నది.

చెల్లాయి లిద్దరూ కదలని చిరులతల్లా అక్కను అంటిపెట్టుకుని ఉన్నారు. అలాగ గుమ్మం దగ్గర జారి వాళ్ళు నిద్రపోతోంటే రాజేశ్వర్ లేపి లోపలకు వెళ్ళమని సైగ చేశాడు.

''భయం మామయ్యా'' అన్నది జయే బిక్కగా.

''భయం లేదమ్మా! భద్రకాళిలా మీ అమ్మమ్మ మనకు అభయమిస్తోందమ్మా'' అన్నాడు. అతని కళ్ళు దుఃఖంతో, అవమానంతో, సంశయాల బరువులతో ఉబ్బిపోయినాయి.

తెల్లగా తెల్లారాక పిల్లలు లేచారు. శ్యామలమ్మ పూనకం దిగినట్లు నీరసంగా పీటమీద కూర్చుని పెరట్లో చెట్లవంక చూస్తోంది. దాసీలు వచ్చారు. వారి సాయంతో వంటకి దిగాలని జయ సిద్ధపడింది. ఊరిలోని వారెందరో కదిలివచ్చారు. రాత్రి జరిగిన సంగతి కథలుగా చెబుతున్నారు. పోలీసులని పిలుద్దామని ఎవరో అంటే వైకుంఠరావు దణ్ణం పెట్టాడు. నోట్లోంచి మాట రాకుండా వంటింటి వైపు శ్యామలమ్మ వంక చూపించాడు. దొరసాని దేవతే అయింది ఆపూట ఆ ఊరివారందరికీ.

భోజనాలు, ఫలహారాలు అయినాయి. జయ తానింక వెళ్ళాలనీ, అమెరికా నుంచి ఏమి సమాచారం వచ్చిందో తెలుసుకోవాలనీ అన్నది. చిన్నవాళ్ళకి కూడా సెలవులైపోయినాయి. ''అంత దూరం ఒక్కత్తెవే పోతావా జయా'' అని మనుమరాలి ఒళ్ళు తడిమి గారాంగా దగ్గరకు తీసుకుంది. జయ నవ్వింది.

''ఎన్ని దేశాల్లోనో విమానంలో తిరిగింది అమ్మమ్మా! దానికేం భయం? పైగా ఇప్పుడింక బావ సాయం ఉంటాడు కదా'' అన్నది చెల్లెలు. జయకి ఆ మాటకి సిగ్గు వచ్చేసింది. ఆ లేబ్రాయపు అందం చూసి శ్యామలమ్మ సంతోషపడిపోయింది.

''అందంగ ఉంటాడా తల్లీ - ఆ పెండ్లి పిల్లగాడు'' అనడిగితే, జయ తలూపింది. తలవంచుకుని టొటటొటా కన్నీళ్ళు కారుస్తూ, ''నేను తిరిగి ఎప్పుడు మిమ్మల్నందర్నీ చూడ్డానికి వస్తానో, అతనిని నీకు ఎప్పుడు చూపిస్తానో? నాన్న రాక్షసుడిలా ఉండబట్టి, పెళ్ళి ఆయన పెత్తనంలో చెయ్యిద్దామన్నా పరువు పోతుందని, వాళ్ళు చేస్తామంటే సరేనన్నాను. వాళ్ళు అంతమంది వచ్చేకంటే నేను ఒక్కత్తెనే వెళ్ళడం మంచిది కదా అమ్మమ్మా? అమ్మ ఉండగానే, మేము మీ దగ్గరకి వచ్చి ఉంటే ఎంత బాగుండేదో. అమ్మమ్మా! మేమింక ఈ వేళ వెళ్ళిపోతాం'' అన్నది.

మధ్యాహ్నం రెండు గంటల కల్లా మిఠాయిలు, పళ్ళు, ఎండు కర్జూరాలు, సీమ బాదం కాయలు, పటిక బెల్లం, అరవిచ్చిన మల్లెపూలు అన్నీ సిద్ధం చేసింది శ్యామలమ్మ. పీటమీద కూచోబెట్టి పసుపు, పారాణి పూసి, తలలో కనకాంబరాలు, మరువం కట్టిన మాల తురిమింది. తన కెంపుల అడ్డిగ తీసి, జయ మెళ్ళో పెట్టి, రెండువేల రూపాయలు చేతిలో పెట్టి, 'చీర కొనుక్కో' అని చెబుదామని నోట్లోంచి మాట రాక, ముత్యాలుగా రాలే కంటి చుక్కలతోనే దీవించింది.



''అమ్మమ్మా! మీరిక్కడ ఉండొద్దు. అమ్మమ్మా, మామయ్యా మా దగ్గరికి మీరు వచ్చేయండి'' అని పిల్లలు ముగ్గురూ ప్రాధేయపడ్డారు. తరువాత వస్తామని వాళ్ళు చెప్పారు. తాతయ్యకి దణ్ణాలు పెట్టారు. తనకు దూరమై ముందు వెళ్ళిపోయి, ఆ తరువాత తాను దూరం పెట్టిన గారాల కూతురు కళ్ళల్లో, గుండెల్లో మెదలి పులిలాంటి వైకుంఠరావు కూడా కరిగి, కంట నీరు పెట్టుకున్నాడు. తన పెళ్ళి విషయమంతా చెప్పింది జయ. ఆయన మనస్ఫూర్తిగా ఆశీర్వదించాడు.

రాజేశ్వరరావు పట్నంలో దింపి వస్తానని బయలుదేరాడు. అలా మామయ్య రావడం ఆ పిల్లలకూ బాగున్నది.

ఆ తరువాత రెండు వారాల్లో జయ ప్రయాణమై అమెరికా వెళ్ళిపోయింది. చెల్లెళ్ళకి చదువులు చెప్పిస్తాననీ, తానే పెళ్ళిళ్ళు చేస్తాననీ ఎంతో తాపత్రయపడుతూ, వాళ్ళకి ధైర్యం చెప్పింది. తనని అయస్కాంతం లాగ ఆకర్షిస్తున్న వివాహం, సంస్కారవంతులైన ఆ కుటుంబం, భువి మీద స్వర్గమని అందరూ అంటుండే ఆ అమెరికా ఎలా వదులుకోవడం, వదిలితే కూడా తనకి ఇవతల ఏముంది? తాను పైకి వెడితే, తన వాళ్ళని పైకి తీసుకుని రావచ్చు.

పిల్లికూనల్లాగ బతుకుతున్న చెల్లెళ్ళిద్దరూ అక్క చేసే ఫోన్ కోసం, పంపే 'ఈ-మెయిల్ కోసం అనుక్షణం ఎదురు చూడడమే. అక్క అమెరికాలో మెడిసిన్ కోర్సులో చేరడానికి ప్రయత్నిస్తోంది. ఆమె పెళ్ళి వీడియోలు, ఫోటోలు, ఇంటర్నెట్ ద్వారా చూశారు, అందుకొన్నారు. గంటలకు గంటలు వాటిని చూస్తూ ఆనందించారు.

రెండు మూడు నెలల తరువాత వాళ్ళు జయకి ఉత్తరం రాశారు. నాన్న ఆరోగ్యం బాగుండక ఆస్పత్రిలో చేరాడనీ, చూసివచ్చామనీ, అమ్మమ్మ, తాతయ్య కూడా ఊరు వదలి పట్నంలో పెద్ద ఇల్లు తీసుకున్నారనీ. జయకి మొదటి వార్త వినగానే ఇంక అవతారం చాలిస్తాడేమో ఆయన అని చటుక్కున తట్టింది. అలా తాను అనుకోవచ్చునా అనే సందేహం కలిగేలోపే, రెండోవార్త అమిత సంతోషం కలిగించింది. వాళ్ళు అక్కడి నుండి బయట పడ్డారని, దినమొక గండంగా బతుకనవసరం లేదని. మకుటం లేని మహారాజులా దొర బతుకు సాగించిన తాతయ్య సిటీలో అనామకంగా ఎలా ఉంటాడోనని దిగులు వేసింది. అమ్మమ్మ ఆనాడు వీరోచితంగా, సుందర తేజోమయ రూపంగా అంతమంది కుర్రాళ్ళని, విప్లవ నినాదాలు చేస్తూ, కొంపకు, యజమానికి నిప్పెడతామని వచ్చినవాళ్ళని నిలవేసిన ఆ దృశ్యం తాను మర్చిపోలేదు.

కొండమీద కూచున్నట్లు, అల్లంత దూరాన అమెరికాలో ఉన్న తాను ఆ కుగ్రామంలో చెలరేగిన అశాంతిని ఎలా అవగతం చేసుకోగలదు? ఆ పల్లెవాండ్ల, విప్లవకారుల నాడిలో, రక్తనాళాల్లో ఉధృతంగా కొట్టుకుంటున్న జీవితాశ ఏమిటో అర్థమౌతుందా? వారి కడుపు మంటల వెనుక గల భౌతికపరమైన వైద్య కారణంగానీ, మానసికమైన జ్వాలకు మూలంగానీ తనకు తెలుస్తుందా?

రష్యాలో ఉండగా జయ విస్మయకరమైన మార్పులు చూసింది. సమూలంగా వ్యవస్థ పెల్లిగిల్లిపోయి ముగ్గవేసి, తిరిగి వేర్వేరు రూపాల్లో నిలబడడం చూసింది. తన చిన్న బుర్రకి అర్థమైన 'పెరిస్త్రోయికా' - అంటే పునర్నిర్మాణంట - 'గ్లాస్‌నోస్త్' - అంటే పారదర్శకత, బహిరంగతట - నలుగురికీ అన్ని విషయాలు తెలియాలని ప్రకటించారు. అన్ని సంబంధాలకు పునాది ఆర్థికమే అని నమ్మి నిర్మించిన ఆ మహా మేరువు కూడా విచ్చి కూలిపోయింది. అన్ని సంబంధాలకు మూలం మనిషి మనసే, స్వార్థపంకిలంతో నిండిన చర్యలే అని నిర్వచించ దానికి వారికి సాహసం చాలలేదా? భౌతికమే గాని, ఆధ్యాత్మిక సత్యాలకు అన్వేషణ ఆరంభం కాని అయోమయ ప్రపంచమది. "నేను - అహం" అనే మూలంలో నాటుకున్న ఆ స్వార్థంలోంచే మనిషి ఆలోచన, జీవన సమరం ఆరంభమౌతోందని స్పష్టంగా గ్రహించని ఆ విదేశీయుల చరిత్ర వంక మనం ఎందుకు చూడడం లేదు? పాఠాలు నేర్చుకోవడం లేదు? లోలోపలి జ్ఞానం వెలికి వచ్చి మనకెందుకు అక్కరకు రావడంలేదు?

"నాయనలారా, ఈ గింజలు మనందరివీ, కలిసి తిందాం రండి. దొర పేటికి కాపలాదారు మాత్రమే" అని బాపూ చెప్పిన ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని శ్యామలమ్మ తన భాషలో చెప్పింది. చదువులు, ఆర్థిక సిద్ధాంతాలు తెలియని ఆమె, ఉదారంగా, శాంతంగా, వివేకంతో, తనలో స్వచ్ఛంగా పెల్లుబికిన ప్రేమతో చెప్పింది. వాళ్ళకి ఆ భాష అర్థమైంది. ఆ ప్రేమ తీపి రుచి తెలిసింది. అందుకు ఆ సంసారాన్ని ఊచకోత వేయక, విడిచి పెట్టారు. కానీ, అది తాత్కాలికం. శాశ్వత పరిష్కారం వేరే ఉండి వుంటుంది.

పక్షులు అందాల అడవి చెట్ల మధ్య, తల ఎత్తిన శిఖరం లాంటి ఆ ఇంటి కప్పుమీద నిర్భయంగా గూళ్ళు కట్టుకున్నాయి. ఇంటి ముంగిట దీపాలు వెలిగి, గ్రామంలో తేజస్సు, కళ నింపటం లేదు. పాడుపడి బూజులు వేలాడే ఇల్లు, బీడుపడిన భూములు, చెదరిపోయిన పశువులు, మూసుకున్న కళ్ళల్లో కూడా కనుపాపల్లోనే ఆకలి. కళ్ళు తెరిస్తే ఆ ఆకలి చూపులు ఎక్కడ నిలపాలో తెలియని పసిపిల్లలు, చిన్న కూనలు, ఆధారంలేని ఆడువారు.

ఆ అన్నల దౌర్జన్యం సాధించింది ఏమిటి? అదే ఘన విజయమా? వారిని కన్న తల్లిదండ్రులకు కూడా బిడ్డ ఎప్పుడు వస్తాడో తెలియదు. నెత్తురు ముద్దగా పట్టుకొచ్చి పడేస్తారో. ఏ దొంతరలోనైనా ఆ కట్టెను తోసి ఇంత మట్టి వేశామని చెబుతారో తెలియక అలమటిస్తున్నారు. బిక్కచిక్కిన, ఓపిక లేని చేతులతో కానరాని దైవానికి మొక్కుతున్నారు.

ఎన్‌కౌంటర్లు జరిపిన పోలీసుల కథా ఇదే. అధికారంతో బలిసిన ప్రభువులు మాత్రం ప్రతి పూటా శాంతివచనాలు వల్లిస్తున్నారు.

ఇది ప్రగతి కాదు. ఇది మానవాభ్యుదయం కాదు. అమ్మమ్మలాంటి వారు చల్లని హిమం లాంటి, కౌముదీ కిరణాల స్మిత కాంతులతో లోకాన్ని నింపాలి. ప్రతి తల్లి చిలకరించిన క్షీరధారలతో ప్రతి ఒక్కరూ ప్రక్షాళనమై పునీతులు కావాలి.



చిత్రవర్ణమయ లోకంలో, యంత్రాల, చక్రాల, ఆకాశ హర్మ్యాల విద్యుత్తేజో విరాజిత పరిసరాలలో ఉన్న జయ మనసు తీరని కోరికలను కోరుతుంటుంది. తన దేశంలో తానేమీ చేయలేని నిస్సహాయతకు సంజాయిషీ ఇవ్వలేక, భూగోళంలో పవిత్ర భారతదేశం ఉన్న దిశగా చూస్తుంటుంది. ఉపనిషత్తులలో ఉపదేశమైన శాంతి మంత్రము "ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః" అని - 'జ్ఞాన ప్రకాశ యుక్తులమై శుభమైన దానినే చెవులతో విందుముగాక' అని చేతులు జోడించి నమస్కరిస్తూ ఉంటుంది.

★ ★ ★